సోమవారం 2-12-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 251


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సింధు నిరీక్షణ ముగిసె...

రెండేళ్ల తర్వాత మళ్లీ టైటిల్ గెలిచిన భారత బ్యాడ్మింటన్ స్టార్ -14లో



ఐసీసీ చైర్మన్‌గా జై షా


అంతర్జాతీయ క్రికెట్ మండలి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరణ -14లో



ఆర్థిక లక్ష్యాన్ని చేరేదెలా..?

రిస్క్, రాబడుల ఆధారంగా అనువైనవి ఎంపిక చేసుకోవడం ద్వారా మన ఆర్థిక లక్ష్యాలను సాకారం చేసుకోవచ్చు.

వివరాలు 15లో ▸



సిరియాలో మళ్లీ అంతర్యుద్ధం

సిరియా భగ్గుమంటోంది. సైన్యం, తిరుగుబాటు సేనల మధ్య ఘర్షణ తారస్థాయికి చేరడంతో మళ్లీ అంతర్యుద్ధం రాజుకుంది.

వివరాలు 6లో ▸



ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్

అమెరికాలో శక్తివంతమైన ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా తనకు అత్యంత సన్నిహితుడైన కశ్యప్ పటేల్‌ను ట్రంప్ ఎంపిక చేశారు.

వివరాలు 6లో ▸



డిప్యూటీ సీఎంగా శ్రీకాంత్ షిండే!

మహారాష్ట్రలో ఉప ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే విముఖంగా ఉండటంతో ఆయన కొడుకు పేరు తెరపైకి వచ్చింది.

వివరాలు 6లో ▸

సంక్రాంతి తర్వాత రైతు భరోసా

రైతుల ఖాతాల్లో జమ • సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



- త్వరలో అసెంబ్లీలో చర్చించి విధివిధానాలు ఖరారు
- మారీచుల తరహాలో మారువేషంలో వచ్చే బీఆర్ఎస్, బీజేపీ వాళ్లను నమ్మొద్దు
- రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నాం

సాక్షి, హైదరాబాద్

సంక్రాంతి పండుగ తర్వాత రైతుల బ్యాంకు ఖాతాల్లో 'రైతు భరోసా' ఆర్థిక సహాయాన్ని జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో సోనియమ్మ గ్యారంటీ అమలై తీరుతుందని చెప్పారు. రైతు భరోసా విధివిధానాల పై మంత్రివర్గ ఉపసంఘం వేశామని, త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వాటిని ఖరారు చేస్తామని తెలిపారు. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి.. చేసి చూపించామని, రైతు భరోసా కూడా ఇచ్చి తీరుతామని అన్నారు. మారీచుల తరహాలో మారువేషంలో వచ్చి అబద్ధాలు చెప్పే బీఆర్ఎస్, బీజేపీ వాళ్ల మాటలు నమ్మొద్దని రైతులను కోరారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు.

మరో నాలుగేళ్లకు అవసరమైన శక్తి లభించింది

'2023 వానాకాలం రైతుబంధును నాటి సీఎం కేసీఆర్ ఎగ్గొట్టారు. మేము అధికారంలోకి రాగానే రూ.7,625 కోట్లు రైతుబంధు కింద చెల్లించాం. శనివారం పాలమూరులో జరిగిన రైతు పండుగలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 568 రైతు వేదికల నుంచి లక్షలాది మంది రైతులు తరలివచ్చి మా ఏడాది పాలన బాగుందంటూ ఆశీర్వదించారు. తద్వారా మిగిలిన నాలుగేళ్ల ప్రభుత్వాన్ని

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్ఎస్ రుణమాఫీ రూ.3,331 కోట్లే..

'రెండు పర్యాయాల బీఆర్ఎస్ పాలనలో రూ.లక్ష రుణమాఫీ సరిగ్గా చేయలేదు. ఏక మొత్తంగా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి నాలుగు విడతల్లో చేశారు. రెండో పర్యాయంలో అధికారంలోకి వచ్చాక తొలి నాలుగున్నరేళ్ల రుణమాఫీని పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు ఔటర్ రింగ్ రోడ్డును అమ్మి వచ్చిన రూ.11 వేల కోట్లతో రుణమాఫీ చేశారు. ఆ నాలుగున్నరేళ్ల కాలానికి రైతులు వడ్డీల కింద రూ.8,578.97 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. వడ్డీలు పోగా రెండో పర్యాయంలో బీఆర్ఎస్ సర్కారు చేసిన వాస్తవ రుణమాఫీ రూ.3,331 కోట్లు మాత్రమే..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

రూ.2 లక్షల లోపు రుణమాఫీ 100% శాతం పూర్తి చేశాం

వ్యవసాయేతర రుణాలను బ్యాంకర్లు పంట రుణాలుగా చూపించడం వల్లే గతంలో రూ.31,000 కోట్ల పంట రుణాలు ఉన్నట్టు చెప్పాం

సన్నాలకు రూ.500 బోనస్ యాసంగి పంటకూ ఇస్తాం

గుజరాత్‌లో ఏయే మద్యం బ్రాండ్లు దొరుకుతున్నాయో చూపిస్తానంటూ బీజేపీకి సవాల్



6 అబద్ధాలు.. 66 మోసాలు!

- కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ చార్జిషీట్
- మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చింది
- ఎన్నో ఆశలతో ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచింది
- చార్జిషీట్ విడుదల చేసిన డీకే అరుణ, ప్రెజెంటేషన్ ఇచ్చిన కిషన్‌రెడ్డి

2లో



రెండో దశ పూర్తితో మంచి నెట్‌వర్క్‌గా మెట్రో

- మెట్రో మొదటి, రెండో దశకు కనెక్టివిటీ ఉంటుంది
- నాలుగేళ్లలో రెండో దశ పూర్తి
- క్రమశిక్షణ పాటిస్తే రద్దీ సమస్యకు పరిష్కారం
- జేబీఎస్– శామీర్‌పేట మార్గంపై సీఎం ఆదేశాలతో కసరత్తు
- అన్ని మెట్రో స్టేషన్లలో ఉచిత పార్కింగ్ సదుపాయం సాధ్యం కాదు

'మీతో సాక్షి' కార్యక్రమంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

5లో

ములుగు అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

- మృతుల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కురుసం మంగు
- పెద్దపల్లి జిల్లా రాణాపూర్‌కు చెందిన ఏగోలపు మల్లయ్య
- రెండు ఏకే–47లు, ఇతర ఆయుధాలు స్వాధీనం
- వారోత్సవాలకు ముందు రోజు ఎన్‌కౌంటర్‌తో పల్లెల్లో టెన్షన్ టెన్షన్


ఘటనా స్థలంలో ఏగోలపు మల్లయ్య మృతదేహం

ఏడుగురు మావోయిస్టుల మృతి

ఏటూరునాగారం మండలం చెల్పాక సమీపంలో ఘటన

సాక్షి ప్రతినిధి, వరంగల్/ఏటూరు నాగారం: ఆదివారం ఉదయం 6.15 గంటలు. అప్పటి దాకా పక్షుల కిలకిలారావాలు వినిపించిన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక సమీప పాలకమ్మ వాగు అటవీ ప్రాంతంలో ఉన్నట్టుండి తుపాకులు గర్జించాయి. మావోయిస్టులు–గ్రేహౌండ్స్ బలగాల మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మరణించినట్లు ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ప్రకటించారు. మృతుల్లో తెలంగాణకు చెందిన ఒక మావోయిస్టు ఉండగా మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని ఆయన తెలిపారు. ఎస్పీ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

కూంబింగ్ జరుపుతుండగా..

నవంబర్ 21న రాత్రి ములుగు జిల్లా వాజేడులో ఉయికే రమేష్, ఉయికే అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ల పేరిట మావోయిస్టులు హత్య చేశారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ బలగాలు ములుగు జిల్లా అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేశాయి. ఆదివారం ఉదయం చెల్పాక అడవుల్లో 10 నుంచి 12 మంది ఆలివ్‌గ్రీన్ దుస్తులు ధరించిన సాయుధ మావోయిస్టులు.. పోలీసు పార్టీలను గుర్తించి వెంటనే కాల్పులు మొదలెట్టారు. ఆయుధాలు వదిలి లొంగిపోవాలని హెచ్చరించినా వినకుండా కాల్పులు కొనసాగించారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన

మిగతా 12వ పేజీలో ▶

దండకారణ్యం నుంచి సరిహద్దుకు...? 12లో

ఆదివారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన 'మాలల సింహగర్జన' బహిరంగసభకు హాజరైన జనం



ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

సుప్రీంకోర్టు తీర్పు ఆర్టికల్ 341కి వ్యతిరేకం..

- వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేద్దాం
- రిజర్వేషన్ల ఎత్తివేతలో భాగమే వర్గీకరణ
- మాలల సింహగర్జన సభలో వక్తలు

- వివరాలు 2లో



కరుణామయుని కోవెల.. వందేళ్ల ఉత్సవాలు

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న మెదక్ చర్చి ఆసియాలో రెండో అతిపెద్ద చర్చిగా గుర్తింపు పొందింది. చారిత్రక వారసత్వ సంపదకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న ఈ కట్టడం నిర్మాణం జరిగి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ విశేషాలు..

- వివరాలు 13లో

దోమలు కుడితే... మలేరియా పరార్

దోమ కుడితే మలేరియా రావడం సాధారణమే.. కానీ దోమలు కుడితే... మలేరియా రాకుండా పోవడం గురించి తెలుసా? మలేరియాను వ్యాప్తి చేసే దోమలతోనే వ్యాక్సిన్లు చేసే పనిని చేయించే సరికొత్త విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అంటే.. ఈ దోమలు కరిస్తే మలేరియా పరార్ అన్నమాట. - 16లో

6 అబద్ధాలు.. 66 మోసాలు!

కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ చార్జిషీట్



కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ రూపొందించిన చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో వెంకటరమణారెడ్డి, రాకేశ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, డీకే అరుణ, సోయం బాపూరావు, పాంగులేటి సుధాకర్‌రెడ్డి

- మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చింది
- ఎన్నో ఆశలతో ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచింది
- చార్జిషీట్ విడుదల చేసిన డీకే అరుణ, ప్రెజెంటేషన్ ఇచ్చిన కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏడాది పాలన పూర్తి చేసుకున్న ప్రజా ప్రభుత్వం ఆరు అబద్ధాలు, అరవై ఆరు మోసాలు మూట గట్టిందంటూ రాష్ట్ర బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఎన్నో ఆశలతో ఓట్లు వేసిన ప్రజలను నట్టేట ముంచిందని మండిపడింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజా ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకుంటుంటే.. ప్రజలు మాత్రం ఈ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నారని విమర్శించింది. ఈ మేరకు బీజేపీ రూపొందించిన చార్జిషీట్‌ను పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, ఎంపీ డీకే అరుణ ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆ తర్వాత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రజల ఆశలు నీరుగార్చారు

'బీఆర్‌ఎస్ నిరంకుశపాలనపై విసుగెత్తిన ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలనే నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రకటించడంతో ఆకర్షితులైన ఓటర్లు ఆ పార్టీకి ఓట్లు వేసి అధికారం కట్టబెట్టారు. ఎన్నో ఆశలతో ప్రజలు ఓట్లు వేస్తే, వారి ఆశలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చింది. రాష్ట్రంలో ఒక్క రైతుకూ ఇప్పటికీ భరోసా అందలేదు. మహాలక్ష్మి పేరిట మోసం చేశారు. గృహజ్యోతి అని పేదల ఇళ్లల్లో చీకట్లు నింపారు. ఇందిరమ్మ సొంత ఇళ్ల జాడలేదు. యువ వికాసం పేరిట ఆర్భాటం చేశారు. ఒక్క విద్యార్థికీ భరోసా ఇవ్వలేకపోయారు. చేయూత పథకం కింద పింఛన్ల పరిమితి పెంచుతామని చెప్పిన రేవంత్.. కనీసం అమల్లో ఉన్న పింఛన్లు ఇవ్వలేని పరిస్థితికి తీసుకువచ్చారు. ఎన్నికల సమయంలో 500 ప్రకటనలు చేశారు. ఇప్పుడు వాటి ఊసెత్తకుండా మాటమార్చుతున్నారు..' అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్ పోకడలు పోతోంది..

'బీజేపీ నిర్మాణాత్మకంగా పనిచేస్తుంది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని భావించి విమర్శలకు దూరంగా ఉన్నాం. కానీ అధికారంలోకి వచ్చిన మొదట్లో వంద రోజుల్లో అన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి..ఇప్పుడు ఏడాది గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. పైగా ప్రజా సమస్యలను ఎత్తి చూపితే అక్రమ కేసులు పెడుతున్నారు. అరెస్టులు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు సరిసమానంగా బీజేపీకి ఎంపీ సీట్లు వచ్చాయి. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టే బాధ్యత మా పార్టీపై ఉంది. ఏడాది కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా కొత్తగా జారీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్‌ఎస్ పోకడలు పోతోంది. ప్రజలు సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారు..' అని కేంద్రమంత్రి అన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనలు, ఇచ్చిన హామీలతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ చేసిన ప్రకటనలకు సంబంధించిన వీడియో క్లిప్పింగులను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత రైతు భరోసా

► మొదటి పేజీ తరువాయి

నడపడానికి అవసరమైన ఇంధనశక్తి మాకు లభించింది. తెలంగాణ రాష్ట్రాన్ని 2014 జూన్ 2న కేంద్రంలోని నాటి యూపీఏ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్, రూ.69 వేల కోట్ల అప్పులతో ఇచ్చింది. పదేళ్ల కేసీఆర్ పాలన అనంతరం 2023 డిసెంబర్ 7న రూ.7 లక్షల కోట్ల అప్పులతో మా ప్రభుత్వం ఏర్పడింది. అసలు, వడ్డీలు కలిపి ప్రతినెలా రూ.6,500 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితిలో మేం అధికారం చేపట్టాం. రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పులు కలిగి ఉన్నట్టు నాటి సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రులుగా పనిచేసిన హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు ఎన్నడూ ప్రజలకు చెప్పలేదు. మా ప్రభుత్వం వచ్చాక డిసెంబర్ 9న అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలను వివరించాం..' అని సీఎం చెప్పారు.

రైతును రాజును చేయడమే లక్ష్యంగా ముందుకు..

'రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ అధైర్యపడకుండా ఇచ్చిన గ్యారంటీల ను అమలు చేస్తున్నాం. రైతును రాజు చేయడమే లక్ష్యంగా మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. రుణమాఫీ, ఉచిత విద్యుత్, సబ్సిడీ ఎరువులు, మద్దతు ధర, ఉపాధి హామీ పథకం లాంటి వాటితో రైతులను ఆదుకుంటున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల లోపు రుణమాఫీని 100 శాతం పూర్తి చేశాం. బ్యాంకర్లు మాకు ఇచ్చిన రూ.2 లక్షల లోపు రుణాలన్నింటినీ మాఫీ చేశాం. ఏదైనా కారణాలతో బ్యాంకర్ల నుంచి వివరాలు అందక ఎవరిదైనా రుణమాఫీ జరగకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిశీలించి రుణమాఫీ చేస్తాం. రుణమాఫీకి రేషన్ కార్డుతో సంబంధం లేదు. పంట పొలాలను తనఖా పెట్టి వ్యవసాయేతర అవసరాలకు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను సైతం బ్యాంకర్లు పంట రుణాలుగా చూపించడంతోనే గతంలో రూ.31 వేల కోట్ల పంట రుణాలున్నట్టు చెప్పాం. తప్పుడు సమాచారమిస్తే శిక్షలు తప్పవని హెచ్చరించడంతో బ్యాంకులు వివరాలను సరిచేసి ఇచ్చాయి. మేము అధికారంలోకి వచ్చిన 25 రోజుల్లోనే 22,22,067 మంది రైతులకు సంబంధించిన రూ.17,869 కోట్ల రుణాలు మాఫీ చేశాం. నాలుగో విడతగా శనివారం మహబూబ్‌నగర్ సభలో రూ.2,747 కోట్ల రుణాలు మాఫీ చేశాం. మొత్తం 25,35,964 మంది రైతులకు సంబంధించిన రూ.20,616 కోట్ల రుణమాఫీ పూర్తైంది. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో కూడా ఇంత తక్కువ సమయంలో ఈ స్థాయిలో రుణమాఫీ జరగలేదు. ఇది గొప్ప రికార్డు..' అని రేవంత్ పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో దానం నాగేందర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ

రాష్ట్ర ధాన్యమే పేదలకు ఇస్తాం...: 'సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లింపు యాసంగి పంటకు సైతం కొనసాగిస్తాం. ఇప్పటివరకు 31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. ఇక్కడ పండే ధాన్యాన్నే పేదలకు రేషన్ దుకాణాల్లో ఇవ్వాలని అనుకుంటున్నాం. సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు సన్న బియ్యంతో భోజనం పెడతాం. ప్రభుత్వ కార్యక్రమాలను మీడియా మరింతగా రైతులకు చేరవేయాలి. బీఆర్‌ఎస్ పాలన తరహాలోనే కాంగ్రెస్ పాలనలో సైతం తెలంగాణలో మద్యం ఏరులై పారుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారు. గుజరాత్‌లో మద్య నిషేధం ఉందని బీజేపీ అంటోంది. కావాలంటే ఇక్కడి నుంచి గుజరాత్‌కు మీడియాను తీసుకెళ్లి ఏయే బ్రాండ్‌లు దొరుకుతున్నాయో చూపిస్తా. కేంద్రంలో మోదీ ఇచ్చిన హామీలు, రాష్ట్రంలో మేమిచ్చిన హామీలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం..' అని సీఎం చెప్పారు. విలేకరుల సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, కొండా సురేఖ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మందుల సామ్యేల్, దానం నాగేందర్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, శ్రీగణేష్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు పండుగతో బీఆర్‌ఎస్‌కు నిద్ర కరువు

గత అప్పులకు నేడు నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ కడుతున్నాం

అదే లేకపోతే రైతు భరోసాకు నిధుల కొరత ఉండేది కాదు: మంత్రి జూపల్లి

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రైతు పండుగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టడం లేదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్, జడ్చర్ల ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. వలసల జిల్లాగా పేరు పడిన ఉమ్మడి పాలమూరును విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయ, సాగునీటి రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్న కృత నిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడుతున్నారని తెలిపారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపారని, ఆ అప్పులకు నేడు నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ వడ్డీలే లేకపోతే రైతు భరోసాతో పాటు ఇతర పథకాలకు నిధుల కొరత ఉండేది కాదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండుగ రాష్ట్రంలోని అన్నదాతలకు దశదిశను చూపిందని అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం బాగుపడడం బీఆర్‌ఎస్ నేతలకు ఇష్టం లేదని, అందుకే అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

పాలమూరు సభతో రైతులకేం ఒరిగింది?

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించిన పాలమూరు సభతో ప్రజలు, రైతులకు ఒరిగింది ఏమీలేదని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో రాకేష్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. లగచర్ల భూముల మీదనే ప్రభుత్వం ఎందుకు మంకుపట్టు పడుతుందన్నారు. ప్రజాస్వామ్యం గురించి గొప్పగా మాట్లాడుతున్న సీఎం రేవంత్ సొంత ఊర్లో కొద్ది రోజుల క్రితం మాజీ సర్పంచ్ సాయిరెడ్డి మరణం సందర్భంగా విధించిన ఆంక్షలు ప్రజలు మరిచిపోలేదని చెప్పారు. రేవంత్ చదువుకున్నప్పుడు వలసల దుస్థితిని ఎదుర్కొన్నది కాంగ్రెస్ పాలనలోనే కదా.. తన తండ్రి మరణిస్తే స్నానాలు చేయడానికి నీళ్లు లేవని చెప్పింది రేవంత్‌రెడ్డే కదా ? అని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలలో పలు పంపులు బిగించి సిద్ధంగా ఉన్నాయని, ఏడాది నుంచి దానిలో తట్టెడు మట్టి ఎత్తలేదన్నారు. తడిగుడ్డతో ప్రభుత్వం రైతుల గొంతులు కోస్తోందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

సుప్రీంకోర్టు తీర్పు ఆర్టికల్ 341కి వ్యతిరేకం

- వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేద్దాం
- రిజర్వేషన్ల ఎత్తివేతలో భాగమే వర్గీకరణ
- మాలల సింహగర్జన సభలో వక్తలు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని మాల సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం 'మాలల సింహగర్జన' బహిరంగసభ నిర్వహించారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో జరిగిన ఈ సభకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షత వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు మాల సామాజికవర్గం నేతలు పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో పొందుపరిచిన రిజర్వేషన్ల సూత్రాలకు భిన్నంగా సుప్రీంకోర్టు తీర్పు ఉందని అన్నారు. ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ మాదిగ మనువాదుల అండతో ఎస్సీలను చీల్చే కుట్రకు దిగారని ఆరోపించారు.



సభలో అభివాదం చేస్తున్న విజయరామారావు, గడ్డం వివేక్ తదితరులు

మాలలకు అండగా ఉంటా: వివేక్

మాలల కోసం పోరాటం చేస్తోన్న తనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు చేసినా వెనక్కి తగ్గలేదని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ.. మాలలందరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కుల వివక్ష నుంచి దళితులకు స్వాతంత్ర్యం కల్పించేందుకు బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. తన తండ్రి వెంకటస్వామి దళితుల కోసమే పోరాడారని.. మాల, మాదిగ అనే తేడా చూడలేదని తెలిపారు. మాలలు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తాను మంత్రి పదవి కోసమే మాలల పోరాటాన్ని మొదలుపెట్టానని కొందరు ఆరోపణలు చేస్తున్నారని.. తాను పదవుల కోసం ఆరాటపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు జరుగుతున్న కుట్రలను దళిత సమాజం గుర్తించాలని కోరారు.

మాల, మాదిగలు కలిసి పోరాడాలి: ఎంపీ మల్లు రవి

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను ఐక్యంగా ఎదుర్కోవాలని నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి పిలుపునిచ్చారు. మాల, మాదిగల మధ్య విభేదాలు సృష్టించి, రిజర్వేషన్లను ఎత్తేసేలా చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. మాల, మాదిగలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్ల అమలుకు ఉద్యమించాలన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. కొన్ని పార్టీలు, వర్గాలు మాలలపై దోపిడీదారుల ముద్ర వేశాయని ఆరోపించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణను తాము అడ్డుకోవడం లేదని, అందరికీ సమ న్యాయం కావాలని కోరుకుంటున్నట్లు మాజీ మంత్రి శంకర్ రావు చెప్పారు. మాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రాంచందర్ మాట్లాడుతూ రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. సభలో ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్యే శ్రీగణేష్, పాశ్వాన్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాల మహానాడు అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమానత్వ సమాజాన్ని నిర్మిద్దాం

నారాయణగురు స్ఫూర్తితోనే కుటుంబ సర్వేకు శ్రీకారం: డిప్యూటీ సీఎం భట్టి



తిరువనంతపురంలోని అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద భట్టి, గిడుగు రుద్రరాజు

సాక్షి, హైదరాబాద్: మానవులందరిదీ ఒకే కులం, ఒకే మతం, ఒకరే దేవుడు అని సందేశమిచ్చి యావత్ భారతదేశాన్ని ప్రభావితం చేసిన నారాయణగురు స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం కేరళలోని కొల్లాంలో ఉన్న నారాయణగురు ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన 'ఇంటర్నేషనల్ లిటరసీ, కల్చరల్ ఫెస్టివల్'కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగించారు. నారాయణగురును స్మరించుకునేందుకు కొల్లాం రావడం తనకు లభించిన అరుదైన గౌరవమని పేర్కొన్నారు. కుల వివక్షను నిర్మూలించి సమాజాన్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు నారాయణగురు కృషి చేశారని కొనియాడారు. నారాయణగురుకు, అంబేడ్కర్‌కు పోలికలున్నాయని తెలిపారు. ఈ ఇద్దరి వారసత్వాలు దేశ చరిత్రలో న్యాయానికి, సమానత్వానికి కొండంత అండగా నిలిచాయని పేర్కొన్నారు. తెలంగాణ, కేరళ మధ్య ఆలోచనల్లో కూడా సారూప్యత ఉందని అన్నారు. తెలంగాణ పోరాటయోధులు కుమురం భీం, చాకలి ఐలమ్మ తరహాలో నారాయణగురు సమానత్వం కోసం తిరుగుబాటు చేశారని తెలిపారు. కేరళ పర్యటనలో భాగంగా భట్టి విక్రమార్క ఆదివారం సాయంత్రం తిరువనంతపురంలోని అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించారు. సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజుతో కలిసి ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు.

అదానీ విరాళాన్ని వాపస్ చేస్తే సరిపోదు

దావోస్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలి: తమ్మినేని వీరభద్రం



గజ్వేల్: స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని వాపస్ చేస్తే సరిపోదని, అదానీతో తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన సీపీఎం జిల్లా మూడో మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో దావోస్‌లో జరిగిన ఒప్పందాలకు సంబంధించిన వివరాలన్నీ బయటపెట్టాలన్నారు. అక్కడ రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరిగాయని, వాటిని వెంటనే రద్దు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ సైతం అదానీ వ్యవహారంలో ఇంకా మౌనాన్ని వీడటం లేదని విమర్శించారు. అమెరికాలో అన్ని వివరాలతో బట్టబయలైన ఈ ఉదంతంపై తమకు ఇంకా సమాచారం అందలేదని కేంద్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా, దేశంలో ఏ రాష్ట్రంలోనైనా బీజేపీ గెలుపు ప్రమాదానికి సంకేతమని హెచ్చరించారు. తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తృతం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. బీజేపీ ప్రయత్నాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నిర్వాసితుల పట్ల ఎంత కర్కశంగా ప్రవర్తించారో గుర్తు లేదా...? అంటూ ప్రశ్నించారు.



పొత్తుండదని మామూలుగా చెప్పొచ్చుగా..!

బహిరంగ చర్చకు రండి.. చార్జిషీట్ సంగతి తేలుస్తాం



- మీ పదేళ్ల పాలన.. మా ఏడాది పాలనపై చర్చించేందుకు వస్తారా?
- బీఆర్‌ఎస్, బీజేపీలు కవల పిల్లలని మరోమారు రుజువైంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్ అంటూ బీజేపీ చేస్తున్న హడావుడి చూస్తుంటే గురివింద సామెత గుర్తుకు వస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన, కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనపై ఆ పార్టీ నేతలు తమతో బహిరంగ చర్చకు వస్తే చార్జిషీట్ సంగతి తేలుస్తామని వ్యాఖ్యానించారు. తమతో చర్చకు వచ్చే సత్తా బీజేపీ నేతలకు ఉందా అని మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది కాలంలో తెలంగాణలో అమలవుతోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాము చర్చకు రెడీగా ఉన్నామని చెప్పారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని, నల్లధనం తెచ్చి ప్రతి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని, వంద రోజుల్లో అన్ని ధరలు తగ్గిస్తామని, డాలర్‌కు పోటీగా రూపాయి విలువ పెంచుతామని, నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, రూ.50కే లీటర్ పెట్రోల్ ఇస్తామని చెప్పిన బీజేపీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అప్రజాస్వామికంగా వ్యవహరించి ప్రభుత్వాలను కూల్చారని, దేశ వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన 411 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న బీజేపీ నేతలు తమకు సుద్దులు చెబుతారా అని ప్రశ్నించారు. 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగ తీవ్రత ఉందని గుర్తు చేశారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన మేనిఫెస్టోను తీసుకొని ఆ పార్టీ నేతలు వస్తే, తమ 2023 ఎన్నికల మేనిఫెస్టోను తీసుకొని తాము వస్తామని, ఏడాదిలో ఏం చేశామో తాము చెబుతామని, పదేళ్లలో ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని మరోమారు రుజువైందని, సమయం వచ్చినప్పుడల్లా ఆ పార్టీలు ఏ టీం, బీ టీంలా వ్యవహరిస్తాయని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నందుకే తెలంగాణలో బీజేపీ అడుగంటిపోతోందని, ఇప్పుడు చార్జిషీట్ అంటూ కొత్త డ్రామాకు తెరలేపారని ఎద్దేవా చేశారు. ఆ రెండు పార్టీలు కవల పిల్లల్లాంటివని ఈ చార్జిషీట్‌తో రుజువైందన్నారు. ఏడాదిగా తాము చేస్తున్న కార్యక్రమాలేవీ బీజేపీ నేతలకు కనపడడం లేదా అని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు.

మోదీ చీవాట్లు పెట్టినందుకే చార్జిషీట్ హడావుడి

కిషన్‌రెడ్డి తన పేరును కిస్మత్‌రెడ్డిగా మార్చుకోవాలి.. మంత్రి పొన్నం ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీజేపీ నేతలు ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసినప్పుడు చీవాట్లు పెట్టారని, అందుకే ఇప్పుడు కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్ అంటూ హడావుడి చేస్తున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. చార్జిషీట్ విడుదల చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తన పేరును కిస్మత్‌రెడ్డిగా మార్చుకుంటే బాగుంటుందని ఆదివారం ఆయన మీడియాతో మట్లాడుతూ ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి తెలంగాణ బీజేపీకి అధ్యక్షుడిలా వ్యవహరించడం లేదని, అంబర్‌పేట నియోజకవర్గ అధ్యక్షుడి స్థాయిలో వ్యవహరిస్తున్నారని, ఈ మాట ఆ పార్టీ నేతలే అంటున్నారని పేర్కొన్నారు. మోదీ గ్యారంటీలు ఎంత వరకు వచ్చాయో? తమ హామీలు ఏ మేరకు నెరవేరాయో చర్చించేందుకు తాము సిద్ధమన్నారు. 2014–24 మధ్య ఎన్నిసార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయో చర్చించేందుకు కూడా తాము సిద్ధమేనన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో తెలంగాణకు ప్రత్యేకంగా ఏం చేసిందో చర్చించేందుకు బీజేపీ నేతలు సిద్ధమా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం నుంచి కులగణన వరకు అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ఇవన్నీ కిషన్‌రెడ్డి చూడలేరా? అని ప్రశ్నించారు. నిజంగా తెలంగాణపై కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఎప్పుడు తెస్తారో చెప్పాలని పొన్నం డిమాండ్ చేశారు.

ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి డాక్టర్ వైఎస్సార్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



రెడ్డి కార్తీకమాస వనభోజనాల కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

చందానగర్ (హైదరాబాద్): తెలుగు ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మియాపూర్ బీకే.ఎన్‌క్లేవ్‌లో రెడ్డి కార్తీకమాస వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాలు గడుస్తున్నా, రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా, వైఎస్ పేరు వినిపిస్తుందన్నారు. రెడ్లలో అందరూ ధనికులు ఉండరని, పేదలు కూడా ఉంటారని వారిని ఆదుకుకోవాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేస్తామని పేదవారికి అండగా ఉండి మంచి కార్యక్రమాలు చేస్తూ, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఏపీలో పేరుకు రెడ్డి అనేది ఉంటే చాలు కేసులు బుక్ చేయడంతో పాటు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రాష్ట్ర వైసీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి అన్నారు. వనభోజనాల అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. వనభోజనాలకు హాజరైన వారిలో మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, వ్యాపారవేత్తలు సరపల్లి కోటిరెడ్డి, మోహన్‌రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ వైస్‌ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, ఏఐజీ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, హెటిరో డ్రగ్స్ డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, సాంబిరెడ్డి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి ఉన్నారు. కాగా, దేశంలోనే ఉత్తమ సీఎంగా నిలిచినందున దివంగత నేత వైఎస్‌కు భారతరత్న ఇవ్వాలంటూ కార్యక్రమానికి హాజరైన వారంతా సంతకాలు చేశారు.

అన్నీ అబద్ధాలు.. అసత్య ప్రచారాలు

సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నీ అబద్ధాలు, అసత్య ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. 'ఈ సర్కారు ఉత్త బేకారు ఉన్నదని ప్రజలు అనుకుంటున్నరు. ఎవరు మెచ్చుకునే పరిస్థితి లేదు గనుక, ముఖ్యమంత్రి తన భుజం తానే తట్టుకుంటున్నడు. మాది సుపరిపాలన అని డబ్బా కొట్టుకుంటున్నడు'అని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ అపరిపక్వత (ఇమ్మెచ్యూరిటీ), అసమర్థత (ఇన్ క్యాపబులిటీ), ప్రతికూల వైఖరి (నెగెటివ్ ఆటి ట్యూడ్)తో రాష్ట్రంలో అన్నిరంగాల్లో ప్రతికూల వాతావరణం నెలకొందన్నారు. 'మేము మంచి ఆర్థిక/వృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే, నీ రాక తర్వాత ఆశించిన మేరకు ఆర్థికవృద్ధి రేటు పెరగలేదు. వృద్ధి రేటు పెంచే సత్తా లేదు, సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక నోటికి వచ్చినట్టు వాగుతున్నావు. నెపం ప్రతిపక్షం మీదకు నెట్టుతున్నవు. కాంగ్రెస్ పాలన ఎట్లుందంటే.. ముందు దగా, వెనుక దగా, కుడి ఎడమల దగా దగా అన్న శ్రీశ్రీ కవిత లాగ ఉంది'అని హరీశ్‌రావు విమర్శించారు. 'ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి రైతుబంధు ఆపిన విషయం, అధికారంలోకి వస్తే 15వేలు ఇస్తామని చెప్పిన విషయం. నీకు గుర్తులేకపోవచ్చు రేవంత్‌రెడ్డి. ఆ ఫిర్యాదు కాపీ, ఎన్నికల కమిషన్ ఆదేశాలను, మీరు మాట్లాడిన వీడియోను పంపుతున్నా చూడండి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఓ వేతన సవరణ... రూ. 850 కోట్ల బకాయిలు



ఆర్టీసీలో 12 వేల మంది నిరీక్షణ

ఉద్యోగ విరమణ చేసిన ఒక్కొక్కరికి సగటున అందాల్సింది రూ. 7 లక్షలు

నిధులు లేక చేతులెత్తేసిన సంస్థ... సాయం చేయని ప్రభుత్వం

సాక్షి,హైదరాబాద్ : రిటైర్ అయిన ఉద్యోగులకు వెంటనే వారికి రావాల్సిన మొత్తాన్ని చెల్లించి సగౌరవంగా సాగనంపటం ఆనవాయితీ. కానీ, వేతన సవరణ కోసం ఏళ్లపాటు ఎదురుచూసి, చివరకు అది అమలయ్యేలోపే ఉద్యోగ విరమణ పొందినవారు.. ఇప్పుడు దాని బకాయిల కోసం మళ్లీ ఎదురుచూడాల్సిన దుస్థితి ఆర్టీసీలో నెలకొంది. ఒకరో ఇద్దరో కాదు..ఏకంగా 12 వేల మందిది ఇదే పరిస్థితి.

ఇదీ సంగతి..

ఆర్టీసీ ఉద్యోగులకు 2017 ఏప్రిల్‌లో వేతన సవరణను నాటి ప్రభుత్వం అమలు చేయలేదు. దీన్ని తీవ్రంగా పరిగణించిన కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో నాటి మంత్రి కడియం శ్రీహరి అధ్యక్షతన ఐదుగురు మంత్రులతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించింది. సంస్థ ఆర్థిక పరిస్థితి మెరుగుకాగానే వేతన సవరణ చేస్తామని, అప్పటి వరకు మధ్యంతర భృతి కల్పిస్తామని కమిటీ హామీ ఇవ్వటంతో సమ్మెను విరమించారు. ఆ మేరకు 16 శాతం ఐఆర్ అమలులోకి వచ్చింది. 2024 వరకు అదే కొనసాగుతూ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 21 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలులోకి వచ్చింది. ఈ సంవత్సరం మే నెలతో కొత్త వేతనాల జారీ మొదలైంది.

- 2017 ఏప్రిల్ నుంచి ఇది అమలు కావాల్సి ఉంది. చివరకు 2024 మే నెలలో అమలులోకి వచ్చింది. ఈ మధ్య కాలంలో ఆర్టీసీలో 12 వేల మంది ఉద్యోగ విరమణ పొందారు. ఈ ఏడేళ్ల కాలానికి (ఉద్యోగ విరమణ పొందిన తేదీ ఆధారంగా హెచ్చుతగ్గులుంటాయి) వారికి బకాయిలు చెల్లించాల్సి ఉంది. అందులో ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉన్నతాధికారులు మొదలు, సెక్యూరిటీ వరకు అన్ని విభాగాల సిబ్బంది ఉన్నారు. వారి బేసిక్ ఆధారంగా బకాయిలను లెక్కగడతారు. సగటున ఒక్కొక్కరికి దాదాపు రూ.7 లక్షల వరకు ఉంటుందని అంచనా. అలా వారికి దాదాపు రూ.850 కోట్లు అందాల్సి ఉంది.
- సర్వీసులో ఉన్న ఉద్యోగులకు కొత్త వేతనాలు అందుతుండగా.. బకాయిలను మాత్రం రిటైర్మెంట్ సమయంలో చెల్లించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, 2017 ఏప్రిల్- 2024 మే మధ్య ఉద్యోగ విరమణ పొందిన వారికి మాత్రం బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో ప్రకటించలేదు. రావాల్సింది పెద్ద మొత్తమే అయినందున, వాటితో కుటుంబపరమైన ఖర్చులకు ప్లాన్ చేసుకున్నారు. అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, వాటి చెల్లింపు సమాచారం కూడా అందటం లేదు.
- 2015లో వేతన సవరణ జరిగినప్పుడు..నాటి బకాయిల భారాన్ని ఆర్టీసీపై పడనివ్వబోమని, తామే చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2017 నాటి బకాయిల విషయంలోనూ ప్రభుత్వమే ఆదుకోవాల్సి ఉంటుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆర్టీసీకి 'మహాలక్ష్మి' పథకం కేటాయింపులు తప్ప గ్రాంట్లు, లోన్ల ప్రస్తావన తేలేదు. దీంతో ప్రభుత్వం నుంచి నిధులు అందటం లేదు. రోజువారీ ఆదాయం రోజువారీ ఖర్చులకే సరిపోని పరిస్థితిలో ఇంత పెద్ద మొత్తాన్ని చెల్లించటం ఆర్టీసీకి సాధ్యం కావడం లేదు.
- నిధులు లేక వారి చెల్లింపుల విషయాన్ని ఆర్టీసీ ఎటూ తేల్చలేకపోతోంది. ఎప్పట్లోగా చెల్లిస్తారో కూడా ప్రకటించలేదు. కార్యాలయాలకు వచ్చి అడుగుతున్నవారికి ఎలాంటి హామీ కూడా ఇవ్వలేకపోతోంది. రిటైర్ అయ్యి ఉండటం, ఆర్టీసీలో పెద్దగా పింఛన్ లేని స్థితిలో ఈ నిధుల అవసరం తమకు ఎంతో ఉందని ఉద్యోగ విరమణ పొందినవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బకాయిలతోపాటు ఆ కాలానికి సంబంధించిన గ్రాట్యుటీ, డీఏ బకాయిలను కూడా చెల్లించాల్సి ఉంది. వాటిదీ ఇదే దుస్థితి.

క్లుప్తంగా...

నేడు అసిస్టెంట్ సర్జన్లకు నియామక పత్రాలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న 442 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తాజాగా 442 పోస్టుల భర్తీ ప్రక్రియను వైద్యారోగ్య శాఖ పూర్తి చేసింది. ఈ ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ లెటర్లు అందించనున్నారు. 24 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు కూడా నియామక పత్రాలు అందజేస్తారు. నెక్లెస్ రోడ్డులో జరిగే కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేయనున్న ట్టు వైద్యారోగ్య శాఖ తెలిపింది. 28 పారామెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 32 ట్రాన్స్ జెండర్ క్లినిక్స్‌ను సీఎం రేవంత్ వర్చువల్ మోడ్‌లో ప్రారంభిస్తారు. కొత్తగా 213 అంబులెన్స్ సర్వీసులను అందుబాటు లోకి తేనున్నారు. త్వరలోనే మరో 600లకు పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫి కేషన్ ఇవ్వనున్నట్టు మంత్రి దామోదర రాజన ర్సింహ తెలిపారు. ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి హెచ్చరించారు.

రెవెన్యూ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీస్తున్నారు

ట్రెసా కార్యవర్గం ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: చారిత్రక నేపథ్యం ఉన్న సంఘ ఉన్నతిని ఓర్వలేక.. కొన్ని విభజన శక్తులు స్వప్రయోజనాల కోసం రెవెన్యూ ఉద్యోగుల ఐక్యతను దెబ్బ తీయాలని చూస్తు న్నాయని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆరోపించింది. ఈ మేరకు సోషల్‌మీడియా వేదికగా ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న దుష్ప్రచారా న్ని తిప్పికొట్టాలని ట్రెసా రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో ట్రెసా రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. కేడర్‌ల వారీగా సంఘాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వం వద్ద పలుకుబడి కోల్పోతామని స్పష్టం చేశారు. అన్ని కేడర్‌లకు ఒకే సంఘంగా ఐక్యంగా ఉండాలని కోరారు. సమావేశంలో జిల్లాల వారీగా రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ట్రెసా రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షుడు పి.రాజ్‌కుమార్, నేతలు ఎండీ రియాజు ద్దీన్, సి.ఎల్.బి.శాస్త్రి, బాణాల రాంరెడ్డి, కె.ని రంజన్‌రావు, ఎండి అన్వర్, దేశ్యా, జగన్‌మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొందరి స్వార్థ ధోరణి వల్లే వీఆర్‌వో వ్యవస్థ రద్దు

ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆరోపణ



మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

శామీర్‌పేట్: గత ప్రభుత్వంలో స్వార్థపూరిత ధోరణి వల్లే వీఆర్‌వోల వ్యవస్థ రద్దు అయిందని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా తూంకుంటలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ పూర్వ వీఆర్‌వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్)ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేంద్రరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో వీఆర్‌వోల పాత్ర కీలకమని, గత ప్రభుత్వ పెద్దలు అనుభవం లేక తీసుకున్న నిర్ణయాల వల్ల ఇటు ప్రజలు, వీఆర్‌వోలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ వ్యవస్థలో పూర్వ వీఆర్‌వో లను కలుపుకొని ముందుకు వెళ్లేలా సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిస్తామని లచ్చిరెడ్డి హామీ ఇచ్చారు. సమస్యలన్నింటినీ సీఎంకి వివరిస్తామన్నారు. కాగా, ఎలాంటి షరతులు లేకుండా రెవెన్యూ వ్యవస్థలో వీఆర్‌వోలను సర్దుబాటు చేయాలని గరిక ఉపేంద్రరావు అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ తహసీల్దార్‌ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శులు రమేశ్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, తహసీల్దార్‌ల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ 1,500 మంది పూర్వ వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నిఖేశ్ ఆస్తులు రూ.600 కోట్లు!

- భారీగా బయటపడిన ఇరిగేషన్ ఏఈఈ అక్రమాస్తులు
- ఆయన బంధువుల ఇళ్లలో కిలో బంగారం స్వాధీనం
- నిఖేశ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలింపు



సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీకి చిక్కిన నీటిపారుదల శాఖ ఏఈఈ హేరూర్ నిఖేశ్‌కుమార్ అవినీతి ఆస్తులను చూసి ఏసీబీ అధికారులే నివ్వెరపోతున్నారు. కేవలం పదేళ్లలోనే వందల కోట్లకు పడగలెత్తిన నిఖేశ్ కుమార్ ఆస్తుల వాస్తవ లెక్కలు తేల్చేపనిలో పడ్డారు. శనివారం నిఖేశ్‌కుమార్, ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో 20 చోట్ల ఏసీబీ అధికారులు మెరుపుదాడులు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం సోదాలు ముగియటంతో ఆయనను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నిఖేశ్‌కు న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించటంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. సోదాల్లో భాగంగా నిఖేశ్‌కు సంబంధించిన రూ.17.73 కోట్ల విలువైన ఆస్తుల పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ దాదాపు రూ.600 కోట్ల వరకు ఉంటుందని అంటున్నారు. నిఖేశ్ బినామీలను గుర్తించే పనిలో ఏసీబీ అధికారులున్నారు. ఆస్తులు భారీగా బయటపడటంతో నిఖేశ్‌కుమారే ఎవరికైనా బినామీగా ఉన్నాడా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) మాజీ డైరెక్టర్ దేవికారాణి అక్రమాస్తుల కేసు తర్వాత ఏసీబీ చరిత్రలోనే ఇది రెండో అతిపెద్ద ఆపరేషన్‌గా చెబుతున్నారు.

విల్లాలు.. విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు

నిఖేశ్ కుమార్ స్థిర, చరాస్తుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు. గండిపేట మండలం పీరం చెరువు పెబెల్‌సిటీ గేటెడ్ కమ్యూనిటీలో నిఖేశ్ నివసిస్తున్నాడు. నానక్‌రాంగూడ, శంషాబాద్, గచ్చిబౌలిలో ఆయన విల్లాలు కొనుగోలు చేసినట్టు గుర్తించారు. తాండూరులో మూడెకరాల భూమి, మొయినాబాద్‌లో మూడు ఫామ్‌హౌస్‌లు గుర్తించినట్టు సమాచారం. ఇప్పటికే నిఖేశ్ బంధువుల ఇళ్లలో కిలో బంగారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. సోమవారం నిఖేశ్‌కుమార్ కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట ఉన్న బ్యాంకు లాకర్లు తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు నెలల క్రితం లంచం తీసుకొంటూ పట్టుబడిన నిఖేశ్‌పై అప్పటి నుంచే ఏసీబీ దృష్టి పెట్టినట్లు సమాచారం. ఆయన ఆస్తుల వివరాలన్నీ సేకరించిన తర్వాత శనివారం సోదాలు చేసినట్లు తెలిసింది.

నిఖేశ్ రూటే సప'రేటు'

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మైనర్ ఇరిగేషన్‌లో ఏఈఈ గా పనిచేసి సస్పెన్షన్‌కు గురైన నిఖేశ్‌కుమార్ అవినీ తిలో ఆరితేరినట్లు ఏసీబీ అధికారులు చెబుతు న్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో స్థిరాస్తి రంగానికి సంబంధించిన నిర్మాణాలకు అక్రమంగా అనుమతులు ఇవ్వటం ద్వారా ఈయన కోట్లు సంపాదించినట్టు తెలుస్తోంది. గండిపేట డివిజన్ ఇరిగే షన్ ఏఈఈగా 2021 నుంచి పనిచేస్తున్న ఆయన.. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో భవన నిర్మాణాలకు అనుమతులు (ఎన్‌ఓసీలు) ఇచ్చి, స్థిరాస్తి కంపెనీల నుంచి భారీగా వసూలు చేసినట్లు గుర్తించారు. 200 గజాల ఇంటి ఎన్‌ఓసీకి రూ.4 లక్షలు, రెండు ఎకరాలు దాటిన నిర్మాణాలకు రూ. 50 లక్షలు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.

ట్యూటర్ నిర్వాకం.. హాస్టల్ విద్యార్థి మృతి

- పొలం పనులకు విద్యార్థిని తీసుకెళ్లిన ట్యూటర్
- ఈత కోసం బావిలోకి దిగి విద్యార్థి మృతి
- సూర్యాపేట జిల్లాలో ఘటన



తిరుమలేశ్ (ఫైల్)

అనంతగిరి: హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం ఓ విద్యార్థి ప్రాణాలు తీసింది. సూర్యాపేట జిల్లా చింతల పాలెం మండలం నక్కగూడెం తండాకు చెందిన గుగులోత్ తిరుమలేశ్ (15) అనే విద్యార్థి అనంతగిరి మండలం శాంతినగర్‌లోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో ఉంటూ అదే గ్రామంలోని జిల్లాపరిషత్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఆ హాస్ట ల్‌లో పనిచేస్తున్న ట్యూటర్ వీరబాబు ఆదివారం తిరుమలేశ్‌తోపాటు మరో విద్యార్థి గుగులోత్ తరు ణ్‌ను తన పొలంవద్ద పనిచేయటానికి తీసుకెళ్లాడు. పని ముగిసిన తర్వాత అక్కడే ఉన్న బావిలో ఈత కొట్టడానికి వెళ్లారు. తరుణ్‌కు ఈత రాకపోవడంతో బయటే ఉండగా, వీరబాబు, తిరుమలేష్ బావిలో దూకారు. తిరుమలేశ్ ఎంతసేపటికీ బయటకు రాకపోవటంతో బావిలో కొద్దిసేపు వెదికిన వీరబాబు.. అక్కడి నుంచి పారిపోయాడు. తిరుమలేశ్ బావిలో మునిగిపోయిన విషయాన్ని తరుణ్ తమ బంధువులకు తెలపటంతో వారు బావి వద్దకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న అనంతగిరి పోలీసులు అక్కడికి చేరుకుని ఫైర్ సిబ్బంది సహాయంతో తిరుమలేశ్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తిరుమలేశ్ కుటుంబ సభ్యు లు, బంధువులు ఆదివారం రాత్రి హాస్టల్ వద్ద ఆందోళన చేపట్టారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు మరణించాడని తిరుమ లేశ్ తండ్రి బాలాజీ.. జిల్లా విద్యాశాఖ అధికారి లతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుమారుడి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి హాస్టల్ వద్దకు చేరుకుని మృతుడి తల్లిదండ్రులకు, బంధువులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.



టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశం ఆదివారం సీఎం ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు!

ఏడాది పాలనపై సీఎం కార్యాలయం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది కాలంలో రాష్ట్రంలో విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులను చిన్న వివాదం లేకుండా పూర్తిచేసినట్లు వెల్లడించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకొంటున్న నేపథ్యంలో విద్యా రంగంలో పురోగతిని ముఖ్యమంత్రి కార్యాలయం మీడియాకు వివరించింది. విద్యారంగంలో సంస్కరణల కోసం విద్యా కమిషన్‌ను ఏ ర్పాటు చేసినట్లు గుర్తుచేసింది. బడ్జెట్‌లో విద్యా శాఖకు రూ.21,292 కో ట్లు కేటాయించామని, గత ఏడాదికన్నా ఇది రూ.2,119 కోట్లు ఎక్కువ అ ని వివరించింది. గడిచిన ఏడాదిలో తమ ప్రభుత్వ హయంలో చోటు చేసుకున్న విద్యారంగ పురోగతి వివరాలను సీఎంఓ విడుదల చేసింది.

ఆ వివరాలు సాక్షిప్లస్ (ఈ -పేపర్)లో

సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ. 830 కోట్ల సాయం

సాక్షి, హైదరాబాద్: అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు రూ.830 కోట్లు విడుదల చేసి నట్లు ప్రభుత్వం తెలిపింది. తద్వారా రాష్ట్రంలోని 1,66,000 కుటుంబాలు లబ్ధి పొందిన ట్లు వెల్లడించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకొంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన–ప్రజా విజయో త్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కార్యాల యం సీఎంఆర్‌ఎఫ్‌పై ఒక ప్రకటన విడుదల చేసింది. '2018 నుంచి 2023 వరకు ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2,400 కోట్ల సాయం అందించింది. అంటే సగటున ఏటా రూ.480 కోట్లు ఖర్చు చేసింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.830 కోట్ల సాయం అందించింది. ఆరోగ్య శ్రీ పరిధిలో లేని చికిత్సలు, ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు ఖరీదైన వైద్యం అవస రమైతే ప్రజా ప్రతినిధుల సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ సాయం అందిస్తుంది' అని వివరించింది. పేద, మధ్యతరగతి వర్గాలవా రికి వైద్య సేవల కోసం ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) జారీ చేయటంలోనూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉదారత చాటుకుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఏడాదిలోనే 13 వేల మందికి సుమారు రూ.240 కోట్ల విలువైన ఎల్వో సీలు మంజూరు చేసినట్లు తెలిపింది.

దయనీయ స్థితిలో గురుకులాలు

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టళ్లు అత్యంత దయనీయ పరిస్థితుల్లో కొట్టుమిట్టా డుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ ఎస్వీ గురుకులాల బాట లో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా శేరిగూడలోని గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల, వినోభానగర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు చేసేందుకు తాము గురుకులాల బాట పట్టలేదని, రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో ఆయా గురుకులాల్లోని సమస్యల మూలాలను తెలుసుకొని వాటిని కాపాడేందుకు వచ్చామని స్పష్టం చేశారు. శేరిగూడ గురుకులంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధ్యా పకులు లేరని.. భవనం సరిగాలేదని, బాత్రూంలు దుర్వాసన వస్తున్నాయని, కుళ్లిపోయిన కూరగాయలు వంటలకు వాడుతున్నారని ధ్వజ మెత్తారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని, విద్యా ర్థులు పడుకోవడానికి బెడ్స్‌లేవని, యూనిఫాం, షూస్ ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఇతర నేతలు పాల్గొన్నారు. కాగా, అనుమతి లేకుండా ప్రవీణ్‌కుమార్ హాస్టల్‌ను సందర్శించడంపై శేరిగూడ గురుకుల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల సమస్యలపై నేడు కలెక్టరేట్ల ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు ఫీజుల విషయంలో ర్యాంకుల విధానాన్ని ఎత్తివేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ల ముట్టడి చేపడుతామని తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్య, వైద్యాన్ని జాతీయం చేసి ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురుకులాలకు సొంత భవనాలు లేవని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని విమర్శించారు. విద్యార్థుల మరణాలపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 3వ వారంలో ఇందిరాపార్కు వద్ద 48 గంటల ఫీజు దీక్ష నిర్వహిస్తామని చెప్పారు.



వ్యక్తీకరణ లేని అందం విసుగు తెప్పిస్తుంది.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 2 డిసెంబర్ 2024

మానని గాయం

ఆధునిక కాలంలో మనిషి అంతరిక్షాన్ని అందుకోగలిగాడు; చంద్రమండలం మీద అడుగు మోపగలిగాడు; సహజ మేధకు పోటీగా కృత్రిమ మేధను సృష్టించాడు; విశ్వామిత్ర సృష్టిని తలపించేలా మనుషులకు దీటైన మరమనుషులను సృష్టించాడు. ఇంతటి మహత్తర ఘనతలను చూసినప్పుడల్లా ‘మానవుడే మహనీయుడు/ శక్తియుతుడు యుక్తిపరుడు మానవుడే మహనీయుడు... జీవకోటి సర్వములో శ్రేష్ఠతముడు మానవుడే!’ అనుకుంటూ గర్వంతో ఉప్పొంగిపోతాం. రేపో మాపో అంగారక గ్రహం మీద ఆవాసాలను ఏర్పాటు చేసే దిశగా మనుషులు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుసుకున్నప్పుడు ఉత్సాహంతో ఉబ్బి తబ్బిబ్బయిపోతాం. మనిషి సాధించిన ఘన విజయాలను ఏకరువు పెట్టాలంటే, ఎన్ని గ్రంథాలైనా చాలవు.

చరిత్రలో ఇన్ని ఘన విజయాలు సాధించిన మనిషికి అనాది పరాజయాలు కూడా ఉన్నాయి. ఆధునికత సంతరించుకుని, అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్న మనిషి–అమరత్వాన్ని సాధించే దిశగా కూడా ప్రయత్నాలు సాగిస్తున్నాడు. అయితే, ఆకలి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని నేటికీ కనుక్కోలేకపోవడం మాత్రం ముమ్మాటికీ మనిషి వైఫల్యమే! యుద్ధాలలో ఉపయోగించడానికి అధునాతన ఆయుధాలను ఎప్పటికప్పుడు తయారు చేయగలుగుతున్న మనిషి – అసలు యుద్ధాల అవసరమే లేని శాంతియుత ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం కూడా వైఫల్యమే!

ప్రపంచంలో మనిషికి క్షుద్బాధను మించిన దుర్భర బాధ మరొకటేదీ లేదు. పురాణ సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు ఆకలి ప్రస్తావన మనకు విరివిగా కనిపిస్తుంది. తాను ఆకలితో అలమటిస్తున్నా, అతిథికి అన్నం పెట్టి పుణ్యలోకాలకు వెళ్లిన రంతిదేవుడి కథ తెలిసినదే! ఆకలికి తాళలేక కుక్కమాంసం తిన్న విశ్వామిత్రుడి కథ పురాణ విదితమే! ఆకలి బాధ మనిషిని ఎంతకైనా దిగజారుస్తుంది. అందుకు విశ్వామిత్రుడి కథే ఉదాహరణ. పురాణాల్లో అక్షయపాత్రలు పుణ్యాత్ముల ఆకలి తీర్చిన గాథలు ఉన్నాయే గాని, సామాన్యుల ఆకలి తీర్చిన ఉదంతాలు లేవు. ఆకలితో అలమటిస్తున్నా, త్యాగం చేయడం గొప్ప సుగుణమని చెప్పే పురాణాలు – ఆకలికి శాశ్వత పరిష్కారాన్ని మాత్రం చెప్పలేదు.

ఆధునిక సాహిత్యంలో ఆకలి ప్రస్తావనకు కరవు లేదు. స్వాతంత్య్రోద్యమం ఉద్ధృతంగా సాగుతున్న కాలంలో ‘మాకొద్దీ తెల్లదొరతనము’ అని ఎలుగెత్తిన గరిమెళ్ల – ఆ పాటలోనే ‘పన్నెండు దేశాలు పండుతున్నాగాని/ పట్టెడన్నమె లోపమండీ/ ఉప్పు పట్టుకుంటే దోషమండీ/ నోట మట్టీ కొట్టుకుపోతామండీ/ అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండీ’ అంటారు. స్వాతంత్య్రం రాక ముందు మన దేశంలోని ఆకలి బాధలు అలా ఉండేవి. ప్రపంచమంతా ఆర్థికమాంద్యంతో అతలాకుతలమైన హంగ్రీ థర్టీస్ కాలంలో కలాలతో కవాతు చేసిన కవులందరూ ఆకలి కేకలు వినిపించినవారే! ‘ఆకలి ఆకలి తెరిచిన/ రౌరవ నరకపు వాకిలి/ హృదయపు మెత్తని చోటుల గీరే జంతువు ఆకలి/... ఈ ఆకలి హోరు ముందు/ పిడుగైనా వినిపించదు/ ఆకలి కమ్మిన కళ్లకు/ ప్రపంచమే కనిపించదు’ అన్న బైరాగి ‘ఆకలి’ కవిత పాఠకులను విచలితులను చేస్తుంది. ‘అన్నపూర్ణ గర్భగుడిని/ ఆకలి గంటలు మ్రోగెను/ ఆరని ఆకలి కీలలు/ భైరవ నాట్యము చేసెను/ ఘోర పరాజయమా ఇది?/ మానవ మారణ హోమం/ తల్లీ! ఆకలి... ఆకలి!’ అంటూ సోమసుందర్ ఆకలి కేకలు వినిపించారు.

‘నేను ఆకలితో ఉన్నాను/ నువ్వు చంద్రుడి వద్దకు వెళ్లావు... నేను తిండిలేక నీరసిస్తున్నాను/ నాకు వాగ్దానాలు మేపుతున్నావు’ అంటూ ఆధునిక శాస్త్ర సాంకేతిక పురోగతి ఒకవైపు, ఆకలి బాధలు మరోవైపుగా ఉన్న ఈ లోకంలో పాలకుల తీరును శ్రీశ్రీ ఎత్తిపొడుస్తారు. ఇప్పటికీ లోకం తీరు పెద్దగా మారలేదు. మానవుడు పంపిన ఉపగ్రహాలు అంగారకుడి వద్దకు వెళ్లినా, ఆకలి బాధలు సమసిపోలేదు; ఆకలి చావులు ఆగిపోలేదు.

మనిషి ఘన విజయాల చరిత్రలో ఆకలి, అశాంతి– రెండూ మాయని మరకలు. ఈ రెండు మరకలూ పూర్తిగా చెరిగిపోయేంత వరకు మనిషి ఎన్ని విజయాలు సాధించినా, అవేవీ మానవాళికి ఊరటనూ ఇవ్వలేవు; మానవాళిని ఏమాత్రం ఉద్ధరించనూ లేవు. ఆకలికి, అశాంతికి మూలం మనుషుల్లోని అసమానతలే! ప్రపంచంలో అసమానతలు తొలగిపోనంత వరకు ఆకలిని రూపుమాపడం, శాంతిని నెలకొల్పడం అసాధ్యం. నిజానికి సంకల్పం ఉంటే, సాధ్యం కానిదంటూ ఏదీ లేదు గాని, అసమానతలను రూపుమాపే సంకల్పమే ఏ దేశంలోనూ పాలకులకు లేదు. అందువల్లనే ఆకలి, అశాంతి మనుషులను తరతరాలుగా పట్టి పీడిస్తున్నాయి. అకాల మరణాలకు కారణమవుతున్నాయి.

ఆకలి వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు పాతికవేల నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అంటే, ఏడాదికి సగటున ఏకంగా తొంభై లక్షల మంది ఆకలికి బలైపోతున్నారు. ఆకలితో మరణిస్తున్న వాళ్లలో పసిపిల్లలు కూడా ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న శిశుమరణాల్లో దాదాపు యాభై శాతం ఆకలి చావులే! నాణేనికి ఇదొకవైపు అయితే, మరోవైపు వంద కోట్లమందికి ఆకలి తీర్చడానికి తగినంత ఆహారం ప్రతిరోజూ వృథా అవుతోంది. ఈ పరిస్థితిని గమనించే ‘అన్నపు రాసులు ఒకచోట/ ఆకలి మంటలు ఒకచోట’ అని కాళోజీ వాపోయారు. ప్రపంచ ఆర్థిక శక్తుల్లో ఐదో స్థానంలో ఉన్న మన దేశం– ఆకలి సూచిలో నూట ఐదో స్థానంలో ఉండటం ఒక కఠోర వాస్తవం. అమృతోత్సవ భారతంలో ఆకలి సమస్య ఒక మానని గాయం!

వ్యవసాయాన్ని పండుగ చేశాం!

అభిప్రాయం



బి. మహేశ్ కుమార్ గౌడ్

అన్నదాత కష్టాలను క్షేత్రస్థాయిలో కళ్లారా చూసి చలించిన కాంగ్రెస్, 2022 మేలో వరంగల్ సభలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ‘రైతు డిక్లరేషన్’ వెలువరించింది. అందుకు అనుగుణంగానే బడ్జెట్‌లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తూ రూ. 72,659 కోట్లు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ‘రుణమాఫీ’ పథకానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. మొత్తం మూడు విడతలలో 22,37,848 మంది రైతులకు రూ. 17,933.18 కోట్లను విడుదల చేసింది. తాజాగా నాలుగో విడత రుణమాఫీగా మరో రూ.2,747.67 కోట్లు అందించింది. అలా ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడుతుందని రుజువు చేసింది. రైతులకు వ్యవసాయాన్ని పండుగ చేయడం జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ఏదో ఒక అంశాన్ని లేవనెత్తుతూ నానా యాగీ చేస్తున్నాయి.

దేశాభివృద్ధికి బడా వ్యాపారస్థుల కంటే రైతులే కీలకమని విశ్వసించే కాంగ్రెస్... అన్నదాతల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్నో ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో దగా పడింది. రాష్ట్రానికి వెన్నెముక లాంటి రైతులను కేసీఆర్ సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వ్యవసాయ రంగం కుదేలైంది. రైతులు కష్టాల సుడిగుండంలో చిక్కుకొని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా... అప్పటి సీఎం కేసీఆర్ మాయమాటలతో అరచేతిలో స్వర్గం చూపించారు. అన్నదాత కష్టాలను క్షేత్రస్థాయిలో కళ్లారా చూసి చలించిన కాంగ్రెస్, వారి కన్నీటిని తుడవాలనే లక్ష్యంతో 2022 మేలో వరంగల్ వేదికగా పార్టీ అధినేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పలు సంక్షేమ పథకాలతో ‘రైతు డిక్లరేషన్’ ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వ్యవసాయ రంగానికి రూ. 54,280 కోట్లు ఖర్చు చేసి తమది రైతు ప్రభుత్వం అని నిరూపించుకుంది.

రైతులు నిరంతరంగా ఆనందంగా ఉంటేనే సమాజంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయనేది కాంగ్రెస్ విశ్వాసం. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించాం. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, ఏడాదికి ఎకరాకు రూ. 15 వేల ‘ఇందిరమ్మ భరోసా’, అన్ని పంటలకు మెరుగైన మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయడం, వివిధ కారణాలతో నష్టపోయే పంటలకు తక్షణం నష్టపరిహారం చెల్లించడం, పంటల బీమా పథకం వర్తింపు, ‘మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకా’న్ని వ్యవసాయ పంటలకు అనుసంధానం చేయడం, పోడు భూముల రైతులకు, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు అన్ని రకాల యాజమాన్య హక్కులు కల్పించడం, అవినీతికి మారుపేరుగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దు చేసి దాని స్థానంలో నూతన రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి పలు రైతు ప్రయోజనకర పథకాలను ‘వరంగల్ డిక్లరేషన్’లో కాంగ్రెస్ ప్రకటించింది. ప్రజల ఆశీర్వాదాలతో అధికారంలోకి రాగానే, తాను ప్రకటించిన కార్యక్రమాలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముందుండే కాంగ్రెస్ అందుకు అనుగుణంగా 2024–25 తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తూ రూ. 72,659 కోట్లు కేటాయించింది. వ్యవసాయంతో పాటు హార్టికల్చర్‌కు రూ. 737 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ. 19,080 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇచ్చే ప్రాధాన్యాన్ని మాటల్లో కాక చేతల్లో చూపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ‘రుణమాఫీ’ పథకానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుచిత నిర్ణయాలతో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా పలు ఇబ్బందులు ఎదురవుతాయని



తెలిసినా మూడు దశలలో సంబంధిత రైతుల బ్యాంకుల ఖాతాల్లో వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి 2 లక్షల రూపాయలు జమ చేసింది. మొదటి విడతలో 11,50,193 మంది రైతులకు రూ. 6,098.93 కోట్లు, రెండో విడతలో 6,40,823 మంది రైతులకు రూ. 6,190.01 కోట్లు, మూడో విడతలో 4,46,832 మంది రైతులకు రూ. 5,644.24 కోట్లు... మొత్తం మూడు విడతలలో 22,37,848 మంది రైతులకు రూ. 17,933.18 కోట్లను విడుదల చేసి... ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని మరోసారి రుజువు చేసింది. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో, అందరికీ న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి పారదర్శకంగా లబ్ధిదారులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంది. కానీ ప్రభుత్వాన్ని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రతిపక్ష పార్టీలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. గతంలో కేసీఆర్ సర్కార్ లక్షరూపాయల రుణమాఫీని వాయిదాల పద్ధతిలో అసంపూర్తిగా నిర్వహించి అన్నదాతల ఆగ్రహానికి గురై అధికారం కోల్పోయింది. అయినా బీఆర్ఎస్ ఆత్మవిమర్శ చేసుకోకుండా ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలు సమయం వచ్చినప్పుడు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయం.

‘రైతు భరోసా’ ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ. 7,625 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన స్వల్ప కాలంలోనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో నిబంధనల ప్రకారం పలు పథకాల (హామీల) అమలులో కొంత జాప్యం జరిగింది. ఈ ప్రభావం ‘రైతు భరోసా’పై కూడా పడింది. ప్రస్తుతం రాబోయే సీజన్‌లో రైతులకు వ్యవసాయానికి సంబంధించిన కొనుగోలులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలని లబ్ధిదారులందరికీ వీలైనంత త్వరగా ‘రైతు భరోసా’ పంపిణీ పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ సర్కార్ ఉంది. సంక్రాంతి పర్వదిన సందర్భంగా పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి తోడు రూ. 1514 కోట్ల ‘రైతు బీమా’ను కూడా ప్రభుత్వం పూర్తి చేసింది. వరికి రూ. 500 బోనస్ చెల్లిస్తామన్న హామీని నిలబెట్టుకుంది.

ప్రకృతి వైపరీత్యాలతో ఇటీవల పంట నష్టం జరిగినప్పుడు కేంద్రంలోని బీజేపీ సర్కార్ సరైన రీతిలో స్పందించకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఆదుకుంది. పంట నష్ట సహాయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపించినా, రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఎన్డీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయారు. తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములను కోల్పోయి త్యాగం చేస్తున్న రైతులకు మెరుగైన ప్రయోజనం కలిగించాలనే దృక్పథంతో... ఆ భూముల మార్కెట్ విలువను మూడింతలు పెంచుతామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని చెప్పడానికి నిదర్శనం.

పోడు భూముల హక్కుల కోసం పోరాడిన రైతులపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దౌర్జన్యాలు బహిరంగ రహస్యమే. దీనికి భిన్నంగా పోడు భూములపై హక్కులను అక్కడ వ్యవసాయం చేసుకుంటున్న రైతులకే అప్పగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అంతేకాక పొలాలకు సాగునీరు అందించేందుకు అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో ప్రాధాన్యం ఇస్తూ... వాటికి నిధులు కేటాయించి వేగవంతంగా పనులు పూర్తి చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. తెలంగాణలో పండే అన్ని రకాల పంటలను రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి అన్నదాతలకు నష్టం రాకుండా చర్యలు తీసుకుంది. రాష్ట్రం కొనుగోలు చేసిన పంటల్లో కేంద్రం 25 శాతమే తీసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా ఇబ్బందులు కలగకూడదనే సంకల్పంతో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఎప్పటికప్పుడు అన్ని రకాల పంటలను సేకరిస్తోంది.

ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుంటే... జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు పనిగట్టుకొని ఏదో ఒక అంశాన్ని లేవనెత్తుతూ నానా యాగీ చేస్తున్నాయి. రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన అన్నదాతలపై కేసులు బనాయించి జైలుపాలు చేసిన ఘనత బీఆర్ఎస్‌ది. ఇప్పుడు కాంగ్రెస్ రైతు ప్రయోజనాలను కాపాడుతుంటే చూడలేకపోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, వెంట వెంటనే తీసుకుంటున్న సత్వర చర్యలు, నిర్ణయాలతో... రైతులకు వ్యవసాయం ఒక పండుగలా మారింది. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అభయహస్తం అందించిన కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ‘రైతు పండుగ’ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాష్ట్రంలోని రైతులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాటలు’ తాజాగా ఇలా...!

చెయ్యాల్సిన పరీక్ష



నాలుగు కోట్ల మంది భారతీయులు తమకు తెలియకుండానే తలసేమియా జన్యువులను మోస్తున్నారు. తల్లిదండ్రుల్లో ఒకరు ఈ జన్యువును కలిగి ఉంటే, సమస్య లేదు. కానీ ఇద్దరికీ ఉంటే, పిల్లవాడు జీవితాంతం బాధపడతాడు. నిరంతరం రక్తమార్పిడి అవసరమవుతుంది. భయంకరమైన శాపం! అందుకే పెళ్లికి ముందు రక్తపరీక్ష తప్పనిసరి చేయాలని నా మనవి.

– జవహర్ సర్కార్, రాజ్యసభ మాజీ సభ్యుడు

అందరూ నాయకులే!



ప్రతి ఒక్కరూ నాయకత్వ సామర్థ్యం కలిగి ఉంటారు. అదేమీ ఒక నిర్దిష్ట పాత్ర లేదా పదవికి పరిమితం కాదు. నాయకత్వం అనేది ఒక మనస్తత్వం. ఇంకా ముఖ్యంగా, అదొక చర్య.

– రవి వెంకటేశన్, వెంచర్ క్యాపిటలిస్ట్

మీరు ఏమిటి?



మీరు మీ పదాల శక్తిని గ్రహిస్తే, మీరొక ఉద్దేశ్యంతో మాట్లాడతారు. మీ ఆలోచనల శక్తిని అర్థం చేసుకుంటే, మీరొక లక్ష్యంతో ఆలోచిస్తారు. మీ ఉనికి శక్తిని తెలుసుకుంటే, మీరు ఉండాల్సిన స్థలాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటారు. మీ విలువ తెలుసుకోండి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

దిద్దుబాటు లేదు!



మన ప్రజాస్వామ్యంలో ఉన్న సమస్య, ఈవీఎంలు తారుమారు కావడం కాదు... దాన్ని సరిదిద్దడానికి ఎలాంటి సంస్థలూ లేకపోవడమే అసలు సమస్య.

– దీపా నితిన్ రౌత్, పైలట్

తవ్వకం పని



పద్నాలుగేళ్ల చిన్నారిని ఆర్కియాలజీ చదివించేందుకు ఒప్పించే ప్రయత్నం చేస్తున్నా. ఆధునిక భారత దేశంలో, పాత వస్తువులను తవ్వడం మంచి లాభసాటి వృత్తి కానుంది.

– ప్రసేన్‌జిత్ దత్తా, కాలమిస్ట్

పిడుగులతో జాగ్రత్త!

వర్షాకాలంలో తరచూ పిడుగులు పడి మనుషులూ, పశువులూ చనిపోవడం తెలిసిందే. నిపుణులు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తే పిడుగుపాటు నుంచి బయట పడవచ్చు. వర్షం రాగానే చెట్ల కిందికి వెళ్లకూడదు. ఒంటరి చెట్లు అత్యంత ప్రమాదకరం. చెట్లు, స్తంభాల కింద కాకుండా ఇళ్లకు, సురక్షిత భవనాలకు చేరుకోవాలి. కారులో ఉంటే అందులో కూర్చొని, కిటికీ అద్దాలు మూసివేయాలి. చేతులు ఒళ్లో పెట్టుకోవాలి. లోహపు తలుపులను తాకరాదు. ఇంటిలో ఉన్నప్పటికీ కొన్ని జాగ్రత్తలు అవసరం. విద్యుత్ పరికరాలను ఆపేయాలి. ఛార్జింగ్ చేస్తున్న ఫోన్ తాకకూడదు. కాంక్రీటు గోడలను, నేలను తాకకూడదు. బాల్కనీ, కిటికీలకు దగ్గరగా ఉండకూడదు. నల్లా నీటిని తాకరాదు. తాము నిలబడిన భూమి పొడిగా ఉండాలి. తడిగా ఉంటే దగ్గరలో పిడుగు పడితే విద్యుదాఘాతానికి గురి కావచ్చు.

చర్మంపై గుచ్చుకున్నట్లు, వెంట్రుకలు నిక్క బొడిచినా వెంటనే పిడుగు పడబోతోందని అర్థం (ఈ సూచికల గురించే అవకాశం ప్రతిసారి ఉండకపోవచ్చు). పొలాల్లో ఉన్నప్పుడు కాలి మునివేళ్ల పైన వంగి కూర్చొని, చెవులు మూసుకొని కూర్చోవడం ఒక మార్గం. ఇందువల్ల నేరుగా పిడుగు పడే అవకాశాలు తగ్గుతాయి. రెండు కాలి మడమలు ‘గ’ ఆకారంలో వెనక తాకి ఉండాలి. ఇందువల్ల భూమిపై పిడుగు పడితే ఒక కాలిలోకి ప్రవేశించిన విద్యుత్ మరో కాలిలోంచి భూమిలోకి త్వరగా వెళ్లిపోతుంది.

అడవిలో ఉంటే గుంపుగా ఉన్న చిన్న చెట్ల కింద ఉండవచ్చు. అప్పటికే కొండపై ఉంటే ఏదైనా గుహ కనిపిస్తే వెళ్లవచ్చు. తాటి చెట్లు ఎత్తుగా, తడిగా ఉండటం వల్ల సహజంగా పిడుగులను ఆకర్షించి భూమిలోకి విద్యుత్తును ప్రవహింపచేస్తాయి. ఇంటిలో ఉండటం క్షేమమే, అయినా పక్కనే పెద్ద చెట్టు ఉంటే ఏమి జరుగుతుందో సూర్యారావుపాలెం పిడుగుపాటు చెబుతోంది. చెట్టుకు దగ్గరలో ఎండు కర్రలు, దహనశీల పదార్థాలు ఉంటే అగ్ని తీవ్రత పెరుగుతుంది. కాని అడుగు బల్లె లేకపోతే మైదాన ప్రాంతంలో కూడా ఉండవచ్చు. కనుక గ్రామంలో చెట్లు అన్నీ ఒకే ఎత్తులో ఉండేట్లు పై కొమ్మలు తొలగిస్తే ప్రమాదావకాశాలు కొంత తగ్గుతాయి. మైదాన ప్రాంతంలో ఉండే పాక దుబ్బుల దగ్గర ఉండటం మరీ ప్రమాదకరం.

‘పిడుగు వాహకాలు’ (లైట్నింగ్ కండక్టర్) గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలి. ఇవి 20 ఎత్తులో పైగా పని చేస్తాయి. పిడుగు వాహకాలు కొద్ది మీటర్ల మేరకే రక్షణ కల్పిస్తాయి గనుక అన్ని ఎత్తైన ఇళ్లపై ఏర్పాటు చేసుకోవాలి. కేంద్ర భూవిజ్ఞాన శాఖ ‘దామిని’ అనే యాప్‌ను తీసుకొచ్చింది. రానున్న 40 నిమిషాల్లో మనమున్న 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ పిడుగులు పడతాయనేది ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పిడుగులను గుర్తించేందుకు దేశవ్యాప్తంగా 83 ప్రాంతాల్లో నెట్ వర్క్ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

– శ్రీనివాస్ మాధవ్, సమాచార హక్కు పరిశోధకుడు

ప్రపంచాన్ని నడిపించే సరికొత్త ఇంధనం

విశ్లేషణ



బి.టి. గోవిందరెడ్డి

ఈవీలు కలకాలం నిలుస్తాయా? వీటికంటే మెరుగైన, పర్యావరణ హితమైన వాహనాలు వస్తాయా? చాలామందిని వేధించే ప్రశ్నలివి. ఆ ఇంధనం పెట్రోలు, డీజిల్ మాదిరి కాలుష్యాన్ని మిగల్చదు. ఈవీ బ్యాటరీల్లో మాదిరిగా లిథియం వంటి ఖరీదైన, అరుదైన ఖనిజాలు అక్కర్లేదు. ఏమిటా అద్భుత ఇంధనం? అదే హైడ్రోజన్!

మీకు తెలుసా? పెట్రోలు, డీజిల్ ఇంజిన్ల ద్వారా సుమారు 80 శాతం శక్తి వృథా అవుతోందని! లీటర్ పెట్రోలు లేదా డీజిల్ పోసి కారు నడిపితే 20–25 శాతం వరకు మాత్రమే వాహనానికి ఉపయోగపడుతుంది. మిగిలిన 75–80 శాతం ఇంజిన్‌లో ఆహుతి కాని ఇంధనం, వేడి పొగ రూపంలో పొగగొట్టం నుంచి బయటకు వెళ్లిపోతుంది. ఇంజిన్‌లో ఇంధనం మండటం వల్ల పుట్టే వేడి, దానిని చల్లార్చే కూలింగ్ వ్యవస్థ రూపంలో వృథా అవుతుంటుంది! విద్యుత్తు బ్యాటరీలు కాలుష్య కారక పొగలు కక్కవు కానీ... వీటి బ్యాటరీల తయారీకి ముడిసరుకైన లిథియం దొరికే దేశాలపై ఆధారపడాలి. పైగా ఇదే లిథియం మన స్మార్ట్ ఫోన్లతోపాటు ఈ కాలపు ఎలక్ట్రానిక్స్ అన్నింటి బ్యాటరీలకూ కావాలి. విద్యుత్తుతో నడిచే వాహనాలు పర్యావరణానికి మేలు చేసేవే అయినప్పటికీ ఛార్జ్ చేసుకునేందుకు ఎక్కువ సమయం పడుతుండటం, పూర్తిస్థాయిలో ఛార్జింగ్ నెట్‌వర్క్ లేకపోవడం వంటివి వీటి విస్తృత వినియోగానికి అడ్డుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పెట్రోల్, డీజిల్, విద్యుత్తు కంటే మెరుగైన, చౌకైన, సమర్థమైన ఇంధనం కోసం దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. హైడ్రోజన్ లభ్యత భూమండలంలో అనంతం. ఒక లీటర్ (మంచి) నీటి నుంచి ఎలక్ట్రాలసిస్ పద్ధతి ద్వారా 1.2 లీటర్ల హైడ్రోజన్‌ను వేరు చేయవచ్చు. గాలి నుంచి కూడా దీనిని వేరు చేయవచ్చు.

ప్రపంచంలోనే మొట్టమొదటి హైబ్రిడ్ కారు (పెట్రోలు + విద్యుత్తు) ‘ప్రియస్’ను తయారు చేసిన రికార్డు టయోటాదే. అలాగే ఇంధనంగా హైడ్రోజన్ ఫ్యుయెల్ సెల్ (అక్కడికక్కడ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే బ్యాటరీ లాంటిది) వాహనం ‘మిరాయి’ కూడా టయోటా సృష్టే. ఈ నేపథ్యంలోనే తాము విద్యుత్తు వాహనాల కంటే హైడ్రోజన్ వాహనాలకే ప్రాధాన్యమిస్తామని టయోటా ఛైర్మన్ అకియో టయోడా ఇటీవల చేసిన ప్రకటన అందరి దృష్టిని హైడ్రోజన్ పై మళ్లించింది. విద్యుత్తు వాహనాల వల్ల ఉపాధి కోల్పోయే అవకాశమున్న టెక్నీషియన్లకు హైడ్రోజన్ ఇంధనం ఆ దుస్థితి రానివ్వదు.

హైడ్రోజన్ ఫ్యుయెల్ సెల్స్ టెక్నాలజీతో ఎన్నో లాభాలున్నాయి. పెట్రోల్, డీజిల్ మాదిరిగా హైడ్రోజన్‌ను నిమిషాల వ్యవధిలో నింపుకోవచ్చు. చల్లటి వాతావరణమైనా, విపరీతమైన వేడి ఉన్నా వాహనం నడపటంలో ఎలాంటి సమస్యలూ ఉండవు. భారీ బ్యాటరీలు అవసరం



ఉండదు. బ్యాటరీ వాహనాల కంటే చాలా ఎక్కువ మైలేజీ వస్తుంది. ఫలితంగా భారీ ట్రక్కులాంటివి దూర ప్రాంతాలకు నిరాటంకంగా ప్రయాణించవచ్చు. సౌర, పవన వంటి పునరుత్పత్తి ఇంధనాల సాయంతో హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తే పర్యావరణ కాలుష్యమూ గణనీయంగా తగ్గుతుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించేందుకు హైడ్రోజన్ పనికొస్తుంది. హైడ్రోజన్ ఇంధనంతో ఇప్పటికే జర్మనీ, ఆస్ట్రియా, నెదర్లాండ్స్, ఇటలీ, యూకే, కెనడా, జపాన్, దక్షిణ కొరియా, చైనా దేశాలు రైళ్లను నడుపుతున్నాయి. కొన్ని దేశాలు ప్రోటో టైప్‌లను రూపొందించి ట్రయల్ రన్‌లో పట్టాలెక్కించాయి. రైళ్లకు హైడ్రోజన్ ఇంధనం వాడటం వల్ల ఎలక్ట్రిక్ లైన్ల ఏర్పాటు, నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి.

ఈ టెక్నాలజీని ఇప్పటికే నాసా అంతరిక్ష ప్రయోగాల్లోనూ విజయవంతంగా పరీక్షించారు. అంతే కాదు, నీటిపై తిరిగే వాహనాలకు మాత్రమే కాకుండా... అంతరిక్ష ప్రయోగాల్లోనూ దీన్ని వాడే అవకాశాలు ఉన్నాయన్న మాట. భవిష్యత్తులో విమానాలు హైడ్రోజన్ ఇంధనంపైనే నడిచే స్కోప్ ఉంది. ఇన్ని ప్రయోజనాలున్న నేపథ్యంలో హైడ్రోజన్ సరుకు రవాణా, బ్యాటరీలు వ్యక్తిగత రవాణాకు పరిమితమవుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే... ప్రస్తుతానికి హైడ్రోజన్ వాహనం ఉత్పత్తి ఖర్చు కొంచెం ఎక్కువే. కానీ... సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పుల కారణంగా 2030 నాటికి ఈ ఖర్చు సగమవుతుందని, ఆ వెంటనే విస్తృత వినియోగం పెరుగుతుందని హైడ్రోజన్ కౌన్సిల్ అంచనా వేస్తోంది.

హైడ్రోజన్ బాటన ప్రపంచం

గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా హైడ్రోజన్ ఫ్యుయెల్ సెల్ అమ్మకాలు 30 శాతం వరకూ పెరిగాయి. ఈ రంగం విలువ 2022 నాటికే రూ. 1.08 లక్షల కోట్లకు చేరుకోగా 2030 నాటికి రూ. 3.32 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. అలాగే కొరియా, జపాన్‌లతో పాటు యూరోపియన్ యూనియన్ కూడా హైడ్రోజన్ వాహనాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. పెట్రోల్ బంకుల మాదిరిగానే హైడ్రోజన్ బంకులలాంటివి వందల సంఖ్యలో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాయి. కొరియాలో 2040 నాటికి 1,200 బంకుల ఏర్పాటుకు ప్రయత్నిస్తుండగా జపాన్ 2030 నాటికే ఎనిమిది లక్షల వాహనాలు, 900 రీఫ్యూయెలింగ్ స్టేషన్ల కోసం ఏర్పాట్లు చేస్తోంది. యూరోపియన్ యూనియన్ 2050 నాటికల్లా ఐదు లక్షల హైడ్రోజన్ ట్రక్కులు ఉత్పత్తి చేసే దిశగా అడుగులేస్తోంది. ఆ యా దేశాల ప్రభుత్వాల ప్రోత్సాహంతో... ప్రైవేట్ రంగం కూడా హైడ్రోజన్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తూండటం గమనార్హం. టయోటాతో పాటు హ్యుందయ్, హోండా, బీఎండబ్ల్యూ, మెర్సిడిస్, ఫోర్డ్ వంటి దిగ్గజ వాహన కంపెనీలు హైడ్రోజన్ టెక్నాలజీలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్న కారణంగా ఇంకొన్నేళ్లలోనే ఈ ఇంధనం ప్రపంచం మొత్తాన్ని నడిపిస్తుందని అంచనా.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అజ్ఞానమే చీకటి

మనలోని అజ్ఞానమే మనల్ని పెనవేసిన చీకటి. పెనవేసిన చీకటి ప్రతి పొరల్ని తొలగించడానికి గురువు చెప్పే ప్రతి వాక్యం జ్యోతిర్మయమే అవుతుంది. చీకటికి చిహ్నాలు చాలా ఉన్నాయి. వాటిని తొలగించేవీ ఇంకెన్నో ఉన్నాయి. అలాగే గురువు చెప్పిన మాటలే వెలుగు కాకపోవచ్చు. గురువు స్థానంలో ఉండే తల్లిదండ్రులు, పెద్దలు, మంచి స్నేహితులు కూడా ఉంటారు. వారి అనుభవపూర్వకమైన హితవాక్యాలను సూచనల ద్వారా కూడా సమస్యల పరిష్కారం లభిస్తుంది. చీకటిలో ఉన్న మన ఆదిమ పూర్వులు ఉదయ సమయాన సూర్యుణ్ణి ఆహ్వానిస్తూ, మమ్ము కూడా ఈ చీకటి నుంచి కాంతిజ్యోతి వైపు నడిపించమని వేడుకున్నారు. ‘తమసోమా జ్యోతిర్గమయ’ అని ప్రార్థించారు.

ఓ సారి ప్రభు శిష్యులు సముద్రంలో పయనిస్తున్నప్పుడు, పెద్ద పెద్ద అలలతో, సముద్రం అల్లకల్లోల స్థితిలో ఉంది. భయకంపితులైపోయారు శిష్యులు. సముద్రంపై ప్రభువు నడచి వస్తూ ఉన్నారు. ఆయన్ను గుర్తు పట్టక మునుపు భీతిల్లిన శిష్యులు దగ్గరకు రాగా ఆనవాలు పట్టే అవకాశం లేదు. వారి మదిలోని చీకటి వెలిగిపోయింది.

ప్రభువును చూసి పేతురు తాను కూడా అలలపై నడవాలని ఆశపడ్డాడు. ప్రభువు ధైర్యంగా నడవమన్నారు. పేతురు నాలుగడుగులు వేశాడో లేదో అనుమానం చీకటిలా ఆవరించేసింది.

ప్రభువు శిలువపై హత్య చేయబడ్డాడు. అప్పుడు శిష్యుడు థామస్ అక్కడ లేడు. ప్రభు మరణాన్ని చూసిందీ లేదు. పునరుత్థాన ప్రభువు దర్శనం ఇచ్చిన తరువాత ‘నీ గాయాలలో నన్ను వేలు పెట్టనీ, అప్పుడుగానీ నీ మరణాన్ని అంగీకరించను’ అని తన అనుమానాన్ని బయటపెడతాడు. ఇలా అజ్ఞానాలు అనేక రకాలు. సమయాన్ని బట్టి విజ్ఞానంగా మార్చుకోవాలి.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం, తిథి: శు.పాడ్యమి ప.12.02 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: జ్యేష్ఠ ప.3.55 వరకు, తదుపరి మూల, వర్జ్యం: రా.12.15 నుండి 1.45 వరకు, దుర్ముహూర్తం: ప.12.14 నుండి 1.02 వరకు తదుపరి ప.2.27 నుండి 3.15 వరకు, అమృతఘడియలు: ఉ.6.30 నుండి 8.11 వరకు, రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.17, సూర్యాస్తమయం: 5.20.

క్లుప్తంగా...

పులిహోర ప్రసాదంలో పురుగులు

- కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కలకలం



పులిహోర ప్రసాదంలో పురుగు

కొమురవెల్లి (సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ప్రసాదంలో పురుగులు రావడం కలక లం రేపింది. ఒక భక్తుడు ఆదివారం స్వామివారిని దర్శించుకుని పులిహోర ప్రసాదం కొనుగోలు చేశారు. తింటున్నపుడు పురుగులు కనిపించడంతో అవా క్కయ్యారు. వెంటనే ఆలయ అధికారుల దృష్టి కి తీసుకెళ్లినా పట్టనట్లు వ్యవహరించారని ఆయన వాపోయారు. స్వామివారి ప్రసాదాల్లో నాణ్యత కొరవడిందని భక్తులు ఆరోపించారు. తూకంలో కూడా 200 గ్రాములకు బదులు 150 నుంచి 160 గ్రాముల పులిహోర ప్రసాదా న్నే అందిస్తున్నారని వారు తెలిపారు. ఈ విషయమై ఆలయ ఈవో బాలాజీని వివరణ కోరగా.. భక్తులెవరూ ప్రసాదంలో పురుగులు వచ్చినట్లు ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. పురుగులు రావడం అవాస్తవమని, కొంతమంది కావాలనే ఆలయ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మఠంపల్లి: ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై మృతుని బంధువులు తెలిపిన వివరాలివి. చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన బానోతు శంకర్ (42) ఆదివారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేస్తుండగా.. విద్యుత్ తీగలు తెగి మీద పడటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమా చారం ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రెండో దశ పూర్తితో మంచి నెట్‌వర్క్‌గా మెట్రో

మెట్రో మొదటి, రెండో దశకు కనెక్టివిటీ ఉంటుంది

- నాలుగేళ్లలో రెండో దశ పూర్తి
- క్రమశిక్షణ పాటిస్తే రద్దీ సమస్యకు పరిష్కారం
- జేబీఎస్–శామీర్‌పేట మార్గంపై సీఎం ఆదేశాలతో కసరత్తు
- అన్ని మెట్రో స్టేషన్లలో ఉచిత పార్కింగ్ సదుపాయం సాధ్యం కాదు
- 'మీతోసాక్షి' కార్యక్రమంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

మీతో సాక్షి

సాక్షి, హైదరాబాద్: 'ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమ స్యలు, వాతావరణ కాలుష్య ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ ప్రమాదాల నివారణకు ఏకైక మార్గం ప్రజారవాణా వ్యవస్థను వీలైనంతగా పటిష్ట పరచడమే. మెట్రో వ్యవస్థ రెండవదశలో మరో 5 కారిడార్లు, మరో 76 కి.మీ.విస్తరించుకొని చక్కటి నెట్‌వర్క్‌గా ఏర్పడబోతుంది. నగర అభివృద్ధి అన్నివైపులా జరిగేలా చూడాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయం' అని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఆర్ఎల్) ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. 'మీతో సాక్షి' కార్య క్రమంలో భాగంగా నిర్వహించిన 'మన నగరం–మన మెట్రో'కు పాఠకులు, ప్రయాణికుల నుంచి అనూ హ్యమైన స్పందన లభించింది. సమస్యలు, సలహాలు, ఫిర్యాదులపైన ఎన్వీఎస్‌రెడ్డి స్పందించారు. ఆయా సమస్యలకు పరిష్కారాలను సూచించారు.

- నాగోల్ మెట్రోస్టేషన్‌లో వాహనాల పార్కింగ్ ఫీజులు మెట్రో చార్జీల కంటే ఎక్కువగా ఉన్నాయి. షెడ్డు సదుపాయం లేదు. వాహనాలకు ఎలాంటి భద్రత లేదు. అన్ని స్టేషన్లలో ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలి.
- దండు రజినీకాంత్, అవినాష్, చేవెళ్ల ప్రభాకర్, రాజ్‌కుమార్‌రెడ్డి చిర్రా, బసవయ్య జాల్డి, శ్రీనాథ్, ప్రశాంత్‌కుమార్, వేణుగోపాల్

మెట్రో రైల్ ఎండీ: నాగోల్–మియాపూర్, మెట్రో స్టేషన్లలో ఉన్న పార్కింగ్ చార్జీలు జీహెచ్ఎంసీ, ఆర్టీసీ చార్జీలతో సమానంగానే ఉన్నాయి. రైల్వే పార్కింగ్ చార్జీల కంటే తక్కువ. మంచినీటి వసతి, టాయిలెట్ సౌకర్యాలు, సెక్యూరిటీ కోసం సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశాం, 24/7 పద్ధతిలో పార్కింగ్ సదుపాయం ఉంది. అన్ని స్టేషన్లలో ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించడం సాధ్యం కాదు.

సీనియర్ సిటిజన్లకు మెట్రో రైళ్లు ఏ మాత్రం సౌకర్యంగా లేవు
– ఎస్.శ్రీనివాస్


ఎండీ: సీనియర్ సిటిజన్లకు మెట్రోలో ప్రత్యేక సీట్లు కేటాయించాం. కానీ కొందరు యువకులు ఈ సీట్లలో కూర్చొని పెద్దవారికి ఇబ్బంది కలిగిస్తున్నారు. తరచూ తనిఖీలు చేసి ఫైన్‌లు వేస్తున్నాం. నడవలేని వృద్ధుల కోసం మెట్రోస్టేషన్లలో వీల్‌చైర్ సౌకర్యం కూడా ఉంది. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే 04023332555 నంబరుకు కాల్ చేయొచ్చు.

సర్...దివ్యాంగులకు ఒక కోచ్ ఉంది. కానీ దివ్యాంగులు రైల్ వరకు ఎలా వెళ్లాలి. లిఫ్ట్, ఎస్కలేటర్ వరకు వెళ్లాలంటే మెట్లు ఎక్కాల్సి వస్తుంది. ఇది చాలా కష్టంగా ఉంది. ర్యాంప్, వీల్‌చైర్ వంటి సదుపాయాలు కల్పించగలరని మనవి.
– టి.శ్రీనివాసాచార్యులు

ఎండీ: దివ్యాంగుల కోసం స్టేషన్లలో వీల్‌చైర్ పెట్టే విధంగా లిఫ్ట్‌లను డిజైన్ చేసి ర్యాంప్‌లను కూడా ఏర్పాటు చేశాం. అంధుల కోసం లిఫ్ట్‌లలో బ్రెయిలీ లిపి వాడాం. మీకు తగు సాయం చేయడానికి మా సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే 04023332555 నంబరుకు కాల్ చేయొచ్చు.

సర్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు మెట్రో పొడిగింపుపై వాస్తవాలు చెప్పండి. మేం కార్లు, ఇతర వాహనాల్లో వచ్చి శామీర్‌పేట్ వద్ద పార్క్ చేసుకొని మెట్రోలో ఎక్కడికైనా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. – రమేష్‌కుమార్, శ్రీరామోజు

ఎండీ: మీరు చెప్పిన రూట్‌లో భారీగా డిఫెన్స్ ఆస్తుల సేకరణ, రైట్ ఆఫ్ వే అనుకూలత వంటి సమస్యల వల్ల ఈ మార్గాన్ని రెండోదశ మెట్రోలో చేర్చడం వీలు కాలేదు. అయినా ఈ మార్గంలో వీలయినంత త్వరగా మెట్రో రైలు ప్రతిపాదనలపై కసరత్తు చేయాలని సీఎం ఆదేశించారు.



మెట్రో వేళలను పొడిగించే అవకాశం ఉందా. నగరంలో నైట్‌లైఫ్ పెరిగి ప్రయాణికుల రాకపోకలు 24 గంటల పాటు ఉంటున్నాయి – సాగంటి శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్

ఎండీ: మెట్రోలో కేవలం ఒకేలైన్ ఉండడం వల్ల రోజువారీ నిర్వహణకు కనీసం 4 గంటల విరామం కావాలి. రాత్రి 12 నుంచి తెల్లవారుజాము 4 గంటలవరకు ఈ సమయం లభిస్తుంది. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు సిస్టమ్స్, ట్రాక్‌లను సన్నద్ధం చేయాలి. అందువల్ల దేశంలో ఎక్కడా మెట్రో రైలు రాకపోకలు 24 గంటల పాటు ఉండవు.



పాఠకుల ప్రశ్నలు పరిశీలిస్తూ సమాధానాలు చెబుతున్న ఎన్వీఎస్‌రెడ్డి

మెట్రోల్లో రద్దీ బాగా పెరిగింది. అదనపు బోగీలను ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది. ఈ దిశగా చర్యలు తీసుకోండి సర్.
– శిరీష

ఎండీ: ప్రయాణికుల సౌకర్యం కోసం రైళ్లు పెంచాలని ఇప్పటికే ఎల్‌అండ్‌టీని కోరాం. మెట్రో రైళ్లలో రద్దీ అనేది విశ్వవ్యాప్తంగా ఉండే సమస్య. ప్రయాణికులంతా ఎక్కువగా రైలు ప్రవేశ ద్వారాల వద్ద గుమిగూడడం వల్ల ఇది మరింత పెద్దదవుతుంది. లగేజీ బ్యాగ్‌లను కాళ్ల దగ్గర పెట్టుకోవడం, రైళ్లలో ఖాళీ ప్రదేశాల్లోకి, వెస్టిబ్యుల్ ఏరియాలోకి జరగడం వంటి క్రమశిక్షణ చర్యలను పాటిస్తే ఈ సమస్యకు కొంత వరకు పరిష్కారం లభిస్తుంది.

మెట్రో రెండోదశ ఎప్పటి వరకు పూర్తవుతుంది – శ్రీనివాస్

ఎండీ: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహించే మెట్రో రెండో దశపై డీపీఆర్, ఇతర డాక్యుమెంట్లు కేంద్రానికి అందజేశాం. అనుమతి లభించగానే పనులు ప్రారంభించి నాలుగేళ్లలో పూర్తి చేస్తాం.

మెట్రో మొదటిదశ రైళ్లకు రెండోదశ రైళ్లకు కనెక్టివిటీ ఉంటుందా? అమీర్‌పేటలో బయలుదేరి నేరుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లొచ్చా.. లేక నాగోల్‌లో మారాల్సి ఉంటుందా? ఒకవేళ అలా మారాల్సి వస్తే లగేజీతో వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంటుంది కదా. – కె.వెంకటేశ్వర్లు

ఎండీ: మెట్రో మొదటి దశ, రెండో దశకు కనెక్టివిటి ఉంటుంది. అమీర్‌పేట, పరేడ్ గ్రౌండ్స్, ఎంజీబీఎస్ తరహాలో ఎయిర్‌పోర్టు మెట్రోజంక్షన్ స్టేషన్‌లైన నాగోల్, ఎల్‌బీనగర్, చాంద్రాయణగుట్టలలో ఎయిర్‌పోర్టుకు వెళ్లే మెట్రో రైలు ఎక్కాల్సి ఉంటుంది. లగేజీతో ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ట్రైన్ మార్పిడికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తాం.

కన్నడ నటి శోభిత ఆత్మహత్య!

- బలవన్మరణానికి కారణం తెలియని వైనం
- ప్రస్తుతానికి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు



గచ్చిబౌలి: కన్నడ నటి శోభిత శివన్న (35) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కన్నడ సినిమాలు, సీరియల్స్‌లో నటించే శోభిత తన భర్త.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుధీర్‌రెడ్డితో కలసి శ్రీరాంనగర్ సీ బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి ఆమె భర్తతో కలసి భోజనం చేసిన అనంతరం నిద్రకు ఉపక్రమించారు. సుధీర్ మరో గదిలో ఆఫీస్ పని చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో పనిమనిషి వచ్చి గది తలుపు తట్టినా శోభిత స్పందించలేదు. దీంతో సుధీర్‌కు అనుమానం వచ్చి తలుపులు విరగ్గొట్టి చూడగా ఆమె ఉరి వేసుకొని చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. శోభిత తల్లిదండ్రులకు ఈ సమాచారం అందించారు. వారి రాకకోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. తుక్కుగూడకు చెందిన సుధీర్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సమయంలో మ్యాట్రిమోని సైట్‌లో శోభిత రిక్వెస్ట్ చూసి వివాహానికి ఓకే చెప్పారు. ఏడాదిన్నర క్రితం పెద్దల అంగీకారంతోనే పెళ్లి చేసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి కలసి భోజనం చేశాక కొద్ది సేపు టీవీ చూశామని సుధీర్ రెడ్డి చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. శోభిత మరణానికిగల కారణాలు తెలియాల్సి ఉందని చెబుతున్నారు. తల్లిదండ్రులు వస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉందని అంటున్నారు. ఇద్దరి మధ్య ఏమైనా అభిప్రాయ భేదాలు ఉన్నాయా? లేక మరేదైనా కారణం ఉందా అనేది దర్యాప్తులో తెలుస్తుందని చెప్పారు. ప్రస్తుతానికి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులతో చనిపోతున్నా..

- నా బిడ్డను జాగ్రత్తగా చూసుకోండి
- సెల్ఫీ వీడియో తీసి వివాహిత ఆత్మహత్య



దేవరకొండ దీప్తి

జ్యోతినగర్(రామగుండం): 'అమ్మా.. నాన్న.. నన్ను క్షమించండి.. ప్రేమ వివాహం చేసుకుని మీకు దూరంగా ఉన్నా.. మొదట్లో ఎంతో ప్రేమగా చూసుకున్న మా ఆయన నిత్యం వేధిస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక పోతున్నా. నేను చనిపోతున్నా.. నా బిడ్డను జాగ్రత్తగా చూసుకోండి'.. అంటూ సెల్ఫీ వీడియో తీసి ఒక వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్ద పల్లి జిల్లా ఎన్టీపీసీ ఆటోనగర్‌లో నివసిస్తున్న నరేందర్ (32), గోదావరిఖనికి చెందిన దేవరకొండ దీప్తిని 2021న ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక బాబు ఉన్నాడు. నరేందర్, దీప్తి స్థానిక అన్నపూర్ణ కాలనీలోని ఒక అద్దె ఇంట్లో ఉంటున్నారు. అయితే, కట్నం తీసుకు రావాలని నరేందర్ కొంతకాలంగా దీప్తిని వేధిస్తున్నాడు. ఇదే విషయమై శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపం చెందిన దీప్తి.. భర్త వేధిస్తున్నందున చనిపోతున్నానని సెల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసింది. ఉరేసుకున్న దీప్తిని గమనించిన నరేందర్ తన మిత్రుల సాయంతో ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా, తన బిడ్డను నరేందర్ చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని.. దీప్తి తండ్రి దివాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరుపుతున్నామని గోదావరిఖని ఏసీపీ రమేశ్, సీఐ ప్రవీణ్, ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు.

'యాసంగి'కి సాగు నీటిపై స్పష్టతనివ్వండి

- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులు, పౌర సరఫరాల శాఖలపై సమీక్ష

సాక్షి, పెద్దపల్లి: ప్రాజెక్టుల్లో ప్రస్తుతం సాగునీరు ఎంత ఉంది? యాసంగి పంటలకు ఎంత విడుదల చేస్తామనే అంశంపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌర సరఫరాల శాఖ విభాగంపై ఆదివారం సమీక్షించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లిలో డిసెంబర్ 4న పాల్గొనే యువశక్తి సభాస్థలిని వారు పరిశీలించారు. అనంతరం మీడియాతో ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్కనీరు ఉపయోగించకుండానే రాష్ట్రంలో అత్యధికంగా 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండించారని తెలిపారు. చిన్నకాళేశ్వరం ముక్తేశ్వర ఎత్తిపోతల పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలని శ్రీధర్‌బాబు సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లను కలెక్టర్, ఉన్నతాధికారులు నిరంతరం తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. డిసెంబర్ 4న పెద్దపల్లి వేదికగా లక్ష మందితో యువశక్తి పేరిట బహిరంగ సభ నిర్వహించి గ్రూప్– 4 అభ్య ర్థులు, ఇతర పరీక్షల్లో ఎంపికై ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలు అందజేస్తామని మంత్రులు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో జీవన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం తదితరులు

చైనాలో బంగారు పంట

1,000 టన్నుల నిల్వలు వెలుగులోకి

విలువ రూ.7 లక్షల కోట్ల పైమాటే!

బీజింగ్: చైనాలో అతి భారీ స్థాయిలో బంగారం నిల్వలు బయటపడ్డాయి. సెంట్రల్ హూనాన్ ప్రావిన్స్‌లో పింగ్‌జియాండ్ కౌంటీలోని వాంగూ గోల్డ్ ఫీల్డ్‌లో ఇటీవల తవ్వకాల్లో వీటిని గుర్తించారు. ఇక్కడ ఏకంగా 1,000 టన్నులకు (10 లక్షల కిలోలకు) పైగా పసిడి లోహం ఉన్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఒకేచోట ఈ స్థాయిలో నిల్వలను గుర్తించడం ప్రపంచంలో ఇదే తొలిసారి. భూ ఉపరితలం నుంచి 2 కి.మీ. దిగువన 300 టన్నులు, 3 కి.మీ. దిగువన 700 టన్నులు ఉన్నట్లు చెబుతున్నారు. దీని విలువ 80 బిలియన్ డాలర్ల (రూ.6.76 లక్షల కోట్లు) పైమాటే! సెంట్రల్ హూనాన్ ప్రావిన్స్‌ను ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు ఉన్న ప్రాంతంగా చెప్పుకోవచ్చు. సాధారణంగా ప్రతి టన్ను మట్టిలో 8 గ్రాముల బంగారముంటేనే దాన్ని హెచ్చు నాణ్యత కలిగిన ముడి ఖనిజంగా పరిగణిస్తారు. అలాంటిది హూనాన్‌లో టన్ను మట్టిలో ఏకంగా 138 గ్రాముల చొప్పున స్వచ్ఛమైన స్వర్ణం ఉందని తేల్చారు. అంటే అత్యధిక నాణ్యత కలిగిన ముడి ఖనిజమని పేర్కొంటున్నారు. కళ్లు చెదిరే రీతిలో బంగారం నిల్వలు బయటపడడంతో చైనా గోల్డ్ పరిశ్రమకు మరింత ప్రోత్సాహం లభించనుంది. ప్రపంచ గోల్డ్ మార్కెట్‌ను డ్రాగన్ దేశం శాసించే రోజులు రాబోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే బంగారం ఉత్పత్తిలో చైనా కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచమంతటా ఏటా ఉత్పత్తయ్యే బంగారంలో చైనా వాటా 10 శాతం. ఇకపై అది మరింత పెరుగబోతోంది. రోజురోజుకూ పసిడి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చైనా భారీగా లబ్ధి పొందనుంది.

ప్రపంచంలో అత్యధిక బంగారం నిల్వలున్న ప్రాంతాలు

దేశం	ప్రాంతం	బంగారం (టన్నుల్లో)
దక్షిణాఫ్రికా	సౌత్ డీప్	929
ఇండొనేషియా	గ్రాస్‌బర్గ్	856
రష్యా	ఒలింపియాడ్	737
పపువా న్యూగినియా	లిహీర్	680
చిలీ	నార్టీ అబీర్టో	657
అమెరికా	కార్లిన్ ట్రెండ్	353
ఆస్ట్రేలియా	బాడింగ్టన్	350
దక్షిణాఫ్రికా	ఎంపొనెంగ్	330
డొమినికన్ రిపబ్లిక్	పాబ్లో వీజో	309
అమెరికా	కార్టెజ్	246



బ్రిక్స్ కరెన్సీ తెస్తే...

100 శాతం సుంకాలు

సభ్యదేశాలకు ట్రంప్ హెచ్చరికలు



వాషింగ్టన్: అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్యపరంగా సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు దేశాల దిగుమతులపై భారీ సుంకాలు విధిస్తానని ప్రకటించిన ఆయన తాజాగా భారత్, చైనా, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా తదితర బ్రిక్స్ దేశాలకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. బ్రిక్స్ కూటమి కొత్త కరెన్సీ తేవాలని చూస్తే సభ్య దేశాల దిగుమతులపై ఏకంగా వంద శాతం సుంకాలు విధిస్తానని సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు తాజాగా సొంత సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు. ''బ్రిక్స్ దేశాలు డాలర్ నుంచి వైదొలగాలని ప్రయత్నిస్తున్నాయి. దానికి ప్రత్యామ్నాయంగా సొంత కరెన్సీని సృష్టించాలని చూస్తున్నాయి. ఆ ప్రయత్నాలు మానుకోవాలి. డాలర్‌కు బదులుగా కొత్త బ్రిక్స్ కరెన్సీని సృష్టించబోమని, మరే కరెన్సీకి మద్దతివ్వబోమని ప్రకటించాలి. లేదంటే ఆ దేశాలపై 100% సుంకాలు విధిస్తాం. అంతేకాదు అమెరికాతో వాణిజ్యానికి కూడా అవి స్వస్తి పలకాల్సి ఉంటుంది'' అని పేర్కొన్నారు. మెక్సికో, కెనడా, చైనా వస్తువులపై సుంకాలను భారీగా పెంచుతామని ట్రంప్ ప్రకటించడం తెలిసిందే.

రష్యా, చైనా సుముఖత

2011లో ఏర్పాటైన బ్రిక్స్‌లో ఇటీవలే ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇథియోపియా, ఈజిప్ట్ కూడా చేరాయి. మరో 34 దేశాలు కూడా చేరడానికి ఆసక్తిగా ఉన్నాయి. అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి ఉమ్మడి కరెన్సీ ప్రతిపాదనను బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా 2023లో తెరపైకి తెచ్చారు. ఉక్రెయిన్‌పై దాడి తర్వాత ఆర్థిక ఆంక్షలతో సతమతమవుతున్న రష్యా, డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసే ఉద్దేశంతో చైనా ఈ యోచనకు సుముఖంగానే ఉన్నాయి. అయితే బ్రిక్స్ కూటమి ఆర్థిక, భౌగోళిక విభేదాల కారణంగా కొత్త కరెన్సీకి అవకాశాలు చాలా తక్కువేనన్నది నిపుణుల మాట.



సిరియాలో మళ్లీ... అంతర్యుద్ధం!

తిరుగుబాటుదార్ల చేతికి అలెప్పో ● అమెరికా, పశ్చిమ దేశాల అండ

అసద్‌ను గద్దె దించే దిశగా శరవేగంగా పరిణామాలు

సిరియా మళ్లీ భగ్గుమంటోంది. దేశంలో రెండో అతి పెద్ద నగరమైన అలెప్పో తాజాగా తిరుగుబాటుదార్ల పరమైంది. ప్రభుత్వ సైన్యం, తిరుగుబాటు సేనల మధ్య ఘర్షణ తారస్థాయికి చేరడంతో మళ్లీ అంతర్యుద్ధం రాజుకుంది. 2011 తర్వాత జరిగిన అంతర్యుద్ధంలో సిరియాలో ఏకంగా 3 లక్షల మందికిపైగా జనం మరణించారు. 60 లక్షల మంది విదేశీ బాట పట్టారు. తర్వాత కాస్త ప్రశాంతంగా ఉన్న సిరియాలో ఇలా ఉద్రిక్తతలు పెరగడం తాలూకు మూలాలు ఉక్రెయిన్-రష్యా, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధాల్లో ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

2011లో 'అరబ్ వసంతం' పేరిట అరబ్ దేశాల్లో ప్రజాస్వామ్య ఉద్యమం ఊపందుకుంది. రాచరికం పోయి ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలంటూ జనం వీధుల్లోకి వచ్చారు. ఈజిప్టులో ఈ పోరాటం ఉవ్వెత్తున ఎగిసి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి దారులు ఏర్పడ్డాయి. అది ఇతర అరబ్ దేశాల ప్రజలకూ స్ఫూర్తినిచ్చింది. సిరియా ప్రజలు కూడా నియంతగా అధికారం చలాయిస్తున్న అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌ను గద్దె దించడమే లక్ష్యంగా పోరుబాట పట్టారు. వాటిని అసద్ ఉక్కుపాదంతో అణచేయడంతో జనం ఆయుధాలు చేతపట్టారు. సైన్యంలో అసద్‌ను వ్యతిరేకించే వర్గం కూడా వారితో చేతులు కలిపింది. అంతా కలిసి తిరుగుబాటుదార్లుగా మారారు. దేశమంతటా వేర్వేరు తిరుగుబాటు దళాలు ఏర్పడ్డాయి. వీటి సిద్ధాంతాలు వేరైనా అసద్‌ను తొలగించి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే ఉమ్మడి లక్ష్యం. అసద్ అంటే గిట్టని తుర్కియే, సౌదీ అరేబియా, యూఏఈతో పాటు అమెరికా తదితర దేశాలు తిరుగుబాటుదార్లకు అన్ని రకాలుగా మద్దతిస్తున్నాయి. దాంతో సిరియాలో ప్రభుత్వ వ్యతిరేక శక్తులు మరింత బలం పుంజుకున్నాయి. అటు అసద్‌కు మద్దతుగా సిరియా మిత్రదేశాలైన ఇరాన్, రష్యా రంగంలోకి దిగాయి. ఇరాన్ సైన్యంతో పాటు లెబనాన్ మిలిటెంట్ గ్రూప్ హెజ్‌బొల్లా అసద్ సైన్యానికి అండగా నిలిచాయి. రష్యా ఇచ్చిన యుద్ధ విమానాలతో సిరియా వైమానిక దళానికి కొత్త బలం చేకూరింది. అసద్ సైన్యం, తిరుగుబాటు సేనల మధ్య ఏళ్ల తరబడి భీకర యుద్ధమే జరిగింది.

ఉగ్ర సంస్థలకు చేదు అనుభవం

సిరియా పరిణామాలను అల్‌ఖైదా, ఐసిస్ వంటి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు తమకనుకూలంగా మార్చుకున్నాయి. తిరుగుబాటుదార్లకు సాయం చేసే నెపంతో సిరియాపై పట్టు సాధించాయి. 2014 నాటికి ఈ జిహాదీల పెత్తనం పెరిగిపోయింది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఐసిస్ ప్రభావం విపరీతంగా పెరిగింది. ఉగ్రవాదులకు సిరియా శాశ్వత అడ్డాగా మారుతుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అమెరికా రంగంలోకి దిగి సిరియన్ డెమొక్రటిక్ ఫోర్సెస్ (ఎస్‌డీఎఫ్) సాయంతో విరుచుకుపడటంతో అల్‌ఖైదా, ఐసిస్ తోకముడిచి దేశం వీడాయి.

కాల్పుల విరమణతో ఆగిన ఉద్రిక్తతలు

సిరియాలో పలు ప్రావిన్స్‌లను తిరుగుబాటుదార్లు ఆక్రమించడం, తర్వాత వాటిని ప్రభుత్వ సైన్యం స్వాధీనం చేసుకోవడం జరుగుతూ వచ్చింది. 2020లో ఇడ్లిబ్ ప్రావిన్స్ తిరుగుబాటుదార్ల చేతుల్లోకి వచ్చింది. ఆ సమయంలో కాల్పుల విరమణ ప్రతిపాదనకు రష్యా, తుర్కియేతో పాటు తిరుగుబాటుదారులూ ఒప్పుకున్నారు. ఉమ్మడి పహారాతో సెక్యూరిటీ కారిడార్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. నాటినుంచీ కీలకమైన ప్రావిన్సులతో పాటు సిరియాలో మెజారిటీ భూభాగం తిరుగుబాటుదార్ల అధీనంలోనే ఉండిపోయింది.

ఇప్పుడే ఎందుకీ అలజడి?

అసద్ మిత్రదేశమైన రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో తలమునకలుగా ఉంది. సిరియాపై దృష్టి పెట్టే స్థితిలో లేదు. మరో మిత్రదేశం ఇరాన్ కూడా ఇజ్రాయెల్ దాడులతో ఉక్కిరిబిక్కిరవుతోంది. హెజ్‌బొల్లా గ్రూప్‌కూ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. వాటినుంచి సైనిక సాయం అందక అసద్ నిస్సహాయ స్థితిలో ఉన్నారు. బయటి సాయం లేక ఆయన ప్రభుత్వమూ బలహీనపడింది. ఈ పరిస్థితిని వాడకుంటూ తిరుగుబాటుదార్లు క్రియాశీలకంగా మారారు. 'మిలటరీ ఆపరేషన్స్ కమాండ్' పేరిట కొత్త కూటమి కట్టారు. పెద్దగా ప్రతిఘటనే లేకుండా వాణిజ్య రాజధాని అలెప్పోతో పాటు శివారు ప్రాంతాలు, గ్రామాల్లోనూ పాగా వేశారు. ఇది అసద్‌కు భారీ ఎదురుదెబ్బే. అమెరికా, ఇజ్రాయెల్, పశ్చిమ దేశాల అండదండలతో వాళ్లిప్పుడు మొత్తం సిరియానే స్వాధీనం చేసుకొనే దిశగా అడుగులు వేస్తున్నారు. అలెప్పోతో పాటు పరిసర ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఆదివారం సైన్యం ఎదురుదాడి యత్నాలు మొదలుపెట్టినా పెద్దగా ప్రభావం చూపలేకపోతోంది. అసద్ నుంచి విముక్తి పొందడానికి సిరియాకు ఎక్కువ రోజులు పట్టకపోవచ్చు. ఆ తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వమే ఏర్పడుతుందా? లేక పశ్చిమ దేశాల కీలుబొమ్మ సర్కారు గద్దెనెక్కుతుందా అన్నది మాత్రం ఆసక్తికరం.

నాయకత్వం ఎవరిది?

సిరియాలో తిరుగుబాటుదార్లతో ఏర్పాటైన 'మిలటరీ ఆపరేషన్స్ కమాండ్'కు హయత్ తాహ్రీర్ అల్-షామ్ సంస్థ నాయకత్వం వహిస్తోంది. ఇది గతంలో అల్-నుస్రా ఫ్రంట్ పేరుతో అల్‌ఖైదాకు అనుబంధంగా పనిచేసింది. తర్వాత స్వతంత్రంగా వ్యవహరిస్తోంది. ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో అధికారం చెలాయిస్తోంది. తుర్కియే, అమెరికా మద్దతుతో సిరియాలో కార్యకలాపాలు సాగిస్తున్న కొన్ని గ్రూప్‌లు తాహ్రీర్ అల్-షామ్‌కు అండగా నిలుస్తున్నాయి.

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా

షిండే తనయుడు!

ఆ పదవి పట్ల షిండే విముఖత

ముంబై: మహారాష్ట్రలో రాజకీయ పరిణామాలు మారిపోతున్నాయి. ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకోవడానికి శివసేన(షిండే) నేత, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే విముఖంగా ఉన్నట్టు చెబుతున్నారు. దాంతో ఆయన తనయుడు, లోక్‌సభ సభ్యుడు శ్రీకాంత్ షిండే పేరు తెరపైకి వచ్చింది. కొత్త ప్రభుత్వంలో షిండే స్థానంలో ఆయన్ను ఉప ముఖ్యమంత్రిని చేస్తారని ప్రచారం సాగుతోంది. దీనిపై ఏక్‌నాథ్ షిండే స్పందిస్తూ చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఆయన ఆదివారం సతారా జిల్లాలోని తన స్వగ్రామంలో మీడియాతో మాట్లాడారు. మహాయుతి సమావేశంలో విస్తృతంగా చర్చించి కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని తేల్చిచెప్పారు. కొత్త సీఎంపై బీజేపీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతిస్తానని అన్నారు. అనంతరం స్వగ్రామం నుంచి ముంబై బయలుదేరి వెళ్లారు. మరోవైపు ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారైందని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. సోమవారం లేదా మంగళవారం బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరుగుతుందని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలంతా ఫడ్నవీస్‌ను నాయకుడిగా ఎన్నుకుంటారని వెల్లడించారు. ఆయన ఈ నెల 5న ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.



మహాయుతిలో భిన్న స్వరాలు

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మహాయుతి పక్షాల నాయకులు రకరకాలుగా స్పందిస్తున్నారు. శివసేన విచ్ఛిన్నం కాకుండా బీజేపీతో కలిసి పోటీ చేసి ఉంటే ఆ రెండు పార్టీల కూటమి ఇంకా ఎక్కువ సీట్లు గెలిచేదని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత రావుసాహెబ్ దన్వే చెప్పారు. మహాయుతిలో ఎన్సీపీ (అజిత్) భాగస్వామి కాకపోయి ఉంటే శివసేన (షిండే)కు 90 నుంచి 100 సీట్లు వచ్చేవని ఆ పార్టీ ఎమ్మెల్యే గులాబ్‌రావు పాటిల్ అభిప్రాయపడ్డారు. అయినా అజిత్‌ను ప్రభుత్వంలో చేర్చుకోవడంపై ఏక్‌నాథ్ షిండే ఏనాడూ బీజేపీని ప్రశ్నించలేదని చెప్పారు.

తాజ్‌మహల్ చార్మినార్‌నూ

కూల్చేస్తారా?

బీజేపీకి ఖర్గే సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: ముస్లింల సారథ్యంలో నిర్మాణం పూర్తిచేసుకున్న దేశంలోని ప్రఖ్యాత కట్టడాలన్నింటినీ కూల్చేస్తారా అంటూ బీజేపీకి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సూటి ప్రశ్న వేశారు. దేశంలోని ప్రతి మసీదు వద్దా సర్వేలు చేపడుతూ బీజేపీ నాయకత్వం భారతీయ సమాజాన్ని విభజిస్తోందని ఆరోపించారు. ''అర్థంపర్థం లేని సర్వేలతో ప్రజలను మోదీ ఐక్యంగా, శాంతంగా జీవించకుండా చేస్తున్నారు. ముస్లింలు నిర్మించారు కాబట్టి ఎర్రకోట, తాజ్‌మహల్, కుతుబ్ మినార్, చార్మినార్ వంటివాటన్నింటినీ కూల్చేస్తారా?'' అని సూటిగా ప్రశ్నించారు. ఉత్తర ప్రదేశ్‌లోని సంభాల్‌లో మసీదు ఉన్న చోట గతంలో హిందూ ఆలయం ఆనవాళ్లున్నాయా అని తెల్సుకునేందుకు సర్వే చేపట్టడం, దానిపై ముస్లింల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, ఆ ఉద్రిక్తత చివరికి పోలీసు ఘర్షణలకు, మరణాలకు దారి తీయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఖర్గే కూల్చివేతల అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. దళితులు, మైనారిటీలు, గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ''ఒక తీర్పు తర్వాత దేశ చరిత్రలో ఎన్నడూలేని పోకడ మొదలైంది. మసీదుల కింద ఆలయాల ఆనవాళ్లున్నాయో కనుగొనేందుకు సర్వేల పేరిట బయల్దేరారు. వీటికి మద్దతు పలికే వారి సంఖ్యా పెరిగింది. దశాబ్దాలుగా ఉన్న ప్రార్థనాస్థలాల స్వభావాన్ని కొత్తగా మార్చకూడదని 1991నాటి చట్టం స్పష్టంచేస్తోంది. అయినాసరే ఆ చట్ట ఉల్లంఘనకు బీజేపీ బరి తెగిస్తోంది'' అంటూ మండిపడ్డారు. మోదీని ఉద్దేశిస్తూ.. '' ఐక్యంగా ఉంటే భద్రంగా ఉంటామని మీరన్నారు. మేము ఇప్పటికే ఐక్యంగా ఉన్నాం. ఐక్యంగా ఉన్న మమ్మల్ని విభజించేది మీరే'' అని ఖర్గే దుయ్యబట్టారు.



భాగవత్ మాటా బీజేపీ వినదా?

''2023లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఒక మంచి విషయం చెప్పారు. 'రామమందిర నిర్మాణమే మన లక్ష్యం. అంతేగానీ మనం ప్రతి మసీదు కింద శివాలయం వెతకకూడద'ని చెప్పారు. కానీ భాగవత్ మాటను కూడా మోదీ, అమిత్‌షా సహా బీజేపీ నేతలెవరూ అస్సలు పట్టించుకోవట్లేదు. బహుశా భాగవత్ తాను బహిరంగంగా చెప్పే కొన్ని విషయాలను బీజేపీ నేతలకు చెప్పరేమో. వీళ్లందరిదీ మొదటినుంచీ ద్వంద్వ వైఖరే'' అంటూ ఖర్గే మండిపడ్డారు. ''గిరిజనులు, మైనారిటీలు, ఓబీసీలు తమ హక్కులను మాత్రమే గాక రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కూడా కాపాడుకోవాలి. అప్పుడే వారి లక్ష్యాలను నెరవేర్చుకోగలరు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా మనందరం ఐక్యంగా నిలబడదాం. ఐక్యంగా ఉంటే కులాల ప్రాతిపదికన ప్రయత్నించినా మన ఐక్యతను మోదీ విచ్ఛిన్నం చేయలేరు. సాధారణ ప్రజానీకం అంటే మోదీకి గిట్టదు. మనల్ని ద్వేషించే వాళ్లతోనే మన పోరు. అందుకే రాజకీయ శక్తి అనేది చాలా ముఖ్యం'' అని ఖర్గే అన్నారు.

పెచ్చరిల్లుతున్న డిజిటల్, సైబర్ నేరాలు

డీజీపీలు, ఐజీపీల సదస్సులో ప్రధాని మోదీ ఆందోళన



భువనేశ్వర్: డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలతోపాటు కృత్రిమ మేధతో సామాజిక, కుటుంబ సంబంధాలకు భంగం కలిగే డీప్‌ఫేక్ కేసులు పెరుగుతుండటంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికతను గరిష్ట స్థాయిలో వాడుకుంటూ పోలీస్ కానిస్టేబుళ్లపై పనిభారం తగ్గించేందుకు ప్రయత్నించాలని సూచించారు. పోలీసు సిబ్బంది, వనరుల కేటాయింపులో పోలీస్‌స్టేషన్లు కేంద్ర స్థానాలుగా మారాలన్నారు. ఆదివారం ప్రధాని మోదీ 59వ అఖిల భారత డీజీపీలు, ఐజీపీల సదస్సులో మాట్లాడారు. భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొనే విషయమై సదస్సులో అన్ని కోణాల్లోనూ విస్తృత స్థాయి చర్చలు జరిగినందుకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కృత్రిమ మేధను వాడుకుంటూ సవాళ్లను అవకాశాలుగా మల్చుకోవాలని కోరారు. అర్బన్ పోలీసింగ్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఉన్న 100 నగరాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తామని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ పాల్గొన్నారు.

భారత్, బంగ్లాదేశ్ రెండూ ఒక్కటే

మైనారిటీల అణచివేతపై ముఫ్తీ వివాదాస్పద వ్యాఖ్యలు



జమ్మూ: భారత్‌లోని మైనారిటీల పరిస్థితి మాదిరిగానే ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో హిందువులపై అణచివేత కొనసాగుతోందని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. 'బంగ్లాదేశ్‌లో హిందూ సోదరులు అణచివేతకు గురవుతున్నారని వింటున్నాం, మరి మన దేశంలోని మైనారిటీలు కూడా అలాంటి అనుభవాలనే చవిచూస్తున్నారు. రెండూ ఒక్కటే. నాకైతే తేడా కనిపించడం లేదు' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మన దేశంలో పరిస్థితులు బాగో లేవన్నారు. ప్రఖ్యాత అజ్మీర్ దర్గాలో ఏఎస్‌ఐ సర్వే వ్యవహారంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ''దర్గాను కూడా తవ్వేస్తారా. ఇలా ఎంతకాలం?'' అని ముఫ్తీ ప్రశ్నించారు. మత ప్రాతిపదికన ప్రజలను విభజించే శక్తులను కలిసికట్టుగా ఎదుర్కోకుంటే 1947 నాటి ఘర్షణలు పునరావృత్తమయ్యే ప్రమాదముంది'' అన్నారు.

ఢిల్లీలో ఒంటరి పోరే

కాంగ్రెస్‌తో పొత్తుండదు: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: విపక్ష 'ఇండియా' కూటమిలో ఐక్యతకు మరో తార్కాణం తెరమీదకొచ్చింది. ఢిల్లీలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని ఆప్ ప్రకటించింది. ఒంటరిగా పోటీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో తాము కూడా ఎవరితోనూ పొత్తులేకుండా ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఆదివారం స్పష్టంచేశారు. ఢిల్లీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోవడం లేదని ప్రకటించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లోనూ పంజాబ్‌లో కాంగ్రెస్‌తో కలిసి ఉమ్మడిగా పోటీచేసేందుకు ఆప్ విముఖత వ్యక్తంచేసిన విషయం విదితమే. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా బరిలో దిగుతామని చెప్పి విపక్షాల 'ఇండియా' కూటమిలో ఐక్యతను కేజ్రీవాల్ ప్రశ్నార్థకం చేశారు. ఇటీవలికాలంలో వేర్వేరు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ప్రతిసారీ కీలక రాష్ట్రాల్లో అధికార పీఠంపై కాషాయ జెండాను విజయవంతంగా ఎగరేస్తూ వస్తున్న బీజేపీని ఢిల్లీ పీఠం మాత్రం దశాబ్దానికి పైగా ఊరిస్తూనే ఉంది. ఇలాంటి సందర్భాల్లో కేంద్రంలో బీజేపీ వ్యతిరేక ఓటును రాష్ట్రస్థాయిలో ఆప్, కాంగ్రెస్ ఉమ్మడిగా ఒడిసి పడతాయని ఆశిస్తున్న వేళ పొత్తులేదని చెప్పి కేజ్రీవాల్ విపక్ష పార్టీల్లో నిరాశను పెంచారు.

శాంతి భద్రతలపై మాట్లాడినందుకే నాపై దాడి

మోదీ ప్రభుత్వం ఢిల్లీలో శాంతిభద్రతలను పరిరక్షించలేకపోతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. నేరగాళ్లపై చర్యలు తీసుకుని శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేసినందుకు ఇటీవలి పాదయాత్రలో తనపై దాడి చేయించిందని విమర్శించారు. ''నాపై చల్లిన ద్రావకం నిరపాయకరమైనది. ప్రమాదకరమైనది అయితే పరిస్థితి వేరుగా ఉండేది. గత 35 రోజుల్లో ఇలా నాపై మూడు దాడులు జరిగాయి'' అని మండిపడ్డారు. ఆప్ ఎమ్మెల్యే నరేశ్ బల్యాన్ అరెస్ట్‌ను ఖండించారు. ఆయనకు ఏడాదిగా గ్యాంగ్‌స్టర్ల నుంచి బెదిరింపులు వస్తున్నాయన్నారు. నేరస్తులకు రక్షణ కల్పించి, ఫిర్యాదుదారులనే అరెస్ట్ చేస్తామన్నట్లుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా వైఖరి ఉందని వ్యాఖ్యానించారు.

కనీసం ముగ్గుర్ని కనండి

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

నాగ్‌పూర్: ''సమాజం ఉనికి కొనసాగాలి. ప్రమాదంలో పడరాదు. అందుకోసం దంపతులు ఇద్దరి కంటే ఎక్కువ సంతానాన్ని కనాలి. కనీసం ముగ్గురు సంతానాన్ని కలిగి ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది'' అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. దేశంలో జనాభా పెరుగుదల 2.1 శాతానికి దిగువకు పడిపోతే సమాజమే కనుమరుగవుతుందని భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. నాగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. 'సమాజానికి కుటుంబమే ప్రాతిపదిక. కుటుంబమూ ఒక యూనిట్' అని అన్నారు. ''జనాభా పెరుగుదల ఇంతగా తగ్గితే వేరెవరూ నాశనం చేయాల్సిన అవసరం లేకుండా సమాజం దానంతటదే అంతర్ధానమవుతుంది. పలు సిద్ధాంతాలు చెబుతున్న విషయమిది'' అని అన్నారు.



ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ బృందంలో మరో భారతీయ అమెరికన్‌కు చోటు దక్కింది. దేశంలో అత్యంత శక్తివంతమైన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్‌గా తనకు అత్యంత సన్నిహితుడైన కశ్యప్ పటేల్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. ''కశ్యప్ (కాష్) పటేల్ ఎఫ్‌బీఐ తదుపరి డైరెక్టర్‌గా వ్యవహరిస్తారని ప్రకటించడానికి గర్వపడుతున్నా. కాష్ తెలివైన న్యాయవాది, పరిశోధకుడు. 'అమెరికా ఫస్ట్' పోరాట యోధుడు. అవినీతిని బహిర్గతం చేయడం, న్యాయాన్ని సమర్థించడం, అమెరికా ప్రజలను రక్షించడంలో వృత్తిగా గడిపారు'' అని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో శనివారం ప్రకటించారు. 44 ఏళ్ల పటేల్.. ట్రంప్ మొదటి పర్యాయంలో అమెరికా తాత్కాలిక రక్షణ మంత్రికి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పని చేశారు. తన మొదటి టర్మ్‌లో కాష్ అద్భుతంగా పనిచేశారని, 60కి పైగా జ్యూరీ ట్రయల్స్‌ను కాష్ విచారించారని, రష్యా మోసాన్ని వెలికి తీయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని ట్రంప్ కొనియాడారు. ''కాష్ నేతృత్వంలోని ఎఫ్‌బీఐ అమెరికాలో పెరుగుతున్న నేరాలను అంతం చేస్తుంది. వలస క్రిమినల్ ముఠాలను నిర్మూలిస్తుంది. సరిహద్దు వెంబడి మానవ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నివారిస్తుంది. ఎఫ్‌బీఐకి విశ్వసనీయత, సమగ్రతను తిరిగి తీసుకురావడానికి అటార్నీ జనరల్ పామ్ బోండీ ఆధ్వర్యంలో కాష్ పనిచేస్తారు'' అని ట్రంప్ పేర్కొన్నారు.

న్యూయార్క్‌లో జన్మించిన కశ్యప్ పటేల్ మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో పుట్టి పెరిగారు. లా చదివాక ఫ్లోరిడాలో స్టేట్ పబ్లిక్ డిఫెండర్‌గా, ఫెడరల్ పబ్లిక్ డిఫెండర్‌గా చేశారు. వాషింగ్టన్ డీసీ న్యాయశాఖలో మూడున్నరేళ్లు అంతర్జాతీయ ఉగ్రవాద ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. రక్షణ శాఖలో స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్‌లోనూ చేరారు. ఇంటర్ ఏజెన్సీ సహకార కార్యకలాపాలలో ఏడాది పాటు కొనసాగారు. తర్వాత తీవ్రవాద వ్యతిరేక సీనియర్ న్యాయవాదిగా నియమితులయ్యారు. హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీ తరఫున రష్యాపై దర్యాప్తునకు నేతృత్వం వహించి మీడియా దృష్టిని ఆకర్షించారు. 2019 సెప్టెంబర్, 2020 ఫిబ్రవరిలో ట్రంప్, ప్రధాని నరేంద్ర మోదీ హ్యూస్టన్, అహ్మదాబాద్ ర్యాలీల్లో కీలక పాత్ర పోషించారు.

ఈవీఎంల హ్యాకింగ్, ట్యాంపరింగ్ అబద్ధం

సామాజిక మాధ్యమాల్లో ఉన్న వీడియోపై ఈసీ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈవీఎంను హ్యాకింగ్, ట్యాంపరింగ్ చేస్తానని ఒక వ్యక్తి చెబుతున్నట్టు ఓ వీడియో వెరలవుతున్న నేపథ్యంలో ఆదివారం ఈసీ ఈ మేరకు స్పందించింది. ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపింది. ''ఈవీఎం స్వతంత్ర వ్యవస్థ కలిగిన యంత్రం. దాన్ని వైఫై, బ్లూటూత్ తదితరాలతో అనుసంధానం చేయలేం. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈవీఎంల హ్యాకింగ్ గురించి మాట్లాడిన వ్యక్తిని సయ్యద్ షుజాగా గుర్తించాం. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న అతనిపై కేసు నమోదు చేశాం'' అని తెలిపింది. ఈవీఎంలపై అసత్యాలు ప్రచారం చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది.

రష్యా రక్షణ బడ్జెట్ రూ.10 లక్షల కోట్లు!

కీవ్: ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రక్షణ వ్యయాన్ని రికార్డు స్థాయిలో పెంచారు. 2025 బడ్జెట్‌లో 32.5శాతాన్ని జాతీయ రక్షణకు కేటాయించారు. రక్షణ వ్యయంగా 13.5 ట్రిలియన్ రూబుల్స్ (రూ.పది లక్షల కోట్లు) కేటాయించినట్లు ఆదివారం ప్రకటించారు. గత ఏడాది మొత్తం బడ్జెట్‌లో 28.3శాతం రక్షణకు కేటాయించగా.. ఈ ఏడాది 32.5శాతానికి చేరింది. రష్యా పార్లమెంటు ఉభయ సభలు, స్టేట్ డ్యూమా, ఫెడరేషన్ కౌన్సిల్ బడ్జెట్ ప్రణాళికలను ఆమోదించాయి.



స్కెచ్ మొత్తం నిహారిక నేతృత్వంలోనే..

వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నిహారిక నేతృత్వంలోనే వ్యవహారమంతా సాగిందని పోలీసులు తేల్చారు. -8లో



లఘు చిత్రాల సమాహారం..

రవీంద్ర భారతి వేదికగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న 'సినివారం' ఈ తరం సినీ ప్రేమికులకు స్వర్గధామంగా మారింది.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
29.0/21.0

వాతావరణం

నగరంలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 29, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

వైద్యుల సేవలు అభినందనీయం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, సిటీబ్యూరో: ప్రజలకు వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఇంపాక్ట్ కాన్–2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆవో గావ్ చలే' వంటి అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందజేయడంలో ఐఎంఏ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. హెల్త్ క్యాంపులు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వైద్యులకు, ప్రజలకు మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ సేవలందిస్తోందని వివరించారు. ఐఎంఏ బంజారాహిల్స్ శాఖ కూడా గిరిజనులకు, పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. సామాజిక మహమ్మారి డ్రగ్స్ వల్ల జరిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ డ్రగ్ ఫ్రీ సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. దేశంలో హెల్త్‌కేర్ స్టాండరస్డ్‌ను పెంచేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ఐఎంఏ బంజారాహిల్స్ నాలుగేళ్లుగా వైద్యులతో పాటు సమాజానికి అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని చెప్పారు.

ఉప్పల్ ఠాణాలో మహిళ హల్‌చల్

ఉప్పల్: మద్యం తాగి వచ్చిన ఓ మహిళ ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో హల్‌చల్ సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ కామాక్షిపురానికి చెందిన ఓ వివాహిత మద్యానికి బానిసగా మారింది. గతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హౌస్ కీపర్‌గా పని చేసేది. నిత్యం మద్యం తాగి వచ్చి గొడవ చేస్తుండటంతో వారు పనిలోంచి తొలగించారు. ప్రస్తుతం మరో ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నట్లు సమాచారం. గత శుక్రవారం మద్యం తాగిన సదరు మహిళ.. స్థానిక వ్యక్తితో గొడవపడి ఫిర్యాదు చేయడానికి ఉప్పల్ పీఎస్‌కు వచ్చింది. తానే తన చేయి కోసుకుని వచ్చి సదరు వ్యక్తిని బ్లాక్ మెయిల్ చేయడంతో పాటు బెదిరిస్తూ పోలీస్ స్టేషన్‌లో కేసు పెడ్తానంటూ హల్‌చల్ చేసింది. తాను మద్యం తాగినట్లు చెబుతూ.. విచిత్రంగా ప్రవర్తించింది. దీంతో పోలీసులు ఆమెను కొద్దిసేపు ఠాణాలో కూర్చుండబెట్టి అనంతరం ఇంటికి పంపించారు.

7న బేగంపేట్‌లో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కాచిగూడ: తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో స్టార్టప్స్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎంకరేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 7న బేగంపేట్‌లోని పర్యాటక భవన్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్ పర్సన్ బెల్లం మాధవి, అధ్యక్షుడు మహేశ్వరం కార్తీక్ తెలిపారు. ఎగ్జిబిషన్ వాల్ పోస్టర్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఆవిష్కరించారు.

చుక్కా రామయ్యను కలిసిన హరీష్ రావు



నల్లకుంట: నల్లకుంట విజ్ఞానపురి కాలనీలోని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త, ఐఐటీ చుక్కా రామయ్య నివాసానికి ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి హరీష్ రావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి విచ్చేశారు. గత నెల 20న చుక్కా రామయ్య పుట్టినరోజు నాడు కొన్ని కారణాల వల్ల ఆయనను హరీష్‌రావు కలవలేకపోయారు. ఈ సందర్భంగా రామయ్య ఆరోగ్య విషయంపై ఆయన ఆరా తీశారు. చుక్కా రామయ్యను కలిసిన వారిలో దేశపతి శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

11 నుంచి ఓయూ డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 11 నుంచి ప్రారంభమవుతాయని ఆదివారం ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.శశికాంత్ తెలిపారు. ఓయూ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్ వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.





డిజైనర్ దుస్తుల్లో హొయలు పోయారు

సినీ తారలు రెజీనా, ఈషా రెబ్బా, దియా మీర్జా డిజైనర్ దుస్తుల్లో మెరిసిపోయారు. ర్యాంప్ వాక్‌తో హొయలుపోయారు. ఆదివారం నగరంలోని ఓ స్టార్ హోటల్లో జరిగిన ఫ్యాషన్ షోలో వెరైటీ థీమ్స్‌తో కూడిన డిజైనర్ దుస్తులను మోడళ్లు ర్యాంప్‌పై ప్రదర్శించి అదరహో అనిపించారు. – వివరాలు సిటీప్లస్‌లో



రహదారులపై మందుబాబుల ఇష్టారాజ్యం

మద్యం మత్తులో వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలను బలిగొంటున్నారు మందుబాబులు. నిషాలో యమ కింకరులే అవుతున్నారు. నగరంలో శనివారం రాత్రి మరో దారుణం జరిగింది. నిషాలో ఉన్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని కారుతో ఢీకొట్టి రోడ్డు ప్రమాదానికి కారకుడయ్యాడు. ప్రైవేట్ ఉద్యోగి ప్రణయ్ మద్యం మత్తులో బండ్లగూడ నుంచి ఖైరతాబాద్‌కు కారులో వెళ్తూ.. సన్‌సిటీ వద్ద రెండు వాహనాలను ఢీకొట్టి తప్పించుకుని వచ్చాడు. **ఆ తర్వాత లంగర్‌హౌస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి దంపతులు మోన ఠాకూర్, దినేష్‌ల ఉసురు తీశాడు.**

– సాక్షి, సిటీబ్యూరో

యమ డ్రింకరులు!

చుక్కేసి చంపేస్తున్నారు!!

- నిషాలో వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలతో చెలగాటం
- తాజాగా లంగర్‌హౌస్‌లో భార్యాభర్తలు బలి
- సిబ్బందితో ఇబ్బందే ప్రధాన కారణం
- పూర్తి ఫలితాలు ఇవ్వని పోలీసుల చర్యలు

అత్యంత తీవ్రమైన ఉల్లంఘన..

ట్రాఫిక్ పోలీసులు రహదారి ఉల్లంఘనల్ని వాటి తీవ్రతను బట్టి ప్రధానంగా మూడు రకాలుగా విభజిస్తారు. మొదటిది వాహనం నడిపే వ్యక్తికి ప్రమాదకరమైనవి, రెండోది ఎదుటి వారికి ప్రమాదకరమైనవి. ఈ రెంటికీ మించి తీవ్రమైన వాటిని మూడో కేటగిరీలోకి చేరుస్తారు. ఈ ఉల్లంఘనల వల్ల వాహనం నడిపే వ్యక్తితో పాటు ఎదుటి వారికీ ప్రమాదం పొంచి ఉంటుంది. హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేయడం వంటివి మొదటి కేటగిరీలో ఉంటే డ్రంకన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ తదితరాలు మూడో కేటగిరీలోకి వస్తాయి. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల చోదకుడి విషయం ఏమో గాని వరుసపెట్టి తోటి, ఎదుటి వ్యక్తులు, వారి కుటుంబాలు మాత్రం కుదేలవుతున్నాయి.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు..

రాత్రి వేళల్లో మద్యం తాగేవారికి, ఆ స్థితిలో వాహనాలు నడిపే వారికి సమయం, సందర్భం అంటూ ఉండదు. డ్రంక్ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు మాత్రం ఇవి ఉంటాయి. ప్రధానంగా వీకెండ్స్‌గా పిలిచే శుక్ర, శనివారాలతో పాటు అప్పుడప్పుడు ఆకస్మికంగా ఈ తనిఖీలు చేపడుతున్నారు. ఈ డ్రైవ్స్ నిర్వహణకూ ప్రత్యేక సమయం అంటూ ఉంటోంది. సాధారణంగా రాత్రి 10 నుంచి తెల్లవారుజామున ఒంటిగంట లేదా రెండు గంటల వరకు మాత్రమే చేపట్టగలుగుతున్నారు. ఈ విధులు నిర్వర్తించిన, పర్యవేక్షించిన వారే మరుసటి రోజూ విధులకు హాజరు కావాల్సి ఉండటంతో ఇలా చేయాల్సి వస్తోంది. ట్రాఫిక్ విభాగంలో ఉన్న సిబ్బంది కొరత నేపథ్యంలో ప్రతి రోజూ, రాత్రంతా డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు చేపట్టలేకపోతున్నారు. దీన్నే మందుబాబులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

తెలివిమీరుతున్న మందుబాబులు..

ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించే రోజులు, సమయాలు, స్థలాలను గమనిస్తున్న మందుబాబులు తెలివిమీరి ప్రవర్తిస్తున్నారు. డ్రంక్ డ్రైవింగ్‌పై తనిఖీలు ఉండని రోజుల్లో, సమయాల్లో రెచ్చిపోతున్నారు. అవి జరిగే వారాంతాల్లోనూ గల్లీలు, ఇతర మార్గాలను అనుసరిస్తూ పోలీసులకు చిక్కట్లేదు. కొందరైతే ఏకంగా వాట్సాప్ గ్రూపుల్లో డ్రంక్ డ్రైవింగ్ జరిగే ప్రాంతాలు, సమయాలకు సంబంధించిన సమాచార మార్పిడి చేసుకుంటూ వాహనాలపై దూసుకుపోతున్నారు. ఇదే అనేక సందర్భాల్లో ప్రమాదహేతువుగా మారుతోంది. మందుబాబులు వాహనం నడుపుతూ తమంతట తాము ప్రమాదానికి లోనైన ఉదంతాలు అసలు వెలుగులోకే రావడం లేదు. ఎదుటి వారిని ఢీకొట్టినప్పుడో, సంచలనాత్మక ఉదంతం జరిగినప్పుడో మాత్రమే ఈ విషయం వెల్లడవుతోంది.

నగరంలో డ్రంక్ డ్రైవింగ్ కేసులు ఇలా..

	2023	2024 (నవంబర్ 15 వరకు)
మొత్తం కేసులు	53,975	48,735
జైలు శిక్షలు పడినవి	3,882	3,538
జరిమానా	రూ.9.79 కోట్లు	రూ.9.71 కోట్లు
సస్పెండ్ అయిన లైసెన్సులు	589	245
బీఏసీ కౌంట్ 200 దాటిన వాళ్లు	4,256	3,689

(రక్తంలో ఉండే ఆల్కహాల్ శాతాన్ని బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ (బీఏసీ) అంటారు. 100 ఎంఎల్ రక్తంలో 30 ఎంజీ ఆల్కహాల్ ఉంటే అది ఉల్లంఘన కిందికి వస్తుంది)

అందరికీ అందుబాటులో డేటాబేస్...

మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కడంతో పాటు ర్యాష్ డ్రైవింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ప్రమాదాలకు కారణమైన, తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన వారి వివరాలతో సమగ్ర ఎలక్ట్రానిక్ డేటాబేస్ సిద్ధం చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కిన వారి వివరాలను ఆధార్ నంబర్‌తో సహా పొందుపరుస్తున్నారు. ఈ వివరాలను వివిధ రకాలైన సేవలు అందించే విభాగాలకు అందుబాటులో ఉంచుతున్నారు. ఆయా విభాగాలు ఇందులోని వివరాలు సరిచూసుకుని తదుపరి చర్యలు తీసుకోనున్నాయి. ప్రధానంగా పాస్‌పోర్ట్, వీసా, జాబ్ వెరిఫికేషన్ సమయాల్లో ఇలాంటి కేసులు అడ్డంకి కానున్నాయని హెచ్చరిస్తున్నారు.

నేడు పుష్ప-2 ప్రీ రిలీజ్ ఈవెంట్

- ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ పోలీస్‌లైన్స్‌లో సోమవారం జరగనున్న పుష్ప–2 ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఏర్పాట్లను ఆదివారం నగర అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా పరిశీలించారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో ఈ కార్యక్రమం జరగనుండగా కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు ప్రజలు ఇతర రహదారుల నుంచి వెళ్లాలని కోరారు.

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వైపు వెళ్లే వాహనదారులు శ్రీకృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీ మీదుగా పంజగుట్ట వైపు వెళ్లాల్సి ఉంటుంది.
- మైత్రివనం జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, మాదాపూర్ వైపు వెళ్లే వాహనదారులు యూసుఫ్‌గూడ బస్తీ వద్ద ఆర్‌బీఐ క్వార్టర్స్ వైపు మళ్లి కృష్ణానగర్ జంక్షన్ మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు వెళ్లాలి.
- బోరబండ బస్టాపు వైపు నుంచి మైత్రివనం జంక్షన్‌కు వెళ్లే వాహనదారులు ప్రైమ్ గార్డెన్, కల్యాణ్‌నగర్, మిడ్‌ల్యాండ్ బేకరీ, జీటీఎస్ కాలనీ, కల్యాణ్ నగర్ జంక్షన్, ఉమేష్ చంద్ర విగ్రహం మీదుగా యూ టర్న్ తీసుకుని, ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద యూ టర్న్ తీసుకుని మైత్రివనం వైపు వెళ్లాల్సి ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పార్కింగ్ ఇలా..

- కార్లను సవేరా అండ్ మహమూద్ ఫంక్షన్ హాళ్లలో పార్కు చేయాలి
- జానకమ్మ తోటలో కార్లు, బైకులు పార్క్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

బల్దియాలో బలపడాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రజాపాలన.. విజయోత్సవాలను జయప్రదం చేయాలి
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అవసరముందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు– 2024 పేరుతో ఈ నెల 7, 8, 9వ తేదీల్లో నగరంలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలతో ఆదివారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసంలో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ బలహీనంగా ఉందని, పార్టీ, ప్రభుత్వం సమన్వయం చేసుకుంటేనే విజయాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ హయాంలో అమలు కాని పథకాలను.. కాంగ్రెస్ ఒక్క సంవత్సరంలో అమలు చేసి చూపించిందన్నారు. క్షేత్రస్థాయిలో చేస్తున్న పనులు కూడా చెప్పడంలో కాంగ్రెస్ కార్యకర్తలు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనుంచి కలిసికట్టుగా పని చేయాలని ఆమె సూచించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బల్దియా ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే మేయర్ పదవి మనకే దక్కుతుందన్నారు. త్వరలోనే జీహెచ్‌ఎంసీలో డివిజన్ల వారీగా పాదయాత్ర చేపట్టి పార్టీ బలోపేతం కోసం కార్యాచరణ దిశగా పయనించాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. విజయోత్సవాలకు గ్రేటర్ హైదరాబాద్ నుంచి భారీ జన సమీకరణ చేయాలన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీ గణేష్, ఎమ్మెల్సీలు అమీర్ అలీఖాన్, ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్లు ఫహీం, నూతి శ్రీకాంత్ గౌడ్, మెట్టు సాయి కుమార్, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సమీర్‌వుల్లాఖాన్ పాల్గొన్నారు.



జాగాలో పాగా!

- ఉప్పల్ భగాయత్‌లో యథేచ్ఛగా ఆక్రమణలు
- మిగిలిపోయిన స్థలాలు దర్జాగా కబ్జా
- తాత్కాలిక షెడ్లు వేసి అద్దెలకిస్తున్న వైనం
- గతంలో ఆక్రమణలను కూల్చివేసిన హెచ్‌ఎండీఏ
- అయినా ఆగని అక్రమార్కుల ఆగడాలు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ భగాయత్‌లో హెచ్‌ఎండీఏ స్థలాలకు రక్షణ కరువైంది. లే అవుట్‌లో మిగిలిన స్థలాలు యథావిధిగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇలా ఆక్రమించిన స్థలాల్లో తాత్కాలిక ప్రాతిపదికన షెడ్‌లను నిర్మించి వ్యాపారులకు అద్దెలకు ఇస్తున్నారు. గతంలో ఇలాంటి ఆక్రమణలపై హెచ్‌ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు. నిఘా, ఎన్‌ఫోర్స్ విభాగం అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. అయినప్పటికీ కొందరు కబ్జారాయుళ్లు మరోసారి అదే స్థలాలను ఆక్రమించి పలు వ్యాపార సంస్థలకు అద్దెలకు ఇస్తున్నారు. ఒక్కో షెడ్డు నుంచి ప్రతి నెలా రూ.లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉప్పల్ భగాయత్‌లోని తూర్పు వైపు రోడ్ నంబర్ 35 ప్రాంతంలో సుమారు 150 గజాల స్థలాన్ని ఒక వ్యక్తి దర్జాగా కబ్జా చేసి ఏకంగా గదులను నిర్మించి అద్దెకు ఇచ్చినట్లు స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. లేఅవుట్‌కు నలువైపులా మూలల్లో ఇలా మిగిలిపోయిన స్థలాలే లక్ష్యంగా కబ్జాల పర్వం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



భారీ లే అవుట్..

- మహా నగరానికి తూర్పు ముఖద్వారంలో హెచ్‌ఎండీఏ ఏర్పాటు చేసిన అతిపెద్ద లే అవుట్ ఇది. వరంగల్ ప్రధాన రహదారికి, విజయవాడ హైవేకు అందుబాటులో ఉండడంతో నిర్మాణ సంస్థలు, రియల్టర్ల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. ఈ లే అవుట్‌లో హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించింది. హైదరాబాద్ మెట్రో రైల్ కోసం ప్రభుత్వం అప్పట్లో రైతుల నుంచి పెద్ద మొత్తంలో భూములను సేకరించిన సంగతి తెలిసిందే. ఇలా ఉప్పల్ భగాయత్‌లో సేకరించిన సుమారు 713 ఎకరాల భూములలో 90 ఎకరాల వరకు మెట్రో రైల్ కోసం, మరో వంద ఎకరాలు జలమండలికి కేటాయించారు. మిగతా భూమిలో హెచ్‌ఎండీఏ లే అవుట్‌ను అభివృద్ధి చేసింది.
- రైతుల నుంచి సేకరించిన భూమికి ఎకరానికి వెయ్యి గజాల చొప్పున అందజేశారు. మరో 413 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ప్లాట్‌ల విక్రయానికి చర్యలు చేపట్టింది. 450 గజాల నుంచి గరిష్టంగా 11 వేలకు పైగా చదరపు గజాల వరకు విస్తీర్ణం కలిగిన సుమారు 3500 ప్లాట్‌లను హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా అమ్మకానికి పెట్టింది. ఈ స్థలాలను కొనుగోలు చేసిన బిల్డర్లు, రియల్టర్లు బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి విక్రయించారు. మధ్యతరగతి వర్గాలు సైతం ఇక్కడ ప్లాట్‌లు కొనుగోలు చేసి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.

హెచ్‌ఎండీఏ స్థలాలు ఉన్నాయి..

ఇప్పటి వరకు మూడుసార్లు ఉప్పల్ భగాయత్‌లో స్థలాల అమ్మకానికి ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించిన హెచ్‌ఎండీఏ రూ.వందల కోట్లు ఆర్జించింది. గతేడాది జూన్ నెలలో మూడోసారి 63 ప్లాట్‌లను విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. కానీ కొన్ని ప్లాట్‌లు మాత్రమే అమ్ముడయ్యాయి. వాటిలో ఇంకొన్ని మిగిలి ఉన్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్ధత దృష్ట్యా ఉప్పల్ భగాయత్‌తో పాటు హెచ్‌ఎండీఏకు ఉన్న సొంత స్థలాల్లో మరెక్కడా ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించేందుకు అధికారులు సాహసించలేకపోతున్నారు. ఈ క్రమంలో ఇలాంటి ఆక్రమణల ఉదంతాలు హెచ్‌ఎండీఏ స్థలాల రక్షణను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

తెలంగాణలో నూతన స్పోర్ట్స్ పాలసీ

శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి


వాలీబాల్ విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న శివసేనారెడ్డి, శిల్పారెడ్డి తదితరులు

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో నూతన స్పోర్ట్స్ పాలసీని అమలు చేయనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. 2028 ఒలింపిక్స్‌లో రాష్ట్రానికి బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా నూతన పాలసీని రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈశా గ్రామోత్సవం రాష్ట్ర, డివిజనల్ స్థాయి క్రీడా పోటీలను నాచారం డిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో నిర్వహించారు. తెలంగాణలోని 13 జిల్లాలకు చెందిన 174 వాలీబాల్, 60 త్రోబాల్ టీంలు పాల్గొన్నాయి, దాదాపు 2 వేల మంది ఆటగాళ్ల గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఫైనల్స్ ముగింపు కార్యక్రమానికి ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరైన శివసేనారెడ్డి విజేతలకు ట్రోఫీలు, నగదు పురస్కారాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా క్రీడాకారుడు కావడంతో స్పోర్ట్స్‌ను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. అలాగే గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయన్నునట్లు తెలిపారు. డిసెంబర్ 7 నుంచి జనవరి 2 వరకు సీఎం కప్ పోటీలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నమని పేర్కొన్నారు. అనంతరం డీపీఎస్ విద్యాసంస్థల చైర్మన్ మల్కకొమురయ్య, మిస్ ఇండియా, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి మట్లాడుతూ ఈషా గురువు సద్గురు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నేపథ్య గాయకులు రామ్ మిరియాల, మంగ్లీ, హారికలు పాటలతో జోష్ నింపారు. కాగా వాలీబాల్ ఫస్ట్ ప్రైజ్ విన్నర్ మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.12 వేల నగదును అందజేశారు. ద్వితీయ బహుమతి సంగారెడ్డి, తృతీయ బహుమతి వరంగల్ జట్టు అందుకున్నాయి.

ఫాంహౌస్‌లపై పోలీసుల దాడులు

అనుమతి లేకుండా పార్టీలు నిర్వహించిన వారిపై కేసులు

మొయినాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీలు నిర్వహిస్తున్న ఫాంహౌస్‌లపై దాడులు చేసిన పోలీసులు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఎనికేపల్లిలోని జేఎల్ఆర్ ఫాంహౌస్, చాకలిగూడలోని అట్టల్ శంకర్ జగదాంబ ఫాంహౌస్, అజీజ్ నగర్‌లోని ద్వారా కన్వెన్షన్‌లలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు అనుమతులు లేకుండా డీజేలు పెట్టి, మద్యం సేవిస్తూ పార్టీలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌లపై దాడులు చేశారు. డీజే బాక్సులు, మద్యం బాటిళ్లు, హుక్కా స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా పార్టీలు నిర్వహిస్తున్న నిర్వాహకులతోపాటు ఫాంహౌస్‌ల యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు.

20 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి, కారును సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

చందానగర్: విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్, సరూర్‌నగర్ డీటీఎఫ్ పోలీసులు శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నానక్‌రాంగూడ మీనాక్షి అపార్ట్‌మెంట్స్‌లో శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కారును వదిలి వెళ్లిపోయాడు. వెంటనే ఆ కారును తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి కారు ఇంజన్‌లో లభించింది. పోలీసులు గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కారులో గంజాయిని తరలిస్తున్న నిందితుడి ఓటర్ కార్డు, ఇతర వస్తువులను పోలీసులు గమనించారు. నిందితుడు ఒడిశాలోని మల్కాన్‌గిరి కమ్మెల జిల్లాకు చెందిన బిక్రం హీరాగా గుర్తించారు. ఈ దాడులలో శంషాబాద్ డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సరూర్‌నగర్ డీటీఎఫ్ ఎస్ఐ శంకర్, శేరిలింగంపల్లి సిబ్బంది పాల్గొన్నారు.

స్కెచ్ మొత్తం నిహారిక నేతృత్వంలోనే!

- రమేష్ కుమార్ హత్య కేసులో రెండో భార్యే కీలకం
- ఆమె గత చరిత్రను తవ్వితీసిన కర్ణాటక పోలీసులు
- రెండో భర్తను మోసం చేసి జైలుకు వెళ్లినట్లు వెల్లడి
- త్వరలో చార్జిషీట్ దాఖలు చేయడానికి సన్నాహాలు


నిహారిక, నిఖిల్, అంకుర్


రమేష్ కుమార్ (మృతుడు)

సాక్షి, సిటీబ్యూరో: మొదటి భర్తను వదిలేసింది.. రెండో భర్తను మోసం చేసింది..మూడో భర్తను ఏకంగా చంపేసింది.. నాలుగో భర్తగా చేసుకోవాలనుకున్న డాక్టర్‌ను జైలుకు పంపింది..పోచారం ఐటీ కారిడార్‌కు చెందిన వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నిహారిక వ్యవహారమిది. తన స్నేహితుడు అంకుర్ రాణాతో కలిసి పీర్జాదిగూడలో ఈ హత్య చేసిన నిహారిక ప్రియుడు నిఖిల్ సూచనల మేరకు మృతదేహాన్ని 850 కిలోమీటర్లు తీసుకువెళ్లి, కర్ణాటకలోని కొడగు ప్రాంతంలో ఉన్న కాఫీ ఎస్టేట్‌లో కాల్చేసిన విషయం విదితమే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సిటీకి తీసుకువచ్చినప్పుడే అంకుర్ కర్ణాటక పోలీసుల నుంచి తప్పించుకోవడం, మళ్లీ చిక్కడం జరిగాయి. త్వరలో నిందితులపై అభియోగపత్రాలు దాఖలు చేయాలని నిర్ణయించిన కొడగు పోలీసులు ప్రధాన నిందితురాలు నిహారిక గత చరిత్రను తవ్వితీశారు.

రెండో భర్తకు రూ.70 లక్షల టోకరా..

నగర శివార్లలోని భువనగిరికి చెందిన ఆకుల శ్రీలతకు (29) ఇక్కడ ఉండగానే ఓ వ్యక్తితో వివాహమైంది. ఓ కుమార్తె కలిగిన తర్వాత డబ్బుపై ఆశ, జల్సాల కోసం శ్రీలత మొదటి భర్తను వదిలేసి, బెంగళూరుకు మకాం మార్చింది. ఓ మల్టీ నేషనల్ కంపెనీలో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ప్రచారం చేసుకుంది. తన పేరును పంతుల నిహారికగా మార్చుకుని..కొన్నేళ్ల క్రితం హర్యానాలోని కర్నాల్ ప్రాంతానికి చెందిన కమల్‌దీప్ శైనీ అనే వ్యక్తితో 'మీట్4యూ' అనే డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా బిల్డప్ ఇచ్చిన నిహారిక కమల్‌ను 2019 జూన్ 22న రెండో పెళ్లి (అతడికి మొదటి వివాహం) చేసుకుంది. తనకు అప్పటికే పెళ్లి కావడం, భర్త నుంచి విడిపోవడాన్ని దాచి ఉంచింది.

ల్యాప్‌టాప్‌లో కనిపించిన ఫొటోతో..

వీళ్లిద్దరూ బెంగళూరులో నివసిస్తుండగానే తన కుమార్తెను మేనకోడలు అంటూ చెప్పి తమ వద్దకు తెచ్చుకుంది. అనారోగ్యం సహా వివిధ రకాలైన కారణాలు చెప్తూ కమల్‌దీప్ నుంచి రూ.70 లక్షలు తీసుకుంది. కరోనా సీజన్‌లో వీళ్లిద్దరూ తమ మకాంను కర్నాల్‌కు మార్చారు. నిహారిక తనతో పాటు తన కుమార్తెను తీసుకువెళ్లింది. ఓ రోజు నిహారిక ల్యాప్‌టాప్‌లో ఆమె మొదటి భర్తకు సంబంధించిన ఫొటోలు చూసిన కమల్‌దీప్ అసలు విషయం తెలుసుకున్నారు. తాను మోసపోయానని గుర్తించిన కమల్‌దీప్ 2021 జనవరిలో కర్నాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అక్కడి పోలీసులు అదే ఏడాది ఫిబ్రవరి 4న నిహారికను అరెస్టు చేశారు. ఆ ఏడాది డిసెంబర్ వరకు కర్నాల్ జైల్లో గడిపిన ఆమెకు బెయిల్ వచ్చింది. జైల్లో ఉండగా వేధింపుల కేసులో జైలుకు వచ్చిన సభా అనే మహిళతో నిహారికకు పరిచయం ఏర్పడింది. సభాను ములాఖత్‌లో కలవడానికి వచ్చే ట్యాక్సీ డ్రైవర్ అంకుర్ రాణాతోనూ ఈమెకు స్నేహం ఏర్పడింది.

కోర్టుకు హాజరుకాకపోవడంతో వారెంట్..

మోసం కేసులో బెయిల్ పొందిన నిహారిక కోర్టు వాయిదాలకు దాదాపు రెండేళ్ల పాటు హాజరుకాలేదు. దీంతో ఆమెపై న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీని ఆధారంగా కర్నాల్ పోలీసులు ఈ ఏడాది మేలో మరోసారి అరెస్టు చేయగా..ఆగస్టులో బెయిల్ పొంది బయటకు వచ్చింది. ఇదిలా ఉండగా..నగరంలోని తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన చెందిన రమేష్ కుమార్ భార్య, కుమార్తెకు దూరంగా పోచారంలో ఉన్న సంస్కృతి టౌన్‌షిప్‌లో ఒంటరిగా నివసించారు. నిహారికకు మాట్రిమోనియల్ సైట్ ద్వారా రమేష్‌తో పరిచయం ఏర్పడింది. 2018లో రిజిస్టర్ వివాహం చేసుకున్న వీళ్లు సంస్కృతి టౌన్‌షిప్‌లోనే కాపురం పెట్టారు. నిహారిక మాత్రం ఉద్యోగ నిమిత్తం అంటూ ఎక్కువ రోజులు బెంగళూరులోనే ఉండేది. ఈ కారణంగానే ఆమె వివాహాలు, అరెస్టులు రమేష్‌కు తెలియలేదు.

వెటర్నరీ డాక్టర్ నిఖిల్‌తో ప్రేమాయణం..

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా వాసవీనగర్ నుంచి బెంగళూరులోని రామమూర్తి నగర్ వెటర్నరీ డాక్టర్‌గా స్థిరపడిన నిఖిల్ మైరెడ్డితో నిహారికకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కొన్నాళ్లుగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. కొన్ని రోజులుగా నిహారిక తనకు జర్మనీలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం వచ్చిందని, దాని నిమిత్తం రూ.2 కోట్లు చెల్లించాల్సి ఉందంటూ రమేష్‌తో చెప్తోంది. అయితే కొన్నాళ్లుగా ఆమె ప్రవర్తన, మాటలపై సందేహాలు రావడంతో ఈ మొత్తం ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో గత నెల్లో నగరానికి వచ్చిన నిహారిక, అంకుర్ పథకం ప్రకారం రమేష్‌ను చంపి, నిఖిల్ సలహాతోనే మృతదేహాన్ని కొడగు వరకు తీసుకువెళ్లి కాల్చేశారు. ఈ ముగ్గురూ అరెస్టు కాగా.. దర్యాప్తు కోసం నగరానికి తీసుకురాగా తప్పించుకున్న అంకుర్ మళ్లీ అరెస్టు అయ్యాడు. కొడగు పోలీసులు తమ దర్యాప్తులో ఈ హత్యలో నిహారిక కీలకమని గుర్తించారు. ఈ మేరకు త్వరలోనే అక్కడి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణంపై సీఎం సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: గోషామహల్ స్టేడియంలో నిర్మించబోయే ఉస్మానియా ఆసుపత్రిపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రహదారులపై సీఎం పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణం కోసం తక్షణమే సర్వే ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. అదే విధంగా ఆస్పత్రికి కావాల్సిన మౌలిక సదుపాయాలు తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని శాఖలతో సమన్వయం కోసం నోడల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి దాన కిషోర్‌ను నియమించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ తో పాటు సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సైంటిస్టులు మెరుగైన సమాజం కోసం పనిచేయాలి



సాక్షి, సిటీబ్యూరో: సైంటిస్టులు మెరుగైన సమాజం కోసం పని చేయాలని సిగ్మా–9 చైర్మన్ గోవిందరాజన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్‌కు హాజరై ప్రసంగించారు. మానవాళిని రక్షించడం కోసం సిగ్మా–9 గ్లోబల్ పీస్ మిషన్‌ను ప్రారంభించిందన్నారు. యుద్ధమైనా, శాంతైనా మానవ ఆవిష్కరణలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. యుద్ధం మనిషి ఐడియాలజీని ప్రతిబింబిస్తుందని అతి విశిష్ట సేవా మెడల్ గ్రహీత మోహన్‌దాస్ పేర్కొన్నారు. మహాభారతం, రామాయణం ఇదే సూచిస్తుందన్నారు. యుద్ధం, శాంతి రెండూ రూపాయి నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివన్నారు. 20వ శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాలు 20 ఏళ్ల వ్యవధిలోనే జరిగాయన్నారు. ప్రస్తుతం కోల్డ్ వార్ స్టార్ట్ అయ్యిందని పేర్కొన్నారు. ప్రపంచంలో పది దేశాలు న్యూక్లియర్ ఆయుధాలు కలిగి ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఏఐ అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులో ఉందన్నారు. గంటకు 6 వేల కిలో మీటర్ల వేగంతో దూసుకెళ్లే మిస్సైల్‌ను భారత్ అభివృద్ధి చేసిందన్నారు. ఆయుధాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకుందన్నారు. కార్యక్రమంలో ఇస్రో, డీఆర్‌డీఓ, డిఫెన్స్ సర్వీసెస్‌లకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తల బృందం ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారు.

సెలబ్రిటీలను మోసగించిన నిందితుడికి రిమాండ్


కాంతి దత్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: వ్యాపారాల్లో పెట్టుబడుల పేరుతో యువ వ్యాపారవేత్తలను, సినీతారలను మోసగించిన ఘటనలో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..వైజాగ్‌కు చెందిన కాంతి దత్ తోనంగి పలువురు వ్యాపారులచే పెట్టుబడులు పెట్టించి వ్యాపారాలు తెరిపించి ఫోర్జరీ సంతకాలతో వాటిని తొలగించి కోట్లాది రూపాయలను మోసగించారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36లో శ్రీజారెడ్డిని డైరెక్టర్లుగా చెప్పి తృతీయ ఫైన్ జ్యువెలరీ పేరుతో ఓ షాపు తెరిపించాడు. బాలీవుడ్ సినీనటి పరిణీతి చోప్రాను బ్రాండ్ అంబాసిడర్‌గా పెడుతున్నానంటూ రూ.కోటిన్నర తీసుకుని ఆమెకు ఇవ్వకుండానే మోసగించాడు. ఫోర్జరీ సంతకంతో శ్రీజారెడ్డిని డైరెక్టర్ పదవి నుంచి తొలగించాడు. ఇలా చాలామందిని వ్యాపారాలు పెట్టించి..వారిని తొలగించి తానే వాటిని ఆక్రమించి పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కాంతి దత్‌పై రెండు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసులో రాజశేఖర్ అనే ర్యాపిడో డ్రైవర్ మృతి చెందగా కాంతిదత్‌పై కేసు నమోదైంది. ఎన్నో కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు.

మత్తు పదార్థాలు స్వాధీనం... నలుగురి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండీఎంఏ డ్రగ్, సెల్ ఫోన్లు

గచ్చిబౌలి: హోటల్ గదిలో పార్టీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన డ్రగ్స్‌ను ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు. ఆదివారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.వైజాగ్ మద్దెలపాలెంకు చెందిన గులిపల్లి గంగాధర్, భువనేశ్వర్‌కు చెందిన డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ కన్హా మహంతి, మాదాపూర్‌లో హాస్టల్‌లో నివాసం ఉండె కొండం ప్రియాంక రెడ్డి, గుడివాడ లీలామహల్‌కు చెందిన ఒగిరాల షకీలు గచ్చిబౌలి డీఎల్ఎఫ్ రోడ్డులోని ఓయో బొటిక్ హోటల్ రూమ్ నెంబర్ 303లో అద్దెకు దిగారు. పార్టీ చేసుకునేందుకు రూమ్‌లో డ్రగ్స్‌ను సిద్ధంగా ఉంచారని విశ్వసనీయ సమాచారం అందడంతో శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో పోలీసులు హోటల్‌పై దాడి చేశారు. రూమ్‌లో 18 గ్రాములు ఎండీఎంఏ, గ్రాము ఓజీ కుష్, ఒక ఎల్ఎస్‌డీ పేపర్, 7 గ్రాముల ఇండియన్ చెర్రాస్ బాల్, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల బెంగళూర్‌కు వెళ్లిన గంగాధర్ ఎండీఎంఏ తీసుకొచ్చాడు. పబ్‌లలో పరిచయమైన వారికి డ్రగ్స్‌ను సరఫరా చేస్తుంటాడు. ప్రధాన సరఫరాదారుడు పరారీలో ఉన్నాడని, అతనిని పట్టుకుంటే మరింత సమాచారం దొరికే అవకాశం ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. గంగాధర్, కన్హా మహంతి, మరో యువతికి డ్రగ్ పాజిటివ్‌గా వచ్చిందని పోలీసులు తెలిపారు.

నకిలీ వెబ్‌సైట్లు.. తస్మాత్ జాగ్రత్త

- చెల్లింపులు పూర్తయ్యాక పనిచేయని సైట్లు
- ఉత్తరాది రాష్ట్రాల్లో నకిలీ కాల్ సెంటర్లు
- ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత అవసరం: పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరస్తులు నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లు, కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి బాధితులను బురిడీ కొట్టిస్తున్నారు. ఇటీవలి కాలంలో నకిలీ వెబ్‌సైట్లతో మోసపోతున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. సైబర్ కేటుగాళ్లు, సైబర్ బాధితుల ఫిర్యాదుల కోసం తాము సృష్టించిన నకిలీ వెబ్‌సైట్లలో నకిలీ కాంటాక్ట్ నంబర్లు పెడుతున్నారు. వాటికి ఎవరైనా ఫోన్ చేస్తే మోసపోయిన సొమ్మును రికవరీ చేస్తామని నమ్మించి, బాధితుల బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్, అడ్రస్, ఆధార్ నంబర్, సీవీవీ ఇలా అన్ని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. వీటిని ఉపయోగించి మరోసారి డబ్బులు కాజేస్తున్నారు. ఇది సాధ్యం కాకపోతే ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఖర్చుల పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు.

నకిలీ కాల్ సెంటర్లు..

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన కొంతమంది బాధితులు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కాంటాక్ట్ నంబర్ల కోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నారు. ఇలాంటి వారిని నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ కాల్ సెంటర్ల ద్వారా మరోసారి బురిడీ కొట్టిస్తున్నారు. కోల్‌కత్తా, బెంగళూరు, పుణే వంటి ఉత్తరాది నగరాలలో నకిలీ కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక యువతీయువకులకు వేతనాలు చెల్లించి ఉద్యోగులుగా నియమించుకుంటున్నారు. సామాన్యుల పేర్ల మీద బ్యాంక్ ఖాతాలు తెరిచి వాటి ద్వారా బాధితులతో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. దీంతో నేరస్తులను పట్టుకోవటం పోలీసులకు సవాల్‌గా మారుతుంది. గూగుల్‌లో కంపెనీ వెబ్‌సైట్లు, కస్టమర్ కేర్ నంబర్లను వెతకవద్దని, వాటిని నమ్మవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ సెర్మనీ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: న్యాయశాస్త్రం అభ్యసించిన విద్యార్థులు, పట్టభద్రులంతా సోషల్ ఇంజినీర్స్ అని, సామాజిక భవిష్యత్ అంతా వారిపైనే ఆధారపడి ఉంటుందని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా సీనియర్ ప్రొఫెసర్ డా.జీబీ రెడ్డి అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఆర్టీసీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ సెర్మనీ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పట్టభద్రులకు అనంత రాజమ్మ మెమోరియల్ గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సామాజిక వ్యవస్థలో న్యాయశాస్త్రం, న్యాయవాదుల ప్రాధాన్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అనంత లా కాలేజీ కరస్పాండెంట్ రవి అనంత, ప్రిన్సిపాల్ డా.ఎంవీ చంద్రమతి తదితరులు పాల్గొన్నారు.

4న రోశయ్య వర్ధంతి సభ


కాటికె విఠల్

సాక్షి, సిటీబ్యూరో: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని సభ మీడియా కో ఆర్డినేటర్, వైశ్యసంఘం నేత కాటికె విఠల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన లక్డీకాపూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రోశయ్య సేవలు ఎనలేనివని ఆయన పేర్కొన్నారు. 'చైతన్య స్ఫూర్తి–మహాశయా రోశయ్య' పేరిట ఈ నెల 4న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించే వర్ధంతి సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత తదితర ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు కూడా హాజరవుతారని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వైశ్యులు, రోశయ్య అభిమానులు తరలివచ్చి ఆయనకు ఘనంగా నివాళులర్పించాలని విఠల్ పిలుపునిచ్చారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్


సైన్స్ టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

తుర్కయంజాల్: జన విజ్ఞాన వేదిక, చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయి పరీక్ష ఆదివారం తుర్కయంజాల్ లార్డ్స్ హైస్కూల్‌లో నిర్వహించారు. లార్డ్స్ గ్రూప్ స్కూల్స్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పరీక్ష పేపర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలనే కుతూహలంతో ఉండాలని అన్నారు. ప్రతీ విషయాన్ని పరిశోధించాలని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను జన విజ్ఞాన వేదిక వెలికితీయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతలు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు రాములయ్య, ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, కోశాధికారి సాయిబాబు, సత్యం, ప్రకాష్, చిన్ని కృష్ణ, జహంగీర్, స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి యూనిఫాం తయారీదారుల సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: షోలాపూర్ గార్మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ (ఎస్‌జీఎంఏ) ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20 వరకూ యూనిఫాం మ్యానుఫ్యాక్చరింగ్ ఫెయిర్ బెంగళూరులో జరుగనుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు నగరంలో నిర్వహించిన ఓ సమావేశంలో వెల్లడించారు. ఈ వార్షిక ఫెయిర్ యూనిఫాం పరిశ్రమలోని తయారీదారులు, సరఫరాదారులు, పంపిణీదారులు తమ తాజా ఉత్పత్తులను ప్రదర్శించడానికి, క్లయింట్‌లతో కనెక్ట్ అవ్వడానికి సరైన వేదికగా పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి 120 ప్రముఖ బ్రాండ్‌లు తయారీదార్లు పాల్గొంటున్నారని, 25,000 డిజైన్‌లు, యూనిఫాం ఫ్యాబ్రిక్స్ ఉపకరణాలతో పాల్గొంటాయని అంచనా వేస్తున్నామన్నారు.



ధనం కంటే విలువలే ముఖ్యం

- పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి
- ఆలోచింపజేసిన ప్రతిభా దర్శన్ కార్యక్రమం

ఫిలింనగర్: తల్లిదండ్రులు తమ పిల్లలకు ధనం కంటే విలువలే ముఖ్యమని నేర్పించాలని పాఠశాల డైరెక్టర్ ఎం.వరలక్ష్మి అన్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'ది జెమ్స్ ఆఫ్ లైఫ్' పేరిట నిర్వహించిన 'ప్రతిభా దర్శన్' కార్యక్రమం ఆలోచింపజేసింది. మానవ జీవితంలో డబ్బుతో కొనలేనివి సృష్టిలో చాలానే ఉన్నాయనే కాన్సెప్ట్‌తో కొనసాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి నిమిషం చాలా విలువైనదని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. విలువలను నేర్చుకోవడంలో తల్లిదండ్రులు ఆదర్శంగా నిలవాలని, సంబంధాలు, ప్రేమ, గౌరవం అనే విలువలను ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విదు మోహన్ మాట్లాడుతూ ధనం, విలువలు అనేవి ప్రతి వ్యక్తి జీవితంలో అంతర్భాగమన్నారు. జీవితంలో డబ్బు కంటే అత్యంత విలువైనవని ప్రేమ, గౌరవం, జ్ఞానం, సమయం అని, వీటిని డబ్బుతో కొనలేమన్నారు. మానవ జీవితం డబ్బు, విలువలు ఒకదానికొకటి సంబంధాలు కలిగి ఉంటాయన్నారు. విలువలను నేర్చుకోవడంలో తల్లిదండ్రులు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు పాఠశాల డైరెక్టర్ మురళీ ముకుంద్ చిన్నారులను అభినందించారు.



'ప్రతిభా దర్శన్'లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

లేబర్ కార్డుతో.. ఆరోగ్యమస్తు!

- ప్రతిరోజూ 5 చోట్ల వైద్య శిబిరాలు
- వారంలో రెండుసార్లు మెగా క్యాంపులు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచనలు
- జనవరి నుంచి మందులు పంపిణీ
- వైద్యశిబిరాలతో కార్మికులకు మేలు

కార్డు ఉన్న ప్రతి కార్మికుడికీ ఉచిత వైద్యం

బంజారాహిల్స్: భవన నిర్మాణరంగ కార్మికుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా ఆ కార్డు కలిగి ఉన్నవారికి ఏడాదికోసారి రక్త పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వైద్య సూచనలకు సిఫారసు చేస్తుంది. రిజిస్టర్ చేసుకున్న నిర్మాణరంగ కార్మికులకు సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నది. 130కి పైగా ఆరోగ్య పరీక్షలు ఇందులో చేస్తున్నారు. ముఖ్యంగా చెవి వినికిడి, రక్తపోటు, కంటి చూపు స్క్రీనింగ్, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించడమే కాకుండా అనుభవజ్ఞులైన డాక్టర్ల నుంచి వైద్య సూచనలు కూడా ఇస్తున్నారు.

వారంలో రెండుసార్లు మెగా ఆరోగ్య శిబిరాలు

కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌ఈ) ఆధ్వర్యంలో నిర్మాణ రంగ కార్మికులకు హైదరాబాద్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల పరిధిలో బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో రక్త పరీక్షలు చేస్తున్నారు. ప్రతిరోజూ ఐదు చోట్ల ఈ శిబిరాలు ఏర్పాటవుతున్నాయి. ఇక గురు, ఆదివారాల్లో మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 16 మండలాల పరిధిలో 30 వేలమంది రిజిస్టర్ చేసుకున్న నిర్మాణ రంగ కార్మికులు ఉన్నారు. ఆయా మండలాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరాల్లో లేబర్ కార్డు కలిగి ఉన్నవారంతా పరీక్షలకు హాజరవుతున్నారు.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఎన్‌బీటీనగర్ బస్తీ దవాఖానాలో లేబర్ కార్డు కలిగిన వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జనవరి నుంచి అందుబాటులో వైద్యులు



ప్రస్తుతం అన్ని మండలాల పరిధిలోని బస్తీ దవాఖానాలు, యూపీఎస్సీల్లో లేబర్ కార్డు కలిగి ఉన్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి నుంచి డాక్టర్‌ను కూడా సంప్రదించే పరిస్థితులను తీసుకువస్తున్నాం. మరో రెండు నెలల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న కార్మికులు తమ రిపోర్ట్‌లను ఆయా వైద్యుల వద్దకు తీసుకువెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు. అలాగే మందులు కూడా ఉచితంగానే పంపిణీ చేస్తారు. కామన్ సర్వీస్ సెంటర్ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగుతున్నది. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇది పనిచేయనుంది. అప్పుడు ట్యాబ్లెట్లు కూడా ఉచితంగా అందించడం జరుగుతుంది. లేబర్ కార్డు కలిగి ఉన్నవారు ఏడాదికోసారి తప్పనిసరిగా హెల్త్ చెకప్ చేయించుకోవాలి. సదరు కార్డు కలిగి ఉన్నవారు రెన్యువల్ చేయించుకోవాలంటే ఈ హెల్త్ చెకప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సదరు వ్యక్తి ఉన్నాడా? లేదా అనే విషయాలు వెలుగుచూస్తాయి. ఉచితంగా అందించే ఈ వైద్య శిబిరాలను కార్మికులు వినియోగించుకోవాలి. ఎక్కడెక్కడ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తారో ఆయా ప్రాంతాల్లో ముందుగానే ప్రచారం చేయడం జరుగుతుంది. కార్మికుల ఆరోగ్యమే ప్రధానంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.

– బొల్లెట్ల మనోహర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్, సీఎస్‌ఈ, హైదరాబాద్ జిల్లా

భక్తిశ్రద్ధలతో హరినామ సంకీర్తన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో హరినామ సంకీర్తన యజ్ఞ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకధాటిగా మూడు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై తన్మయత్వంలో మునిగితేలారు. బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించాలంటూ శ్రీకృష్ణుడిని ప్రార్థించారు. అలాగే శాంతిని నెలకొల్పాలని వేడుకున్నారు.

విద్యార్థులకు స్వెటర్ల పంపిణీ



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు స్వెటర్లు పంపిణీ చేశారు. సాయి ప్రసన్న, సత్య ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఈ కార్యక్రమానికి ముందుకువచ్చి విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి అనిత, ఉపాధ్యాయులు మురళీధర్ రెడ్డి, అబ్దుల్ హమీద్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ మాట్లాడుతూ వనరుల సౌరశక్తి, పవనశక్తి, జల వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని, వాటిని మనం వినియోగించుకోవాలని తెలియజేయడానికి విద్యార్థులకు ఆయా అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి త్వరలో జరగనున్న మండల, జిల్లా స్థాయి పోటీలకు అర్హులు అవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం చేయడం మహాభాగ్యం

వెంగళరావునగర్: నిరుపేదలకు అన్నదానం చేయడం ఎంతో మహాభాగ్యమని శ్రీ అన్నపూర్ణాదేవి అన్న సమర్పణ సొసైటీ నేతలు తెలియజేశారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని సొసైటీ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని రహమత్‌నగర్ చౌరస్తాలో అన్నపూర్ణాదేవి, శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు, కాటకాలు రాకుండా, ఉపద్రవాలు ప్రజలను ముంచెత్తకుండా, సిరులతో, సుఖసంతోషాలతో ప్రజలు ఉండాలని కోరుతూ ప్రతి నెల ఇలాంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తాడికొండ కృష్ణమూర్తి గుప్తా, ఎం.శ్యాంరావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, బి.ఆంజనేయులు యాదవ్, బుద్ధ నాగార్జున గుప్తా, పి.వి.బ్రహ్మానందం గుప్తా, కొవ్వూరి ప్రభు గుప్తా, జి.సత్యనారాయణ గౌడ్, పి.చందర్‌గౌడ్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ హ్యాండ్లూమ్‌కు విశేష స్పందన



మేళాలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు





మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన స్వదేశీ హస్త శిల్పకళా హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ మేళాలో పట్టు ఫ్యాన్సీ డిజైనర్ చీరలు పోచంపల్లి డ్రస్ మెటీరియల్స్ చుడీదార్స్ షూటింగ్స్, షర్టింగ్స్, పాత కంచిపట్టు, బనారస్, గద్వాల్, వెంకటగిరి స్వచ్ఛమైన జరీ చీరలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని నిర్వాహకులు సందీప్ కుమార్ తెలిపారు. (జమ్మూ కాశ్మీర్) ఎంబ్రాయిడరీ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, (ఆంధ్రప్రదేశ్) ధర్మవరం, మంగళగిరి, వెంకటగిరి, కలంకారి చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా తెలంగాణలో ఎంతో పేరున్న గద్వాల్, నారాయణపేట్, పోచంపల్లి చీరలు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ మేళాలో వన్ గ్రామ్ గోల్డ్‌తో పాటు సామన్యుడి నుంచి సంపన్నుల వరకు కొనుగోలు చేసే విధంగా సరసమైన ధరలకు అన్ని రకాల వస్త్రాలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉంచామన్నారు. అన్ని రకాల క్రెడిట్, డెబిట్ కార్డులపై కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ప్రతి నీటిబొట్టును పొదుపుగా వాడుకోవాలి


ఖైరతాబాద్: భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో ప్రతి నీటిని పొదుపుగా వాడుకోవాలని గ్రౌండ్ వాటర్ కన్సల్టెంట్ జాల సత్యనారాయణ అన్నారు. సేవ్‌ఎర్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్‌లోని పలు బస్తీలు, కాలనీలలో నీటిని పొదుపు చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నీటి సంక్షోభం నెలకొంటున్న సమయంలో నీటిని వృథా చేయొద్దన్నారు. ప్రకృతి ప్రసాదించిన వాటిలో నీరు ఎంతో విలువైందని, ప్రతి ప్రాణికి నీరు ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవ్‌ఎర్త్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న గ్రౌండ్ వాటర్ కన్సల్టెంట్ జాల సత్యనారాయణ తదితరులు

వైభవంగా అయ్యప్ప స్వామి పల్లకి ఊరేగింపు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఓంనగర్ వీరాంజనేయ ఆలయంలోని హరిహర క్షేత్ర సన్నిధి వారి సమక్షంలో అయ్యప్ప స్వామి పల్లకి ఊరేగింపు ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. విద్యుత్ దీపాల వెలుగులో, మేళతాళాలతో స్వామి వారి ఊరేగింపు వీధుల్లో సాగింది. గురు స్వాములు శ్రీనివాస్, తిరుపతినాయుడు, ఉపేందర్ అప్పలనాయుడు, రాంబాబుయాదవ్, గౌరిశంకర్‌లతో పాటు బస్తీ నాయకుడు నరసింహ తదితరులు పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దాడికి దారి తీసిన పార్కింగ్ గొడవ

రహమత్‌నగర్: వాహనం పార్కింగ్ చేసే క్రమంలో మొదలైన గొడవ చివరకు దాడి చేసే వరకు వెళ్లింది. దీంతో బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు దాడికి పాల్పడ్డ వ్యక్తులపై కేసు నమోదు చేశారు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రగడ్డ గంగానగర్‌కు చెందిన తహేర్ శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఆదే ప్రాంతంలోని సాజీద్ నివాసం ఎదుట పార్కింగ్ చేశాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగి దాడి వరకు వెళ్లింది. దీంతో సాజీద్ ఇమ్రాన్, ఖజా, ఇబ్రహీలకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న వారు తహేర్‌తో పాటు అడ్డొచ్చిన అతని తల్లిపై దాడి చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కస్టమర్స్‌పై హోటల్ యజమాని దాడి

వెంగళరావునగర్ : కస్టమర్స్‌పై హోటల్ యజమాని దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే విష్ణుకాంత్ తన స్నేహితుడు సురేష్‌తో కలిసి శనివారం రాత్రి రహమత్‌నగర్ చౌరస్తాలోని అమర్‌పాయింట్ హోటల్ వద్దకు వచ్చాడు. ఈ సమయంలో హోటల్ యజమాన్యంలో ఒకరైన వాహిద్ అక్కడకు వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని అక్కడ పెట్టాలని, మీ వాహనాన్ని తీయాలని సూచించాడు. పక్కన పెట్టుకోవచ్చు కదా అని విష్ణుకాంత్ సమాధానం ఇవ్వడంతో అసభ్య పదజాలంతో దూషించాడు. ఎందుకు తిడుతున్నావని విష్ణుకాంత్ ప్రశ్నించగా అతనిని కొట్టాడు. అతను ఎదురు తిరగడంతో మరో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కూడా దాడిచేశారు. బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల మరణాలపై ఫిర్యాదు

న్యాయవాది కొండ సాయిప్రసాద్ గౌడ్



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ గురుకులాలలోని వసతి గృహాలలో ఆహార కల్తీ కారణంగా విద్యార్థుల మరణాలు తరచుగా జరుగుతున్న సంఘటనలపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది కొండ సాయిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా నారాయణగూడలో సాయిప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో 38 మంది విద్యార్థులు ఆహార కల్తీ కారణంగా మరణించడం జరిగిందని, అదే విధంగా వేలసంఖ్యలో విద్యార్థులు అనారోగ్యానికి గురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈ విషయంలో జాతీయ బాలల హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి పూర్తి విచారణ చేపట్టి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన సంఘటనలకు బాధ్యులైన వారిని కఠి నంగా శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



ముగింపు సభలో మాట్లాడుతున్న వీరయ్య

వెంగళరావునగర్: నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య తెలియజేశారు. స్థానిక వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సెంట్రల్ సిటీ కమిటీ 23వ మహాసభల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ ముగింపు సభలకు ముఖ్యఅతిథిగా హాజరైన వీరయ్య మాట్లాడుతూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. హైడ్రా, మూసీ పేరుతో రాజకీయాలు చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశానికి కమ్యూనిస్టుల అవసరం పెరిగిందని, ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు బలం తగ్గడం విచారకరమన్నారు. తక్షణమే ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.వెంకటేష్, దశరథ్, రాజన్న, నాగలక్ష్మి, జూబ్లీహిల్స్ జోన్ నాయకులు చంద్రశేఖర్, టి.సాయిశేషగిరిరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక చికిత్సాలయంలో వ్యక్తి అదృశ్యం



నర్సింగరావు(ఫైల్)

రహమత్‌నగర్: ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎస్పీఆర్‌నగర్ బల్కంపేట్ ఆలయం వద్ద వనం నర్సింగరావు (54) మెడికల్ షాపు నిర్వహించేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో మానసికంగా కుంగిపోయి మతిభ్రమించింది. ఈ క్రమంలోనే గత నెల 18న అతన్ని ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. కాగా శనివారం ఉదయం నుంచి నర్సింగరావు కనిపించకపోవడంతో అతని తమ్ముడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఎదుట జేఏసీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

ఖైరతాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 317 కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయారని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు జీవో 317ను సవరణ చేసేందుకు ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ వైఖరి పట్ల జేఏసీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తూ ఆదివారం ఎన్టీఆర్ మార్గ్‌లోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఎదుట జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిటీ ఎనిమిది నెలలు సమీక్షించి పాత జీవోను కొనసాగించేలా మార్పులు చేసిందని, స్థానికత కోసమే తాము పోరాటం చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ పట్ల సానుకూలంగా ఉన్నారని, కానీ కొందరు అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమయం ఇస్తే, తమ గోడును చెప్పుకుంటామని జేఏసీ నాయకులు తెలిపారు.

లండన్ నుంచి వచ్చిన వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్: స్నేహితుడి పెళ్ళి కోసం లండన్ నుంచి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అనంతపురంలోని ఉరవకొండ ప్రాంతానికి చెందిన ఎం.లక్ష్మీరెడ్డి స్థానికంగా ఉన్న తన స్నేహితుని పెళ్ళికి హాజరయ్యేందుకు గతనెల 2వ తేదీన లండన్ నుంచి వచ్చాడు. 17వ తేదీ పెళ్ళి చూసుకుని ఎల్లారెడ్డిగూడలోని కజిన్ బ్రదర్ ఎస్.యువప్రశాంత్ రూంకు వెళ్ళాడు. కొన్ని రోజుల ఉన్న తర్వాత ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్ళి 25వ తేదీ తిరిగి వచ్చాడు. 26వ తేదీ సాయంత్రం దాదాపు 6 గంటల సమయంలో మరోసారి రూం నుంచి వెళ్ళిన లక్ష్మీరెడ్డి తిరిగి రాలేదు. ఎన్నిమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో యువప్రశాంత్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కరీంనగర్‌కు చెందిన కె.సాయితేజ స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జవహర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గతనెల 29 రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లోకి వెళ్ళాడు. ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. అనేక చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం ఎంతో ముఖ్యం

కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ వి.నవీన్‌యాదవ్

వెంగళరావునగర్: పేదలకు ఉచిత విద్య, వైద్యం ఎంతో ముఖ్యమని, అందుకే నెలకొకసారైనా బస్తీలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ వి.నవీన్‌యాదవ్ అన్నారు. వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని మెడిస్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం యూసుఫ్‌గూడ వల్లాల గ్రౌండ్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నవీన్‌యాదవ్ తొలుత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులు సొంతలాభాన్ని కొంత మానుకుని ప్రజల చెంతకు వచ్చి నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. నిరుపేదలు కోరుకునేది ఉచిత విద్య, వైద్యం అని అలాంటి వాటిని వారికి ఇవ్వగలిగితే జన్మధన్యమవుతుందని అన్నారు. వైద్య శిబిరంలో పేదలకు సాధారణ వైద్యం, పిడియాట్రిక్, ఫిజియోథెరపీ, ఆర్థోపెడిక్, వాస్క్యులర్ సర్జన్, మహిళల కోసం గైనక్ పరీక్షలను నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.వెంకట్‌తో పాటుగా హాస్పిటల్స్ జనరల్ మేనేజర్ జాన్ చంద్ర పాకల, డాక్టర్ కిరణ్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రవిశంకర్‌రెడ్డి, డాక్టర్ సంతోష్, డాక్టర్ మాధురి, డాక్టర్ దివ్య, డాక్టర్ భార్గవ్, డాక్టర్ మధు తదితరులు పాల్గొని సేవలు అందించారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు పరీక్షలతో పాటుగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు.



మందులను పంపిణీ చేస్తున్న నవీన్‌యాదవ్

సాయంత్రం వేళ.. సరదాగా..!

నెక్లెస్ రోడ్డుకు క్యూ కట్టిన జనం

ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన వింటర్ ఉత్సవ్ మేళాకు ఆదివారం నగరవాసులు భారీగా క్యూ కట్టారు. బయట, లోపల చల్లని ఆహ్లాకరమైన వాతావరణం ఉండటంతో తమ కుటుంబసమేతంగా ఇక్కడకు ఇచ్చేసి కశ్మీరు అందాలను ఆస్వాదిస్తూ సెల్‌ఫోన్‌లలో ఫొటోలు దిగుతూ సాయంత్రం వేళ సరదాగా గడిపారు. భారీగా తరలివచ్చిన సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు మిర్జా రఫీక్ బేగ్ యూట్యూబ్ ఫేమ్ కిరాక్ ఖాలా టీం ప్రియారెడ్డి, గుల్లు దాదాలతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించారు.





వింటర్ ఉత్సవ్ మేళాలో కశ్మీర్ అందాలను ఆస్వాదిస్తున్న సందర్శకులు

నగరంలో నేడు


- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శనకు అందుబాటులో ఉంటుంది.
- యువకళావాహిని ఆధ్వర్యంలో గానగంధర్వ ఘంటసాల 102వ జయంతి వేడుకలు రవీంద్రభారతిలో సాయంత్రం 5.30 గంటలకు జరుగుతాయి. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన ప్రముఖ గాయనీ మణిశాస్త్రి, చంద్రతేజలకు ఘంటసాల ప్రతిభా పురస్కార ప్రదానం జరుగుతుంది.
- బాచుపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రాంగణం ప్రారంభోత్సవంతోపాటు 39వ వ్యవస్థాపక దినోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డికి 2023 విశిష్ట పురస్కారాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రదానం చేయనున్నారు.
- తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ శ్రీ ఆదిత్య అతేనా ఓనర్స్ సొసైటీతో కలిసి ఆదిత్య క్లబ్ హౌస్‌లో సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌లో మిల్లెట్ పాత్రపై అవగాహన కార్యక్రమం జరుగుతుంది.
- స్వదేశీ హస్తశిల్ప కళా హ్యాండ్‌లూమ్ అండ్ క్రాఫ్ట్స్ మేళా మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

చెకింగ్‌లో చేతివాటం

వాహనాల తనిఖీల్లో జోరుగా అక్రమాలు

- వే బిల్లు లేకున్నా సరుకు తరలింపు.. చేతిరాతతో జరిమానా
- వాణిజ్య పన్నులశాఖలో లెక్కలేని నోటీసులు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



సాక్షి సిటీబ్యూరో: పుణే నుంచి నగరానికి వచ్చిన ఓ టైల్స్ లోడ్ లారీని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీ చేశారు. లారీలో ఉన్న వ్యయానికి, వే బిల్లుకు పొంతన కుదరలేదు. టైల్స్ అసలు ధర రూ.10 లక్షలు కాగా, వే బిల్లులో కేవలం రూ. 2.50 లక్షలని ఉంది. కమర్షియల్ ట్యాక్స్ నిబంధనల ప్రకారం టైల్స్ వ్యయం లెక్కించి 18 శాతం పన్నుతోపాటు వంద శాతం జరిమానా వసూలు చేయాలి. కానీ, ఇదే అదనుగా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేస్తున్న వాహనాలు వందల్లోకాగా, పన్ను మాత్రం పదుల సంఖ్యలో వసూలు అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాల తనిఖీల్లో పన్ను పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఖజానాకు చేరడం లేదు. నిబంధనల ప్రకారం ఏదైనా సరుకు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వాహనంలో తరలించేటప్పుడు వే బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. సరుకు విలువ రూ.50 వేల లోపు ఉంటే జీఎస్‌టీ నిబంధనల ప్రకారం వే బిల్లు అవసరం లేదు. రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటే తప్పక వే బిల్లులు తీసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ వే బిల్లును కూడా ఆ శాఖ వెబ్‌సైట్ ద్వారా తీసుకోవచ్చు. రెండు రాష్ట్రాల పరిధి దాటినా పక్షం రోజుల వరకు వే బిల్లు గడువు ఉంటుంది. దీనిని ఆసరా చేసుకొని ఒకే వే బిల్లుపై రెండు నుంచి మూడు ట్రిప్పుల సరుకును రవాణా చేస్తున్నారు. వాహనం తనిఖీ చేసిన తర్వాత సరుకు విలువ వే బిల్లు కంటే ఎక్కువగా ఉంటే పన్ను వసూలుకు, జరిమానా విధించేందుకు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చేతిరాతతో నోటీసులు ఇస్తున్నారు. మరోవైపు ఈ నోటీసులకు సంబంధించిన వివరాలు ఆ శాఖ కార్యాలయం రికార్డుల్లో నమోదు కావడం లేదు. సంబంధిత సరుకు రవాణా చేసిన వ్యక్తులతో బేరాలు కదిరిన తర్వాత ఆ చేతిరాత నోటీసులను చింపేస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

అక్రమాలు ఇలా..

జాయింట్ కమిషనర్ కార్యాలయం ద్వారా తమ తమ పరిధిలో వాహనాల తనిఖీకి నలుగురు సభ్యులతో బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. తనిఖీల్లో కేవలం ఇద్దరు లేదా ముగ్గురు పాల్గొంటున్నారు. వాహనాలను ఆపడానికి, తనిఖీ కోసం అధికారులు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుంటున్నారు. డ్రైవర్, ట్రాన్స్‌పోర్టు నిర్వాహకుడు, సరుకు యజమానితో ఆ ప్రైవేట్ వ్యక్తులే మాట్లాడుతున్నారు. వీరే ముడుపులు వసూలు చేస్తున్నారు. పైగా వీరు జారీ చేస్తున్న నోటీసుల విషయం కమిషనర్ కార్యాలయంలో నమోదు కావడంలేదు. నోటీసుల లెక్క లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.

పన్ను పూర్తిగా ఖజానాకు చేరాలంటే..

అధికారులు తనిఖీల సమయంలో అండర్ వే బిల్లుతో సరుకులు తరలిస్తున్న వాహనాలకు అందించే నోటీసులు కంప్యూటరైజ్డ్‌గా ఉండాలి. జారీ అవుతున్న నోటీసుల వివరాలు వాటి క్రమసంఖ్య ప్రకారం కేంద్ర కార్యాలయంలో నమోదు కావాలి. తనిఖీ సిబ్బంది జారీ చేస్తున్న నోటీసులను కంప్యూటరైజ్డ్ చేయకపోవడంతో వాటి వివరాలు ఏ కార్యాలయంలోనూ అందుబాటులో లేవు. పన్నుల వసూళ్ల కోసం రూపొందించిన యాప్‌ల మాదిరిగానే వే బిల్లు తనిఖీల కోసం కూడా యాప్ రూపొందించాలి.

ప్రజాసంబంధాల నిర్వహణ సంక్లిష్టం



సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల వెల్లువ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజాసంబంధాల నిర్వహణ ఎంతో సంక్లిష్టంగా, చాలెంజ్‌గా మారిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బూట్ క్యాంప్‌లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు చెందిన ప్రజాసంబంధాల అధికారులు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేసేవారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహీంద్ర వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ శశి నంజుండయ్య, వ్యాక్సన్ వర్సిటీ ప్రొఫెసర్ జోష్ డాల్రింపుల్, ఎన్ఎండీసీ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్ జయప్రకాశ్ తదితరులు మాట్లాడారు. అల్గారిథం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కమ్యూనికేషన్స్ వ్యవస్థ బలపడుతున్న ప్రస్తుత రోజుల్లో ప్రజాసంబంధాల నిర్వహణ ఎంతో కీలకమైన కర్తవ్యంగా మారిందన్నారు. సత్యం, నైతికత విలువలను ప్రామాణికంగా చేసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ కింగ్‌స్టన్, ఆనందిత ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై పోలీస్ కిష్టయ్య విగ్రహం ప్రతిష్ఠించాలి

- ముదిరాజ్ సంఘాల నాయకుల డిమాండ్



గన్‌పార్కు ఎదుట నివాళులర్పిస్తున్న బండా ప్రకాష్, చిత్రంలో ఈటల రాజేందర్, ప్రొఫెసర్ కోదండరాం

నాంపల్లి: తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడంతోపాటు జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభల సంయుక్తాధ్వర్యంలో వుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో 15 అవార్డులు పొందిన కిష్టయ్య రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో అమరుల కుటుంబాలకు న్యాయం జరిగేవిధంగా అండగా ఉంటామని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఆంధ్ర పాలకుల హయాంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను అడ్డుపడాలనే ఆశయంతో బలిదానం చేసుకున్న కిష్టయ్య వంటి అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఏదైనా యూనివర్సిటీకి కిష్టయ్య పేరు పెట్టాలని కోరారు. తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బిత్తిరి సత్తి(రవి) ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌కు పితృవియోగం



మక్బూద్ హుస్సేన్

గోల్కొండ: నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ తండ్రి మహ్మద్ మక్బూద్ హుస్సేన్ శనివారంరాత్రి అహ్మద్‌నగర్‌లోని తన స్వగృహంలో మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఉమ్మడి తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ సెలక్షన్ కమిటీలో కూడా విధులు నిర్వహించారు. ఆయనకు మాజిద్ హుస్సేన్, మహ్మద్ షాకీర్ హుస్సేన్ సంతానం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన షాకీర్ హుస్సేన్ అమెరికాలో ఉంటున్నారు. అంత్యక్రియలు ఆదివారంరాత్రి అహ్మద్ నగర్ ఫస్ట్ లాన్సర్‌లోని ముస్లిం శ్మశానవాటిలో జరిగాయి. పలువురు మజ్లిస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఆదివారం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను పరామర్శించారు.

టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఎన్నికలు

గౌలిపురా: రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నికల అధికారి మాధవి పాటిల్, టగ్ ఆఫ్ వార్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ మదన్‌మోహన్, ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ పవన్‌ల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదర్శ మహేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు, యువతీ, యువకులను సమీకరించి వారిలో క్రీడాస్ఫూర్తిని నింపి క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించడానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎం.బ్రహ్మనందం, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గౌలీకర్ ధీరజ్ లాల్, పి.ఇమ్మానియెల్, దొంకి యాదగిరి, కొడి సురేందర్, కె.మురళీధర్ రావు, కె.దేవేందర్, బి.సాయి కుమార్, భానుప్రకాశ్, ఎ.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎల్ఐసీ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: భావితరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని నినదిస్తూ ఎల్ఐసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ ర్యాలీని ప్రారంభించారు. ఇందిరాపార్క్ సికింద్రాబాద్ డివిజనల్ ఆఫీస్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ చిక్కడపల్లి వరకూ కొనసాగి డివిజనల్ కార్యాలయం దగ్గర ముగిసింది. ఈ ర్యాలీలో నగరంలోని ఎల్ఐసీ ఉద్యోగులు, డీవోలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునీత్‌కుమార్ మాట్లాడుతూ సైక్లింగ్ పర్యావరణ పరిరక్షణతోపాటు ఆరోగ్యానికి కూడా దోహదం చేస్తుందన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

- ప్రారంభించిన మంత్రి పొంగులేటి



చందానగర్: మియాపూర్‌లోని యలమంచిలి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శిగా సేవలందిస్తూ ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వేసవికాలంలో చలివేంద్రాలు, మజ్జిగ సెంటర్లు, విద్యార్థులకు నోటుపుస్తకాలు ఉచితంగా అందిస్తూ ఇప్పుడు ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం గొప్ప పరిణామమన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, బండి రమేష్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ, వీరమల్ల వీరేందర్ గౌడ్, యాదగిరి గౌడ్, సాంబశివ రావు, పద్మిని, ప్రియదర్శిని, రమేష్, దొర్నాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు ఎస్.కె.మిశ్రోకు చాట్ల శ్రీరాములు అవార్డు



ఎస్.కె.మిశ్రో

నాంపల్లి: ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు ఎస్.కె.మిశ్రో(80) కీర్తిశేషులు చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారం-2024కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీ గాయత్రీ సదనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవార్డు ఎంపిక కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ పురస్కారాన్ని రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అందజేస్తారు. ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య అధ్యక్షతన జరిగే చాట్ల శ్రీరాములు 93వ జయంతి వేడుకల్లో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి చేతుల మీదుగా అవార్డు అందజేస్తారు. రంగస్థల, టెలివిజన్, చలన చిత్ర రంగాల్లో విశేషమైన సేవలందించిన ప్రముఖులను గుర్తించి 1999వ సంవత్సరం నుంచి చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పలు విమానాలు రద్దు

శంషాబాద్: తుపాను ప్రభావంతో శంషాబాద్ విమానాశ్రయం నుంచి చెన్నై, తిరుపతికి వెళ్లే పలు విమానాలు ఆదివారం కూడా రద్దయ్యాయి. చెన్నై నుంచి హైదరాబాద్ రావాల్సిన రెండు విమానాలు రద్దుకాగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి చెన్నై, తిరుపతి వెళ్లాల్సిన ఒక్కో విమానం రద్దయింది.

బాలమల్లేష్ నిబద్ధత ఉన్న ప్రజానాయకుడు



బాలమల్లేష్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కూనంనేని సాంబశివరావు తదితరులు

కాచిగూడ: నమ్మిన సిద్ధాంతం కోసం బాలమల్లేష్ తుదిశ్వాస వరకు పోరాడిన గొప్ప వ్యక్తి అని, నిబద్ధత కలిగిన ప్రజానాయకుడని పలువురు వామపక్ష, రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు, మేధావులు కొనియాడారు. బలహీన వర్గాల గొంతుకగా, వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాల్లో కీలకభూమిక పోషించారని అన్నారు. వామపక్ష భావజాలం పట్ల ఆకర్షితులై విద్యార్థి సంఘం నాయకుడి స్థాయి నుంచి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయి వరకు ఎదిగారని పేర్కొన్నారు. వామపక్ష, ప్రజా ఉద్యమాలకు ఆయన లేని లోటు తీరనిదని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం బాలమల్లేష్ భౌతికకాయాన్ని ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ఆవరణలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయానికి పలువురు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం, బీఆర్ఎస్ నేతలు బోయినపల్లి వినోద్, వి.శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ చెరకు సుధాకర్, పల్లె రవి, సీపీఐ(ఎం) నేతలు ఎస్.వీరయ్య, డీజీ నర్సింహారావు, టి.సాగర్, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసి) నేతలు భాస్కర్, మహేష్ కుమార్, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ తదితరులు హాజరై నివాళులర్పించారు. బాలమల్లేష్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కార్పొరేట్ల కోసమే బ్యాంకుల ప్రైవేటీకరణ

- అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి రాంబాబు



ఇండియన్ బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సులో మాట్లాడుతున్న రాంబాబు

కాచిగూడ: 'అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దోపిడీదారుల కోసమే మోదీ ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరిస్తోంది'అని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు ఆరోపించారు. ఇండియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ అండ్ తెలంగాణ) ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్‌లో అసోసియేషన్ మహిళా విభాగం కన్వీనర్ జి.పద్మ అధ్యక్షతన బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ దేశ పురోగతికి ప్రభుత్వ రంగ బ్యాంకులే ఊతమిస్తాయని అన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులను బలోపేతం చేయడానికి బదులుగా ప్రైవేటీకరిస్తే సామాన్యుల పొదుపు దోపిడీకి గురవడంతోపాటు బ్యాంకు ఉద్యోగుల భద్రతకు పెనుముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణ చేపట్టినప్పుడు జనసంఘ్, ఆర్ఎస్ఎస్‌లు తీవ్రంగా వ్యతిరేకించాయని, ఇప్పుడు వాటి విధానాలనే బీజేపీ అనుసరిస్తూ బ్యాంకులను ప్రైవేటీకరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి.రాజేశ్వరరెడ్డి, డాక్టర్ మౌనిక బోపన్న, అజిత కాట్రగడ్డ, బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు కె.రాధాకృష్ణ, ఎంఎస్ కుమార్, పివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దానగుణ సంపన్నుడు ఆరిగపూడి విజయకుమార్



విజయకుమార్‌కు నివాళులర్పిస్తున్న జనార్దన మూర్తి, వంశీ రామరాజు, రఘురాం తదితరులు

చిక్కడపల్లి: ఆరిగపూడి విజయకుమార్ నిస్వార్థం, దానగుణం కల్గిన వ్యక్తి అని సాహితీవేత్తలు, గాయకులు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన విజయకుమార్‌కు సంతాపం ప్రకటిస్తూ ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్ధనమూర్తి అధ్యక్షత సభ జరిగింది. కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ గాన సభ ఆడిటోరియం లోపల దివంగత సాహిత్య, సాంస్కృతిక, సంగీత, నృత్య, రాజకీయ ప్రముఖులు, దేశ నాయకుల నిలువెత్తు తైలవర్ణ చిత్రాలను విజయకుమార్ లక్షల వ్యయంతో ఏర్పాటు చేయించారని కొనియాడారు. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, కిన్నెర ఆర్ట్స్ అధినేత మద్దాలి రఘురాం, గాయకులు వైఎస్ రామకృష్ణ , త్రినాథరావు, వసుంధర, నటులు రోసిరెడ్డి. జంగయ్యగౌడ్, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు లోకం కృష్ణయ్య, ఓంకార్ రాజు, వంశీకృష్ణ, కిరణ్, బండి శ్రీనివాస్ తదితరులు విజయకుమార్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

కాలానుగుణంగా విద్యాబోధన అవసరం



సమన్వయ-2024 జాతీయ సదస్సులో పాల్గొన్న యునెస్కో ప్రోగ్రామ్ ఆఫీసర్, పలు సీబీఎస్ఈ స్కూళ్ల ప్రిన్సిపాల్స్

- యునెస్కో ప్రోగ్రామ్ ఆఫీసర్ సరితా జాదవ్

సాక్షి, సిటీబ్యూరో: కాలానుగుణంగా అత్యాధునిక విద్యావిధానాలతో పాఠశాలలను ఎలా సిద్ధం చేయాలనే అంశంపై నిర్వాహకులు దృష్టి సారించాలని యునెస్కోకు చెందిన నేషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సరితా జాదవ్ సూచించారు. 'హైదరాబాద్ సహోదయ స్కూల్స్ కాంప్లెక్స్ (హెచ్ఎస్ఎస్‌సీ) ఆధ్వర్యంలో 'సమన్వయ 2024 పేరుతో జాతీయ సదస్సును బంజారాహిల్స్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 281 సీబీఎస్ఈ స్కూళ్లకు చెందిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో సరికొత్త విద్యావిధానాలు, మారుతున్న పరిస్థితులు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సరితా జాదవ్ మాట్లాడుతూ గ్లోబల్ ఎడ్యుకేషన్ విధానానికి అనుగుణంగా విద్యాబోధనను మార్చుకోవాలన్నారు. స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ముంబై ఐఐటీ ప్రొఫెసర్ అజంతా సేన్, ఐఐఎం అహ్మదాబాద్ ప్రొఫెసర్ కాథన్ దుష్యంత్ శుక్లా, హెచ్ఎస్ఎస్‌సీ చైర్మన్ అమీర్ ఖాన్, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎబెనీజర్, సెక్రెటరీ రోజా పాల్, డా.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు నిరసన



నిరసన ప్రదర్శనలో ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజు, వడ్లమూరి కృష్ణ స్వరూప్ తదితరులు

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రీమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమైనదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజు, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా ఆదివారం నారాయణగూడలో మాలలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మాలల ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికి మాల ఎమ్మెల్యేల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ, క్రీమిలేయర్ అమలు చేయడం ద్వారా మాలలను అణచివేయడానికి రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు పూనుకున్నాయని ఆరోపించారు. ఇప్పుడు వర్గీకరణతో మాలల భవిష్యత్‌ను దెబ్బతీయడానికి మనువాద పాలకులు చేస్తున్న చర్యలు, కుట్రలపైన పెద్ద ఎత్తున పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు సీహెచ్ రోజాలీలా, ఆర్ల రమేష్, నక్కా దేవేందర్ రావు, ఎస్.పద్మ, భూపల్లి హేమలత తదితరులు పాల్గొన్నారు.

మాలల 'సింహగర్జన' విజయవంతం

రసూల్‌పురా: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మాలల సింహగర్జన సభ విజయవంతమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది మాలలు తరలివచ్చారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, కేంద్ర మాజీమంత్రి జి.వెంకటస్వామి చిత్రపటాలకు పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కుల వివక్ష కారణంగా అంబేద్కర్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని చెప్పారు. రిజర్వేషన్లు రద్దు చేసేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వెంకటస్వామి మాల, మాదిగ చూడకుండా 70 వేల మందికి గుడిసెలు వేయించారని, 40 వేల మందికి ఉద్యోగాలు కల్పించారని, తాను కూడా వెంకటస్వామి బాటలో నడుస్తున్నానని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మాలలను చిన్నచూపు చూస్తున్నారని, వారికి ఈ సభకు హాజరైన మాలలే సరైన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ సమాజంలో కులవ్యవస్థ వెంటాడుతోందని, రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలోనే కాకుండా ప్రైవేటు సెక్టార్‌లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ మాల సోదరులకు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ రాష్ట్రీయ ఎక్తా మోర్చా నాయకులు భావసనాయి పాశ్వాన్, పెద్దపల్లి ఎంపీ వంశీ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హైదరాబాద్ ఇన్‌చార్జి రాజు ఉస్తాద్, మహాసేన నాయకుడు రాజేష్, దిగంబర్ కాంబ్లే, రెంజర్ల రాజేష్ వివిధ జిల్లాల వచ్చిన మాలలు పాల్గొన్నారు.

సినిమా.. సినిమా.. అంటూ జీవితాన్ని సైతం అంకితం చేసి ఈ రంగంలో రాణించడానికి, వెండి తెరపైన తమకంటూ ప్రత్యేకంగా ఓ పేజీ రాసుకోవాలని తపించే, పరితపించే సినిమా ప్రేమికులెందరో. విభిన్న కళల సమాహారం సినిమా. కథకుడు, దర్శకుడితో మొదలై.. నటీనటులు, ప్లేబ్యాక్ సింగర్స్, మ్యూజిక్, కొరియోగ్రఫీ, ఆర్ట్, వీఎఫ్ఎక్స్, డబ్బింగ్.. ఇలా విభిన్న కళాకారుల సమిష్టి కృషి సినిమా. ఈ వేదికపై తమ పేరును చూసుకోవాలన్నా, వారి చిరకాల ఆకాంక్షను నెరవేర్చుకోవాలన్నా ఎక్కడో సాయం అందాలి. ఇప్పుడిప్పుడే సినీ రంగం వైపు అడుగులేస్తున్న ఔత్సాహికుల కళాత్మకతను, సృజనాత్మకతను గుర్తించే వారుండాలి..?! సినిమానే లక్ష్యంగా లఘుచిత్రాలు రూపొందిస్తూ, బిగ్ స్క్రీన్ కోసం ప్రయత్నిస్తున్న సినీపిపాసులను ఆదరించే ప్రోత్సాహం అవసరం.. ఇలాంటి వారందరినీ సగర్వంగా ప్రపంచానికి పరిచయం చేస్తోంది 'సినివారం'. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరం నడిబొడ్డున కొలువుదీరిన రవీంద్రభారతి వేదికగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న 'సినివారం' ఈ తరం సినీ ప్రేమికులకు స్వర్గధామం. ఉత్తమ షార్ట్ ఫిలింస్ నిర్మించే వారిని గుర్తించి వారి ప్రయాణానికి రెడ్ కార్పెట్ వేస్తోంది రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ 'సినివారం'. - సాక్షి, సిటీబ్యూరో



- ప్రతి వారం లఘు చిత్రాల ప్రదర్శన, ప్రోత్సాహం
- వెండితెరకు ఆర్టిస్టులను పరిచయం చేస్తూ
- నగరంలోని రవీంద్రభారతి వేదికగా ఆవిష్కృతం
- చిన్న సినిమాలకు గుర్తింపునిచ్చే అద్భుత వేదిక
- ఎనిమిది ఏళ్లుగా కళారంగానికి సేవలందిస్తూ..



వినీలాకాశంలాంటి సినీ ప్రపంచంలోకి అడుగులేసిన యువతరానికి గుర్తింపునివ్వాలనే లక్ష్యంతో 2016 నవంబర్ నెలలో పురుడుపోసుకుంది 'సినీవారం'. సృజనాత్మకత ఉండి, సినిమాపై ప్రేమతో మొదటి ప్రయత్నంగా లఘు చిత్రాలు రూపొందిస్తున్న తెలంగాణ యువత ఎందరో. వారందరికీ ఒక అవకాశంతో పాటు, సినిమా రంగానికి వారి సృజనాత్మకతను తెలియజేసేది ఆ షార్ట్‌ఫిల్మ్ మాత్రమే. అనంతరం దానిపై సినీ రంగ ప్రముఖులతో చర్చిస్తుంది ఈ సినీవారం. ఇందులో భాగంగా ఈ ఎనిమిదేళ్లలో కొన్ని వందల లఘు చిత్రాలు ఈ తెరపై ప్రదర్శితమయ్యాయి. వీటిని రూపొందించిన సినీ ప్రేమికులకు నేరుగా అవకాశాలు లభించాయి. నూతన తెలంగాణలో సినీ ప్రేమికులకు ఇదొక అవకాశాల పుష్పక విమానం.

సినివారం..

లఘు చిత్రాల సమాహారం..

నైపుణ్యాలను గుర్తించి.. లోపాలను సవరిస్తూ..

తెలంగాణకు సినిమా కొత్త కాదు. ఆ రోజుల్లోనే బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకున్న మొదటి తరం సినీ రంగ ప్రముఖులు.. పైడి జయరాజ్. ఆయన గౌరవార్థం రవీంద్రభారతిలోని థియేటర్‌కు పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ అని నామకరణం చేశారు. ఈ థియేటర్‌లోనే ఈ తరం యువకులు తీసిన లఘు చిత్రాలను క్రమం తప్పకుండా ప్రతి శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 9 గంటల వరకూ ప్రదర్శిస్తున్నారు. కరీంనగర్, మహబూబ్ నగర్, ఖమ్మం, ఆదిలాబాద్, హైదరాబాద్.. ఇలా తెలంగాణలోని విభిన్న ప్రాంతాల్లో యువతరం తీసిన షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలను ఈ వేదికపై ప్రదర్శించి వారికి ఒక గుర్తింపునిస్తోంది రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ. ఈ ప్రయత్నంలో వారి నైపుణ్యాలను, లోపాలను ఇదే వేదికపై తెలియజేసేలా ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన నిర్మాతలు, సినీ ప్రముఖులు, నిపుణులు, ప్రముఖ సినీ విమర్శకులతో చర్చా గోష్టిని నిర్వహిస్తున్నారు. అనంతరం వారికి సినిమా అవకాశాలు లభించేలా ఒక దారిని చూపిస్తోంది.



మహామహులంతా ఇక్కడి నుంచే..

పెళ్లి చూపులు, ఈ నగరానికి ఏమైంది వంటి హిట్ చిత్రాలతో ఫేమస్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన తరుణ్ భాస్కర్, మెయిల్ సినిమాతో చిన్న సినిమాకు పెద్ద గుర్తింపు తీసుకొచ్చిన ఉదయ్ గుర్రాల, దొరసాని ఫేం కేవీఆర్ మహేంద్ర వంటి ఈ తరం సినీ దిగ్గజాలు తమ మొదటి సినీ ప్రయత్నాలను ఈ సినీవారం వేదికగానే ప్రదర్శించారు. ఇలా దర్శకులు, నటులు, సినీ రచయితలతో పాటు సిని పరిశ్రమకు అవసరమయ్యే విలువైన ముడిసరుకు కొంతమేర ఈ సినీవారం వేదికగా సమకూరుతోంది. ఇక్కడ ప్రదర్శించే లఘుచిత్రాలు ప్రధానంగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, తెలంగాణ పోరాటాలు, యధార్థగాథలతో పాటు నేటి మోడ్రన్ కమర్షియల్ సినిమాల నాణ్యతను పరిచయం చేస్తున్నాయి.

క్రియేటివిటీకి కేరాఫ్ అడ్రస్...



పదేళ్ల కృషికి నిదర్శనం ఇది.. ప్రస్తుత సినిమాల్లో తెలంగాణ నేపథ్యమున్న కళాకారులు, కథలు, సినిమాలు, టెక్నీషియన్‌లు వారి విజయాలు..!! ఈ లక్ష్యం నిర్దేశించుకునే 2016లో 'సినివారం'ను ప్రారంభించాం. గతంలో ముంబైలోని బాలీవుడ్ కమర్షియల్ సినిమాలకు కేంద్రం. కానీ అక్కడి మరాఠీ సినిమాలు కూడా వాటి ప్రత్యేకతను, ప్రాధాన్యతను, ప్రశస్తిని కొనసాగించాయి. అలాగే హైదరాబాద్‌లోనూ తెలుగు సినిమా సైతం తన వైవిధ్యాన్ని, విశిష్టతను ప్రదర్శించాలనే లక్ష్యంతో ఈ వినూత్న ప్రయత్నానికి నాంది పలికాం. ఇందులో భాగంగా కళ, నైపుణ్యాలు, సృజనాత్మకత ఉండి, అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న యువతకు అద్భుత వేదికను నిర్మించాం. ఈ సినివారం వేదికగా ఇప్పటి వరకూ దాదాపు 27 మంది ఈ తరం దర్శకులు పరిచయమయ్యారు. అంతేకాకుండా 24 క్రాఫ్ట్స్‌కు చెందిన నిపుణులు గుర్తింపును, అవకాశాలను పొందారు. ఇలాంటి ఔత్సాహికుల కోసం ఇక్కడ వారి షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనతో పాటు వర్క్‌షాప్‌లు, శిక్షణా తరగతులు, అవగాహనా సదస్సులు, ఇంటరాక్టివ్ సెషన్స్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఒక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ అందించే సేవలన్నీ ఇక్కడ అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఇటీవలే సినిమాల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ప్రాధాన్యత పైన వర్క్‌షాప్ నిర్వహించాం. సినిమా రంగంలోని అధునాతన మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. భవిష్యత్‌లోనూ ఈ తరం సినిమా ప్రేమికులకు మరిన్ని అవకాశాలను భాషా సాంస్కృతిక శాఖ అందిస్తుంది.

– మామిడి హరికృష్ణ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు



వైవిధ్యానికే బిగ్ ఇంపాక్ట్

▶ ఆహ్వానం రిసార్ట్స్‌లో అవార్డుల ప్రదానం

సాక్షి, సిటీ బ్యూరో, మణికొండ: పలు రంగాల్లో వైవిధ్యతను, సానుకూల ప్రభావాన్నీ చూపుతున్న వారిని గౌరవిస్తూ అవార్డులు ప్రదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని బిగ్ ఎఫ్ఎం సీఈఓ సునీల్ కుమారన్ అన్నారు. నగర శివారు గండిపేట సమీపంలోని ఆహ్వానం రిసార్ట్స్‌లో బిగ్ ఎఫ్ఎం తొలి ఎడిషన్ బిగ్ ఇంపాక్ట్ అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. దూరదృష్టిగల పారిశ్రామిక వేత్తలు, వివిద రంగాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్న వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఘన చరిత్ర, సంస్కృతికి పేరుగాంచిన హైదరాబాద్ కొత్త ఆలోచనలకు, వ్యాపారాలకు కేంద్రంగా మారుతోందన్నారు. ఆహారం, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, ఆరోగ్యం, విద్య, జీవనశైలి వంటి రంగాల్లో వైవిధ్యం చూపుతున్న వ్యక్తులకు బిగ్ ఇంపాక్ట్ అవార్డులను అందించామన్నారు. తదుపడి ఎడిషన్లు చండీగఢ్, పాట్నా లాంటి నగరాల్లో నిర్వహిస్తామన్నారు. పీఎంజే జ్యూవెల్స్, డైమండ్స్, గోల్డ్, ఏ2ఏ హోమ్‌లాండ్ వారు స్పాన్సర్ చేసిన ఈ కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్ అమీషా పటేల్, నటుడు సుధీర్‌బాబు పాల్గొన్నారు.

సుభాన్ బేకరీకి 'బిగ్' పురస్కారం..

నగర చరిత్రలో మమేకమైన సుభాన్ బేకరీకి బిగ్ ఇంపాక్ట్ పురస్కారం లభించింది. బాలీవుడ్‌తో పాటు తెలుగులో బద్రి తదితర సినిమాల్లో నటించిన నటి అమీషా పటేల్ ఈ పురస్కారాన్ని బేకరీ అధినేత ఇర్ఫాన్ సయ్యద్‌కు అందజేశారు. హైదరాబాద్ నగరానికి ప్రాచుర్యం పొందిన ఉస్మానియా బిస్కెట్ ను పరిచయం చేసిన సుభాన్ బేకరీ ఎందరికో స్ఫూర్తి అని ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు.



నేటి నుంచి.. కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్



సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్‌లో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ (సీబీపీ) నిర్వహిస్తున్నట్లు నగరానికి చెందిన కోనేరు లక్ష్మయ్య (కేఎల్‌హెచ్)గ్లోబల్ బిజినెస్ స్కూల్ తాజాగా ప్రకటించింది. ఈ ప్రోగ్రామ్ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని, ఈ నెల 14తో ముగుస్తుందని తెలియజేసింది. విద్యారంగంలో అడ్వాన్స్‌డ్ డిజిటల్ మార్కెటింగ్ విద్యకు సంబంధించిన అవసరం కీలకంగా మారిన నేపథ్యంలో యుజీసీ గుర్తింపు పొందిన వర్సిటీలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలకు చెందిన ఉపాధ్యాయుల కోసం ఈ ప్రోగ్రామ్ ప్రత్యేకంగా రూపొందిందని, దీనిని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) స్పాన్సర్ చేస్తోందని వివరించింది.

స్టార్స్.. ర్యాంప్

ఫ్యాషన్ వీక్‌లో మెరిసిన.. రెజీనా.. ఈషారెబ్బా..





సాక్షి, సిటీబ్యూరో: అందాల తారల ర్యాంప్ వాక్‌తో హెచ్‌టీ ఫ్యాషన్ వీక్ అదరహో అనిపించింది. హోటల్ పార్క్ హయత్‌లో ఆదిత్య లగ్జరీ వింటేజ్ సమర్పించిన ఈ షోలో వెరైటీ థీమ్స్‌తో తీర్చిదిద్దిన డిజైనర్ దుస్తులను మోడల్స్ ర్యాంపు పై ప్రదర్శించారు. ఎస్ఐఎఫ్ గ్లోబల్ స్టూడెంట్స్, స్టార్ లైఫ్ షఫీక్ రెహ్మాన్, సాహిల్ కచ్చర్ తదితర ప్రముఖ డిజైనర్స్‌కు చెందిన డిజైన్ కలెక్షన్స్ వీటిలో ఉన్నాయి. ప్రముఖ సినీతారలు రెజినా కాసాండ్రా, ఈషా రెబ్బలతో పాటు బాలీవుడ్ నటి దియా మీర్జా షో స్టాపర్స్ గా మెరిచారు. దాదాపు 16 మంది డిజైనర్లు రూపొందించిన సరికొత్త డిజైన్లను ఈ రెండు రోజుల షో ప్రదర్శించింది. నగరంతో పాటు ముంబై, ఢిల్లీ ప్రాంతాలకు చెందిన మోడల్స్ పాల్గొన్నారు.

మహిళా టెక్నీషియన్లు ముందుకు రావాలి

'సాక్షి'తో అమల అక్కినేని ప్రత్యేక ఇంటర్వ్యూ

తెరమీద పోషించిన పాత్రల సంగతి అటుంచితే, 'నిత్య జీవితంలో తాను పోషించిన ప్రతి పాత్రా తనకు పూర్తి సంతృప్తిని అందించింది' అని చెబుతున్నారు సీనియర్ నటి, అగ్రనటుడు అక్కినేని నాగార్జున భార్య అమల అక్కినేని. తమ ఇంట పెళ్లి బాజాలు మోగుతున్న నేపథ్యంలో.. 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

- సాక్షి, సిటీబ్యూరో



ప్రతి పాత్రా సంతృప్తికరం

సాక్షి: పిల్లల విజయాలా? విద్యార్థుల విజయాలా? ఏవి ఎక్కువ?

అమల : సినిమా రంగంలో నా పిల్లల విజయాలు సంతోషాన్ని అందిస్తాయనేది నిజమే, కానీ నిజం చెప్పాలంటే.. నా విద్యార్థుల విజయాలు అంతకన్నా ఒకింత ఎక్కువ ఆనందాన్నే పంచుతాయి.. పంచుతున్నాయి.

సాక్షి: ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ)లో బాగా కనిపించారు..

అమల : ఈ సారి అక్కినేని నాగేశ్వరరావు గారితో పాటు ఐదుగురు లెజెండరీ సెంచురీ ఇయర్‌ను ఇఫీ నిర్వహించింది. అదే కాకుండా ప్రారంభ కార్యక్రమం నుంచి ఇఫీ బాగా నచ్చింది. బొమన్ ఇరానీ లెజెండ్స్ గురించి ఎంతో బాగా చెప్పారు. క్లాసిక్స్ నుంచి న్యూ టాలెంట్స్ దాకా, అలాగే ప్రపంచ సినిమాని, ఇండియన్ సినిమాని ఒకే చోట చేర్చడం అద్భుతం. ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరం. మనం అంతా మన చిన్న ప్రపంచంలో బిజీగా ఉంటాం. ఇలాంటివి జరిగితేనే ఎన్నో మననం చేసుకోగలుగుతాం.. మరెన్నో తెలుసుకోగలుగుతాం..

సాక్షి: మీ 'అన్నపూర్ణ' స్టూడెంట్స్‌కి కూడా ఇఫీలో చోటు దక్కింది..

అమల : ఎస్.. గతంలో ఎన్నో చోట్ల మా విద్యార్థుల చిత్రాలను ప్రదర్శించారు. కానీ ఇఫీలో మా అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాకి అవకాశం రావడం తొలిసారి. సంస్థ డైరెక్టర్‌గా ఇది నాకు చాలా సంతోషాన్ని అందిస్తోంది.

సాక్షి: సీనియర్ నటిగా సినిమా రంగంలోకి వచ్చే యువతులకు ఏం చెబుతారు?

అమల : ఇప్పుడు కొందరు నిర్మాతలు మంచి పాత్రల్ని మహిళలకు ఇస్తున్నారు. అయినా మహిళలంటే కెమెరా ముందు కేవలం నటిగా మాత్రమే కాదు టెక్నీషియన్స్ కావచ్చు, ఫిల్మ్ మేకర్స్‌గా కూడా కావచ్చు. సినిమా పరిశ్రమలోకి ఎటువంటి జంకూ లేకుండా రమ్మంటూ అమ్మాయిలకు నేను ధైర్యాన్ని ఇస్తున్నాను.

సాక్షి: నిత్య జీవితంలో మీరు పోషించిన పాత్రలు ఎలా అనిపించాయి..

అమల : నేను పోషించిన ప్రతి పాత్రా నన్ను ఇంత దూరం తీసుకొచ్చాయి. ఇంట్లో భార్యగా, కోడలిగా, తల్లిగా.. ఇవన్నీ నాకు ప్రత్యేకమైన పాత్రలు. అద్భుతమైన ప్రయాణాన్ని అందించాయి. అలాగే గడపదాటితే.. బ్లూ క్రాస్ ద్వారా జంతు సంరక్షణ.. మరో వైపు భవిష్యత్తు సినిమా రంగం కోసం యువతను తీర్చిదిద్దడం.. అన్నీ మధురమైనవి మాత్రమే కాక నేనేంటో నాకు చూపించాయి.

సాక్షి: కొత్త కోడలికి ఏవైనా సలహా లాంటివి..

అమల : ఆమె చాలా టాలెంటెడ్. చాలా మెచ్యూర్డ్ మహిళ. ఆ అమ్మాయికి నేను సలహా అంటూ ప్రత్యేకంగా ఏమీ ఇవ్వనక్కర్లేదు. ఆమె తప్పకుండా ఒక మంచి భార్యగా మంచి జీవితాన్ని ఆస్వాదించాలని నా కోరిక. మీ పాఠకులు కూడా కొత్త జంట భవిష్యత్తు బాగుండాలని ఆశీస్సులు ఇవ్వాలని కోరుతున్నా.

క్లుప్తంగా...

చిత్రహింసలు పెట్టి చంపేశారు

- ములుగు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల నేతల ఆరోపణ



ఎన్‌కౌంటర్ మృతుల ఫొటోలను ప్రదర్శిస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ములుగు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 12 నెలల కాలంలో 16 మంది ఎన్‌కౌంటర్ పేరుతో చనిపోయారని తెలిపారు. ములుగులో మావోయిస్టుల శవాలు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు లేవని, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపినట్లు ఉన్నాయని ఆరోపించారు. మావోయిస్టుల మృతదేహాలకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శవ పరీక్షలు చేసి, ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేయా లని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజ కీయ ఖైదీల విడుదల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్లా రవీంద్రనాథ్, పీడీఎస్ నేత చంద్రమౌళి పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఒక గిరిజను డిని మావోయిస్టులు హతమార్చిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధి దలేర్‌కు చెందిన కుమ్మేశ్ కుంజమ్‌ను రెండు రోజుల క్రితం మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. అతని గొంతుకోసి హతమార్చి మృత దేహాన్ని చితక్‌టిండోడీ సమీపంలోని ప్రధాన రహదారిపై పడవేశారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందువల్లే హతమార్చామంటూ మావోయిస్టు పార్టీ బైరంఘడ్ ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖ వదిలారు.

పోలీస్ కిష్టయ్యకు కవిత నివాళి

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరుల కుటుంబాలను బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అన్ని విధాలుగా ఆదు కున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మలిదశ ఉద్యమకారుడు పోలీసు కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా.. ఆది వారం ఆయన భార్య పద్మావతి, కుమారుడు రాహుల్‌ను కవిత కలిశారు. ఈ సందర్భంగా ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కవిత వెంట టీజీపీఎస్సీ మాజీ సభ్యు రాలు సుమిత్ర ఆనంద్ తనోబా ఉన్నారు.

విభజన సమస్యలపై నేడు సీఎస్‌ల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజనకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌ల) నేతృత్వంలో అధికారుల కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశం మంగళగిరిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

పులి భయంతో.. జ్వరం!



ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలం దుబ్బగూడలో రైతు రౌత్ సురేశ్‌పై పులి దాడి చేయడాన్ని చూసిన అతని భార్య సుజాత జ్వరంతో మంచం పట్టింది. ఏ క్షణాన ఎవరిపై పులి దాడి చేస్తుందో తెలియక.. దుబ్బగూడ.. పరిసర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

పులి కోసమే వెతుకుతున్నాం సర్..

కాగజ్‌నగర్ డివిజన్‌లో ఇటీవల ఇద్దరిపై దాడి చేసిన పులి ఆచూకీ కోసం అటవీ అధికారులు తీవ్రంగా గాలిస్తున్నారు. సిర్పూర్ రేంజ్‌లో అటవీ అధికారి ఫోన్లో మాట్లాడుతుండగా.. ఆయన కార్యాలయంలో నిజమైన పులిని తలపిస్తున్న పులి బొమ్మ ఆసక్తి రేపుతోంది.



- ఫొటోలు: సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

దండకారణ్యం నుంచి సరిహద్దుకు?

ఇటీవలి కాలంలో ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం

మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దులోకి వచ్చే అవకాశం ఉందన్న ఎస్ఐబీ

- పలువురు ఎస్పీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాలతో డీజీపీ భేటీ
- ఆ తర్వాతే వాజేడులో ఇద్దరు ఇన్‌ఫార్మర్లను హత్య చేసిన మావోయిస్టులు
- తాజా ఎన్‌కౌంటర్‌తో ఎస్ఐబీ అంచనా నిజమని తేలిన వైనం
- రాష్ట్రంలో సంచరిస్తున్న 15 మందిలో 14 మంది మృతి!



సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/మంథని/ సాక్షి హైదరాబాద్: దండకారణ్యం నుంచి మావోయిస్టు సాయుధ దళాలు సేఫ్టీ జోన్‌గా భావిస్తున్న తెలంగాణ సరిహద్దుకు వచ్చాయా? ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు దండకారణ్యం వీడుతున్నారా? పారా మిలటరీ, యాంటీ మావోయిస్టు స్క్వాడ్స్, కేంద్ర సాయుధ బలగాల మోహరింపు, తీవ్రమైన నిర్బంధం నేపథ్యంలో ఎత్తుగడలలో భాగంగా తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నారా? రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహించాలనుకున్నారా? అంటే నిజమేనంటున్నాయి పోలీసు వర్గాలు. దండకారణ్యం విడిచి తెలంగాణకు చేరుకుని కార్యకలాపాలు నిర్వహించే క్రమంలోనే కీలక మావోయిస్టు నేతలు కురుసం మంగు అలియాస్ భద్రు, పాపన్న, ఏగోలపు మల్లయ్య అలియాస్ కరుణాకర్, కోటి, మధు సహా ఏడుగురు మావోయిస్టులు మృత్యువాత పడినట్లు చెబుతున్నారు. రెండు నెలలుగా పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో దండకారణ్యంలో యుద్ధవాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర సాయిధ బలగాలు నారాయణపూర్ జిల్లా అబూజ్‌మఢ్ దండకారణ్యంలోకి చొచ్చుకు పోగా.. ఈ క్రమంలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో 254 మంది వరకు మృతి చెందినట్లు ఇటీవల మావోయిస్టు పార్టీ ప్రకటించింది.

ముందే పసిగట్టిన ఎస్ఐబీ..

2026 నాటికి మావోయిస్టుల అంతమే లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో పోలీసు బలగాల చర్యలు అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వ్యూహం మార్చిన మావోయిస్టు అగ్రనేతలు, సాయధ దళాలు దండకారణ్యం నుంచి తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించే అవకాశం ఉందని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అంచనా వేసింది. రాష్ట్ర పోలీసులను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే ఈనెల 11న తెలంగాణ డీజీపీ జితేందర్.. జేఎస్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీలు, ఓఎస్డీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాల ఇన్‌చార్జిలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇది జరిగిన పది రోజులకు మావోయిస్టులు ములుగు జిల్లా వాజేడులో పంచాయతీ కార్యదర్శి ఉయికే రమేష్, ఉయికే అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ల పేరిట హత్య చేశారు. అనంతరం రాష్ట్రంలో భారీ ఎన్‌కౌంటర్ సైతం చోటు చేసుకోవడంతో ఇంటెలిజెన్స్ వర్గాల అంచనా నిజమని తేలింది. మావోయిస్టు అగ్ర నాయకత్వంలో ఉన్న పలువురు తెలుగు రాష్ట్రాల నాయకుల్లో కొందరు ఆరోగ్య సమస్యలతో ఉన్నట్టు సమాచారం. దీంతో పాటు తమకు దశాబ్దాలుగా సేఫ్‌జోన్లుగా ఉన్న దండకారణ్యంలోని ఒక్కో స్థావరాన్ని కేంద్ర పారా మిలటరీ బలగాలు స్వాధీనం చేసుకుంటుండటంతో కొత్త ప్రదేశాలకు మకాం మార్చే యోచనలో భాగంగా మావోయిస్టు దళాలు సరిహద్దుకు చేరాయని తెలుస్తోంది.

ఉనికి ఉన్నట్టుగా లేఖలు

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో దళాల సంచారం లేకున్నా వివిధ ఏరియా కమిటీల పేరిట తరచుగా లేఖలు విడుదల చేస్తూ వచ్చారు. సాధారణంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ, అల్లూరి సీతారామరాజు – భద్రాద్రి కొత్తగూడెం (ఏఎస్ఆర్‌బీకే) డివిజన్ కమిటీల పేర్లతో లేఖలు వస్తుంటాయి. ఆ తర్వాత మంచిర్యాల – పెద్దపల్లి – భూపాలపల్లి-ములుగు జిల్లాల డివిజన్ పేరిట కూడా లేఖలు వచ్చేవి. కానీ 2023 రెండో అర్ధభాగం నుంచి 2024 తొలి అర్ధభాగం వరకు పాల్వంచ – మణుగూరు, ఇల్లెందు – నర్సంపేట, సింగరేణి, చర్ల – శబరి తదితర ఏరియా కమిటీల పేర్లతో లేఖలు రావడం ఎక్కువైంది. తద్వారా తెలంగాణలో తమ ఉనికి ఉన్నట్టుగా చాటుకునేందుకు మావోయిస్టులు ప్రయత్నించారు.

తుడిచిపెట్టుకుపోయిన లచ్చన్న, భద్రు దళాలు

వివిధ కమిటీల పేర్లతో లేఖల జారీల అనంతరం జూన్‌లో మావోయిస్టులు గోదావరి తీరం దాటి తెలంగాణలోకి వచ్చినట్టు గట్టిగా ప్రచారం జరిగింది. దీనికి తగ్గట్టుగానే ములుగు – భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులో గుండాల మండలం దామెరతోగు అడవుల్లో జూలై 25న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు. ఈ కాల్పులపై పోలీసులు స్పందిస్తూ.. నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన భద్రు, లచ్చన్నతో పాటు దాదాపు 15 మంది మావోయిస్టులు ఆయుధాలతో సంచరిస్తున్నట్టు సమాచారం అందిందని, ఈ మేరకు చేపట్టిన కూంబింగ్.. ఎదురు కాల్పుల్లో ఒకరు చనిపోయారని ప్రకటించారు.

భారీ నష్టం..

తాజా జరిగిన భారీ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల రఘునాథపాలెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యులలో లచ్చన్న, లచ్చన్న సతీమణి తులసి అలియాస్ పునెం లక్కీ, పాల్వంచ మణుగూరు ఏరియా కమాండర్ కామ్రేడ్ రాము, పార్టీ సభ్యులు కోసి, సీనియర్ సభ్యులు గంగాల్, కామ్రేడ్ దుర్గేశ్ మరణించిన విషయం తెలిసిందే. కాగా ములుగు ఎన్‌కౌంటర్‌లో రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీతోపాటు తెలంగాణ క్యాడర్‌కు చెందిన యువ మావోయిస్టులు చనిపోవడం మావోయిస్టులకు తీరని నష్టమేనని అంటున్నారు. ఇటీవల దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు తొలితరం అగ్రనాయకుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు సహా మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న, అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు హతమైన విషయం కూడా తెలిసిందే.

కాగా భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలో సెప్టెంబర్ 5న జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాల్వంచ-మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్నతో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. ఒక మావోయిస్టు తప్పించుకున్నట్టు పోలీసులు తెలిపారు. దీంతో ముందుగా పేర్కొన్న 15 మందిలో మొత్తం ఏడుగురు చనిపోయినట్టయ్యింది. లచ్చన్న దళం తుడిచిపెట్టుకుపోయినా భద్రు అలియాస్ మంగు దళం జాడ పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే తాజాగా ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మరణించడంతో భద్రు దళం మొత్తం హతమైంది.

ఈసారి గేదెపై దాడి..

- ఆసిఫాబాద్ జిల్లాలో కొనసాగుతోన్న పెద్దపులి అలజడి



ఇటిక్యాలపహాడ్ అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులుల అలజడి కొనసాగుతోంది. శుక్రవారం గన్నారం గ్రామానికి చెందిన మహిళపై దాడి చేసి చంపగా, శనివారం దుబ్బగూడ గ్రామానికి రైతు సురేశ్‌ను గాయపర్చిన విషయం తెలిసిందే. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు ఆదివారం పరామర్శించారు. అనంతరం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం ఇటిక్యాల పహాడ్ అటవీ ప్రాంతంలో పర్యటించారు. మనుషులపై దాడి చేసిన పులి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు పెంచికల్‌పేట్ మండలంలో ఆదివారం ఓ పెద్దపులి వరిమడ్ల శ్రీనివాస్‌కు చెందిన గేదెపై దాడి చేసి హతమార్చింది. పశువుల కాపరి జక్కుల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దరోగపల్లి అటవీ ప్రాంతంలోకి గేదెలను మేత కోసం తీసుకెళ్లారు. ఈ క్రమంలో పులి ఒక్కసారిగా గేదెపై దాడి చేసింది. గమనించిన కాపరి సమీపంలోని మేకల కాపరులతో కలిసి పెద్దగా కేకలు వేయగా పులి అటవీ ప్రాంతంలోకి పరుగులు తీసింది. అయితే దరోగపల్లి అటవీ ప్రాంతంలో గేదెపై దాడి చేసింది ఏ పులి అనేదానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

ములుగు అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి



కుర్సం మంగు



ముస్సాకి దేవల్



ముస్సాకి జమున

కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మిగతా వారు పారిపోగా ఘటన స్థలంలో రెండు ఏకే-47 రైఫిళ్లు, ఒక జీ-6, ఒక ఇన్సాస్, 303 రైఫిళ్లు, మందు గుండు సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు, నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న (35), దండకారణ్యం డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, కోటి, కమలాకర్ (43), ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), ముస్సాకి జమున (23), పార్టీ సభ్యులు జైసింగ్ (25), కిషోర్ (22), కామేష్ (23)గా పోలీసులు గుర్తించారు. ఏగోలపు మల్లయ్యది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

తొమ్మిదేళ్ల తర్వాత భారీ ఎన్‌కౌంటర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పాగా వేసేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే 2015 సెప్టెంబర్ 15న ములుగు జిల్లా వెంగళాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ వడ్డేపల్లికి చెందిన ఎంటెక్ విద్యార్థి తంగళ్లపెల్లి శ్రుతి అలియాస్ మహిత, వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెండ్యాలకు చెందిన మణికంటి విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మరణించారు. అప్పట్నుంచి సుమారు తొమ్మిదేళ్ల తర్వాత ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరగడం కలకలం రేపుతోంది. మావోయిస్టు పార్టీ సాయుధ విభాగం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ రెండురోజుల క్రితమే పిలుపునిచ్చింది. ఈ మేరకు వారోత్సవాలకు సన్నద్ధమవుతున్న సమయంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుని ఏకంగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కిన చెల్పాక

తాజా ఎన్‌కౌంటర్‌తో చెల్పాక పేరు 33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కింది. 1991 జూన్ 21న అప్పటి పీపుల్స్‌వార్, ఇప్పటి మావోయిస్టు పార్టీ నక్సలైట్లు భారీ మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఏటూరునాగారం సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కిషోర్‌కుమార్ సహా ఏడుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు మరణించారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ రోజునే గ్రామ సమీపాన నక్సలైట్లు ఈ ఘటనకు పాల్పడ్డారు. చెల్పాక పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్సుల్లో సిరా పోసి, పథకం ప్రకారం పోలీసులకు సమాచారం చేరవేసి రప్పించిన నక్సల్స్.. ఈ భారీ మందుపాతర పేల్చారు. అదే చెల్పాక సమీప అడవుల్లో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

కొనసాగుతున్న కూంబింగ్

భారీ ఎన్‌కౌంటర్ పల్లెల్లో కలకలం రేపింది. ఇన్‌ఫార్మర్ల పేరిట వాజేడులో ఇద్దరి హత్య, ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా పోలీసు బలగాల కూంబింగ్ కొనసాగుతూనే ఉంది. పీఎల్‌జీఏ వారోత్సవాలను భగ్నం చేసేందుకు గొత్తికోయ గూడేలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు.

మృతుల వివరాలు.. లభ్యమైన ఆయుధాలు

1.కుర్సం మంగు: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చేరమంగి గ్రామం. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద లభ్యమైన ఆయుధం ఏకే-47.

2.ఏగోలపు మల్లయ్య: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం. తెలంగాణ, డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరు నాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద కూడా ఏకే-47 లభ్యమైంది.

3.ముస్సాకి దేవల్: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసుర్ గ్రామం. ఇతని వద్ద జీ3 రైఫిల్ లభ్యమైంది.

4.ముస్సాకి జమున: గొత్తికోయ. ఛతీస్‌గఢ్ రాష్ట్రం బైరామ్‌ఘర్ గ్రామం.

5.జైసింగ్: పార్టీ సభ్యుడు. ఇంద్రావతి ప్రాంతం. లభ్యమైన ఆయుధం.303 రైఫిల్.

6.కిషోర్: పార్టీ సభ్యుడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగులూరు పీఎస్ పరిధి పాంపాడ్ గ్రామం. లభ్యమైన ఆయుధం ఇన్సాస్ రైఫిల్.

7. కామేష్: పార్టీ సభ్యుడు. ఛతీసగఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పీఎస్ పరిధి మలంపెంట గ్రామం. లభ్యమైన ఆయుధం ఎస్‌బీబీఎల్ గన్.

భవిష్యత్ తరాలకు ఈశ్వరీబాయి చరిత్ర

మంత్రులు ఉత్తమ్, పొన్నం, జూపల్లి

గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): సామాజిక ఉద్యమ కారిణి ఈశ్వరీబాయిని భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా పలు కార్యక్రమాలు చేపడతామని పలువురు మంత్రులు తెలిపారు. రవీంద్రభారతిలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జె.ఈశ్వరీబాయి 106వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన గొప్ప వ్యక్తి ఈశ్వరీబాయి అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎంతో అనుభవజ్ఞు రాలైన గీతారెడ్డి సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. అనంతరం తెలంగాణ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావుకు ఈశ్వరీ బాయి స్మారక అవార్డును ప్రదానం చేశారు.



పల్లె నాగేశ్వర్‌రావుకు ఈశ్వరీబాయి అవార్డును ప్రదానం చేస్తున్న పొన్నం, మహేశ్ గౌడ్, ఉత్తమ్, గీతారెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి

తప్పతాగి.. దంపతులను ఢీకొట్టి..

- మద్యం మత్తులో కారునడిపి ఇద్దరి ప్రాణాలను బలిగొన్న యువకుడు
- లంగర్‌హౌస్‌లో కారు బీభత్సం..
- ప్రమాదంలో పలు వాహనాలు ధ్వంసం
- భార్య వదిలేసిందన్న కారణంతోనే తాగానని నిందితుడి వెల్లడి



ప్రమాదానికి కారణమైన కారు



కుమార్తెలతో మోనా ఠాకూర్, దినేష్ గిరి

సాక్షి, హైదరాబాద్/లంగర్‌హౌస్: తప్ప తాగిన ఓ వ్యక్తి కారు నడిపి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి చెందారు. లంగర్‌హౌస్ వద్ద శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న ప్రణయ్ అనే వ్యక్తి మద్యం మత్తులోనే బండ్లగూడ జాగీర్ నుంచి ఖైరతాబాద్‌కు కారులో వెళ్తూ మార్గమధ్యలో సన్‌సిటీ వద్ద పలు వాహనాలను ఢీకొట్టాడు. స్థానికులు పట్టుకొని దాడి చేయగా... తప్పించుకుని ముందుకు వచ్చి లంగర్‌హౌస్ ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న దంపతులతోపాటు మరికొన్ని వాహనాలను ఢీకొట్టాడు. దీంతో ఐటీ ఉద్యోగులైన దంపతులు మోన ఠాకూర్-దినేష్ గిరి అక్కడికక్కడే మృతి చెందారు. పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.

తప్పించుకుని.. అదే వేగంతో..

భార్య తనను వదిలి వెళ్లిందన్న బాధలో తాగుడుకు బానిసైన ప్రణయ్.. మైకంతో కారు నడిపి ఓ ఇంట్లో తీరని విషాదం నింపాడు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి బండ్లగూడ జాగీర్‌లోని ఓ బార్‌లో మద్యం తాగి.. ఖైరతాబాద్‌లో ఉండే మరో స్నేహితుడిని కలవడానికి తన స్విఫ్ట్ కారులో (టీఎస్ 34 కే 5031)లో బయలుదేరాడు. కారును నియంత్రించలేక సన్‌సిటీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. స్థానికులు పట్టుకొని చితకబాదుతుండగా తప్పించుకొని అదే వేగంతో వచ్చి లంగర్‌హౌస్‌లో దంపతుల బైక్‌తోపాటు మరికొన్ని వాహనాలను కూడా బలంగా ఢీకొట్టాడు. దీంతో మోనా ఠాకూర్- దినేష్ గిరి అక్కడికక్కడే మరణించగా.. టోలిచౌకి మెట్లకు చెందిన మెకానిక్ షేక్ అక్తర్, తాడ్‌బన్‌కు చెందిన మొహమ్మద్ జావిద్, ఐటీ ఉద్యోగి రహీమ్, మలక్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ అబ్బాస్ గాయపడ్డారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న స్థానికులు ఠాణా వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రణయ్‌ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు విచారణలో తన భార్య వదిలి వెళ్లిందనే బాధలో మద్యం తాగానని ప్రణయ్ చెప్పాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మోన, దినేష్ మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రి మార్చ్యురీలో పోస్టుమార్టం చేశాక కుటుంబీకులకు అప్పగించారు.

బిడ్డలకు ఆహారం తెస్తామని వెళ్లి..


లంగర్‌హౌస్‌కు చెందిన మోన ఠాకూర్ ఐటీ ఉద్యోగిని. ఆమెకు ఇద్దరు కూతుళ్లు (12, 9 ఏళ్లు) ఉన్నారు. భర్త నుంచి విడాకులు తీసుకొన్న ఆమె.. బంజారాహిల్స్‌కు చెందిన ఐటీ ఉద్యోగి దినేష్ గిరిని 2023లో రెండో వివాహం చేసుకుంది. దినేష్ పుట్టిన రోజు వేడుకల కోసం గత సోమవారం ఇద్దరూ గోవా వెళ్లి.. శనివారం తిరిగొచ్చారు. ఇద్దరు కుమార్తెలు వారితో వెళ్లలేదు. బిడ్డలు బర్త్‌డే పార్టీగా మాంసాహారం భోజనం కావాలని అడగటంతో భోజనం తెచ్చేందుకు శనివారం రాత్రి దంపతులిద్దరు బైక్‌పై వెళ్తుండగా రాత్రి 10:30 గంటల ప్రాంతంలో మిలటరీ వాటర్‌ట్యాంక్ వద్ద వేగంగా వచ్చిన ప్రణయ్ కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రణయ్ స్వస్థలం వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూరు అని పోలీసులు తెలిపారు.

నేను చెవిరెడ్డిపై కేసు పెట్టలేదు

'ఎర్రావారిపాలెం' బాలిక తండ్రి వెల్లడి



సాక్షి ప్రతినిధి, తిరుపతి: బాధిత బాలికను పరామర్శించేందుకు వెళ్లి, న్యాయం కోసం నిలబడిన వైఎస్సార్‌సీపీ నేత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై పోలీసులు నమోదు చేసిన పోక్సో కేసు వెనుక 'అసలు నిజం' బయటపడింది. బాలిక తల్లిదండ్రులు రమణ, అరుణ ఆదివారం మీడియా ముందుకు వచ్చి వాస్తవాలను వెల్లడించారు. ''మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కేసు పెట్టాలని నేను పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. నా బిడ్డకు అన్యాయం జరిగిందని తెలిసిన వెంటనే పోలీసులు ఆ కేసును తారుమారు చేస్తారన్న భయంతో.. నేనే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫోన్ చేసి రమ్మన్నాను. నేను పిలిస్తేనే ఆయన వచ్చారు. అలాంటి వ్యక్తి మీద నేను ఎందుకు కేసు పెడతా? నా బిడ్డకు ఏదో అన్యాయం జరిగిందని వచ్చిన వ్యక్తి మీద నేను కేసు పెట్టాననడం పాపం కదా! నేను ఎవ్వరి మీదా కేసు పెట్టలేదు. నాకేమో చదువురాదు. పోలీసులు నా దగ్గరకు వచ్చి.. మీడియా వాళ్లు మీ పాప గురించి పదేపదే అడుగుతున్నారు.. వాళ్లు పోస్టులు పెట్టకుండా ఉండాలంటే ఈ కాగితంలో సంతకం పెట్టు' అని నా దగ్గర సంతకం పెట్టించుకున్నారు. మా బిడ్డ గురించి చెవిరెడ్డి ఎక్కడ కూడా అత్యాచారం జరిగిందని చెప్పలేదు. మమ్మల్ని ఎక్కడా కించపరచలేదు. మా పరువుకు నష్టం కలిగించేలా ఏమీ చేయలేదు. పాపకు మెరుగైన వైద్యం కావాలంటే.. ఎక్కడకు తీసుకెళ్లినా సాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయనపై నేను కేసు పెట్టాననడం దారుణం'' అని బాలిక తండ్రి రమణ వాపోయాడు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలం యలమందకు చెందిన ఓ బాలికపై ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బాలిక తండ్రి అభ్యర్థన మేరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి యలమందకు వెళ్లి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. కానీ చెవిరెడ్డితో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత నాగార్జునరెడ్డి, 'సాక్షి', సోషల్ మీడియా యాక్టివిస్టులపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా పలు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు ప్రకటించిన సంగతి తెలిసిందే.







ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న మెదక్ చర్చి ఆసియాలో రెండో అతి పెద్ద చర్చిగా గుర్తింపు పొందింది. చారిత్రాత్మక వారసత్వ సంపదకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న ఈ కట్టడం నిర్మాణం జరిగి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ విశేషాలు...

కరుణామయుని కోవెలకు వందేళ్ల ఉత్సవాలు

అది మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయం... తినడానికి తిండిలేక... చేద్దామంటే పని లేక ప్రజలు ఆకలితో నకనకలాడి అలమటిస్తున్న రోజులు. మరో బాధాకరమైన విషయం... అంటురోగాలతో జనం పిట్టల్లా నేలరాలి చనిపోతున్న దుర్భరమైన పరిస్థితులు అవి. పట్టెడన్నం దొరికితేనే పంచభక్ష్యపరమాన్నాలుగా భావించి పరమానంద పడుతున్న రోజులు. సరిగ్గా ఇటువంటి దుర్భర పరిస్థితులలో దేశంకాని దేశం నుండి ఖండంతరాలు దాటి సాక్షాత్తూ పరలోకం నుంచి ప్రభువు పంపిన దేవ దూతలా వచ్చాడు చార్లెస్ వాకర్ పాస్నెట్. ఇంగ్లాండ్ దేశస్థుడైన ఆయన ముందుగా సికింద్రాబాద్‌లోని అప్పటి మిలటరి(ఆర్మీ) సేనకు నాయకుడిగా వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటికే అమాయక ప్రజలనేకులు గత్తర వ్యాధితో మూకుమ్మడిగా చనిపోతున్నారు. ఈ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉంది.

> వందేళ్ల పండగకు ముస్తాబవుతున్న మెదక్ చర్చి
> 23న శతాబ్ది ఉత్సవాలు
> చర్చి నిర్మాణ ప్రదాత చార్లెస్ వాకర్ పాస్నెట్ రక్తసంబంధీకుల రాక
> ముఖ్య అతిథిగా హాజరు కానున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

> ఈ కట్టడాన్ని మూడు గవాక్షాలు, పలు రంగుటద్దాలతో నిర్మింపజేశారు. తూర్పున ఏసుక్రీస్తు జన్మవృత్తాంతం, పడమర క్రీస్తును శిలువ వేసిన దృశ్యం, ఉత్తరాన క్రీస్తు పునరుత్థానుడై నిలిచిన దృశ్యాలు కనిపిస్తాయి. వీటిని తయారు చేసిన కళాకారులు ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఫ్రాంకో ఓ. సాలిస్‌బర్‌లు. అంతే కాకుండా ఇవి సూర్యరశ్మి వెలుతురులో (పగలు) మాత్రమే కనిపిస్తాయి. సూర్య అస్తమయం అయిందంటే కనిపించవు. ఈ నిర్మాణం 1914 నుండి 1924 డిశంబర్ వరకు 10 ఏళ్లపాటు జరుగగా డిశంబర్ 25న క్రిస్మస్ పర్వదినం రోజున ఆరంభించారు. ఈ చర్చిలో ఒకేసారి 5 నుంచి 6 వేల మంది కూర్చొని ప్రార్థనలు చేసుకోవచ్చు.

ఆకలి తీర్చిన ఆలయం..!

ఆకలితో ఎవరూ చనిపోకూడదని భావించిన చార్లెస్ వాకర్ పాస్నెట్ ఈ ప్రాంతంలో చర్చి నిర్మాణం తలపెట్టాడు. చర్చ్ నిర్మాణం కోసం దాదాపు 200 రకాల నమూనాలను తయారు చేశారట. వాటిలో ఏది ఉత్తమమైనదో తెలియక ఆందోళన చెందుతూ వాటన్నింటిని ముందు పెట్టుకుని మోకరిల్లి 'పరలోకదేవా ఇందులో ఏ నమూనా ప్రకారం నిర్మించాలో దారిచూపు' అంటూ ప్రార్థన చేయగా ఉన్నటుండి పెద్ద గాలి వచ్చి అందులోని 199 నమూనా కాగితాలు కొట్టుకుపోయి ఒకే ఒక్క నమూనా మిగిలిందట. అదే దైవ నిర్ణయంగా భావించి దాని ప్రకారం నిర్మించబడిందే ప్రస్తుత చర్చి అని పెద్దలు చెబుతున్నారు. నిర్మాణానికి తన వద్ద ఉన్న డబ్బు సరిపోక పోవడంతో స్వదేశంలో భిక్షమెత్తి మరీ నిర్మాణాన్ని పూర్తి చేశారు వాకర్.

ఈ చర్చి వల్లే 'మెదక్'కు ఆ పేరు

వేలాది మంది కూలీలతో పది సంవత్సరాల పాటు కొనసాగిన నిర్మాణం వల్ల కాలే కడుపులకు పట్టెడు మెతుకులు దొరికేవట. అప్పట్లో ఈ ప్రాంతానికి గుల్షనాబాద్ అని పేరు. వేలాది జనం చర్చి నిర్మాణంలో భాగస్వాములు కావటం కోసం తండోపతండాలుగా తరలి వెళ్లేవారట. వారిని చూసి ఎక్కడికి వెళ్తున్నారని అడిగితే 'మెతుకు' కోసం పనికి వెళ్తున్నామంటూ చెప్పేవారట. దీంతో ఈ ప్రాంతం గుల్షానాబాద్ నుంచి మెతుకు సీమగా పేరు గాంచింది. అది కాస్తా రానురాను మెదక్‌గా రూపాంతరం చెందింది.

175 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో ఠీవిగా కనిపించే మెదక్ చర్చిని భారతీయ, విదేశీ కళానైపుణ్యాల మేళవింపుతో నిర్మించారు. రెండంతస్తుల్లో నిర్మించిన ఈ కట్టడం, శిఖరం.. వందేళ్లు పూర్తయినా చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. నిర్మాణం పటిష్ఠంగా ఉండేందుకు భారతీయ పురాతన పద్ధతులను అనుసరించారు. చర్చి లోపల ప్రతిధ్వనులు వినిపించని విధంగా నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకున్నారు.


ప్రశాంతతకు, పవిత్రతకు నిలయమైన ఈ చర్చికి ఇంకా అనేక ప్రత్యేకతలున్నాయి. చర్చి నిర్మాణానికి రాతి, డంగుసున్నాన్ని మాత్రమే వాడారు. పిల్లర్లు, బీములు లేకుండా రెండు అంతస్తులతో విశాలమైన ప్రార్థనా మందిరాన్ని, శిఖరాన్ని నిర్మించడం నాటి పనితనానికి అద్దం పడుతోంది. 200 అడుగుల పొడవుతో సువిశాలమైన చర్చి చూపరులను కట్టిపడేస్తుంది.

ఈ చర్చి నిర్మాణం కోసం ఆరో నిజాం 1000 ఎకరాల భూమిని కేటాయించారు. సుమారు 14 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. కొంతకాలం కిందట 2 కోట్లతో మరమ్మతులు చేశారు. క్రిస్మస్, గుడ్ ఫ్రైడే లాంటి పర్వదినాల్లో ఈ చర్చిని సందర్శించేందుకు విదేశీయులు కూడా వస్తుంటారు. సందర్శకుల్లో క్రైస్తవులే కాకుండా ఇతర మతస్థులు కూడా ఉంటారు.

ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి

ఆసియా ఖండంలోనే అద్భుతంగా నిర్మించిన ఈ చర్చి నిర్మాణం జరిగి ఈ డిశంబర్ 25 నాటికి 100 సంవత్సరాలు పూర్తి కానుంది. 25న క్రిస్మస్ కావడం వల్ల ఆ రోజున భక్తుల ప్రార్థనలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈనెల 23న శతజయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు చర్చిని ముస్తాబు చేస్తున్నారు. 23న పదిహేను మంది బిషప్‌లతో ఉదయం నుంచే ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయి. ఇందులో భాగంగా మెదక్ పరిధిలోని ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో పలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కోసం చిత్రలేఖనం, నృత్యం తదితర పోటీలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారు. అలాగే చర్చి నిర్మాణదాత చార్లెస్ వాకర్ పాస్నెట్ రక్త సంబంధీకులు సైతం హాజరు అవుతారని నిర్వాహకులు చెబుతున్నారు.

–సీహెచ్. నీలయ్య
సాక్షి, మెదక్



జీవితంలో ఎంత పొందినా, ఎంత కీర్తి గడించినా, ఇంకా ఏదో కావాలి అన్న కోరిక మానవుడిని అనుక్షణం వెంటాడుతూ ఉంటుంది. ఫలితంగా ఇంకా ఏదో కావాలని నిరంతరాయంగా అన్వేషణ సాగుతుంటుంది. ఏది గమ్యం, ఎటు వైపు పయనం అన్న అవగాహన లేకుండా మనిషి ప్రయాణం సాగిపోతూ ఉంటుంది. కోరికల వలయంలో కూరుకుపోతూ కొట్టుమిట్టాడతాడు మనిషి. చాలామందికి కోరికల నిజతత్వంపై అవగాహన ఉండదు. అందుకే ప్రాపంచిక విషయాలకు సంబంధించిన కల్పనలు చేసుకుంటూ, కలలు కంటూ, అనేకమైన కోరికలతో జీవితాలను వెళ్లదీస్తారు.

కోరికలను తీర్చేది...

ప్రాపంచికమైన కోరికలను మాత్రమే తీర్చుకోవడం ద్వారా శాశ్వతమైన ఆనందాన్ని పొందాలని భావించేవారు సత్యానికి చాలా దూరంగా ఉన్నట్లు లెక్క. ఇటువంటి మనఃస్థితి ఉన్నవారు కోరికలు తీరని పక్షంలో మానసిక సమతుల్యతని కోల్పోతారు. కోరికలు తీరకపోవడం కారణంగా ఏర్పడే లోటు వల్ల వారు తమ పరిస్థితిని మరింత దుర్భరం చేసుకుంటారు.

బాహ్యమైన విషయాలు సంతోషాన్ని తప్పక అందిస్తాయి. కానీ ఆత్మతృప్తిని, ఆనందాన్ని అందించలేవు. బాహ్యమైన విషయాల ద్వారా కానీ, వస్తు సంపదల ద్వారా కానీ ఏర్పడే సంతోషం కొద్దిసమయం పాటే నిలబడుతుంది. ఈ కారణంగానే ఒక కోరిక తీరిన వెంటనే మరొక కోరిక పుట్టుకొస్తుంది. ఇంకా ఇంకా ఏదో కావాలని మనిషి నిరంతరం తపన పడుతూ, అన్వేషిస్తూనే ఉంటాడు. ఆత్మజ్ఞానమే ఆ అన్వేషణకు సమాధానం. ఎన్నడూ మార్పు చెందనిది, శాశ్వతమైనది మాత్రమే యదార్థమైన సంతృప్తిని ఇవ్వగలదు. ఆత్మతత్వం ఏమిటో అవగాహనకు వచ్చినప్పుడు మాత్రమే మనిషికి సంపూర్ణమైన తృప్తి కలుగుతుంది.

> ఆత్మజ్ఞానం కోసం మీరు దేన్ని వదిలి పెట్టవలసిన అవసరం లేదు. నిజానికి ఆత్మజ్ఞానంలోనే మీకు కావాల్సిన సాఫల్యమంతటినీ కనుగొంటారు. మీ హృదయం లోనే దివ్యమైన ఆనందాన్ని, ఆత్మ తృప్తిని అనుభూతి చెందుతారు. ఆత్మతో అనుసంధానం కలిగినప్పుడు బాహ్యంగా మీరు దేన్నీ అన్వేషించాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా సాధన చేసే యోగికి తీరని కోరికలు ఏవి ఉండవు.

ఆత్మతృప్తి అనంతమైన కోరికలన్నిటిని తీరుస్తుంది. నిజమైన ఆనందం మీలోనే ఉంది. ఆ ఆనందమే మీ నిజ తత్వమై ప్రకాశిస్తూ ఉంటుంది. ఆత్మ సాక్షాత్కారంలోనే నిజమైన ధన్యత ఉంది.

చాలామంది ఆత్మవిద్య కోసం ఎందుకు అన్వేషణ చేయరంటే, ఆత్మజ్ఞానం కోసం వాళ్లు దేన్నో వదిలి వేయాలని భ్రమ పడతారు. ధ్యానసాధన చేసి ఆత్మజ్ఞానం పొందిన ఎందరో మహనీయులు, మహాత్ములు ఆత్మదర్శనంతోనే తమకు మిగిలినవన్నీ సమకూరాయని తెలిపారు, నిరూపించారు కూడా. మీరు ఆశించే ప్రతిదీ పరమాత్మ సృష్టిలోనే ఉంది అన్న సత్యాన్ని తెలుసుకోండి. ఈ విషయాన్ని ప్రగాఢంగా నమ్మండి. దేన్ని కోరుకుంటే కోరికలన్నీ తీరి మనసు శాంతిస్తుందో అదే ఆత్మ. ఆ ఆత్మదర్శనం దిశగా అడుగులు వేయండి. ఈ రోజే సాధన మొదలు పెట్టండి.



– మాతా ఆత్మానందమయి
ఆధ్యాత్మిక గురువు

సినిమా

కోలీవుడ్ టార్చ్ బేరర్స్

కొంతకాలంగా నడక మార్చుకుంటోంది తమిళ సినిమా. వెండితెర నిర్వచనాన్ని మార్చే బాధ్యతను భుజానకెత్తుకున్నారు కోలీవుడ్ కొత్త కథనాయకులు. ఇక్కడ కథానాయకులు అంటే తెరపై కనిపించే హీరోలు కారు. సిల్వర్ స్క్రీన్‌ను రీ డిఫైన్ చేస్తూ ఇండస్ట్రీకే టార్చ్ బేరర్స్‌గా మారిన దర్శకులు. హీరోల ఇమేజ్ చుట్టూ తిరిగే కథలకు ఎండ్ కార్డ్ వేసి రొటీన్ ఫార్ములా సినిమాలకు మంగళం పాడేశారు ఈతరం దర్శకులు. సమాజం పెద్దగా పట్టించుకోని అంశాలనే ముడి సరుకుగా తీసుకుని ఈ దర్శకులు తెరకెక్కిస్తున్న చిత్రాలు తమిళ సినిమాను కొత్త పంథాలోకి తీసుకెళ్తున్నాయి. అట్టడుగు ప్రజల జీవితాలే ఆ చిత్రాల కథా వస్తువులు. ప్రతి ఫ్రేమ్‌లోనూ సామాజిక స్పృహ ఉట్టిపడేలా సోషల్ కమిట్‌మెంట్‌తో సినిమాలు తీస్తున్నారు. కోలీవుడ్ స్థాయిని పెంచుతున్న ఆ ముగ్గురు దర్శకుల గురించి తెలుసుకుందాం.


మారి సెల్వరాజ్, వెట్రిమారన్, పా. రంజిత్

సామాజిక వివక్షే కథగా...

అణిచివేతకు గురైన వాడికే వివక్ష వికృత రూపం తెలుస్తుంది. తమిళనాడులో అణగారిన వర్గానికి చెందిన మారి సెల్వరాజ్ తాను అనుభవించిన, తన చుట్టూ ఉన్నవాళ్లు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షనే సినిమా కథలుగా మార్చుకున్నారు. అట్టడుగు ప్రజల గళంగా మారారు ఈ దర్శకుడు. తమిళ సంస్కృతి నేపథ్యంలో వాస్తవ జీవిత గాథలను ఆవిష్కరిస్తున్నారు. 2018లో తొలి చిత్రం 'పరియేరుం పెరుమాళ్' నుంచి 'కర్ణన్, మామన్నన్', మొన్నటి 'వాళై' వరకు ప్రతి చిత్రంలోనూ కులం కట్టుబాట్లు, ప్రజల హక్కులు, గౌరవప్రదమైన జీవితం... మారి సెల్వరాజ్ చర్చకు పెట్టే అంశాలు ఇవే. మెయిన్ స్ట్రీమ్ సినిమా పట్టించుకోని పాత్రలకు వాయిస్ ఇస్తూ తన సినిమా ద్వారా సామాజిక పోరాటం చేస్తున్నారు. మారి సెల్వరాజ్ సినిమాల్లో కల్చరల్ రిప్రజెంటేషన్ తప్పక ఉంటుంది. బడుగు బలహీన వర్గాల గ్రామీణ జీవన విధానాన్ని నిజాయితీగా కళ్లకు కట్టే ప్రయత్నంలో ఈయన ప్రతి సందర్భంలోనూ సక్సెస్ అవుతున్నారు.

పోరాట యోధులుగా...

సినిమా అంటే ఏదో ఒక కథ చెప్పడం కాదు. వివక్ష కారణంగా పూడుకుపోయిన గొంతులకు వాయిస్ ఇవ్వాలి. శతాబ్దాల నుంచి వివక్షను అనుభవిస్తున్న కమ్యూనిటీలో పుట్టిన వ్యక్తి స్వరం సినిమాగా చూపించాల్సి వచ్చినప్పుడు ఘాటుగానే ఉంటుంది. పా. రంజిత్ సినిమాలు కూడా అంతే. అంబేద్కర్ ఆలోచనా విధానానికి తగ్గట్టు దళిత్ ఐడెంటిటీని ఎస్టాబ్లిష్ చేసేందుకు చిత్ర పరిశ్రమలో రాజీలేని పోరాటమే చేస్తున్నారాయన. కబాలి (2016), కాలా (2018)... ఈ రెండు చిత్రాల్లో సూపర్ స్టార్ రజనీకాంత్ స్టార్ ఇమేజ్‌కి సామాజిక న్యాయం కోసం పోరాడే యోధుడి పాత్రను మేళవించి పా. రంజిత్ చిత్రించిన విధానం తరాలుగా అన్యాయాలకు గురవుతున్న వర్గాలకు కొత్త బలాన్ని ఇచ్చింది.

రంజిత్ సినిమాలకు రజనీకాంత్ కూడా ఫిదా అయిపోయారు. సామాజిక అంశాలు... వాటిని ప్రభావితం చేసే పొలిటికల్ డైనమిక్స్ రంజిత్ సినిమాలో నిండి ఉంటాయి. చరిత్ర మూలాల్లోకి వెళ్లి దళితుల సంఘర్షణలను, వారి ఆత్మగౌరవ పోరాటాలను వెలికి తీసి ఈ ఏడాది 'తంగలాన్' రూపంలో పా. రంజిత్ సృష్టించిన సునామీ సినీ విమర్శకుల మెప్పు పొందింది. దర్శకుడిగా దృశ్య రూపం ఇవ్వడంతో సరిపెట్టకుండా నిర్మాతగా మారి ఈ తరహా చిత్రాలెన్నింటికో బ్యాక్‌బోన్‌గా నిలిచారు. మారి సెల్వరాజ్ తొలి చిత్రం 'పరియేరుం పెరుమాళ్' అందులో ఒకటి. దళిత జీవితాలను తెరకెక్కించే క్రమంలో వారిని బాధితులుగా కాకుండా పోరాట యోధులుగా చూపిస్తూ అవసరమైన చోట కమర్షియల్ ఎలిమెంట్స్‌ను కూడా జోడించి సాగిస్తున్న మూవీ జర్నీ తమిళ ఇండస్ట్రీలో పా. రంజిత్‌కు ప్రత్యేక స్థానాన్ని ఇచ్చింది.

కఠినమైన వాస్తవాలతో...

తమిళనాడులోని సామాజిక–రాజకీయ వాతావరణాన్ని నిజ జీవితాలకు దగ్గరగా చూపించడంలో వెట్రిమారన్‌ది ప్రత్యేక శైలి. వాస్తవాలు ఎంత కఠినంగా ఉంటాయో వెట్రిమారన్ సినిమాలు కూడా అంతే. విభిన్న వర్గాల జీవితాలను సజీవంగా చూపించడంలో వెట్రిమారన్ ముందుంటారు. ఈయన సినిమాల్లో కనిపించే సామాజిక సమస్యల పరిధి విస్తృతంగా ఉంటుంది. 'ఆడుగళం, విశారణై, అసురన్'... ఏ సినిమా తీసుకున్నా వాటి నేపథ్యంలో కనిపించేది ప్రజల పోరాటాలే. కళను వినోదానికి పరిమితం చేయకుండా సామాజిక మార్పుకు ఆయుధంగా మార్చుకున్న దర్శకులుగా మారి సెల్వరాజ్, పా. రంజిత్, వెట్రిమారన్ కనిపిస్తారు. కమర్షియల్ ఎలిమెంట్స్ చొప్పించినా సరే ఈ ముగ్గురి సినిమాలో పీడిత ప్రజలే ప్రధాన పాత్రలుగా ఉంటారు. వాళ్లే హీరోలుగా సినిమాను నడిపిస్తారు. భిన్న చిత్రాల ద్వారా వీళ్లు సంధిస్తున్న ప్రశ్నలు దేశ సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లోనూ వీళ్ల ముద్ర కనిపిస్తోంది. చిత్ర పరిశ్రమ వినోద సాధనంగా మారి, నేల విడిచి సాము చేస్తున్న సందర్భంలో వాస్తవికత, సామాజిక చైతన్యాన్ని నమ్ముకుని స్టోరీ టెల్లింగ్‌కు కొత్త అర్థం చెప్పే ప్రయత్నం చేస్తున్నారు ఈ ముగ్గురు. దర్శకులుగా వీరిది బాధ్యతాయుతమైన ప్రయాణం. – ఫణి కుమార్ అనంతోజు

మహేశ్‌గారు ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు

– నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని


అలీ, నమ్రత, సత్యదేవ్

హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ది లయన్ కింగ్'కు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్ కింగ్' సినిమా రూపొందిన సంగతి తెలిసిందే. బారీ జెన్కిన్స్ దర్శకత్వంలో రోమన్ స్కీ, మార్క్ సెర్యాక్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 20న విడుదల కానుంది. ఈ చిత్రం ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో డిసెంబరు 20నే రిలీజ్ కానుంది. 'ముఫాసా: ది లయన్ కింగ్'లోని ప్రధాన పాత్రలుగా కనిపించే ముఫాసా పాత్రకు మహేశ్‌బాబు, టాకాకు సత్యదేవ్, పుంబాకు బ్రహ్మానందం, టిమోన్‌కు అలీ, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి. శర్మ వాయిస్ ఓవర్స్ ఇచ్చారు. ఆదివారం జరిగిన ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఈ సినిమా కొత్త పోస్టర్‌ను లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''ముఫాసా: ది లయన్ కింగ్' మంచి ఎమోషనల్ రైడ్ మూవీ. మహేశ్‌బాబుగారు ఎంజాయ్ చేస్తూ, డబ్బింగ్ చెప్పారు'' అన్నారు. ''నా వాయిస్ డిస్నీ లైబ్రరీలో ఉండటం ఓ గ్రేట్ అచీవ్‌మెంట్‌గా ఫీలవుతున్నాను. మహేశ్‌బాబుగారితో కలిసి టాకా పాత్రకు డబ్బింగ్ చెప్పడం సంతోషంగా ఉంది'' అని తెలిపారు సత్యదేవ్. ''టిమోన్ పాత్రకు డబ్బింగ్ చెప్పడం నా అదృష్టం'' అని పేర్కొన్నారు అలీ.



అశోక్ కుమార్, కృష్ణచైతన్య, సీహెచ్ రామారావు, వెంకయ్యనాయుడు, సీహెచ్ ఫణి, ఆర్. నారాయణమూర్తి

ఘంటసాల సినిమా చూడటం తెలుగు వారి కర్తవ్యం

– మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

''ఘంటసాలగారిని శతాబ్ది గాయకుడు (సింగర్ ఆఫ్ సెంచరీ) అంటారు. ఆయన్ను నేను అమర గాయకుడు అంటాను. ఒక సాధారణ వ్యక్తిగా మొదలైన ఆయన జీవితం సంగీతంతో సాగుతూ... స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, సినీ గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, భగవద్గీత గానాన్ని అందించిన తొలి తెలుగు స్ఫూర్తిగా భావితరాలకు ఆయన ఆదర్శంగా నిలుస్తారని భావిస్తున్నాను'' అన్నారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. దివంగత ప్రముఖ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ 'ఘంటసాల: ది గ్రేట్'. ఈ చిత్రంలో ఘంటసాల పాత్రలో కృష్ణచైతన్య నటించారు. ఘంటసాల భార్య సావిత్రి పాత్రలో కృష్ణచైతన్య భార్య మృదుల నటించారు. సీహెచ్ రామారావు దర్శకత్వంలో సీహెచ్ ఫణి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ– ''ఘంటసాలగారిపై సినిమా తీసినందుకు ఫణిగారిని అభినందిస్తున్నాను. కృష్ణచైతన్య, మృదులలను మెచ్చుకుంటున్నాను. సదుద్దేశంతో తీసిన ఈ సినిమా చూడటం తెలుగువారి కర్తవ్యం'' అన్నారు. మరో అతిథి దర్శక–నిర్మాత–నటుడు ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ– ''ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలి. ఉత్తరాది గాయకులకు ఇచ్చి ఆయనకు ఎందుకు ఇవ్వలేదు? ఎంజీఆర్‌కు భారతరత్న ఇచ్చి ఎన్టీఆర్‌కు ఇవ్వలేదు. ఆయనకూ ఇవ్వాలి'' అని అన్నారు. ''మా సినిమాను ప్రేక్షకులకు ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను'' అన్నారు కృష్ణచైతన్య. ''ఘంటసాలగారి పాట ఎంత గొప్పదో అందరికీ తెలుసు. కానీ ఆయన వ్యక్తిత్వం కొందరికే తెలుసు. ఆయన వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని ఈ సినిమాలో చెప్పడం జరిగింది'' అని తెలిపారు సీహెచ్ రామారావు.

కొరియన్ కనకరాజు?


వరుణ్ తేజ్

కొరియన్ కనకరాజుగా మారనున్నారట వరుణ్ తేజ్. ఆయన హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాను ఆదివారం ప్రకటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. వచ్చే మార్చిలో చిత్రీకరణ ప్రారంభం కానుంది. ''ఈ న్యూ ఏజ్ ఎంటర్‌టైన్మెంట్ ఫిల్మ్‌లో వరుణ్ తేజ్ క్యారెక్టర్ కొత్తగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. కాగా ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

ప్రేమ... వినోదం...


కవిన్, అపర్ణా దాస్

కవిన్, అపర్ణా దాస్ ప్రధాన పాత్రల్లో గణేష్ కె. బాబు తెరకెక్కించిన చిత్రం 'డా..డా'. తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రాన్ని 'పా.. పా..' పేరుతో నీరజ కోట తెలుగులో రిలీజ్ చేయనున్నారు. డిసెంబరు 13న ఈ చిత్రం ఏపీ, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియాలో రిలీజ్ కానుంది. ''తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కిన చిత్రం 'పా.. పా..'. తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ అచ్చిబాబు రిలీజ్ చేయబోతున్నారు'' అని నీరజ కోట తెలిపారు.

క్షణ క్షణం ఉత్కంఠ

''కథ, కథనాలను నమ్మి 'ఎమ్ 4 ఎమ్'ని హాలీవుడ్ రేంజ్‌లో రూపొందించాం. మా సినిమా గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితం కావడం హ్యాపీగా ఉంది'' అని మోహన్ వడ్లపట్ల చెప్పారు. జో శర్మ, సంబీత్ ఆచార్య లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఎమ్ 4 ఎమ్'. మోహన్ వడ్లపట్ల దర్శకత్వంలో మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్‌విన్ గ్రూప్ (యూఎస్‌ఏ) పై రూపొందిన ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో త్వరలో విడుదల కానుంది. ''క్షణక్షణం ఉత్కంఠతో నడిచే ఈ మూవీలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగా చేశాను'' అని తెలిపారు జో శర్మ.


జో శర్మ, మోహన్



అర్జున్‌కు అధికారికంగా 2800 ఎలో రేటింగ్

అంతర్జాతీయ చెస్‌లో అరుదైన 2800 ఎలో రేటింగ్ మైలురాయిని తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్ అధికారికంగా అధిగమించాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ ప్లేయర్‌గా, ప్రపంచ చెస్‌లో 16వ ప్లేయర్‌గా అర్జున్ గుర్తింపు పొందాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అర్జున్ 2801 ఎలో రేటింగ్‌తో నాలుగో ర్యాంక్‌లో ఉన్నాడు. 21 ఏళ్ల అర్జున్ అక్టోబర్‌లో యూరోపియన్ క్లబ్ కప్ టోర్నీ సందర్భంగా లైవ్ రేటింగ్స్‌లో తొలిసారి 2800 మైలురాయిని దాటాడు.

గుకేశ్, డింగ్ లిరెన్ ఆరో గేమ్ 'డ్రా'



ప్రపంచ చెస్ కిరీటం కోసం తలపడుతున్న భారత్, చైనా గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, డింగ్ లిరెన్‌ల మధ్య 'డ్రా'ల వరంపర కొనసాగుతోంది. సింగపూర్ సిటీలో ఆదివారం జరిగిన ఆరో రౌండ్ గేమ్ 46 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ప్రస్తుతం ఇద్దరూ 3 పాయింట్లతో సమఉజ్జీలుగా కొనసాగుతున్నారు. మరో 8 రౌండ్లు మిగిలుండగా ఇంకో 4.5 పాయింట్లు ఎవరు ముందుగా గెలిస్తే వారే ప్రపంచ చాంపియన్ అవుతారు. నేడు విశ్రాంతి దినం. మంగళవారం ఏడో గేమ్ జరుగుతుంది.

'పింక్' మ్యాచ్‌లో భారత్‌దే విజయం

- ఫిట్‌నెస్, ఫామ్ చాటుకున్న గిల్
- రాణించిన నితీశ్ రెడ్డి, జైస్వాల్
- పీఎం ఎలెవన్‌పై టీమిండియా గెలుపు



కాన్‌బెర్రా ఎంపీ అలిసియా పేన్ నుంచి విన్నర్స్ ట్రోఫీ అందుకుంటున్న రోహిత్



నితీశ్ రెడ్డి

కాన్‌బెర్రా: భారత్, ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్ జట్ల మధ్య రెండు రోజుల డే–నైట్ ప్రాక్టీస్ మ్యాచ్ 'వన్డే'కు పరిమితమైంది. వరుణుడు కరుణించడంతో భారత బ్యాటర్లు 'పింక్ బాల్'తో ఆ కాస్త ప్రాక్టీస్‌కు నోచుకున్నారు. భారీ వర్షం వల్ల తొలి రోజు ఆటంతా రద్దవగా... రెండోరోజు వన్డేలా నిర్వహించారు. ఒక్కో జట్టుకు 46 ఓవర్లు కేటాయించారు. జట్టులోని 11 మందికి బ్యాటింగ్, బౌలింగ్ చేసే అవకాశం కల్పించారు. భారత జట్టు ఐదు వికెట్లు కోల్పోయి ఈ మ్యాచ్‌లో గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పీఎం టీమ్ 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ స్యామ్ కొన్‌స్టాస్ (97 బంతుల్లో 107; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో అలరించాడు. హనో జాకబ్స్ (60 బంతుల్లో 61; 4 ఫోర్లు, 2 సిక్సులు), జాక్ క్లేటన్ (52 బంతుల్లో 40; 6 ఫోర్లు) రాణించారు. హర్షిత్ రాణా (4/44) నిప్పులు చెరగడంతో ఒక దశలో పీఎం జట్టు 138 పరుగులకే 7 వికెట్లను కోల్పోయింది. అయితే కొన్‌స్టాస్, జాకబ్స్ ఎనిమిదో వికెట్‌కు 67 పరుగులు జోడించడంతో పీఎం జట్టు 200 పైచిలుకు స్కోరు చేయగలిగింది. భారత బౌలర్లలో ఆకాశ్‌దీప్ 2 వికెట్లు పడగొట్టగా... సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, సుందర్, జడేజా తలా ఒక వికెట్ తీశారు. అనంతరం భారత జట్టు మొత్తం 46 ఓవర్లు ఆడి 5 వికెట్లు కోల్పోయి 257 పరుగులు సాధించింది. టీమిండియా 42.5 ఓవర్లలోనే 241 పరుగుల విజయలక్ష్యాన్ని అందుకున్నా... ప్రాక్టీస్ కోసం పూర్తి ఓవర్లు ఆడింది. టాపార్డర్ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ (62 బంతుల్లో 50 రిటైర్డ్ నాటౌట్; 7 ఫోర్లు) ఫిట్‌నెస్, ఫామ్ చాటుకోగా... ఓపెనర్ యశస్వి జైస్వాల్ (59 బంతుల్లో 45; 9 ఫోర్లు), ఆంధ్ర ప్లేయర్ నితీశ్ కుమార్ రెడ్డి (32 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (36 బంతుల్లో 42 నాటౌట్; 5 ఫోర్లు) రాణించారు.

సింధు నిరీక్షణ ముగిసె...

- రెండేళ్ల తర్వాత మళ్లీ టైటిల్ సొంతం
- సయ్యద్ మోడీ ఓపెన్‌లో మూడోసారి విజేతగా నిలిచిన భారత స్టార్
- పురుషుల సింగిల్స్ చాంప్ లక్ష్య సేన్
- గాయత్రి–ట్రెసా జాలీ జోడీకి మహిళల డబుల్స్ టైటిల్



సింధు విజయగర్జన

లక్నో: టాప్ సీడ్ హోదాకు తగ్గట్టు ఆడిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ ఏడాది టైటిల్ లోటును తీర్చుకుంది. ఆదివారం ముగిసిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సింధు చాంపియన్‌గా నిలిచింది. తద్వారా 2 సంవత్సరాల 4 నెలల 18 రోజుల టైటిల్ నిరీక్షణకు తెరదించింది. ప్రపంచ 119వ ర్యాంకర్ వు లువో యు (చైనా)తో 47 నిమిషాలపాటు జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు 21–14, 21–16తో గెలుపొందింది. ఈ విజయంతో సింధుకు 15,750 డాలర్ల (రూ.13 లక్షల 31 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. సయ్యద్ మోడీ ఓపెన్‌లో సింధు టైటిల్ నెగ్గడం ఇది మూడో సారి. ఆమె 2017, 2022లోనూ విజేతగా నిలిచింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య వరల్డ్ టూర్‌లో ఈ ఏడాది సింధుకిదే తొలి టైటిల్‌కాగా... ఓవరాల్‌గా 18వ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. 29 ఏళ్ల సింధు చివరిసారి 2022 జూలైలో సింగపూర్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. ఆ తర్వాత ఆమె ఖాతాలో మరో టైటిల్ చేరలేదు. ఈ ఏడాది మలేసియా మాస్టర్స్ టోర్నీలో సింధు ఫైనల్ చేరినా రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

'ఈ విజయం నాలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. నా ప్రధాన లక్ష్యం గాయాల బారిన పడకుండా పూర్తి ఫిట్‌గా ఉండటమే. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ చాలా దూరంలో ఉన్నా ఫిట్‌గా ఉంటే వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లోనూ బరిలోకి దిగుతా. ఈ ఏడాదిని టైటిల్‌తో ముగించినందుకు ఆనందంగా ఉంది. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటా. జనవరి నుంచి కొత్త సీజన్‌ను ప్రారంభిస్తా' అని సింధు వ్యాఖ్యానించింది.

లక్ష్య సేన్ జోరు

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్‌కే టైటిల్ లభించింది. 31 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో లక్ష్య సేన్ 21–6, 21–7తో జియా హెంగ్ జేసన్ (సింగపూర్)పై గెలిచాడు. లక్ష్య సేన్‌కు 15,570 డాలర్ల (రూ. 13 లక్షల 31 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. లక్ష్య సేన్‌కు కూడా ఈ ఏడాది ఇదే తొలి టైటిల్ కావడం గమనార్హం. ఈ సంవత్సరం లక్ష్య సేన్ మొత్తం 14 టోర్నీలు ఆడగా... ఈ టోర్నీలోనే ఫైనల్‌కు చేరుకొని టైటిల్ సాధించడం విశేషం. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో పృథ్వీ కృష్ణ–సాయిప్రతీక్ (భారత్).. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో (భారత్) జోడీలు రన్నరప్‌గా నిలిచాయి.



లక్ష్య సేన్

గాయత్రి–ట్రెసా జోడీ అదుర్స్



స్వర్ణ పతకాలతో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ

మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గాయత్రి–ట్రెసా కెరీర్‌లో ఇదే తొలి సూపర్–300 టైటిల్ కావడం విశేషం. ఫైనల్లో గాయత్రి–ట్రెసా ద్వయం 21–18, 21–11తో బావో లి జింగ్–లి కియాన్ (చైనా) జంటను ఓడించింది. ఈ ఏడాది ఓవరాల్‌గా గాయత్రి–ట్రెసా జోడీ 20 టోర్నీలు ఆడి ఎట్టకేలకు తొలి టైటిల్‌ను దక్కించుకుంది. గాయత్రి–ట్రెసా జంటకు 16,590 డాలర్ల (రూ. 14 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ సంవత్సరం నిలకడగా రాణించిన గాయత్రి–ట్రెసా ద్వయం ఈనెల 11 నుంచి 15 వరకు చైనాలో జరిగే సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

విజేత రిషితా రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ సర్క్యూట్‌లో తెలంగాణ అమ్మాయి బసిరెడ్డి రిషితా రెడ్డి అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. రెండు వారాల వ్యవధిలో ఆమె తన ఖాతాలో రెండో టైటిల్‌ను జమ చేసుకోవడం విశేషం. న్యూఢిల్లీలో జరిగిన ఐటీఎఫ్ జే100 టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన రిషితా రెడ్డి చాంపియన్‌గా నిలిచింది. అండర్–18 సింగిల్స్ ఫైనల్లో రిషిత 4–6, 6–4, 6–3తో నెల్లీ ఇవనోవా (రష్యా)పై విజయం సాధించింది. గతవారం గువాహటిలో జరిగిన జే60 ఐటీఎఫ్ టోర్నీలోనూ రిషిత సింగిల్స్ విభాగంలో టైటిల్ గెల్చుకుంది.

ఐసీసీ చైర్మన్‌గా జై షా



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నూతన చైర్మన్‌గా జై షా ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పీఠం ఎక్కగానే ఆయన ముందు చాంపియన్స్ ట్రోఫీ రూపంలో సవాల్ ఎదురుగా ఉంది. అయితే ఇదివరకే ఆతిథ్య పాకిస్తాన్‌కు భారత్ వెళ్లదనే స్పష్టమైన సంకేతం ఉండటంతో ఇదేమంత సమస్య కాబోదని ఐసీసీ వర్గాలు భావిస్తున్నాయి. ఐసీసీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఐదో భారతీయుడిగా జై షా గుర్తింపు పొందాడు. గతంలో దివంగత జగ్మోహన్ దాల్మియాతో పాటు శరద్ పవార్, శశాంక్ మనోహర్, ఎన్. శ్రీనివాసన్‌లు ఐసీసీలో అత్యున్నత పదవీ బాధ్యతలు చేపట్టారు. అయితే 36 ఏళ్ల వయసులోనే జై షా ఎన్నికవడం ద్వారా అతిపిన్న వయసులో ఐసీసీ చైర్మన్ అయిన తొలి వ్యక్తిగా ఘనత వహించాడు. రెండేళ్లపాటు ఆయన పదవీలో కొనసాగుతారు.

బోర్డు కార్యదర్శి?

తదుపరి బోర్డు కార్యదర్శి ఎవరనే దానిపై ఇప్పటి వరకూ స్పష్టతే లేదు. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమల్‌తో పాటు బీసీసీఐ కోశాధికారి ఆశిష్ షెలర్, సంయుక్త కార్యదర్శి దేవజిత్ లోన్ సైకియాల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇక ఐసీసీలో భారత ప్రతినిధిగా బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ లేదంటే సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాలలో ఒకరు పాల్గొంటారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నిఫ్ట్‌లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్).. దేశవ్యాప్తంగా ఉన్న 18 క్యాంపస్‌లలో అకడమిక్ సెషన్ 2025–26కు సంబంధించి బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» నిఫ్ట్ క్యాంపస్‌లు: బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, చెన్నై, దమణ్, గాంధీనగర్, హైదరాబాద్, జోధ్‌పూర్, కాంగ్రా, కన్నూర్, ముంబై, న్యూఢిల్లీ, పాట్నా, పంచకుల, రాయ్‌బరేలి, షిల్లాంగ్, శ్రీనగర్, వారణాసి.

కోర్సుల వివరాలు

» బ్యాచిలర్ ప్రోగ్రామ్: నాలుగేళ్ల వ్యవధి.
» బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్(బీడీఈఎస్): ఫ్యాషన్ డిజైన్/లెదర్ డిజైన్/యాక్సెసరీ డిజైన్/టెక్స్‌టైల్ డిజైన్/నిట్‌వేర్ డిజైన్/ఫ్యాషన్ కమ్యూనికేషన్/ఫ్యాషన్ ఇంటీరియర్.
» మాస్టర్స్ ప్రోగ్రామ్: రెండేళ్ల వ్యవధి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్(ఎండీఈఎస్), మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్(ఎంఎఫ్ఎం), మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎంఎఫ్‌టెక్).
పీహెచ్‌డీ ప్రోగ్రామ్(డిజైన్, మేనేజ్‌మెంట్, టెక్నాలజీ).
» అర్హత: యూజీ ప్రోగ్రామ్‌కు 10+2 పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. పీజీ ప్రోగ్రామ్‌కు ఏదైనా డిగ్రీ లేదా బీఎఫ్‌టెక్, బీఈ/బీటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: యూజీకి 24 ఏళ్లు మించకూడదు. పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు వయోపరిమితి లేదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్యమైన తేదీలు

యూజీ, పీజీ ప్రోగ్రామ్

» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 06.01.2025.
» దరఖాస్తుల సవరణ తేది: 10.01.2025 నుంచి 12.01.2025 వరకు.
» అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేది: జనవరి మూడో వారం 2025.
» డిగ్రీ, పీజీ ప్రవేశ పరీక్ష తేది: 09.02.2024.
» సిట్యుయేషన్ టెస్ట్/ఇంటర్వ్యూ/డాక్యుమెంట్ వెరిఫికేషన్: ఏప్రిల్, 2025.
» వెబ్‌సైట్: www.nift.ac.in/admission

మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్‌లో 234 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్.. రెగ్యులర్ ప్రాతిపదికన నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 234.

పోస్టుల వివరాలు

» స్కిల్డ్–1(ఐడీ–5): చిప్పర్ గ్రైండర్, కాంపోజిట్ వెల్డర్, ఎలక్ట్రిక్ క్రేన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, గ్యాస్ కట్టర్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్), జూనియర్ డ్రాఫ్ట్స్ మ్యాన్(ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్), జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ (మెకానికల్), జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్), మిల్ రైట్ మెకానిక్, మెషినిస్ట్, జూనియర్ ప్లానర్ ఎస్టిమేటర్(మెకానికల్), జూనియర్ ప్లానర్ ఎస్టిమేటర్(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్), రిగ్గర్, స్టోర్ కీపర్/స్టోర్ స్టాఫ్, స్ట్రక్చరల్ ఫ్యాబ్రికేటర్, యుటిలిటీ హ్యాండ్(స్కిల్డ్), ఉడ్ వర్క్ టెక్నీషియన్(కార్పెంటర్).
» సెమీ–స్కిల్డ్–1(ఐడీ–1): ఫైర్ ఫైటర్స్, యుటిలిటీ హ్యాండ్(సెమీ–స్కిల్డ్).
» స్పెషల్ గ్రేడ్ (ఐడీ–9): మాస్టర్ ఫస్ట్ క్లాస్, యాక్ట్ ఇంజనీర్‌కు లైసెన్స్.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఐటీఐ, ఎన్ఏసీ పరీక్ష, డిప్లొమా, డిగ్రీ, పీజీ, సర్టిఫికేట్ ఆఫ్ కాంపిటెన్సీ(ఫస్ట్ క్లాస్ మాస్టర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.11.2024 నాటికి 18 నుంచి 38 ఏళ్ల మధ్య ఉండాలి. మాస్టర్ ఫస్ట్ క్లాస్ /యాక్ట్ ఇంజనీర్‌కు లైసెన్స్ గ్రేడుకు గరిష్ఠంగా 48 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు స్పెషల్ గ్రేడ్(ఐడీ–9) –రూ.22,000 నుంచి రూ.83,180, స్కిల్డ్ గ్రేడ్–1(ఐడీ–5) రూ.17,000 నుంచి రూ.64,360, సెమీ–స్కిల్డ్ గ్రేడ్–1(ఐడీ–2) రూ.13,200 నుంచి రూ.49,910.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఉద్యోగానుభవం, ట్రేడ్/స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.12.2024
» అర్హులైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది: 31.12.2024.
» ఆన్‌లైన్‌పరీక్ష తేది: 15.01.2025.
» వెబ్‌సైట్: https://mazagondock.in

ఎంబీఏకు మరో మార్గం.. సీమ్యాట్!

» సీమ్యాట్–2025 నోటిఫికేషన్ విడుదల
» సీమ్యాట్ స్కోర్‌తో ఎంబీఏ, పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశం
» వేయికి పైగా ఇన్‌స్టిట్యూట్‌లకు ప్రామాణికంగా సీమ్యాట్

కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్).. దేశ వ్యాప్తంగా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏ, పీజీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా దాదాపు వేయి ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏ తదితర మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. ఎన్‌టీఏ ప్రతి ఏటా సీమ్యాట్‌ను నిర్వహిస్తోంది. తాజాగా సీమ్యాట్–2025కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. సీమ్యాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఎంబీఏ స్పెషల్

బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థుల్లో ఎక్కువ శాతం మంది లక్ష్యం మేనేజ్‌మెంట్ పీజీ. ఇందుకోసం ఐఐఎంల్లో ప్రవేశానికి నిర్వహించే క్యాట్ మొదలు రాష్ట్ర స్థాయిలోని ఉమ్మడి ఎంట్రన్స్‌ల వరకూ.. ఎన్నో ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కానీ అందుబాటులో ఉండే సీట్లు, పోటీ కారణంగా అందరికీ సీట్లు లభించకపోవచ్చు. ఇలాంటి వారికి మెరుగైన ప్రత్యామ్నాయం సీమ్యాట్. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఎంబీఏ కళాశాలల్లో అడ్మిషన్ లభిస్తుంది.

నిర్వహణ.. ఎన్‌టీఏ

సీమ్యాట్‌ను 2018 వరకు ఏఐసీటీఈ సొంతంగా నిర్వహించేది. 2019 నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో పరీక్ష జరుగుతోంది. ఫలితాల అనంతరం విద్యార్థులు ఆయా ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశానికి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హతలు

బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

400 మార్కులకు పరీక్ష

సీమ్యాట్‌ను మొత్తం అయిదు విభాగాల్లో నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ 20 ప్రశ్నలు–80 మార్కులు, లాజికల్ రీజనింగ్ 20 ప్రశ్నలు–80 మార్కులు, లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు–80 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–80 మార్కులకు, ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 20 ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. మొత్తం మూడు గంటల వ్యవధిలో ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1 మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

వేయికిపైగా ఇన్‌స్టిట్యూట్‌లు

సీమ్యాట్–2025 స్కోర్‌ను దేశవ్యాప్తంగా వేయికి పైగా ఇన్‌స్టిట్యూట్‌లు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. సదరు ఇన్‌స్టిట్యూట్‌ల్లో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(పీజీపీఎం), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) కోర్సుల్లో ప్రవేశాలకు సీమ్యాట్ స్కోరుతో ప్రవేశం పొందొచ్చు. క్యాట్‌లో మంచి ర్యాంకు దక్కని విద్యార్థులకు సీమ్యాట్ చక్కని ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది.

మలి దశ ఎంపిక ప్రక్రియ

సీమ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించే ఇన్‌స్టిట్యూట్‌లు.. మలిదశలో ప్రత్యేక ఎంపిక ప్రక్రియను అనుసరిస్తున్నాయి. ఆయా కాలేజీలు సీమ్యాట్‌లో పొందాల్సిన కనీస స్కోర్‌ను నిర్దేశిస్తున్నాయి. ఆ స్కోర్ సాధించిన వారు ఎంబీఏలో అడ్మిషన్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జీడీ, పీఐలు

పలు ఇన్‌స్టిట్యూట్‌లు మలిదశలో గ్రూప్ డిస్కషన్(జీడీ), పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ) నిర్వహిస్తున్నాయి. వీటిలో చూపిన ప్రతిభ, పొందిన మార్కులు, సీమ్యాట్ స్కోర్‌కు వెయిటేజీ కల్పించి ప్రవేశాలు ఖరారు చేస్తున్నాయి. కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు నేరుగా సీమ్యాట్ స్కోర్ ఆధారంగా కనీస కటాఫ్‌ను నిర్దేశించి ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందించి సీట్ల భర్తీ చేస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:2024,డిసెంబర్13
- దరఖాస్తు సవరణ అవకాశం: 2024, డిసెంబర్ 15 నుంచి 17 వరకు
- సీమ్యాట్ అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2025 జనవరి 20
- సీమ్యాట్ తేదీ: 2025, జనవరి 25
- పూర్తివివరాలకు వెబ్‌సైట్: https://exams.nta.ac.in/CMAT

రాత పరీక్షలో రాణించేలా

క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్

అభ్యర్థుల్లోని గణిత, డేటా విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో మంచి స్కోర్ సాధించాలంటే.. అర్థమెటిక్–రేషియోస్, మిక్చర్స్–అలిగేషన్స్, టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, పర్సంటేజెస్, టైమ్ అండ్ స్పీడ్, ప్రాఫిట్ అండ్ లాస్, ఇంటరెస్ట్, బేసిక్ స్టాటిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా నెంబర్ ప్రాపర్టీస్, ప్రాబబిలిటీ, కౌంటింగ్ ప్రిన్సిపల్స్, జామెట్రీ, డెరివేటివ్స్ (మ్యాగ్జిమా–మినిమా) వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి టేబుల్ అండ్ పై ఛార్ట్స్, బార్ డయాగ్రమ్స్ అండ్ గ్రాఫ్స్, ఛార్ట్‌లను పరిశీలించడం, వాటిలోని గణాంకాలను విశ్లేషించడం వంటి నైపుణ్యాలు సొంతం చేసుకునేలా ప్రిపరేషన్ సాగించాలి.

లాజికల్ రీజనింగ్

ఈ విభాగం కోసం లీనియర్, సీటింగ్, సీక్వెన్సింగ్ అండ్ అరేంజింగ్ విత్ కండిషన్స్ టు కోడింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. స్టేట్‌మెంట్–కంక్లూజన్, లాజికల్ పజిల్, న్యూమరికల్ పజిల్, వెన్ డయాగ్రమ్, ట్రూ–ఫాల్స్ స్టేట్‌మెంట్స్, విజువల్ రీజనింగ్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టితో ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం క్యాట్, ఎక్స్‌ఏటీ తదితర పరీక్షల పూర్వ ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్

అభ్యర్థుల్లోని ఇంగ్లిష్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. యూసేజ్ ఆఫ్ ఆర్టికల్ నాన్ ఫెనైట్స్, డాంగ్లింగ్ మాడిఫైర్, యూసేజ్ ఆఫ్ నౌన్స్ అండ్ ప్రొనౌన్స్, అడ్జెక్టివ్స్, ఆడ్ వెర్బ్స్, ప్రిపోజిషన్స్–రెగ్యులర్, ఫాలోవుడ్, సింటాక్స్, సబ్జెక్ట్–వెర్బ్ అరేంజ్‌మెంట్, సింపుల్, కంటిన్యూయస్, పర్ఫెక్ట్ టెన్సెస్ అండ్ కండిషనల్ అన్‌రియల్ పాస్ట్, జంబుల్డ్ పారాగ్రాఫ్స్ వంటి అంశాలపై పట్టు సాధించడం ద్వారా మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. అదే విధంగా రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజెస్ కూడా ఈ విభాగంలో ఉంటాయి. 500 నుంచి 600 పదాలతో పాసేజ్‌లు ఇస్తారు. తర్వాత పాసేజ్‌కు సంబంధించిన ఇంటర్ ఫియరెన్స్ డ్రాన్, సెంట్రల్ ఐడియా, ఫ్రేజెస్, ఇడియమ్స్, తదితరాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రామాణిక ఇంగ్లిష్ దినపత్రికలను రోజూ చదువుతూ వొకాబ్యులరీ పెంచుకోవాలి. సెంటెన్స్ ఫార్మేషన్‌పై పట్టుసాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలపై అవగాహనను పరీక్షించే విభాగం ఇది. స్టాండర్డ్ జీకే బుక్స్, న్యూస్ పేపర్లు, వీక్లీలు, వెబ్‌సైట్స్, పీరియాడికల్స్‌ను ఫాలో అవ్వాలి. వీటితోపాటు బిజినెస్, జాతీయ, అంతర్జాతీయ అంశాలు, వార్తల్లో వ్యక్తులు, భారత రాజ్యాంగం, వివిధ దేశాలు–కరెన్సీలు, భారతదేశం–రాష్ట్రాలు, అంతర్జాతీయ సంస్థలు, ద్రవ్య, కోశ గణాంకాలు, ఇటీవల చోటు చేసుకుంటున్న సమకాలీన పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అంశాలు మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కీలకమని భావించి ఈ విభాగాన్ని ప్రవేశపెట్టారని చెప్పొచ్చు. అభ్యర్థులు.. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌నకు సంబంధించిన టెక్నికల్ టెర్మినాలజీ (సీడ్ ఫండింగ్, క్రౌడ్ ఫండింగ్, ఏంజెల్ ఇన్వెస్టర్స్ తదితర) పై అవగాహన పొందాలి. స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి పథకాల లక్ష్యాలు, వాటి ప్రస్తుత పరిస్థితులపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

250-350 స్కోర్ సాధించేలా

సీమ్యాట్ ద్వారా టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు 300 నుంచి 350 మార్కులు సాధించేలా కృషి చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది. గత రెండేళ్ల ఫైనల్ మెరిట్ లిస్ట్‌లను పరిగణనలోకి తీసుకుంటే.. 300కు పైగా స్కోర్ సాధించిన అభ్యర్థులు వేయికి పైగా ఉండగా, 250 నుంచి 300 మధ్యలో స్కోర్ సాధించిన అభ్యర్థుల సంఖ్య దాదాపు 10వేలుగా ఉంది. కాబట్టి అభ్యర్థులు ఈ శ్రేణిలో స్కోర్ సాధించేలా కృషి చేస్తే టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం ఖరారు చేసుకునే అవకాశం ఉంది.

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
759	217
79,803	24,131

విదేశీ సూచీలు

● నాస్‌డాక్	19,218	▲	158
● డోజోన్స్	44,911	▲	189
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,287	▲	6
● డాక్స్	19,626	▲	201
● షాంఘై	3,326	▲	31
● నికాయ్	38,208	▼	141

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.09	85.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.70	108.53
€	యూరో	ఎస్‌బీఐ	88.11	90.71
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.56	56.99
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.98	56.21
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.57	65.29
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.63	23.19
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.09	23.87
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.77	12.59

ఆర్థిక లక్ష్యాన్ని చేరేదెలా..?





స్థిరమైన ఆదాయం చాలా మందికి ఒక ముఖ్యమైన ఆర్థిక లక్ష్యం. రిటైర్మెంట్ ప్రణాళిక కావొచ్చు. లేదా ప్యాసివ్ ఆదాయ మార్గం కోరుకోవచ్చు. అప్పటికే వస్తున్న ఆదాయాన్ని మరింత పెంచుకోవాలని అనుకోవచ్చు. క్రమం తప్పకుండా ఆదాయం వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవితానికీ స్థిరత్వాన్నిస్తుంది. ముందస్తు పింఛను ప్రణాళికలు లేని వారు రిటైర్మెంట్ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం వచ్చే మార్గాలను ఆశ్రయించాల్సిందే. ఉద్యోగం/వృత్తి/వ్యాపారాల్లో ఉన్న వారు సైతం తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఆసక్తి చూపించొచ్చు. కొన్ని రకాల వృత్తుల్లో, వ్యాపారాల్లో ఉన్న వారికి ప్రతి నెలా స్థిరమైన ఆదాయం ఉండదు. ఈ తరహా వ్యక్తుల ముందు ఎన్నో పెట్టుబడి సాధనాలు అందుబాటులో ఉన్నాయి. రిస్క్, రాబడుల ఆధారంగా తమకు అనువైనవి ఎంపిక చేసుకోవడం ద్వారా తమ ఆర్థిక లక్ష్యాలను సులభంగా సాకారం చేసుకోవచ్చు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

స్థిరమైన ఆదాయానికి ఎన్నో మార్గాలు

- పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్
- సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్
- మ్యూచువల్ ఫండ్స్ మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్లు
- బీమా సంస్థల యాన్యుటీ ప్లాన్లు
- సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ కూడా ఒక సాధనమే
- రిస్క్, రాబడుల ఆధారంగా తుది ఎంపిక

పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకం (ఎంఐఎస్)

నెలవారీ ఆదాయం కోసం అందుబాటులోని డెట్ సాధనాల్లో ఇది కూడా ఒకటి. ఇందులో పెట్టుబడులకు నూరు శాతం భారత ప్రభుత్వం హామీ ఉంటుంది. కనుక పెట్టుబడులు, రాబడుల విషయంలో ఎలాంటి రిస్క్ ఉండదు. రిస్క్ వద్దనుకునే వారికి అనువైనది. ప్రస్తుతం ఇందులో పెట్టుబడిపై 7.4 శాతం వార్షిక రాబడి అందుబాటులో ఉంది. ఈ ప్రకారం రూ. లక్ష పెట్టుబడిపై ప్రతి నెలా రూ.616 ఆదాయంగా అందుతుంది. ఇందులో డిపాజిట్ కాల వ్యవధి ఐదేళ్లు. గడువు తీరిన తర్వాత మరో ఐదేళ్లకు తిరిగి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఒకరు గరిష్ఠంగా రూ.9,00,000 వరకు, ఉమ్మడిగా అయితే రూ.15,00,000 ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇందులో పెట్టుబడులకు, వడ్డీ రాబడికి ఎలాంటి పన్ను ప్రయోజనం లేదు. రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. తమ వార్షిక ఆదాయంలో చూపించి పన్ను చెల్లించాల్సిందే. 10 ఏళ్లు నిండిన మైనర్ పేరిట కూడా ఖాతా ప్రారంభించొచ్చు. నెలవారీ వడ్డీని పోస్టల్ సేవింగ్స్ ఖాతాలో జమ చేస్తారు. గడువు కంటే ముందే ఈ పథకం నుంచి వైదొలిగేట్టు అయితే కొంత నష్టపోవాల్సి వస్తుంది. డిపాజిట్ చేసిన ఏడాది నుంచి మూడేళ్లలోపు అయితే పెట్టుబడిలో 2 శాతం, మూడేళ్ల తర్వాత ఒక శాతాన్ని కోత విధిస్తారు.

దీర్ఘకాల ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్‌లు)

5–40 ఏళ్ల కాలంతో ఇవి ఉంటాయి. వీటిపై ఆరు నెలలకు ఒకసారి వడ్డీ ఆదాయం పొందొచ్చు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యయాల కోసం ఈ బాండ్ల ద్వారా నిధులు సమీకరిస్తాయి. వీటిల్లో రిస్క్ లేదనే చెప్పుకోవచ్చు. ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ వద్ద రిటైల్ డైరెక్ట్ ఖాతాను ఉచితంగా తెరిచి, జీసెక్‌లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ ఖాతా ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను ప్రైమరీ, సెకండరీ మార్కెట్లో ఎలాంటి చార్జీలు లేకుండా కొనుగోలు చేసుకోవచ్చు. ప్రభుత్వ బాండ్లలో ఫిక్స్‌డ్, ఫ్లోటింగ్, ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్‌డ్ అని పలు రకాలున్నాయి. గడువు ముగిసే వరకు కొనసాగకుండా, మధ్యంతరంగా సెకండరీ మార్కెట్లో విక్రయించాలనుకుంటే అప్పటి వడ్డీ రేట్ల పరంగా చేతికి వచ్చే మొత్తంలో మార్పు ఉండొచ్చు. కేంద్ర ప్రభుత్వం ట్రెజరీ బిల్లులు, డేటెడ్ సెక్యూరిటీలు (జీ-సెక్‌లు) జారీ చేస్తుంటుంది. ఇందులో ట్రెజరీ బిల్లులు అన్నవి 91 రోజులు, 182 రోజులు, 364 రోజుల వ్యవధితో వస్తాయి. వీటిల్లో వడ్డీ చెల్లింపులు ఉండవు. కూపన్ రేటు మేర ముందే ముఖ విలువలో తగ్గించి తీసుకుంటారు. కనుక ఇన్వెస్టర్లు జీసెక్‌లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీలు జారీ చేస్తుంటాయి.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)

60 ఏళ్లు నిండిన వారికే ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడానికి అనుమతి ఉంది. పదవీ విరమణ తర్వాత ఆదాయం కోరుకునే వారు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు. ఇందులో ఒకరు రూ.30లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. దంపతులు అయితే ఉమ్మడిగా రూ.60 లక్షలు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పథకం కాల వ్యవధి ఐదేళ్లు. దీనిపై 8.2 శాతం వడ్డీ లభిస్తుంది. అన్ని పోస్టాఫీసుల్లోనూ, కొన్ని బ్యాంక్ శాఖల్లో ఎస్‌సీఎస్‌ఎస్ ఖాతా తెరవొచ్చు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లిస్తారు. ఇది ఆదాయపన్ను పరిధిలోకి వస్తుంది. ఇందులో చేసే పెట్టుబడిపై అదే ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. వడ్డీ రాబడిని ఏ ఏడాదికి ఆ ఏడాదే పన్ను రిటర్నుల్లో చూపించాల్సి ఉంటుంది. ఆదాయ శ్లాబుకు అనుగుణంగా పన్ను రేటు చెల్లించాల్సి వస్తుంది. ముందస్తు పదవీ విరమణ తీసుకున్న వారికి కనీస వయోపరిమితి 55 ఏళ్లుగా ఉంది. రక్షణ దళాల్లో పనిచేసిన మాజీ ఉద్యోగులు 50 ఏళ్లకే ఇందులో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్లు

మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్లను (ఎంఐపీలు) ఆఫర్ చేస్తుంటాయి. ప్రధానంగా డెట్ సెక్యూరిటీల్లో, స్వల్పంగా (10–20శాతం) ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇన్వెస్టర్లకు స్థిరాదాయాన్ని అందిస్తాయి. వీటిల్లో రాబడులకు ఎలాంటి హామీ ఉండదు. స్థిరంగానూ ఉండవు. మార్కెట్ ఆధారితంగా రాబడులు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో రాబడులు మరీ తగ్గొచ్చు. వీటిల్లో రిస్క్ తక్కువ. లిక్విడిటీ ఎక్కువ. ఎప్పుడు అవసరమైతే అప్పుడు పెట్టుబడిని వెనక్కి తీసుకోవచ్చు.

సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్లు (ఎస్‌డబ్ల్యూపీ)

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్)లు గురించి తెలిసే ఉంటుంది. ఎంపిక చేసుకున్న పథకాల్లో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకునేందుకు వీలు కల్పించేదే సిప్. దీనికి విరుద్ధంగా ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి క్రమంగా కొంత చొప్పున ఉపసంహరించుకోవడమే ఎస్‌డబ్ల్యూపీ. ఎంత మేర ఉపసంహరించుకోవాలన్నది ఇన్వెస్టర్ అభీష్టమే. తమ వద్దనున్న మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనువైన ఫండ్స్‌ను ముందుగా ఎంపిక చేసుకోవాలి. అందులో ఏకమొత్తంలో కాకుండా, ఆరు నుంచి 12 నెలల సమాన వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల కొనుగోలు సగటుగా మారుతుంది. ఆ తర్వాత నుంచి ప్రతి నెలా నిర్ణీత శాతం మేర ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ఉపసంహరించుకోవచ్చు. రాబడుల కంటే మూడు శాతం తక్కువ ఉపసంహరణకు పరిమితం కావాలి. దీనివల్ల ఈ మూడు శాతం తిరిగి పెట్టుబడి వృద్ధికి దోహదపడుతుంది. దీంతో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని అధిగమించేందుకు వీలుంటుంది.

మోతీలాల్ ఓస్వాల్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అఖిల్ చతుర్వేది సూచన ప్రకారం.. ఈక్విటీల్లో 65 శాతం, డెట్‌కు 35 శాతం కేటాయించే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ లేదా ఈక్విటీలకు 60 శాతం, డెట్‌కు 40 శాతం కేటాయించే బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. వీటిల్లో దీర్ఘకాలంలో రాబడులు 12–13 శాతం మేర ఉంటాయి. కనుక ఉపసంహరణ 6–9 శాతం మించకూడదు. ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. ఇవి అయితే ఈక్విటీ కేటాయింపులను 35 శాతానికే పరిమితం చేసి మిగిలిన మొత్తాన్ని డెట్‌కు కేటాయిస్తాయి. వీటిల్లో దీర్ఘకాల రాబడి 9–10 శాతం మేర ఉంటుంది. కనుక 6 శాతం ఉపసంహరణకు పరిమితం కావాలి. ఇవే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి, డివిడెండ్ ఆప్షన్ ఎంపిక చేసుకున్నా సరిపోతుంది. కానీ, డివిడెండ్ ఎప్పుడు ప్రకటించాలన్నది ఫండ్స్ సంస్థల అభీష్టం. అందుకే ఎస్‌డబ్ల్యూపీ మెరుగైన ఆప్షన్ అవుతుంది. వీటిల్లో పెట్టుబడులకు ఎలాంటి పన్ను ప్రయోజనం లేదు. కానీ, ఏడాదిలోపు విక్రయించిన పెట్టుబడులకు సంబంధించి లాభంపై 20 శాతం పన్ను, ఏడాది మించిన పెట్టుబడులు విక్రయించగా వచ్చిన లాభంపై మొదటి రూ.1.25 లక్షల తర్వాతి మొత్తంపై 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

యాన్యుటీ ప్లాన్లు

పెట్టుబడిపై మరుసటి నెల నుంచే ఆదాయాన్నిచ్చే 'ఇమీడియెట్ యాన్యుటీ ప్లాన్'లను జీవిత బీమా కంపెనీలు ఆఫర్ చేస్తుంటాయి. ఎల్‌ఐసీ నుంచి జీవన్ శాంతి, జీవన్ అక్షయ్ ఇవే తరహా ప్లాన్లు. ఇన్వెస్టర్ల అవసరాలకు అనుగుణంగా ఈ ప్లాన్లలో ఎన్నో ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఎంపిక చేసుకున్న కాలం వరకు స్థిరమైన రాబడులు ఇందులో వస్తాయి. వడ్డీ రేట్లలో అస్థిరతల ప్రభావం వీటి రాబడిపై ఉండవు. నెలవారీ, త్రైమాసికం, ఆరు నెలలు, ఏడాదికోసారి ఆదాయం వచ్చే ఆప్షన్లలో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు. జీవితకాలానికి ఈ యాన్యుటీ ప్లాన్లను తీసుకోవచ్చు. మరణానంతరం పెట్టుబడిని నామీనికి అందిస్తారు. వీటికి పన్ను పరమైన ప్రయోజనాలు లేవు. ఈ ప్లాన్ల నుంచి అందుకునే రాబడిపై 1.8 శాతం జీఎస్‌టీ చెల్లించాలి. ఈ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్లు అని కూడా ఉంటాయి. అవి ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేసిన వెంటనే కాకుండా.. నిర్ణీత కాలం తర్వాత నుంచి క్రమం తప్పకుండా చెల్లింపులు చేసేవి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు)



బ్యాంకుల్లో దీర్ఘకాల డిపాజిట్లపై వడ్డీ 7–9 శాతం మధ్య ఉంది. ప్రముఖ బ్యాంకుల్లో ఇది 7–8 శాతం మధ్య ఉంటే, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు కొంచెం అదనంగా ఆఫర్ చేస్తున్నాయి. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (నాన్ క్యుములేటివ్)లపై ప్రతి నెలా వడ్డీ చెల్లింపులు లభిస్తాయి. కాకపోతే మరీ దీర్ఘకాలానికి (పదేళ్లకు మించిన) డిపాజిట్ చేసుకోవడానికి అవకాశం ఉండదు. పైగా ఎలాంటి పన్ను ప్రయోజనం లేదు. వడ్డీ రాబడి ఆదాయ పన్ను పరిధిలోకి వస్తుంది. రిస్క్ పరంగా చూస్తే.. బ్యాంక్ ఎఫ్‌డీలకు ఆర్‌బీఐ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద రక్షణ ఉంటుంది. బ్యాంక్ సంక్షోభంలో పడితే ఒక బ్యాంక్ పరిధిలో ఒక ఖాతాదారు పేరిట ఎంత డిపాజిట్ ఉన్నప్పటికీ గరిష్ఠంగా రూ.5లక్షల వరకు వెనక్కి వస్తుంది. కనుక ఒక బ్యాంక్ పరిధిలో (ఎన్ని శాఖలైనా) రూ.5లక్షలే డిపాజిట్ చేసుకోవడం తెలివైన నిర్ణయం.

కార్పొరేట్ డిపాజిట్లు

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు (హెచ్‌ఎఫ్‌సీలు) తమ డిపాజిట్ల ద్వారా నిధులు సమీకరిస్తుంటాయి. ఈ తరహా కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల(నాన్ క్యుములేటివ్)లో ఇన్వెస్ట్ చేసుకుని, వీటి నుంచి నెలవారీ/మూడు నెలలు/ఆరు నెలలు/ఏడాదికి ఒకసారి చొప్పున ఆదాయం తీసుకునే వెసులుబాటు ఉంది. వీటిని బ్యాంక్ డిపాజిట్లతో పోల్చి చూడొచ్చు. బ్యాంకుల్లో రూ. 5 లక్షల వరకు డిపాజిట్లకు రక్షణ ఉంటుంది. కానీ కార్పొరేట్ డిపాజిట్లలో ఎలాంటి హామీ ఉండదు. కనుక రిస్క్ తగ్గించుకునేందుకు ఏఏఏ రేటెడ్, ఏఏ మైనస్ రేటెడ్ డిపాజిట్లను ఎంపిక చేసుకోవచ్చు. సంబంధిత ఆర్థిక సంస్థ గత చరిత్రను ఇన్వెస్ట్ చేసే ముందు పరిశీలించాలి. బ్యాంక్ ఎఫ్‌డీల కంటే కాస్త అధిక రాబడులు వీటిల్లో ఉంటాయి. వడ్డీ ఆదాయానికి ఎలాంటి పన్ను ప్రయోజనాల్లేవు. ఉదాహరణకు బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థలు డిపాజిట్లపై నిధులు సమీకరిస్తుంటాయి. ఇవి మెరుగైన రేటింగ్ కలిగిన సంస్థలు.

బాండ్ ల్యాడర్ పోర్ట్‌ఫోలియో

వివిధ కాల వ్యవధులతో బాండ్లను కొనుగోలు చేయడం. అంటే ఒక్కో బాండ్ మెచ్యూరిటీ ఒకే తేదీతో కాకుండా, వరుస క్రమంలో ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు ఏడాది కాలానికి ఒకటి తీసుకుంటే, 13 నెలలు, 14 నెలలు, 15 నెలలు ఇలా అనమాట. గడువు తీరి చేతికి వచ్చిన ప్రతి బాండ్ మెచ్యూరిటీ మొత్తంలో అసలుతో తిరిగి బాండ్ కొనుగోలు చేయాలి. వడ్డీ భాగాన్ని ఆదాయం కింద వినియోగించుకోవాలి.

పీర్ టు పీర్ (పీ2పీ) లెండింగ్

పీ2పీ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు ప్రత్యేకంగా ఉన్నాయి. ఇవి రుణం కావాల్సిన వారిని, అదే సమయంలో రుణంపై ఆదాయం కోరుకునే వారిని ఒకే వేదికగా కలుపుతాయి. బాండ్లు, ఎఫ్‌డీల కంటే పీ2పీ ప్లాట్‌ఫామ్‌లు ఎక్కువ రాబడికి మార్గం చూపుతాయి. కాకపోతే రుణం తీసుకునే వ్యక్తికి సంబంధించి ఆర్థిక చరిత్ర ఈ సంస్థలకు పెద్దగా తెలియదు. కనుక రుణ ఎగవేతల రిస్క్ వీటిల్లో ఉంటుంది. వడ్డీ ఆదాయంలో కొంత పంచుకునేట్టు అయితే పీ2పీ సంస్థలు రుణం వసూలు బాధ్యతను తీసుకుంటున్నాయి.

వీటిని గమనించాలి..

- నెలవారీ లేదా త్రైమాసికంవారీ స్థిరమైన ఆదాయానికి వీలుగా పెట్టుబడి సాధనం ఎంపికలో ఎంతో ఆచితూచి వ్యవహరించాలి. అందరికీ అన్నీ అనుకూలంగా ఉండవు. పెట్టుబడికి అందుబాటులో ఉన్న నిధి, వాటిపై ఆశిస్తున్న రాబడి, ఎంత రిస్క్ తీసుకోగలరు? ఇలాంటివన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. తమ ఆకాంక్షలకు సరిపోలే ఉత్పత్తిని ఎంపిక చేసుకోవాలి. పెట్టుబడుల వృద్ధికి, పెట్టుబడిపై స్థిరమైన రాబడికి మధ్య వ్యత్యాసం ఉంది. స్పష్టత తెచ్చుకోలేకపోతే ఈ విషయంలో నిపుణుల సాయం తీసుకోవడానికి వెనుకాడొద్దు.
- రాబడిపై పన్ను బాధ్యతను తప్పకుండా గుర్తించాలి. పన్ను పోను నికర రాబడి ఎంతన్నది చూడాలి. తమ పెట్టుబడుల కాల వ్యవధికి అనుకూలమైన ఉత్పత్తిని ఎంపిక చేసుకోవాలి.
- పెట్టుబడి మొత్తాన్ని ఏదో ఒక సాధనంలో కాకుండా, ఒకటికి మించిన సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవడాన్ని పరిశీలించాలి.



తెలుగు రాష్ట్రాల్లో బీవోబీ 'కిసాన్ పఖ్వాడా'



ముంబై: రైతులు, గ్రామీణ ప్రాంతాలవారికి తోడ్పాటు అందించే దిశగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 'బరోడా కిసాన్ పఖ్వాడా' 7వ ఎడిషన్‌ను నిర్వహించినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తెలిపింది. ఈ సందర్భంగా వ్యవసాయ రంగం కోసం ఉద్దేశించిన తమ డిజిటల్ ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ పథకాలపై కూడా అవగాహన కల్పించినట్లు వివరించింది. 70 పైచిలుకు కార్యక్రమాల ద్వారా 3,700 మంది పైగా రైతులకు చేరువైనట్లు, సుమారు రూ. 25 కోట్ల వ్యవసాయ రుణాలను మంజూరు చేసినట్లు బ్యాంకు తెలిపింది. డిజిటల్ బరోడా కిసాన్ క్రెడిట్ కార్డ్, డిజిటల్ గోల్డ్ లోన్ మొదలైన డిజిటల్ ఉత్పత్తులను మరింత ప్రాచుర్యంలోకి తేవడంపై దృష్టి పెడుతున్నట్లు బ్యాంక్ హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్ రితేష్ కుమార్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-12-2024

విశాఖ	600–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	608–00
విజయవాడ	620–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	610–00
వరంగల్	612–00
రిటైల్ ధర	6.70

సిప్‌తో మూడేళ్లలో రూ.10 లక్షలు!



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



డెట్ ఫండ్స్ ఈల్డ్ టు మెచ్యూరిటీ (వైటీఎం), యావరేజ్ మెచ్యూరిటీ అంటే ఏంటి?

– చంద్ర గుణ శేఖర్

డెట్ ఫండ్స్ విశ్లేషణకు వైటీఎం, యావరేజ్ మెచ్యూరిటీ రెండూ కీలక కొలమానాలు. ఫండ్ పనితీరు సామర్థ్యాలు, రిస్క్‌ను వీటి సాయంతో తెలుసుకోవచ్చు.

వైటీఎం: మ్యూచువల్ ఫండ్ పథకం పోర్ట్‌ఫోలియోలో బాండ్లను గడువు తీరే వరకు కొనసాగిస్తే వచ్చే రాబడిని తెలియజేస్తుంది. ఉదాహరణకు ఒక డెట్ ఫండ్ వైటీఎం 8గా ఉంటే.. రాబడులు సుమారుగా ఆ స్థాయిలో ఉంటాయని అర్థం. కానీ, ఫండ్స్ పోర్ట్‌ఫోలియోలో మేనేజర్ చేసే మార్పులతో వాస్తవ రాబడులు వేరుగా ఉండొచ్చు. రోజువారీ ఎక్స్‌పెన్స్ రేషియో మినహాయింపులు, పెట్టుబడుల రాక, పోక ఇవన్నీ నికర రాబడులను ప్రభావితం చేస్తాయి. ఒక డెట్ ఫండ్‌లో ప్రస్తుత పోర్ట్‌ఫోలియో ప్రకారం ఎంత రాబడులు వస్తాయన్నది వైటీఎం తెలియజేస్తుంది.

యావరేజ్ మెచ్యూరిటీ: ఫండ్ పోర్ట్‌ఫోలియోలో వివిధ బాండ్లు వివిధ కాలాలకు మెచ్యూరిటీ అవుతాయి. అన్ని బాండ్ల మెచ్యూరిటీల సగటు మెచ్యూరిటీని ఇది తెలియజేస్తుంది. ఉదాహరణకు ఒక పోర్ట్‌ఫోలియోలో రెండు బాండ్లు ఉండి, ఒకటి 10 ఏళ్లు, మరొకటి 5 ఏళ్లకు మెచ్యూరిటీ తీరుతుందని అనుకుందాం. అప్పుడు వీటి సగటు మెచ్యూరిటీ 7.5 ఏళ్లు అవుతుంది. ఫండ్ పోర్ట్‌ఫోలియో వడ్డీ రేట్ల సున్నితత్వాన్ని ఇది తెలియజేస్తుంది. యావరేజ్ మెచ్యూరిటీ ఎంత దీర్ఘకాలానికి ఉంటే అంతగా వడ్డీ రేట్ల మార్పుల ప్రభావం ఉంటుందని అర్థం చేసుకోవాలి. యావరేజ్ మెచ్యూరిటీ తక్కువగా ఉంటే ఈ ప్రభావం తక్కువ. వైటీఎం ద్వారా ఫండ్ సగటు రాబడిని, యావరేజ్ మెచ్యూరిటీ ద్వారా ఆ ఫండ్ పోర్ట్‌ఫోలియోపై వడ్డీ రేట్ల మార్పు ప్రభావం ఏ మేరకు ఉంటుందో తెలుసుకోవచ్చు.

నా వయసు 35 ఏళ్లు. వచ్చే మూడేళ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా రూ.10 లక్షలు సమకూర్చుకోవాలని అనుకుంటున్నాను. లార్జ్‌క్యాప్ ఫండ్స్, ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌కు ఎక్కువ పెట్టుబడిని కేటాయించాలని అనుకుంటున్నాను. ఇవి ఎక్కువ రాబడులు ఇస్తాయని విన్నాను. నా లక్ష్యానికి ఇది మెరుగైన పెట్టుబడుల వ్యూహమేనా?

– జిగ్నేష్

మీ లక్ష్యం రాజీపడకూడనిది అయితే, కచ్చితంగా మూడేళ్లలో రూ.10లక్షలు రావాలని కోరుకుంటుంటే.. అందుకు ఈక్విటీ పెట్టుబడుల ఎంపిక సరైనది కాదు. 2000 సంవత్సరం నుంచి చారిత్రక రాబడుల గణాంకాలను పరిశీలిస్తే.. సెన్సెక్స్‌లో మూడేళ్ల సిప్ రాబడి మైనస్ 15 శాతంగా ఉంది. అందుకే స్వల్పకాలానికి ఈక్విటీ పెట్టుబడులు ఎంతో రిస్క్‌తో ఉంటాయి. స్వల్పకాలానికి సంబంధించి ముఖ్యమైన లక్ష్యాల విషయంలో భద్రతతో పాటు, స్థిరమైన రాబడులను ఇచ్చే సాధనాలనే పరిగణనలోకి తీసుకోవాలి. కనుక ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ విభాగంలో షార్ట్ డ్యురేషన్ డెట్ ఫండ్స్‌ను మీరు పరిశీలించొచ్చు. వీటిల్లో ఎంతో స్థిరత్వం, ఊహించతగిన రాబడులు ఉంటాయి. దీంతో మీ పెట్టుబడులు మార్కెట్ అస్థిరతలకు గురికావు. ఒకవేళ మీ లక్ష్యంలో కొంత వెసులుబాటు ఉండి, రిస్క్ తీసుకునేట్టు అయితే అప్పుడు ఈక్విటీ పెట్టుబడులు పరిశీలించొచ్చు. అది కూడా కనీసం ఐదేళ్లు, అంతకుమించిన కాలానికే ఈక్విటీలు సూచనీయం. దీర్ఘకాలంలో సిప్ రాబడులు ప్రతికూలం నుంచి సానుకూలంలోకి మారి, సంపద సృష్టికి వీలు కల్పిస్తాయి. మార్కెట్ అస్థిరతలను అధిగమించి వృద్ధిని చూపించగలవు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

నవంబర్‌లో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు	ఆటో అమ్మకాలూ పెరిగాయి

స్టాక్స్ వ్యూ

ఓఎన్‌జీసీ | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 257
టార్గెట్: రూ. 325

ఎందుకంటే: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీ ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో స్టాండెలోన్ ప్రాతిపదికన రూ. 18,200 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించింది. ఇది మా అంచనాల రూ. 18,800 కోట్లకంటే కొద్దిగా తక్కువే అయినప్పటికీ అత్యధిక శాతం మంది అంచనాలను అందుకుంది. మరోపక్క గ్యాస్ అమ్మకాల పరిమాణం, నికర ధరలు అంచనాలకు అనుగుణంగానే నమోదయ్యాయి. ఇక స్టాండెలోన్ నికర లాభం అందరి అంచనాల(రూ. 9,200 కోట్లు)ను అధిగమిస్తూ రూ. 12,000 కోట్లను తాకింది. ఇందుకు ఇతర ఆదాయం జంప్‌చేయడం, డ్రై వెల్ రైటాఫ్‌తో పాటు పన్ను రేటు తగ్గడం తోడ్పాటునిచ్చాయి. అయితే ఓఎన్‌జీసీ విదేశ్(ఓవీఎల్) నుంచి చమురు, గ్యాస్ ఉత్పత్తి నీరసించింది. దీంతో నిర్వహణ వ్యయాల కారణంగా త్రైమాసికవారీగా సంస్థ నికర లాభం తగ్గింది. కాగా.. అంతర్జాతీయంగా రష్యాసహా చమురు ఉత్పత్తి(ఒపెక్‌ప్లస్) దేశాలు ముడిచమురు బ్యారల్ ధరలను 75–80 డాలర్ల స్థాయిలో నిలిపేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు భావిస్తున్నాం. దీంతోపాటు ప్రభుత్వం బ్యారల్‌కు 75 డాలర్ల చొప్పున నికర ధరను పొందేందుకు ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాను అనుమతిస్తోంది. కేజీ డీబ్ల్యూ 98/2 బ్లాకు జోరు పెంచడం ద్వారా ఉత్పత్తిలో 10–15 శాతం వృద్ధిని అందుకోనుంది.

అశోక్ లేలాండ్ | ఆనంద్ రాఠీ | కొనొచ్చు




ప్రస్తుత ధర: రూ. 232
టార్గెట్: రూ. 290

ఎందుకంటే: ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో రూ. 1,020 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించింది. తద్వారా రూ. 920 కోట్ల ఇబిటా అంచనాలను అధిగమించింది. ఇందుకు భారీగా మెరుగుపడ్డ స్థూలలాభ మార్జిన్లు అండగా నిలిచాయి. అయితే వార్షిక ప్రాతిపదికన ఇబిటా 6 శాతం నీరసించింది. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో దేశీయంగా భారీ, మధ్య తరహా వాణిజ్య వాహన విభాగం 6 శాతం వృద్ధిని అందుకోనున్న అంచనాలతో సానుకూల స్థితికి చేరే వీలుంది. మూడేళ్లపాటు అంటే 2025–27 కాలంలో వార్షికంగా 7 శాతం పురోగతిని సాధించగలదని అంచనా. టన్నేజీ మిక్స్‌తోపాటు లాభదాయకతపై ప్రత్యేక దృష్టి కారణంగా ఇబిటా మార్జిన్లు మెరుగుపడనున్నాయి. రానున్న మూడేళ్లలో ఆదాయంలో 11 శాతం, ఇబిటాలో 14 శాతం, నికర లాభాల్లో 17 శాతం చొప్పున వృద్ధిని ఊహిస్తున్నాం. అయితే కంపెనీ ప్రధాన విభాగాలలో ఆశించిన స్థాయిలో డిమాండ్ కనిపించకపోవడం, కమోడిటీ ధరల పెరుగుదల, ప్రత్యర్థి కంపెనీల నుంచి పోటీ తీవ్రతరం కావడం వంటి అంశాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)



రెండ్రోజులు తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. వారం రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నెలకొన్న వాతావరణంలో.. ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కాగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణ స్థితిలో నమోదయ్యాయి. ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 32.9 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 15.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రానున్న మూడురోజులు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది.



బయటపడుతున్న సంగమేశ్వరాలయం

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి బయటపడుతోంది. శ్రీశైలం డ్యామ్‌లో నీటి మట్టం తగ్గుతుండటంతో నంద్యాల జిల్లాలోని ప్రాచీన సంగమేశ్వరాలయ శిఖర భాగం ఆదివారం దర్శనమిచ్చింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ఆదివారం 864.90 అడుగులకు చేరుకుంది. దీంతో ఆలయ శిఖరభాగం కృష్ణాజలాలపై భక్తులకు కనువిందు చేస్తోంది. శిఖరానికి ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ కుంకుమార్చన, పుష్పార్చన, మాలాలంకరణ, మంగళహారతి వంటి విశేష పూజక్రతువులు నిర్వహించారు. అనంతరం కార్తీకమాసం సందర్భంగా సాయంసంధ్యా సమయంలో కృష్ణా జలాలలో మహామంగళహారతి నిర్వహించారు.

దోమ కుడితే మలేరియా రావడం సాధారణమే...
కానీ దోమలు కుడితే... మలేరియా రాకుండా పోవడం గురించి తెలుసా?
మామూలుగా వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు ఇస్తుంటారు. కానీ మలేరియాను వ్యాప్తి చేసే దోమలతోనే వ్యాక్సిన్లు చేసే పనిని చేయించే సరికొత్త విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.
అంటే.. ఈ దోమలు కుడితే మలేరియా పరార్ అన్నమాట.
ఆ వివరాలేమిటో తెలుసుకుందామా...

దోమలు కుడితే.. మలేరియా పరార్



వ్యాక్సిన్ తరహాలో ఇమ్యూనిటీ కోసం..

సాధారణంగా ఏదైనా వ్యాధిని కలిగించే వైరస్‌లు, బ్యాక్టీరియాల వంటి సూక్ష్మజీవులను చంపి, లేదా నిర్వీర్యం చేసి వ్యాక్సిన్లను రూపొందిస్తారు. వ్యాక్సిన్లు ఇచ్చినప్పుడు మన రోగ నిరోధక వ్యవస్థ అవి సాధారణ సూక్ష్మజీవులేనని భావించి.. ప్రతిరక్షకాలను విడుదల చేస్తుంది. దీనితో ఆ వ్యాధికి సంబంధించిన అసలైన వైరస్, బ్యాక్టీరియా సోకడానికి ముందే మనలో ఇమ్యూనిటీ సిద్ధంగా ఉంటుంది. మలేరియాకు చెక్ పెట్టడంపై పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్తలు.. ఇదే టెక్నిక్‌ను వినూత్న తరహాలో అమలు చేసే పరిశోధన చేపట్టారు. మలేరియాను కలిగించే పారసైట్స్‌లో జన్యు మార్పులు చేసి.. దోమల ద్వారానే వాటిని వ్యాపింపజేసి పరిశీలించారు.

మలేరియా పారసైట్స్‌నే మార్చి..

మనలో మలేరియా వ్యాధికి కారణమయ్యేది ప్లాస్మోడియం ఫాల్సిపారం అనే పరాన్నజీవి. శాస్త్రవేత్తలు ఈ పరాన్నజీవిలో జన్యుమార్పులు చేసి.. 24 గంటల్లోనే విస్తరించడం ఆగిపోయే 'జీఏ1'రకాన్ని... ఆరు రోజుల తర్వాత విస్తరించడం ఆగిపోయే 'జీఏ2'రకాన్ని సృష్టించారు.

మనుషులను కుట్టించి, పరీక్షించి..

ఈ పరిశోధన కోసం కొందరు వలంటీర్లను ఎంపిక చేసి మూడు గ్రూపులుగా విభజించారు. మొదటి గ్రూప్ వారికి మలేరియా పారసైట్లేవీ లేని సాధారణ దోమలతో కుట్టించారు. రెండో గ్రూప్ వారిని 'జీఏ1'పారసైట్లను ఎక్కించిన దోమలతో... మూడో గ్రూప్ వారిని 'జీఏ2'పారసైట్లను ఎక్కించిన దోమలతో కుట్టించారు. పదిహేను రోజుల తర్వాత ఈ మూడు గ్రూపుల వారందరినీ అసలైన మలేరియా పారసైట్లు ఎక్కించిన దోమలతో కుట్టించారు. తర్వాత అందరినీ పది రోజుల పాటు అబ్జర్వేషన్‌లో పెట్టి వైద్య పరీక్షలు చేస్తూ, లక్షణాలను గమనించారు.

సాధారణ దోమలతో కుట్టించిన వారిలో అందరికీ మలేరియా వ్యాధి సోకినట్టు గుర్తించారు.

24 గంటల జీవితకాలం మాత్రమే ఉన్న 'జీఏ1'రకంతో ఇన్‌ఫెక్ట్ చేసినవారిలో 87 శాతం మందికి మలేరియా సోకింది. అంటే 13 శాతం మందికే ఇమ్యూనిటీ వచ్చింది.

6 రోజుల జీవితకాలం ఉన్న 'జీఏ2'రకంతో ఇన్‌ఫెక్ట్ చేసినవారిలో.. కేవలం 11 శాతం మందికే మలేరియా సోకింది. అంటే మిగతా 89 శాతం మందిలో ఇమ్యూనిటీ అభివృద్ధి చెందిందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

6 రోజుల ఎఫెక్ట్ ఎందుకు?

మలేరియా పరాన్నజీవి మన శరీరంలోకి ప్రవేశించాక.. మొదట కాలేయంలోకి చేరుతుంది. ఇందుకోసం నాలుగైదు రోజులకుపైనే పడుతుంది. తర్వాత పరాన్నజీవులు కాలేయంలో విపరీతంగా అభివృద్ధి చెంది ఎర్ర రక్తకణాలకు సంక్రమించి మలేరియా వ్యాధిని కలుగజేస్తాయి. ఈ కారణంతోనే ఒక రోజే జీవితకాలం ఉన్న 'జీఏ1'రకం ప్రభావం చూపించలేదని... ఆరు రోజుల జీవితకాలం ఉన్న 'జీఏ2'ప్రభావం చూపించిందని శాస్త్రవేత్తలు తేల్చారు. అయితే ఆరు రోజులు కాగానే.. 'జీఏ2'రకం ఆటోమేటిగ్గా నిర్వీర్యం అయిపోయిందని, శరీరంలో మాత్రం ఇమ్యూనిటీ వచ్చేసిందని గుర్తించారు.

వ్యాక్సిన్ల రూపకల్పనకు అద్భుత తోడ్పాటు

ఈ పరిశోధన మలేరియా వ్యాక్సిన్ల అభివృద్ధి దిశగా అద్భుతమైన తోడ్పాటు అని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ శాస్త్రవేత్త జులియస్ హాఫల్లా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మలేరియా కారణంగా ఏటా లక్షల మంది మరణిస్తున్నారని.. వారిని కాపాడేందుకు ఈ పరిశోధన ఉపయోగపడుతుందని తెలిపారు. అయితే దీనిపై మరింత విస్తృత పరిశోధన చేసి, అందుబాటులోకి తేవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

\- సాక్షి సెంట్రల్ డెస్క్

మీ గుట్టు విప్పే పరీక్ష



సరికొత్త డీఎన్ఏ టెస్టింగ్ కిట్‌తో 500 రకాల పరీక్షలు
మీ గతం.. భవిష్యత్తు కూడా చెప్పేసే లాలాజల టెస్ట్
జీనియస్ డీఎన్ఏ సంస్థ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: మీ వంశ చరిత్ర ఎంత పెద్దదో.. ఎక్కడెక్కడ విస్తరించి ఉన్నదో తెలుసుకోవాలనే కుతూహలం ఉందా? భవిష్యత్‌లో మీరు ఎదుర్కోబోయే ఆరోగ్య సమస్యలేమిటో అనే ఆలోచన భయపెతున్నదా? మీ బలాలు.. బలహీనతల గురించి తెలుసుకోవాలని భావిస్తున్నారా? అయితే.. మీ బుర్రను తొలిచే ఈ సందేహాలు, సమస్యలన్నింటికీ ఒక్కచోటే పరిష్కారం దొరుకుతుంది. అదే 'డీఎన్ఏ టెస్ట్ కిట్'. థాయ్‌లాండ్‌కు చెందిన జీనియస్ డీఎన్ఏ అనే సంస్థ ఈ కిట్‌ను ఆవిష్కరించింది. కేవలం మీ నోటిలోని లాలాజలాన్ని విశ్లేషించటం ద్వారా దాదాపు 500 రకాల పరీక్షలు నిర్వహించి రిపోర్టు ఇస్తుంది. టెస్ట్ చేయించుకోవాలని అనుకొనేవాళ్లు ఆ కంపెనీ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్టర్ చేసుకోవాలి. ఈ కిట్ విలువ రూ.35 వేలు. యాప్‌లో ఆర్డర్ ఇస్తే కంపెనీ ఏజెంటు ఇంటికే వచ్చి లాలాజలం శాంపిల్ తీసుకెళ్తారు. దానిని అమెరికాలోని ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తారు. టెస్ట్ రిపోర్టును యాప్‌లో మనకు పంపిస్తారు.

డీఎన్ఏ టెస్ట్ కిట్ ద్వారా వెల్లడించే 12 రకాల టాలెంట్స్..		
	• చదివే నైపుణ్యం	• ఇంటెలిజెన్స్
	• జ్ఞాపకశక్తి	• మల్టీ టాస్కింగ్ నైపుణ్యత
	• గణిత సామర్థ్యం	• టాస్క్ అటెన్షన్
	• పనిచేసే నైపుణ్యం	• భాషా నైపుణ్యం
	• సంగీత పరిజ్ఞానం	• క్రీడా నైపుణ్యం
	• క్రియేటివిటీ	• శరీర దృఢత్వం

రూ. 8.14 కోట్ల మోసం కేసు..
మరో ఇద్దరి అరెస్ట్



సాక్షి, హైదరాబాద్: స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశచూపి నగరవాసి నుంచి రూ.8.14 కోట్లు కొల్లగొట్టిన భారీ సైబర్ మోసం కేసులో మరో ఇద్దరిని టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను రాహుల్ డాంగి (21), రాహుల్ భోయి (25)లుగా గుర్తించామని ఆదివారం టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్తాన్‌లో అరెస్టయిన ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులను శనివారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట బాధితుడి నుంచి ఈ ముఠా విడతల వారీగా రూ.8.15 కోట్లు కొట్టేసింది. అక్టోబర్ 21న బాధితుడు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు బ్యాంక్ ఖాతాలను ట్రాక్ చేశారు. బాధితుడి ఖాతా నుంచి జరిగిన లావాదేవీల ఆధారంగా రాజస్తాన్‌లోని శ్రీ సన్వరియా ఫర్నిచర్స్ కరెంట్ ఖాతాలో రూ.75 లక్షలు జమ అయ్యాయి. ఈ ఖాతా నుంచి మరో 25 ఖాతాలకు డబ్బులు బదిలీ అయినట్టు సీఎస్‌బీ అధికారులు గుర్తించారు. వీటి ఆధారంగా ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగి (21), రాహుల్ భోయి (25)లను పట్టుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కేసులో గతవారం సైతం ఒక నిందితుడిని టీజీ సీఎస్‌బీ అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,619 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు ఉన్నవారికి సకాలంలో, లేనివారికి 12 గంటల్లో, ఎస్ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం అవుతోంది.

ఘాట్‌రోడ్‌లో యువకుల హల్‌చల్..: తెలంగాణకు చెందిన 08 జెడ్ 6003 వాహనంలోని యువకులు ఘాట్ రోడ్‌లో వికృత చేష్టలు చేస్తూ, వాహనాలపై నిలబడుకుని తిరుమలకు వెళ్లారు. ప్రమాదకరంగా ఫీట్లు చేస్తూ వాహనంపై చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురిచేశారు. వీరిని చూసిన భక్తులందరూ ఇలాంటి వారిపై టీటీడీ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కియోస్క్ మిషన్ ప్రారంభం..: టీటీడీ నిర్వహిస్తోన్న ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు విరాళం ఇచ్చేందుకు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌ను టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం ప్రారంభించారు.



హనుమంతునిపై పట్టాభిరాముడిగా అమ్మవారు

చంద్రగిరి: శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన ఆదివారం రాత్రి పట్టాభిరాముడు అలంకరణలో అమ్మవారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని సుప్రభాతంతో నిద్రమేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించి రాజమన్నార్ అలంకరణలో కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి అమ్మవారిని ఆస్థాన మండపం నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకువచ్చి హనుమంత వాహనంపై కొలువుదీర్చారు. పట్టు వస్త్రాలు, వజ్రవైఢూర్యాలతో ధనుర్బాణము ధరించిన పట్టాభిరాముడుగా అమ్మవారిని అలంకరించారు. అనంతరం హనుమంత వాహనంపై అమ్మవారు కొలువై తిరువీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



ఫిర్యాదులు, కేసుల వెనుక లోగుట్టు తెలుస్తూనే ఉంది
టీవీ చానళ్ల డిబేట్లలో సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ

ఏడాది కిందటి పోస్టులపై ఇప్పుడు మనోభావాలు దెబ్బతినడం ఏమిటో!

సాక్షి, అమరావతి: 'నేను ఏడాది కిందట సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై ఇప్పుడు కొందరి మనోభావాలు హఠాత్తుగా దెబ్బతినడం ఏమిటో అర్థం కావడం లేదు. పత్రికల్లో ప్రచురించే కార్టూన్ల మాదిరిగానే నేను కూడా కొన్ని పోస్టులను సోషల్ మీడియాలో పోస్ట్ చేశా. పత్రికలకు ఉన్నట్టే వ్యక్తులకు కూడా కాస్త భావప్రకటన స్వేచ్ఛ ఉంది. కాస్త వ్యంగ్యంగా వ్యాఖ్యానించవచ్చు. ఆ పోస్టులు పెట్టినప్పుడు అంటే ఏడాది కిందట ఎవరూ తమ మనోభావాలు దెబ్బతిన్నాయని అనలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయనూ లేదు. ఆ పోస్టుల్లో నేను పేర్కొన్నవారు కూడా కనీసం అప్పుడు అభ్యంతరం వ్యక్తం చేయనేలేదు. కానీ హఠాత్తుగా ఏడాది తరువాత.. అదీ ఆంధ్రప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లోని వ్యక్తులకు ఒకేసారి మనోభావాలు దెబ్బతినడం ఏమిటో..! వాళ్లు ఒకేసారి వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయడం ఏమిటో..! పోలీసులు వెంటనే కేసులు పెట్టడం ఏమిటో..! దీన్నిబట్టి ఈ ఫిర్యాదులు, కేసుల వెనుక ఏం జరిగిందన్నదీ.. ఎంత పక్కా స్క్రిప్ట్ ఉందన్నదీ స్పష్టం అవుతునే ఉంది..' అని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అన్నారు. ఆయన ఆదివారం వివిధ టీవీ చానళ్ల డిబేట్లలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



కొయ్యూరు ఎన్‌కౌంటర్ మృతులు (ఫైల్)

గర్జనపల్లిపై 'కొయ్యూరు' తూటా!

'కొయ్యూరు' ఎన్‌కౌంటర్‌లో గర్జనపల్లి యువకుడి మృతి

మావోయిస్టు అగ్రనేతలతో పాటు ఆ పల్లె పశువుల కాపరి ఎన్‌కౌంటర్

నేటికి కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు

సిరిసిల్ల: పాతికేళ్ల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనల జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉన్నాయి. నక్సలైట్ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఎన్‌కౌంటర్ వార్తలే వినిపించేవి. ఇప్పుడు మావోయిస్టు పార్టీ.. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కొయ్యూర్ (ఇప్పుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా) అటవీ ప్రాంతంలో 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అగ్రనేతలు నల్ల ఆదిరెడ్డి అలియాస్ సామ్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి అలియాస్ మహేశ్, శీలం నరేశ్ అలియాస్ మురళి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. వీరితోపాటు రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన యువకుడు, పశువుల కాపరి సింగం లక్ష్మీరాజం (21) ప్రాణాలు కోల్పోయాడు. ముందుగా గుర్తుతెలియని మావోయిస్టు అగ్రనేతగా, గుర్తుతెలియని శవంగా పోలీసులు ప్రకటించారు. అయితే ఆయన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించడంతో లక్ష్మీరాజంగా నిర్ధారించారు. పాతికేళ్ల కిందట జరిగిన ఆ సంఘటన గర్జనపల్లి గుండెలను పిండేస్తోంది. ఆనాటి తూటా గాయం ఇంకా సలుపుతూనే ఉంది.



గర్జనపల్లి బస్టాండులో అమరవీరుల స్తూపం

ఏం జరిగిందంటే..

లక్ష్మీరాజం గర్జనపల్లిలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసి, తండ్రి సింగం వెంకటితోపాటు పశువులు కాసేవాడు. కడుపేదరికం అనుభవించే లక్ష్మీరాజం ఆ ఊరిలో వివాదరహితుడు. అప్పట్లో పీపుల్స్‌వార్ సానుభూతిపరుడిగా లక్ష్మీరాజం పనిచేసినట్లు ఎవరికీ తెలియదు. కానీ ఎల్లారెడ్డిపేట పోలీసులు నవంబర్ 30వ తేదీ అర్ధరాత్రి లక్ష్మీరాజంను ఇంట్లో నుంచి పట్టుకెళ్లారు. తెల్లవారే ఆ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లక్ష్మీరాజం గురించి వాకబు చేశారు. ఆ విషయం అప్పట్లో పత్రికల్లో ప్రముఖంగా ప్రచురితమైంది. కానీ పోలీసులు తమకేమీ తెలియదని చెప్పారు. డిసెంబర్ 2న కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలు ఎన్‌కౌంటర్ అయ్యారు. నలుగురు మావోయిస్టులు మరణించారని పోలీసులు ప్రకటించారు. అప్పటి రాష్ట్ర డీజీపీ హెచ్‌జే దొర, ఇతర పోలీసు ఉన్నతాధికారులు హెలీకాప్టర్‌లో కొయ్యూర్ ఎన్‌కౌంటర్ స్థలాన్ని సందర్శించారు. నాలుగో మృతుడు (లక్ష్మీరాజం) అంతర్ రాష్ట్ర నక్సలైట్ అని ప్రకటించారు. కానీ అప్పటికే కీడు శంకించిన గర్జనపల్లి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కొయ్యూర్‌కు వెళ్లి శవాన్ని గుర్తించారు. దీంతో నాలుగో మృతుడు గర్జనపల్లి వాసిగా నిర్ధారణ అయ్యాడు. సామాన్యమైన పశువుల కాపరి మావోయిస్టు అగ్రనేతలతోపాటు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. ఇది అప్పట్లో ఓ సంచలనం. గర్జనపల్లి యువకుడు కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో ఎలా మరణించాడు అని ఒక్కటే చర్చ సాగింది.



కొయ్యూరు ఎన్‌కౌంటర్ మృతులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, శీలం నరేశ్ (ఫైల్)

శీలం నరేశ్‌కు సిరిసిల్లతో అనుబంధం

కొయ్యూర్ మృతుల్లో మరో అగ్రనేత శీలం నరేశ్ అలియాస్ మురళి జగిత్యాల వాసి కాగా.. సిరిసిల్ల పాలిటెక్నిక్ కాలేజీ (అగ్రహారం) లో చదువుకున్నాడు. ఆయన సోదరుడు జగదీశ్ సిరిసిల్ల 'సెస్'లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. సిరిసిల్లలో శీలం నరేశ్ మిత్రులు చాలా మంది ఉన్నారు. కొయ్యూర్ ఎన్‌కౌంటర్ ఘటన సిరిసిల్ల ప్రాంతంలో కలకలం సృష్టించింది. ఆ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు ముగ్గురు మరణించగా.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పశువుల కాపరి లక్ష్మీరాజం మరణించడం చర్చకు దారి తీసింది.

అజ్ఞాతంలో మరో ముగ్గురు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో మానాల ఎన్‌కౌంటర్‌లో 11 మంది మావోయిస్టులు మరణించడంతో ఆ పార్టీ ఉనికి కోల్పోయింది. జిల్లాలో పట్టున్న జనశక్తి పార్టీ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో క్షీణించింది. ప్రస్తుతం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెకు చెందిన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కొస, కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన చంద్రయ్య, బండలింగంపల్లికి చెందిన మరో యువకుడు అజ్ఞాతంలో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. జిల్లాలోని గండిలచ్చపేటకు చెందిన బాలసంతుల ఉప్పలయ్య అలియాస్ చిన్నన్న సైతం 35 ఏళ్లుగా కనిపించడం లేదు. కానీ ఆయన ఎక్కడ ఉన్నది ఇప్పటికీ మిస్టరీయే.

దీనస్థితిలో లక్ష్మీరాజం కుటుంబం

కొయ్యూర్ ఎన్‌కౌంటర్ మృతుడు లక్ష్మీరాజం కుటుంబం ఇప్పుడు దీనస్థితిలో ఉంది. అతని తండ్రి వెంకటి చాలా రోజుల కిందట మరణించగా.. తల్లి భారతవ్వ అనారోగ్యంతో పనిచేత కాని స్థితిలో ఉంది. తమ్ముడు నర్సయ్య కూలి పనిచేస్తున్నాడు. రేకులషెడ్డు వేసుకుని జీవిస్తున్నారు. అతను అనారోగ్యంతో మంచం పట్టాడు. లక్ష్మీరాజం బతికి ఉంటే ఆ కుటుంబం పరిస్థితి ఇలా ఉండేది కాదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఏది ఏమైనా 25 ఏళ్ల కిందటి తూటా గాయం.. ఓ కుటుంబానికి ఇంకా మానని గాయమై సలుపుతోంది. స్వరాష్ట్రంలోనూ సలుపుతున్న గాయాన్ని కనీసం మాన్పించే మందు రాయని పరిస్థితి ఉండడం బాధాకరం. ఆ పేద కుటుంబానికి బాసటగా నిలవాల్సిన బాధ్యత పాలకులదే. ఇప్పటికైనా సర్కారు దయతలిచి లక్ష్మీరాజం తల్లిని, తమ్ముడిని ఆదుకోవాల్సిన అవసరం ఉందనే భావన స్థానికుల్లో ఉంది.



లక్ష్మీరాజం తల్లి భారతమ్మ



గర్జనపల్లిలోని పూరింట్లో లక్ష్మీరాజం సోదరుడు నర్సయ్య



పోటెత్తిన యాదాద్రి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో కార్తీక మాసం చివరి రోజు.. ఆదివారం సెలవు కలిసి రావడంతో భక్తులు అధికంగా తరలి వచ్చారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటల సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో రూ.56,71,426 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



గుట్టలో పెరిగిన వ్రతాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో కార్తీకం సందర్భంగా.. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు అధికంగా జరిగాయని ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. గతేడాది 20,524 వ్రతాలు జరిగితే.. ఈ ఏడాది కార్తీక మాసంలో 23,248 వ్రతాలు జరిగినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నవరం ఆలయం తరువాత.. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ వ్రత పూజలకు భక్త దంపతులు ప్రాధాన్యమిస్తారు.





వాహనం దిగి.. ట్రాఫిక్‌ను చక్కదిద్ది..

ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ట్యాంక్‌బండ్ వైపు నుంచి వస్తున్న కారు అంబేడ్కర్ కూడలి వద్ద అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకుపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. అదే సమయంలో ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి యూ టర్న్ తీసుకుని తెలంగాణ సచివాలయం వైపు వెళ్తున్న రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. తన వాహనాన్ని ఆపించి సంఘటన స్థలం వద్దకు వెళ్లారు. స్వయంగా ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. అంతలో ఆయన సిబ్బంది ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన కారును సంఘటన స్థలం నుంచి తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. దాదాపు పది నిమిషాల పాటు అక్కడే ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు.. ట్రాఫిక్ అవాంతరం తొలగిపోయిన అనంతరం అక్కడి నుంచి బయల్దేరి వెళ్లారు.

బాలమల్లేశ్ మృతికి సీఎం సంతాపం

సాక్షి, హైదరాబాద్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ ఆకస్మిక మరణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

దివ్యాంగుల ఉద్యోగాలు వారికే దక్కాలి

- వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో భర్తీకాని దివ్యాంగుల కోటా ఉద్యోగాలను బ్యాక్‌లాగ్ కేటగిరీలోనే ఉంచాలని, అర్హుల లభ్యత ఆధారంగా తిరిగి వారికే దక్కేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. ప్రభుత్వ ఆమోదంతో దివ్యాంగుల కొలువులు వారికే దక్కేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు భర్తీకాని ఉద్యోగాలను క్యారీఫార్వర్డ్ చేస్తూ జనరల్ కేటగిరీలోకి మారుస్తున్నారని, దీంతో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముత్తినేని వీరయ్యను ఘనంగా సన్మానించారు. దివ్యాంగుల సమస్యలపై పోరాడిన వీరయ్యకు రాష్ట్ర ప్రభుత్వం చైర్మన్ పదవి ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకురాలు బి.శైలజ, డిఫరెంట్లీ ఏబుల్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హబీబ్ మియా, ప్రధాన కార్యదర్శి చిరబోయిన లక్ష్మయ్య పాల్గొన్నారు.



చెర్వు గట్టు కిటకిట

కార్తీక మాసం చివరి రోజు కావడంతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో కిటకిటలాడుతున్న శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు!

ఏడాది పాలనపై సీఎం కార్యాలయం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది కాలంలో రాష్ట్రంలో విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారు. స్కూళ్లు తెరిచే నాటికే అన్ని మరమ్మతులు చేపట్టేందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసింది. పారిశుద్ధ్య నిర్వహణకు రూ.136 కోట్లు కేటాయించింది. విద్యార్థులకు అందించే యూనిఫాం కుట్టుకూలీని ఒక్కో జతకు రూ.50 నుంచి రూ.75కు పెంచారు. స్కూళ్లు తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 21,419 మంది టీచర్లకు పదోన్నతులు లభించాయి. 37,406 మంది ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ టీచర్లను బదిలీ చేశారు. ఇవన్నీ టీచర్లలో ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని పెంచాయి. ఫలితంగా నాణ్యమైన బోధనకు బాటలు వేసింది.

తీరిన టీచర్ల కొరత

అతి తక్కువ సమయంలోనే విజయవంతంగా డీఎస్సీ నిర్వహించి, 11,062 మంది టీచర్లను నియమించడంతో చాలా వరకు టీచర్ల కొరత తీరింది. టీచర్ల హేతుబద్ధీకరణను పాటించింది. 1-10 మంది విద్యార్థులుంటే, ఒక ఉపాధ్యాయుడు, 11-40 మంది ఉంటే ఇద్దరు, 41-60 మంది ఉంటే ముగ్గురు, 60 మంది విద్యార్థులున్న చోట మంజూరైన పోస్టులన్నీ కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏటా రెండు సార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలన్న లక్ష్యాన్ని కార్యరూపంలోకి తెచ్చింది. మండలానికో ఎంఈవో ఉండేలా చర్యలు తీసుకుంది.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య ను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటి కోసం 20 నుంచి 25 ఎకరాల్లో కొత్త భవనాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొడంగ ల్, మధిర నియోజకవర్గాల్లో వీటికి శంకుస్థాపన చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వేర్వేరుగా విద్యను బో ధించడం సరికాదని, వీరందరినీ ఒ కే చోటకు తేవడం ఈ స్కూల్స్ ము ఖ్యోద్దేశంగా ప్రభుత్వం ప్రకటించింది.

నైపుణ్యాలకు పెద్దపీట

మార్కెట్ అవసరాలతో పోటీ పడేలా విద్యావిధా నంలో మార్పుల దిశగా అడుగులు పడ్డాయి. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారి శ్రామిక అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలను అందించే ప్రయత్నం మొదలైంది. 65 ఐటీఐలను రూ. 2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చింది. అకడమిక్ కోర్సులు తీసుకొ స్తోంది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని అత్యున్నత ఆశయాలతో ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగి న నైపుణ్యాలు బోధించేలా ఈ స్కిల్ యూనివర్సిటీ ఉండాలని, సిలబస్ దానికి తగినట్లు రూపొందించాలనే ఉద్దేశంతో దేశంలోని పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యాన్ని ఆహ్వానించింది.

మరెన్నో...

- మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు పాఠశాల స్థాయి నుంచే ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసింది. గురుకులాల్లోని బడుగు వర్గా ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే లక్ష్యంతో డైట్ ఛార్జీలను పెంచింది. ఇది రూ.300 కోట్ల భారమైనప్పటికీ ప్రభుత్వం లెక్కచేయలేదు. దీనివల్ల హాస్టళ్లలో ఉండే 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది.
- పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన విశ్వవిద్యాలయాలకు కొత్త వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టారు. ఎక్కడా ఎలాంటి పైరవీలకు తావివ్వలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. 247 లెక్చరర్ పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. 37 ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించింది.





దీప జ్యోతిర్ నమోస్తుతే! | కార్తీక మాసం చివరి రోజున విజయవాడ దుర్గఘాట్ వద్ద కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వదులుతున్న భక్తులు



లాహిరి.. లాహిరి.. ఉత్సాహమే మరి | కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా విజయవాడలోని కృష్ణా నదిలో టూరిజం బోటు, స్పీడ్ బోట్‌లో సందడి చేస్తున్న యువత



చలాకీ బామ్మ.. ఊయల ఊగెనమ్మా! | విజయవాడ భవానీ ఐలాండ్‌లో కుటుంబ సభ్యులతో వచ్చి ఊయల ఊగుతున్న బామ్మ

క్లుప్తంగా...

నారాయణరావుకు ఏపీఎస్టీఏ మద్దతు

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోన్న గంధం నారాయణరావుకి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, చందనరావు తెలిపారు. 34 ఏళ్ల పాటు ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా సేవలు అందించి, పదవీ విరమణ అనంతరం విద్యాసేవ చేస్తున్న నారాయణరావుకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు.

బోధనకే పరిమితం చేయండి
ఏపీటీఎఫ్ అమరావతి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తామన్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా విద్యాశాఖ కార్యాలయాల్లో డెప్యుటేషన్‌పై క్లరికల్ విధుల్లో నియమిస్తోందని, ఇది సరైన విధానం కాదని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సి.వి.ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. తక్షణం ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దుచేసి పాఠశాలలకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

గడప గడపలో ఉక్కు గళం విప్పేలా చేద్దాం
ఎంపీ, బీఎస్పీ జాతీయ కో ఆర్డినేటర్ రాంజీ గౌతమ్

అగనంపూడి (గాజువాక): గడప గడపలో విశాఖ ఉక్కు గళం వినిపించేలా కార్యాచరణ చేపడతామని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో గళం విప్పుతామని బహుజన సమాజ్‌వాద్ పార్టీ (బీఎస్పీ) జాతీయ కోఆర్డినేటర్, ఎంపీ రాంజీ గౌతమ్ చెప్పారు. ఉక్కు ఉద్యమానికి సంఘీభావంగా కూర్మన్నపాలెం కూడలిలో ఆదివారం బీఎస్పీ సారథ్యంలో ధర్నా చేపట్టారు. గౌతమ్ మాట్లాడుతూ..అందరం కలిసి విశాఖ ఉక్కును కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కేంద్రం ఇప్పటికే 23 ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేటీకరించిందని గుర్తు చేశారు. బీఎస్ఎన్ఎల్‌ని 3జీకే పరిమితం చేసి ప్రైవేట్ సంస్థలకు మాత్రం 5జీ సర్వీస్‌లకు అవకాశం కల్పించిందన్నారు. ఇక్కడ కూడా విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా ఉక్కు కర్మాగారాన్ని వేధిస్తూ నష్టాల పేరు చెప్పి ప్రైవేటీకరణకు పన్నాగం పన్నిందని ఆరోపించారు.

క్రీడా నైపుణ్యం వెలికితీసేలా పోటీలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఆదివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ క్రీడా మైదానంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. ఈ పోటీలకు ఏయూ ఎఫిలియేషన్ కళాశాలల నుంచి వంద మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి మేరకు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారులు ఏయూ జట్టు తరఫున పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పీడీ డాక్టర్ లక్ష్మణ్‌రెడ్డి, ఐఐపీఈ క్రీడాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పతాక స్థాయిలో కొమ్ముకోయ నృత్యం

కొండకోనల్లో నృత్య సౌందర్యం

మాటలు లేని కాలంలో ఆదివాసీలు లయబద్ధంగా వేసిన గెంతులే నేడు ప్రపంచదేశాల్లో గొప్ప నృత్యంగా వెలుగొందుతున్నాయి. అలాంటి వాటిలో ఒకటైన గిరిజనుల కొమ్ముకోయ నృత్యం అత్యంత పురాతన కళారూపంగా ప్రసిద్ధి చెందింది. కోయ జాతి గిరిజనులు మాత్రమే చేసే ఈ నృత్యం దేశ వ్యాప్తంగా విశేష ఆదరణ పొందింది. ఈ నృత్యం పేరు చెబితే చింతూరు మండలంలోని కోయజాతికి చెందిన కళాకారులు గుర్తుకువస్తారు.

పురాతన కళారూపం ఆదివాసీల కొమ్ముకోయ నృత్యం

కామన్‌వెల్త్, ఐపీఎల్‌లోప్రదర్శనలు... సంప్రదాయప్రదర్శనలతో ఆదాయం

ప్రత్యేకత చాటుతున్న కోయజాతి కళాకారులు

చింతూరు: సంస్కృతి, సంప్రదాయంలో భాగమైన కొమ్ముకోయ నృత్యంతో తమ ప్రత్యేకతను దేశం నలుమూలలా చాటుతున్నారు కోయజాతికి చెందిన గిరిజన కళాకారులు. ఈ నృత్యం పేరు చెబితే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని తుమ్మలకు చెందిన గిరిజన కళాకారులు ముందుగా గుర్తుకొస్తారు. సొంత శుభకార్యాలతో ప్రారంభమైన ఈ నృత్యం రాష్ట్రంలో వివిధ పండుగల సందర్భంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఓ భాగమైంది. అనంతర కాలంలో ఇతర రాష్ట్రాల్లో జరిగే సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు కామన్‌వెల్త్ గేమ్స్, ఐపీఎల్ ప్రారంభం, ముగింపు సంబరాల్లో సైతం ఈ నృత్యం ఎంతో ప్రాచుర్యం పొందింది.

20 బృందాలు...

తుమ్మలతోపాటు బుర్కనకోట, సరివెల, వేకవారిగూడెం, సుద్దగూడెం తదితర గ్రామాలకు చెందిన గిరిజన కళాకారులు సైతం ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 20 బృందాల వరకు ఉన్నాయి. ఈవెంట్‌ను బట్టి ఒక్కో బృందంలో 20 నుంచి 40 మంది మహిళలు, పురుషులు ఉంటారు.

- గిరిజన సంస్కృతికి తగ్గట్టుగా దుస్తులు ధరించి పురుషులు అడవి బర్రె కొమ్ములను పోలిన ఆకృతులు, నెమలి ఈకలతో కూడిన తలపాగా చుట్టుకుని, పెద్ద డోలు పట్టుకుని దానిని వాయిస్తూ ఉంటారు. మహిళలు తలకు రిబ్బన్ చుట్టుకుని అందులో ఈకలను పెట్టుకుని, కాళ్లకు గజ్జెలు కట్టుకుని పురుషుల డోలు వాయిద్యానికి అనుగుణంగా నాట్యం చేస్తుంటారు. ముందు నెమ్మదిగా ప్రారంభమయ్యే ఈ నృత్యం క్రమేపీ పుంజుకుంటుంది.
- నృత్యం ముగింపులో పొట్టేళ్ల మాదిరిగా పురుషులు తమ కొమ్ములతో ఒకరినొకరు గుద్దుకోవడం ప్రత్యేక ఆకర్షణ. దుస్తుల అలంకరణ వైవిధ్యంగా ఉంటుంది. పురుషులు ఎర్ర దుస్తులు ధరిస్తే మహిళలు పచ్చ దుస్తులు ధరిస్తారు.

సాంస్కృతిక విభాగాల ఆధ్వర్యంలో..

సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేశంలో, రాష్ట్రంలో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో కొమ్ముకోయ నృత్య కళాకారుల ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నారు. వివిధ పండుగల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా వీరు పాల్గొంటున్నారు.

- మన్యంలో చిత్రీకరించే కొన్ని సినిమాల్లో సైతం కొమ్ముకోయ నృత్య ప్రదర్శనకు చోటు దక్కింది. పుష్ప–2, గేమ్‌చేంజర్, దేవదాసు–2, ఊరిపేరు భైరవకోన, దొంగలబండి, అమ్మాయినవ్వితే.. శ్లోకం వంటి చిత్రాల్లో తమ ప్రదర్శనకు అవకాశం వచ్చినట్టు నృత్య కళాకారులు తెలిపారు.

రోజుకు రూ.వెయ్యి: ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు రవాణా ఖర్చులు, వసతి కల్పించడంతో పాటు ఒక్కొక్కరికీ రోజుకు రూ. వెయ్యి చొప్పున చెల్లిస్తారని వారు పేర్కొన్నారు. ఒకొక్క కళాకారుడు ఏడాదికి సుమారు రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందుతుంటారు.

- ఎంతో ఖ్యాతి పొందినా కళాకారులు మాత్రం వ్యవసాయం, కూలిపనులపై కూడా ఆధారపడుతుంటారు.

ప్రస్థానమిలా..

చింతూరు మండలం తుమ్మ లకు చెందిన పట్రా ముత్యం తమ గ్రామానికి చెందిన కొంత మంది కళాకారులతో కలసి ఓ బృందాన్ని ఏర్పాటుచేసి వివిధ పాంతాల్లో ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా కొమ్ముకోయ నృత్య ప్రస్థానం ప్రారంభమైంది. ఆయన మృతి అనంతరం అతని కుమారుడు రమేష్ సంప్రదాయ వృత్తిగా ఈ నృత్యాన్ని కొనసాగిస్తున్నారు.

ఐటీడీఏ సహకరించాలి



కొమ్ముకోయ నృత్యం ద్వారా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను దేశవ్యాప్తంగా చాటుతున్న తమకు సహకారం అందించాలి. ఐటీడీఏ ద్వారా తమకు మరిన్ని అవకాశాలు కల్పిస్తే తాము ప్రదర్శనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. – పట్రా రమేష్, కొమ్ముకోయ కళాకారుడు, తుమ్మల

ఎంతో ఆదరణ



ఆదివాసీ సంస్కృతిలో భాగంగా ప్రకృతి ఒడిలో తాము నేర్చుకున్న ఈ నృత్యానికి ఇతర ప్రాంతాల్లో ఎంతో ఆదరణ లభిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనల ద్వారా అక్కడి సంస్కృతిని తాము తెలుసుకునే అవకాశం కలుగుతోంది. ప్రభుత్వం నుంచి మాలాంటి కళాకారులకు పూర్తిస్థాయిలో సహకారంఅందించాలి. – వుయికా సీత, కొమ్ముకోయ నృత్య కళాకారిణి

అందం.. అత్యద్భుతం

మగసానితిప్పలో ఆధ్యాత్మిక పరవశం.. ఆహ్లాదాన్ని పంచే అందాలెన్నో

- గోదావరి నదీపాయల మీదుగా పడవ ప్రయాణం
- మంత్రముగ్ధులను చేస్తున్న మడ అడవుల అందం
- పర్యాటకంగా ప్రోత్సహిస్తే మంచి ఫలితం

సాక్షి, అమలాపురం/ కాట్రేనికోన: గౌతమీ నదీ సాగర సంగమ ప్రాంతం. పాయలు.. పాయలుగా విడిపోయే నది. వాటిని ఆనుకుని ఇరువైపులా చిట్టిపొట్టి మొక్కలు.. చిక్కని గుబురు పొదలు. వాటి మధ్య సాగే పడవ ప్రయాణం. మడ పీతలు.. అందమైన పక్షులు.. అరుదైన వృక్షజాతులు.. ఔషధ మొక్కలు ఇలా దారి పొడవునా కనిపించే అందమైన సుందర దృశ్యాలు ఎన్నో మరెన్నో. అంబేడ్కర్ కోనసీమ జిల్లా బలుసుతిప్ప శివారు మగసానితిప్పకు వెళ్లే పడవ ప్రయాణం పైరు పచ్చని కోనసీమలో సరికొత్త అందాలను కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. కొబ్బరి తోటలు.. పచ్చని పొలాలు.. పంట కాలువల అందాలనే కాదు.. మడ అడవులు.. నదీపాయలు.. పడవ ప్రయాణాలు.. ఇలా 'స్వర్గమే కళ్లముందు' కదలాడుతోంది.

మగసానితిప్ప ఓ కుగ్రామం. గోదావరి నదీపాయలు, మడ అడవులు నడుమ ఒక చిన్న దీవి. కాట్రేనికోన మండలం బలుసుతిప్ప పంచాయతీ శివారు గ్రామం. అగ్నికుల క్షత్రియులు ఉండే ఆ గ్రామానికి వెళ్లాలంటే పడవ ఒక్కటే మార్గం. అటువంటి గ్రామంలో మత్స్యకారుల ఆరాధ్య దైవం కాల భైరవస్వామి ఇక్కడ కొలువై ఉన్నారు. ఈ ఆలయానికి సుమారు 1,800 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలో స్వామివారి ఆలయాన్ని సమీపంలో ఉన్న బలుసుతిప్ప గ్రామంలో చోళరాజులు నిర్మించారని ఆలయ చరిత్ర చెబుతోంది. తుపాను సమయంలో మూలవిరాట్ సముద్రంలో కూరుకుపోతుండగా, మత్స్యకారులు అడ్డుకుని ఊరికి ఈశాన్యంగా ఉన్న మగసానితిప్పలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ ఆలయం నిర్మించి వందేళ్లకు పైబడి అవుతోంది. తొలుత మత్స్యకార పద్దెలు పూజాదికాలు నిర్వహించగా, గత 80 ఏళ్లుగా బ్రాహ్మణుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు.

ముచ్చటగొలిపేలా..

ఈ గ్రామానికి వెళ్లేందుకు రెండు జల మార్గాలున్నాయి. ఒకటి బలుసుతిప్ప, రెండోది ఐ.పోలవరం మండలం జి.మూలపొలం నుంచి ఇంజన్ పడవల (బోట్లు) మీద రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ పడవల ప్రయాణం ఒక అద్భుతం. మనో ఫలకంపై చెరగని ముద్రగా నిలిచిపోతోంది అంటే అతిశయోక్తి కాదు. ఒంపులు తిరుగుతూ సాగే నదీపాయల మధ్య బోటు ప్రయాణం.. ఇరువైపులా దట్టమైన పొదరిల్లుగా అల్లుకుపోయిన మడ చెట్లు.. నీటి మీద తేలియాడే వాటి వేర్లు ముచ్చటగొల్పుతాయి. అడవుల్లో ఉండే ఔషధ మొక్కల నుంచి వచ్చే పరిమళాలు ప్రకృతి ప్రేమికులను మరో లోకానికి తీసుకుపోతాయి.

చెట్ల కొమ్మల మీద పాకుతున్న మడ పీతలు.. అక్కడక్కడా కనిపించే మడ పిల్లులు.. విదేశీ పక్షులు కనువిందు చేస్తాయి. చిన్న కాలువలుగా.. వెంటనే పెద్ద నదిని తలపించే పాయలు.. తీరాన్ని ఆనుకుని గోదావరి దీవుల మధ్య సంప్రదాయ పద్ధతిలో జీవనం సాగించే అగ్నికుల క్షత్రియులు (మత్స్యకారులు). చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ మడ అడవుల్లో పీతలు, చేపల, రొయ్యల వేట ఆశ్చర్యాన్ని గురి చేస్తాయి. మడ అడవులను ఆనుకుని మత్స్య సంపద కోసం ఏర్పాటు చేసిన వలలు, వాటి వద్ద మత్స్యకారుల సందడి ముచ్చట గొల్పుతాయి. పడవలకు ఎదురుగా వచ్చే వేట పడవలు... రాకపోకలు సాగించే గ్రామస్తులు, గంటపాటు సాగే ప్రయాణంలో కంటిని కట్టిపడేసే అందచందాల గురించి ఎలా ఎన్ని చెప్పుకొన్నా.. ఎంత చెప్పుకొన్నా తక్కువే. ప్రకృతి ప్రేమికులు జీవితంలో ఒక్కసారైనా ప్రయాణం చేయాలనిపించే ప్రాంతం ఇది.



నదీపాయల ఇరువైపులా మడ అడవులు



మగసానితిప్పకు పడవలపై వస్తున్న అయ్యప్ప భక్తులు

పర్యాటకంగా ప్రోత్సహించాలి

పర్యాటకంగా ప్రోత్సహిస్తే ప్రయాణికులు, భక్తుల సంఖ్య మరింత పెరగనుంది. ఏకో టూరిజంలో భాగంగా గతంలో పలు సందర్భాల్లో పర్యాటక బోట్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా తరువాత పట్టించుకునేవారు లేకుండా పోయారు. బలుసుతిప్ప, జి.మూలపొలం నుంచి ప్రత్యేక పర్యాటక బోట్లు ఏర్పాటు చేయడం, మగసానితిప్పలో సేద తీరేందుకు ఏర్పాట్లు చేస్తే పర్యాటక అభివృద్ధి జరుగుతుంది.

పెరిగిన తాకిడి

అతి పురాతన ఈ ఆలయానికి ఇటీవల కాలంలో భక్తుల తాకిడి పెరిగింది. గతంలో అప్పుడప్పుడు ఒకరిద్దరు భక్తులు మాత్రమే బయట నుంచి వచ్చేవారు. మహాశివ రాత్రి నాడు మాత్రం పెద్ద ఎత్తున భక్తులు వచ్చేవారు. కానీ ఇప్పుడు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. మరీ ముఖ్యంగా కార్తిక మాసంలో రోజూ భక్తులు వస్తుండగా అయ్యప్ప, భవానీ మాలధారులు భారీగా వస్తున్నారు. ప్రతి నెలా అష్టమి రోజు ఇక్కడ గుమ్మడి కాయలో దీపం పెట్టడం వల్ల పాపాలు పోతాయని భక్తుల విశ్వాసం.

ఆనవాయితీగా దీపారాధన



కాల భైరవ స్వామి వెలసి 18 దశాబ్దాలు దాటిందని చరిత్ర చెబుతోంది. ఈ ఆలయాన్ని ఇక్కడ నిర్మించి వందేళ్లు దాటుతోంది. ఏడు దశాబ్దాలుగా మా తండ్రి, తరువాత నేను అర్చకత్వం చేస్తున్నాం. గతంలో భక్తులు పెద్దగా వచ్చేవారు కాదు. ఇప్పుడు పెరిగింది. అష్టమి రోజున ఇక్కడ గుమ్మడికాయలో దీపారాధన చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిపై నమ్మకంతో భక్తులు అధికంగా వస్తున్నారు. – ఓం నమశ్శివాయ, ఆలయ పూజారి, మగసానితిప్ప

ఆధ్యాత్మిక సమాచారం

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపి, ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. కార్తిక మాసం ముగియడం, అమావాస్య నేపథ్యంలో ఆదిదంపతుల ఆర్జిత సేవల్లో విశేషంగా పాల్గొనడంతో పాటు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ.300, రూ.500 టికెటు క్యూలైన్లలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ దర్శించుకున్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలోని డీఈఓ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి దేవస్థానానికి సంబంధించిన 2025 క్యాలెండర్‌ను విడుదల చేశారు. క్యాలెండర్‌లో అమ్మవారి దసరా అలంకారాలతో పాటు దుర్గా మల్లేశ్వర స్వామి మూలవిరాట్ ఫొటోలను ముద్రించారు. రెండు, మూడు రోజుల్లో ఈ క్యాలెండర్లు భక్తులకు అందుబాటులోకి వస్తాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

దుర్గగుడి ఆస్థాన సిద్ధాంతిగా చల్లా శ్రీనివాసశర్మ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన సిద్ధాంతిగా చల్లా శ్రీనివాసశర్మ నియమితులయ్యారు. ఆదివారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో చల్లా శ్రీనివాసశర్మ బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చల్లా శ్రీనివాసశర్మ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ ఈవో కేఎస్ రామరావు, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కాసుల హారం' శోభాయాత్ర

చంద్రగిరి/తిరుమల : పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు సోమవారం రాత్రి అమ్మవారు గజవాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా పున్నమి గరుడ సేవ రోజున శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీ కాసుల హారాన్ని గజ వాహనంపై కొలువుదీరిన అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం తిరుమల నుంచి సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని శోభాయాత్రగా తిరుచానూరుకు తీసుకువచ్చి ఆలయ అధికారులు, అర్చకులకు అందజేయనున్నారు. ఈ క్రమంలోనే గజవాహన సేవ అనంతరం సిరులతల్లికి వేడుకగా వసంతోత్సవం నిర్వహించనున్నారు.


నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు ఘనంగా జరిగాయన్నారు. జిల్లా కార్యదర్శి గుజ్జల వలరాజును రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. విద్యను రాష్ట్రాల జాబితాకు మార్చాలని, విద్యారంగానికి ప్రత్యేకంగా నిధులు అందించాలని కోరారు. కేజీ నుండి పీజీ మరియు పరిశోధన స్థాయి వరకు ఉచిత విద్య అందించాలని కోరారు. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించి, బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవోలను రద్దు చేయాలనే తదితర డిమాండ్‌తో పోరాటం చేస్తామన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల సీట్లు వంఎటనే భర్తీ చేయాలని కోరారు. వైవీయూ యూనివర్సిటీకి నిధులు కేటాయించి ఆర్కిటెక్ యూనివర్సిటీకి స్థలం కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు జె.శివ శంకర్, నగర కార్యదర్శి శివ తేజ, మని ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



గోదారమ్మ పుట్టింటికి వెళ్లొద్దామా?


నాసిక్ త్రయంబకం ఈ రెండింటినీ కలిపి పలుకుతారు. కానీ ఈ రెండింటికీ మధ్య 30 కిలో మీటర్ల దూరం ఉంది. త్రయంబకం జ్యోతిర్లింగం. ఇక్కడ పానవట్టం మీద మూడు చిన్న చిన్న శివలింగాలుంటాయి. నీరు ఊరుతూ ఉంటుంది. ఆ నీటిని చేత్తో తీసి బయట పోస్తుంటారు పూజారులు. ఆ నీరు బ్రహ్మగిరి కొండల్లో నుంచి ఉబికి వస్తున్న గోదావరి నీరని చెబుతారు. త్రయంబకం ఆలయ నిర్మాణం ఒక అద్భుతం. గ్రానైట్ రాయిలో చెక్కిన గోపురం, ఆ గోపురంలో చెక్కిన శిల్పాల సౌందర్యం కనువిందు చేస్తుంది. శిల్పకారులకు చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది. ఆలయంలో నాలుగు వైపులా ద్వారాలుంటాయి. స్పెషల్ దర్శనం కోసం ఆలయ సంస్థానం నిర్వహిస్తున్న దర్శనం కౌంటర్ ఉంటుంది. కానీ సమాంతరంగా స్థానికులు అవినీతిని ప్రోత్సహిస్తుంటారు. టికెట్ తీసుకోకుండా వాళ్ల చేతికి డబ్బిస్తే మరో ద్వారం నుంచి ఆలయంలో ప్రవేశపెడతారు. ఈ అవినీతిపరులు పర్యాటకులను మిస్‌లీడ్ చేస్తూ కౌంటర్ దగ్గరకు వెళ్లనివ్వకుండా దారి మళ్లిస్తుంటారు. ఆలయ కౌంటర్ నిడివి పెంచితే అవినీతి తగ్గుతుంది, ఆలయ గౌరవం పెరుగుతుంది. ఆలయం లోపల మాత్రం గంభీరమైన వాతావరణం, మనసును శివుడి మీద లగ్నం చేస్తుంది. త్రయంబకేశ్వరుడి దర్శనం తర్వాత ఎదురుగా కనిపిస్తున్న గుట్ట మీద అమ్మవారి ఆలయం ఉంది. త్రయంబకేశ్వరుడి ఆలయం పూర్తిగా నల్లగా ఉంటే అమ్మవారి విగ్రహం తోపాటు ఆలయం నేల నుంచి శిఖరం వరకు మొత్తం పాలరాతి నిర్మాణం.



కొండ మీద గోదావరి

త్రయంబకం తర్వాత బ్రహ్మగిరి కొండల వైపు సాగాలి. గోదావరి నది పుట్టిన ప్రదేశాన్ని చూడాలంటే నిట్టనిలువుగా ఉన్న కొండను నడిచి ఎక్కాల్సిందే. రెండు కొండల మధ్య ఇరుకు మెట్ల మీద పైకి వెళ్తుంటే నది పాయలు పర్యాటకులను పలకరించడానికి ఎదురు వచ్చినట్లు తల మీదకు జాలువారుతుంటాయి. కర్ర సాయంతో కొండ ఎక్కడమే మంచిది. మెట్లెక్కి కొండ మీదకు చేరిన తర్వాత తెలుస్తుంది అది ఒక కొండ కాదని. విశాలంగా విస్తరించిన పశ్చిమ కనుమల శిఖరాల నుంచి ధారలు జలజలమని శబ్దం చేస్తూ కొండల మధ్య విశాలమైన ప్రదేశంలోకి చేరతాయి. అదే గోదావరి కుండ్. భక్తులు ఆ నీటిలో పుణ్యస్నానాలు చేస్తుంటారు. గోదావరి పుట్టిన ప్రదేశాన్ని చూసిన తర్వాత తిరుగు ప్రయాణంలో నాసిక్‌లో ఆగాలి. పంచవటి, సీతాగుహ, కాలారామ్ మందిర్ ప్రధానమైనవి. సీతాగుహలోకి వెళ్లి రావడం ఆసక్తిగా ఉంటుంది. కానీ రద్దీ చాలా ఎక్కువ. క్యూలైన్‌లోనే ఎక్కువ టైమ్ అయిపోతుంది. కాలారామ్ ఆలయంలో రాముడి విగ్రహం అందంగా ఉంటుంది. ఆలయ నిర్మాణం ఉత్తర దక్షిణాది శైలి సమ్మేళనంగా ఉంటుంది. నాసిక్‌లో నాణేల ముద్రణాలయం ఉంది. ఎత్తైన కాంపౌండ్ వాల్‌ను మాత్రమే చూడగలం. టూర్ ఆపరేటర్‌ని అడిగితే ఆ రోడ్డులో తీసుకువెళ్తారు. షిరిడీ ప్రయాణంలో నాసిక్, త్రయంబకాలను కలుపుకోవచ్చు. షిరిడీ నుంచి బయలుదేరిన తర్వాత మొదట ముక్తిధామ్ వస్తుంది. ఈ పాలరాతి ఆలయంలో కృష్ణుడితోపాటు శివుడు... ఇంకా చాలామంది దేవతల రాజస్థాన్ మార్బుల్ విగ్రహాలుంటాయి. పన్నెండు జ్యోతిర్లింగాల నమూనాలుంటాయి. త్రయంబకేశ్వరుడిని కూడా చూడవచ్చు. షిరిడీ టూర్ ఆపరేటర్లు నిర్వహించే కంబైండ్ ప్యాకేజ్‌లలో బ్రహ్మగిరి ఉండదు. విడిగా వాహనం మాట్లాడుకోవాలి. కొండ మీదకు ట్రెకింగ్ కూడా ఉంటుంది. కాబట్టి ఫ్రీ టైమ్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇక నాసిక్‌లో సీతాగుహలోకి వెళ్లడం కంటే క్యూలో మనవంతు కోసం వెయిట్ చేయడమే కష్టం. ఇక్కడ టోకెన్ సిస్టమ్ పెడితే బాగుంటుంది. పర్యాటకులు టోకెన్ తీసుకుని తమ వంతు వచ్చే వరకు ఎదురుగా ఉన్న ఇతర ఆలయాలు, పంచవటి వృక్షాలను చూస్తూ, తినుబండారాలతో కాలక్షేపం చేయవచ్చు. ఇంత సిస్టమాటిక్‌గా ఏమీ ఉండకపోవడంతో పర్యాటకులే స్వయంగా తమ వెనుక వారికి చెప్పి క్యూ లైన్ నుంచి బయటకు వచ్చి టీ స్టాల్‌లో టీ తాగి, స్నాక్స్ తిని మళ్లీ క్యూలో చేరుతుంటారు.






– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ట్రావెల్ సిక్‌నెస్

కొందరికి ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ ఉంటుంది. కొందరికి బస్సు ప్రయాణం పడదు. మరి కొందరికి విమాన ప్రయాణం ఇబ్బంది పెడుతుంది. ఇలాంటప్పుడు దేహం తనను తాను సరి చేసుకోవడానికి కడుపులో తిప్పి వాంతులతో సరిదిద్దుకుంటుంది. ఇక ప్రయాణాల్లో ఎదురయ్యే ప్రధానమైన ఆరోగ్య సమస్యల్లో మలబద్ధకం ఒకటి. వాతావరణ మార్పుతో వచ్చే జలుబు, దగ్గు, జ్వరంతోపాటు ఆహారంలో మార్పు కారణంగా ఎదుర్యే విరేచనాలకు ముందస్తుగా మందులు తీసుకెళ్లవచ్చు. కానీ కాన్‌స్టిపేషన్ తగ్గడానికి మందులు ఉంటాయి, కానీ వాటిని తరచూ వాడకూడదు.

- ట్రావెల్ కాన్‌స్టిపేషన్‌కి కారణం... బస్సు, ట్రెన్, విమానం కోసం ఎదురు చూస్తూ ఎక్కువ సమయం కూర్చుని గడపడం వల్ల దేహకదలికలు తగ్గిపోవడం. మనం నివసిస్తున్న ఎత్తుకంటే ఎక్కువ ఎత్తుకి వెళ్లినప్పుడు దేహంలో సర్కాడియన్ రిథమ్ తనను తాను సరిదిద్దుకోవడానికి కొంత సమయం పడుతుంది. సర్కాడియన్ రిథమ్ మనం వెళ్లిన ప్రదేశానికి తగినట్లు తనను తాను మార్చుకున్న తర్వాత సమస్య పరిష్కారమవుతుంది. ఇందుకు ఇరవై నాలుగ్గంటల సమయం పడుతుంది.
- రోజూ వాకింగ్ లేదా ఇతర వ్యాయామాలు చేసే వాళ్లకు టూర్‌లో ఈ రొటీన్ తప్పుతుంది. ఇది కూడా కాన్‌స్టిపేషన్‌కు కారణమవుతుంటుంది. కాబట్టి రోజులో తగినంత నడక ఉండాల్సిందే. మనం వెళ్లిన ప్రదేశం వాహనంలో ఉండి చూస్తూ ముందుకు సాగే ట్రిప్ అయితే ఉదయం తప్పనిసరిగా ఓ అరగంట వాకింగ్ చేయాల్సిందే. అలా కాకుండా కాలినడన తిరిగి చూసే ప్రదేశాలైతే దేహానికి తగినంత నీరు, శక్తి ఉండే ఆహారం తీసుకుంటే సరిపోతుంది. అలాగే బాదం గింజలు, కమలాలు, అరటిపండ్లు, అవొకాడో, పైనాపిల్ వంటి పీచు సమృద్ధిగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.
- శీతాకాలం దాహం తక్కువగా ఉంటుంది. కాబట్టి నీరు తాగడం తగ్గిపోతుంది. కానీ దేహాన్ని డీహైడ్రేషన్‌కు గురి కానివ్వకుండా తగినంత నీరు తీసుకోవాలి. ఒక వాటర్ బాటిల్‌లో ఎలక్ట్రోలైట్ పౌడర్ కలిపిన నీటిని వెంట తీసుకుని వెళ్లడం మంచిది. ఈ జాగ్రత్తలు తీసుకుంటే ట్రావెల్ సిక్‌నెస్‌లన్నింటినీ అధిగమించవచ్చు.

ఇది సిమ్లా యాపిల్ కాదు... కల్పా యాపిల్





యాపిల్ చెట్టు ఎన్ని కాయలు కాస్తుంది? మనం మామిడి చెట్టును చూస్తాం, జామచెట్టును చూసి ఉంటాం. కానీ యాపిల్ చెట్టుతో మనకు పరిచయం ఉండదు. యాపిల్ కోసం సిమ్లాకే కాదు... కల్పాకు కూడా వెళ్లవచ్చు. అందుకే ఓసారి హిమాచల్ ప్రదేశ్‌లోని 'కల్పా' బాట పడదాం. మన పక్కనే ఉన్నట్లుండే హిమాలయాలను చూస్తూ విస్తారమైన యాపిల్ తోటల్లో విహరిద్దాం. 'రోజూ ఒక యాపిల్ పండు తింటే డాక్టర్‌ను చూడాల్సిన అవసరమే ఉండదు' అని యాపిల్‌లో ఉండే ఆరోగ్య లక్షణాలను ఒక్కమాటలో చెప్తుంటాం. కల్పా గ్రామంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణమైన ఆరోగ్యంతో కనిపిస్తారు. అస్సాం టీ తోటల్లో మహిళలు వీపుకు బుట్టలు కట్టుకుని ఆకు కోస్తున్న దృశ్యాలు కళ్ల ముందు మెదలుతాయి. యాపిల్ తోటల్లో అమ్మాయిలు బుట్టను చెట్టు కొమ్మల మధ్య పెట్టి యాపిల్ కాయలు కోస్తుంటారు. కిన్నార్ కైలాస్ పర్వత శ్రేణుల దగ్గర విస్తరించిన గ్రామం కల్పా. యాపిల్ పండుని చెట్టు నుంచి కోసుకుని తింటూ రంగులు మార్చే హిమాలయాలను చూడడం ఈ ట్రిప్‌లోనే సాధ్యమయ్యే అనుభూతి. తెల్లటి మంచు పర్వత శిఖరాల్లో కొన్ని ఉదయం ఎర్రగా కనిపిస్తాయి. మధ్యాహ్నానికి ఆ శిఖరం తెల్లగానూ మరో శిఖరం ఎరుపురంగులోకి మారుతుంది. సూర్యుడి కిరణాలు పడిన పర్వత శిఖరం ఎర్రగా మెరుస్తుంటుంది. సాయంత్రానికి అన్నీ తెల్లగా మంచు ముత్యాల్లా ఉంటాయి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రకృతి ఇంతే సౌందర్యంగా ఉంటుంది. మంచుకొండలు చేసే మాయాజాలాన్ని చూడాలంటే శీతాకాలమే సరైన సమయం. గోరువెచ్చని వాతావరణంలో విహరించాలంటే మార్చి నుంచి జూన్ మధ్యలో వెళ్లాలి. కల్పా చాలా చిన్న గ్రామం. సిమ్లా టూర్‌లో భాగంగా ప్లాన్ చేసుకోవచ్చు. ఇంత చిన్న కల్పా గ్రామంలో ప్రాచీన దేవాలయాలున్నాయి. బౌద్ధవిహారాలు కూడా ఉన్నాయి.

ఆర్ట్

గ్రాఫిటీ కళతో నిరసన



మార్పు రావాలనుకున్న వ్యక్తి చిత్రకారుడు అయితే అతని కుంచె నుంచి పుట్టే చిత్రం జనాలను ఆలోచింపజేస్తుంది. అస్సాంలో గ్రాఫిటీ అనేది కళ కంటే గొప్పది అని నిరూపిస్తుంది. రాజకీయ, పర్యావరణ సమస్యలపై అవగాహన పెంచడానికి దృశ్యమాన స్వరాన్ని వినిపిస్తోంది.

సుసంపన్నమైన సాంస్కృతిక సంప్రదాయాలు, రాజకీయ పరిణామాలతో నిండిన ప్రాంతంగా అస్సాం పేరొందింది. అలాంటి చోట చాలా కాలంగా కేవలం స్వీయ వ్యక్తీకరణ రూపమే కాకుండా సామాజిక మార్పు కోసం ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తోంది కళ. ఇక్కడ గ్రాఫిటీ, స్ట్రీట్ ఆర్ట్ సామాజిక పర్యావరణ సమస్యలకు వ్యతిరేకంగా నిరసనకు పదునైన రూపాలుగా ఉద్భవించాయి.

ఆకర్షించిన జాతీయ దృష్టి

గ్రాఫిటీ ఇప్పుడు అక్కడ నిరసన మాధ్యమంగా ఉంటోంది. అటవీ నిర్మూలన, ప్రభుత్వ విధానాలు, సహజ వనరులు కలుషితం అవడం.. వంటి విషయాలపై ఆరోపణలే కాదు సమస్యలను పరిష్కరించడానికి స్థానిక కళాకారులు గ్రాఫిటీని ఉపయోగిస్తున్నారు. స్థానిక కళాకారుడు మార్షల్ బారుహ్. అతని బోల్డ్ గ్రాఫిటీ కళాఖండాలు ఇప్పుడు ఆ రాష్ట్రంలో వాడి, వేడి సంభాషణలకు దారితీశాయి. ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై దృష్టిని ఆకర్షించాయి. బారుహ్ ఇటీవల జోర్హాట్‌లోని హోలోంగపర్ గిబ్బన్ వన్యప్రాణుల అభయారణ్యంలో ప్రతిపాదిత చమురు అన్వేషణను వ్యతిరేకిస్తూ తన కళాకృతి కోసం జాతీయ దృష్టిని ఆకర్షించాడు. ఈ ప్రాజెక్ట్ అంతరించిపోతున్న గిబ్బన్‌ల నివాసాలను బెదిరించింది.గౌహతి, ఎగువ అస్సాంలోని గోడలు, ఫ్లైఓవర్లపై అతని అద్భుతమైన విజువల్స్ ఈ సమస్య గురించి ప్రజలకు అవగాహన కల్పించాయి. ఇది చివరికి నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ (NBWL)కు చేరింది.

కళకు సంకెళ్లు

'నా కళాఖండాలు రాజకీయ విధాన నిర్ణయాలు వాయిదా వేయడానికి ఎంతవరకు దోహదపడ్డాయో నాకు తెలియదు. కానీ నా రచనలను గమనించిన తర్వాత ప్రజలు ఈ సమస్య గురించి తెలుసుకున్నారని నేను సంతృప్తి చెందాను. కళకు ప్రజలను ఆలోచింపజేసే సామర్థ్యం ఉంది. ఉపరితలం దాటి చూసేలా వారిని ప్రేరేపించగలదు' అని బారుహ్ చెబుతాడు. అతని ఈ నినాదం ఉద్యమం తేవడానికి కాదు. హింస, నిరుద్యోగం, చెట్ల నరికివేత, ప్రభుత్వ విధానాలకు సంబంధించి చాలా మంది పౌరులు అనుభవించిన నిరాశకు ప్రతిబింబం 'కళ కేవలం సామాజికంగా ప్రతిబింబించాలి వాస్తవాలు నగరాన్ని సుందరీకరించడంపై మాత్రమే దృష్టి సారిస్తే, క్లిష్టమైన సమస్యల నుండి దృష్టిని మళ్లించే ప్రమాదం ఉంది' అని యువ కళాకారుడు గట్టిగానే సమాధామిస్తాడు. అన్నింటికంటే, బారుహ్ అరెస్టు కళాత్మక వ్యక్తీకరణ, ప్రభుత్వ అధికారం మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతను హైలైట్ చేస్తుంది.

ఆర్టిస్ట్స్ వర్సెస్ అథారిటీ

కళను నిరసన సాధనంగా, విధ్వంసకరంగా భావించే రేఖ దీంతో మరింత అస్పష్టంగా మారింది. మరొక ప్రముఖ గ్రాఫిటీ కళాకారుడు నీలిమ్ మహంత ఈ భావాలను ప్రతిధ్వనిస్తూ, నిరసన కళ గురించి మరింత బహిరంగ సంభాషణకు పిలుపునిచ్చారు. 'కళను నిరసన రూపంగా స్వాగతించాలి. దీనికి వ్యతిరేకంగా చట్టాలు విధించే బదులు, కళాకారులు హైలైట్ చేస్తున్న సమస్యలపై ఆరోగ్యకరమైన చర్చలను ప్రభుత్వం ప్రోత్సహించాలి' అని మహంత అన్నారు. బారుహ్, గ్రాఫిటీని సృష్టించడం అనేది కేవలం ఒక కళాత్మక ప్రయత్నం కాదు. ప్రభుత్వ చర్యల పట్ల అసంతృప్తిని తెలియజేయడానికి ఒక మార్గం.'మేము మా అసమ్మతిని పదాలకు బదులుగా చిత్రాల ద్వారా వ్యక్తపరుస్తున్నాం' అని భేజల్ అనే స్థానిక గ్రాఫిటీ కళాకారుడు పర్యావరణ సమస్యలను ఎత్తిచూపారు.

కళా శక్తి

ప్రకృతి విధ్వంసంపై దృష్టి సారించే అతని రచనలు, చెట్ల నరికివేత, గౌహతిలోని జలుక్‌బరి ఫ్లైఓవర్‌లోని గోడలపై అడవుల సమస్యలు, పేలవంగా ఉండే ప్రజా మౌలిక సదుపాయాల స్థితి వంటి పర్యావరణ సంబంధిత ఆందోళనల గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. నిరసన కళతో ప్రమాదాలు ఉన్నప్పటికీ, ఈ కళాకారులు అధైర్యపడలేదు. 'కళకు అపారమైన శక్తి ఉంది. జాతీయ రహదారులపై కళాఖండాలను రూపొందించకుండా ఒక సంవత్సరం పాటు నన్ను నిషేధించారు. కొన్ని నిరసనల సమయంలో నేను గౌహతిలో ఉండి ఉంటే నన్ను అరెస్టు చేసి ఉండేవారని తెలుసు. కానీ అలాంటి ఆంక్షలు నన్ను ఆపలేవు. కళ నా స్వరం' అని చెబుతాడు అతను. 'నిరసన కళ రాజకీయాలు అస్సాంలోని వివాదాస్పద స్వభావాన్ని చట్టాన్ని అమలు చేసే అధికారులు గుర్తించారు. రాజకీయ నాయకులు మద్దతు కూడగట్టడానికి దీనిని ఉపయోగిస్తున్నారు. కానీ అదే సాధనాలను వారి ప్రత్యర్థులు ఉపయోగించినప్పుడు, బెదిరింపులకు గురవుతారు' అంటూ ఒక సీనియర్ పోలీసు అధికారి మీడియాతో ప్రస్తావించారు. అస్సాంలో కళాత్మక స్వేచ్ఛ, రాజకీయ అధికారం మధ్య ఉద్రిక్తత రాష్ట్రానికి మాత్రమే కాదు. ఇది భారతదేశం అంతటా విస్తృత ధోరణిని ప్రతిబింబిస్తుంది. ఇక్కడ నిరసన కళ వివాదాస్పద సమస్యగా మారింది. జాతి కలహాలు, పర్యావరణ క్షీణత, రాజకీయ అశాంతి వంటి సమస్యలతో రాష్ట్రం చాలా కాలంగా పోరాడుతోంది. అస్సాంలో కళ అసమ్మతి స్వరంగా మారింది. న్యాయం కోసం పిలుపునిచ్చే శక్తివంతమైన అహింసా మార్గంగారూపు కట్టింది.



గార్డెన్ ఆర్ట్

చిరస్థాయిగా నిలిచిపోయే తోట

అరటి గెల, గుమ్మడికాయలు, పనస, పైనాపిల్... ఇవన్నీ తోటలో పండుతాయి. డిజైనర్ బెంజుమ్ ఇత్తడి నమూనాలతో ఇంట్లో ఎప్పటికీ నిలిచి ఉండే పండ్లను, కూరగాయలను సృష్టించాడు. 'ప్రకృతికి, అతని తల్లికి, తన జీవితానికి గుర్తుగా వీటిని సృష్టించాను' అని చెబుతాడు బెంజుమ్



అరుణాచల్ ప్రదేశ్‌లోని టిర్బిన్ అనే చిన్న గ్రామంలో జన్మించిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ జెంజుమ్. తన చిన్ననాటి జ్ఞాపకాలను బతికించుకోవాలన్నది అతని తాపత్రయం. వినోదం అందుబాటులో లేని ప్రదేశంలో పెరిగినందున, 1980లలో చిన్న పిల్లవాడిగా అతని తీరిక పనిలో చెట్లు ఎక్కడం, తేనెటీగలను వెంబడించడం, నదుల్లో ఈత కొట్టడం, చేపలు పట్టడం, పర్వతాలలో హైకింగ్ చేయడం వంటివి ఉన్నాయి. ప్రకృతి అతని ఏకైక ఆట స్థలం. ఇప్పుడు ఆ ప్రకృతినే తన తొలి ఆర్ట్ షో 'అపొసే'ను ప్రదర్శనకు పెట్టాడు, ఇది బెంజుమ్ స్థానిక గాలో మాండలికంలో అక్షరాలా 'వివిధ రకాల పండ్లు' అని అర్థం.



దానిమ్మపండ్లు – కళాకారుడి పనితీరును వెలుగులోకి తెచ్చాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని రూపా అనే చిన్న గ్రామంలో టిబెటన్ మఠాల కోసం సాంప్రదాయ ఇత్తడి వస్తువులను రూపొందించడంలో నైపుణ్యం కలిగిన స్థానిక కళాకారులు ఉన్నారు. రాష్ట్రంలోని పశ్చిమాన ఉన్న తవాంగ్, ఆసియాలో అతి ప్రాచీనమైన, రెండవ అతి పెద్ద బౌద్ధ ఆశ్రమానికి నిలయం ఉంది. ఆ ఆశ్రమాలను సందర్శించిన బెంజుమ్ నిజమైన పండ్లను అచ్చులుగా ఉపయోగించడం, వాటిని శాశ్వతమైన ఇత్తడి ప్రదర్శనలుగా మార్చడంపై ఆసక్తిని పెంచింది. బెంజుమ్ ఢిల్లీలో నివసిస్తున్నాడు. తన ఢిల్లీ తోటలో బెంజుమ్ మామిడి, బొప్పాయి, అవకాడో, సీతాఫలం, అరటి, నిమ్మకాయలు వంటి వివిధ రకాల పండ్లను సీజన్‌ను బట్టి పండిస్తాడు. అయితే అతనికి ఇష్టమైనది నారింజ. ''నారింజ చెట్లు సాధారణంగా ముళ్లతో ఉంటాయి, కానీ చెట్ల వయస్సు పెరిగే కొద్దీ ముళ్ళు తగ్గిపోతాయి. నారింజ పండ్లను కోయడం, స్నేహితులతో కలిసి ఆడుకోవడం, ముళ్ల నుండి వచ్చిన కొద్దిపాటి గాయాలను తీర్చే పండ్ల మాధుర్యం నాకు చిన్ననాటి జ్ఞాపకాలుగా ఉన్నాయి'' అని బెంజుమ్ గుర్తు చేసుకుంటాడు.

జ్ఞాపకాల తోట

''మా ఊరిలో ప్రతి ఇంటికీ తోట ఉంటుంది. పువ్వులకు బదులుగా వాటిలో కూరగాయలు, పండ్లు పండిస్తాం. రైతు అయిన నా తల్లి ఎప్పుడూ గ్రామంలోనే ఉంటూ తన జీవితమంతా మా తోటలో పండ్లు, కూరగాయలు పండిస్తూ ఉండేది. వాటికి విత్తనాలు నిల్వచేసేది. అక్కడ సమయం గడపడం నా సృజనాత్మక పనిని లోతుగా ప్రభావితం చేసింది. ప్రకృతితో ఈ కనెక్షన్ ఇప్పుడు నా డిజైన్లలోకి విస్తరించింది. ఆ జ్ఞాపకాలను మళ్లీ పునశ్చరణ చేసి, వాటికి ఒక సాక్షాత్కార రూపం ఇవ్వాలన్న నా ప్రయత్నమే 'అపొసే''' అని బెంజుమ్ చెబుతారు.

ఇత్తడి ఫ్రూట్స్

ఇత్తడితో రూపొందించిన 16 త్రీ–డైమెన్షనల్ ఫ్రూట్ మోడల్ అద్భుతంగా అనిపిస్తుంది. ప్రతి ఒక్క కళారూపం బెంజుమ్ తల్లి తోట నుండి ఒక పండు, కూరగాయలను సూచిస్తుంది. ఈ డిజైన్స్‌తో బెంజుమ్ ప్రదర్శన కూడా నిర్వహించాడు. 12, 44 అంగుళాల అరటి గెల, పైనాపిల్స్, బొప్పాయిలు, జాక్‌ఫ్రూట్స్, నిమ్మకాయలు, గుమ్మడికాయలు,



కళను బతికించాలి..

ఈశాన్య ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే కొద్దిమంది డిజైనర్లు, కళాకారులలో బెంజుమ్ ఒకరు. 'ప్రక్రియ నెమ్మదిగా ఉంది, కానీ మొత్తానికి ప్రారంభమైంది. ఇప్పుడు ఈ ప్రాంతం నుండి కొత్త తరం యువ కళాకారులు ఉద్భవించడాన్ని నేను గమనించాను. వారిలో ఈ కళ పట్ల అవగాహన పెంచాలి, సృజనాత్మకతను మెరుగుపరచాలి' అని వివరిస్తాడు బెంజుమ్. బెంజుమ్ ప్రతిభ బట్టలు డిజైన్ చేయడం, సినిమాల్లో నటించడం వరకే కాదు ఇప్పుడు ఈ కళారూపాలతో బిజీ అయిపోతే తిరిగి పెద్ద స్క్రీన్‌పై ఎప్పుడు చూస్తామని అక్కడి వారు అడుగుతుంటారు. బెంజుమ్ నవ్వుతూ 'ముందు చేస్తున్న పనిపైనే సంపూర్ణ దృష్టి పెడుతున్నాను' అంటారు బెంజుమ్.

నృత్యం


క్లాసికల్ డ్యాన్స్ మహోత్సవ్!



మైసూరు కళా దివస్‌లో వసుంధరోత్సవ–2024 పేరుతో 10 రోజుల మెగా క్లాసికల్ డ్యాన్స్ మహోత్సవం జరిగింది. మెగా క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో 550 మందికి పైగా నృత్యకారులు పాల్గొన్నారు. నృత్యకళాకారిణి వసుంధర దొరస్వామి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇంత మంది నృత్యకళాకారులు పాల్గొన్న ఈ వేడుక ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకుంది.

ఈ నృత్యరూపకానికి ప్రఖ్యాత నృత్య కళాకారిణి వసుంధర దొరస్వామి నృత్య దర్శకత్వం వహించారు. నృత్యకారులలో ఆమె విద్యార్థులే కాకుండా ఇతర గురువుల వద్ద నృత్యం నేర్చుకున్న వారు కూడా తమ కళను ప్రదర్శించారు. మైసూరు కళా దివస్ పేరుతో శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమానికి చెందిన దత్త విజయానంద తీర్థ స్వామి, సుత్తూరు మఠానికి చెందిన శివరాత్రి దేశికేంద్ర స్వామి, మైసూరు ఎంపీ యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్, సంగీత అకాడమీ పీఠాధిపతి సంధ్యా పురేచ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన శివరాత్రి దేశికేంద్ర స్వామి మాట్లాడుతూ 'యోగా మాదిరిగానే భారతనాట్యం కూడా ఈ దేశం ప్రపంచానికి అందించింది. వసుంధర దొరస్వామి భరతనాట్యానికి చేసిన కృషికి, ప్రపంచ స్థాయిలో గొప్ప, ప్రాచీన నృత్య రూపాన్ని ప్రోత్సహించారు' అని ప్రశంసించారు. మైసూరు కళా దివస్ వసుంధర పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ నిర్వహించిన శాస్త్రీయ నృత్యం ఇది. వసుంధర దొరస్వామికి భరతనాట్యానికి 50 ఏళ్లుగా చేస్తున్న సేవను పురస్కరించుకొని ఈ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకలో మైసూరులోని కళాకారులు, నృత్య గురువులే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులూ పాల్గొన్నారు. ఈ ఉత్సవం భరతనాట్యానికి అంకితం చేస్తున్నామని వివరించారు.





కష్టాల మధ్యలో అవకాశం ఉంటుంది

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

బిజినెస్ రీల్

బీమా ప్రీమియంలపై జీఎస్‌టీ ఎత్తివేయండి

జీవిత బీమా ఉద్యోగుల సమాఖ్య డిమాండ్



కోల్‌కతా: బీమా ప్రీమియంలపై జీఎస్‌టీ ఎత్తివేయడంతో పాటు ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెంపునకు అనుమతి నిరాకరించాలంటూ జీవిత బీమా ఉద్యోగుల సమాఖ్య డిమాండ్ చేసింది. అలాగే కొత్త కార్మిక చట్టాల ఉపసంహరణ, 2010 తర్వాత ఎల్ఐసీలో రిక్రూట్ అయిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సమాఖ్య కోరింది. తమ డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారంతో పాటు అన్ని పార్టీల మద్దతు కోరతామని ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ వి.నరసింహన్ తెలిపారు.

సమర్థవంతమైన చట్టాల అవసరం..

పన్ను చట్టాలను సులభతరంగా మార్చాల్సిన అవసరం ఉందని ఇదే సమావేశంలో పాల్గొన్న ఏఎంఆర్‌జీ అండ్ అసోసియేట్స్ సీనియర్ పార్ట్‌నర్ రజత్ మోహన్ సైతం పేర్కొన్నారు. నిబంధనల అమలుతోపాటు, మరింత మందిని పన్ను చెల్లింపుల పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ''సుప్రీంకోర్టు వరకు చేరేలోపే 50 శాతం కేసుల్లో ప్రభుత్వం వీగిపోతోంది. పెద్దగా ఆదాయం లేని సంస్థలకు సైతం ఇటీవల భారీ మొత్తంతో పన్ను డిమాండ్‌లు జారీ చేయడాన్ని గుర్తు చేశారు. మరింత సమర్థవంతమైన పన్నుల వ్యవస్థతో వివాదాలు గణనీయంగా తగ్గిపోతాయని అభిప్రాయపడ్డారు.

టెక్ మహీంద్రా, పెరల్ ఇన్నోవేషన్ హబ్



ముంబై: టెక్ మహీంద్రా సహకారంతో బెంగళూరులో మేకర్స్ ల్యాబ్ పేరుతో ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పెరల్ అకాడమీ తెలిపింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెటావర్స్, గేమింగ్ రంగాల్లో పరిష్కారాలను అభివృద్ధి చేసే దిశగా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులను ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమని క్రియేటివ్ ఆర్ట్స్ ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన పెరల్ అకాడమీ పేర్కొంది. 'టెక్ మహీంద్రా సంకేతిక నైపుణ్యంతో మా డిజైన్ ఇన్నోవేషన్లను మిళితం చేయడం ద్వారా పరిశ్రమలో సరికొత్త ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది' అని అకాడమీ ప్రెసిడెంట్ అదితీ శ్రీవాస్తవ తెలిపారు. అభివృద్ధి చెందిన సాంకేతిక రంగం కొత్త నైపుణ్యాలను, సృజనాత్మక రంగం అనుభవాలను మేకర్స్ ల్యాబ్ అందిస్తుందన్నారు.

ఏపీలో కేవీబీ రెండు కొత్త శాఖలు



చెన్నై: ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో మొత్తం నాలుగు కొత్త శాఖలు ప్రారంభించింది. వీటిలో రెండు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కడపలో ఏర్పాటు చేసింది. దీంతో మొత్తం శాఖల సంఖ్య 858కి చేరినట్లు బ్యాంకు తెలిపింది. సెప్టెంబర్ ఆఖరు నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ. 1,76,138 కోట్లుగా ఉంది.

నవంబర్‌లో ఆటో అమ్మకాల జోరు

- కలిసొచ్చిన పెళ్లిళ్ల సీజన్
- ఎస్‌యూవీలకు డిమాండ్



న్యూఢిల్లీ: పెళ్లిళ్ల సీజన్, ఎస్‌యూవీలకు డిమాండ్ నెలకొనడం, గ్రామీణ మార్కెట్లు మెరుగుపడుతుండటం వంటి సానుకూల అంశాలతో నవంబర్‌లో వాహన విక్రయాలు పెరిగాయి. మారుతీ సుజుకీ ఇండియా, టాటా మోటర్స్, టయోటా కిర్లోస్కర్ మోటర్స్ మొదలైన దిగ్గజాల దేశీయ అమ్మకాలు వృద్ధి చెందాయి. మారుతీ విక్రయాలు 5 శాతం, టాటా మోటర్స్ 2 శాతం, టయోటా 44 శాతం మేర వృద్ధి నమోదు చేశాయి. అటు, కొత్తగా లిస్టయిన హ్యుందాయ్ మోటర్ ఇండియా అమ్మకాలు 2 శాతం క్షీణించాయి. గ్రామీణ మార్కెట్లు పుంజుకుంటూ ఉండటం, ఎస్‌యూవీలకు డిమాండ్ నెలకొనడం, లిమిటెడ్ ఎడిషన్లను ప్రవేశపెట్టడం తదితర అంశాలు తమకు కలిసొచ్చాయని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. నవంబర్‌లో బ్రెజా, ఎర్టిగా, గ్రాండ్ విటారా ఎక్స్‌ఎల్6 వంటి యుటిలిటీ వాహనాల అమ్మకాలు గత నవంబర్‌లో నమోదైన 49,016 యూనిట్లతో పోలిస్తే 59,003 యూనిట్లకు పెరిగాయి. అయితే, ఆల్టో, ఎస్-ప్రెసోలాంటి మినీ-సెగ్మెంట్ కార్ల అమ్మకాలు 9,959 యూనిట్ల నుంచి 9,750 యూనిట్లకు తగ్గాయి. మరోవైపు, వివిధ వర్గాల అవసరాలకు అనుగుణమైన హ్యాచ్‌బ్యాక్‌ల నుంచి ఎస్‌యూవీల వరకు వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో విక్రయాలు మెరుగుపర్చుకుంటున్నట్లు టయోటా వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు.

కంపెనీ	నవంబర్ 2024	నవంబర్ 2023	వృద్ధి/క్షీణత (శాతాల్లో)
మారుతీ సుజుకీ	1,41,312	1,34,158	5
టాటా మోటర్స్	73,246	72,647	1
హ్యుందాయ్	48,246	49,451	- 2
టయోటా	25,586	17,818	44
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ	6,019	---	---
వీఈసీవీ	5,574	5,194	7
ద్విచక్ర వాహనాలు..			
టీవీఎస్ మోటర్స్	4,01,250	3,64,231	10
సుజుకీ మోటర్‌సైకిల్	94,370	87,96	8

మార్కెట్లపై జీడీపీ ఎఫెక్ట్

ఆర్‌బీఐ పాలసీపై దృష్టి

- గణాంకాలకూ ప్రాధాన్యం
- ఫెడ్ చైర్మన్ పావెల్ ప్రసంగం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబర్)లో దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను అందుకోలేకపోయింది. గత 7 త్రైమాసికాలలోనే అత్యల్పంగా 5.4 శాతంగా నమోదైంది. జీడీపీ గణాంకాలు గత వారాంతాన మార్కెట్లు ముగిశాక వెలువడటంతో ఈ ప్రభావం నేడు (2న) దేశీ స్టాక్ మార్కెట్లపై కనిపించనున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. దీనికితోడు అంతర్జాతీయ పరిస్థితులు, విదేశీ పెట్టుబడులు, స్థూల ఆర్థిక గణాంకాలు సైతం ఈ వారం సెంటిమెంటుపై ప్రభావం చూపనున్నట్లు తెలియజేశారు. ఈ వారం చివర్లో రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) పరపతి సమీక్షను చేపట్టనుంది. దీంతో ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలపై దృష్టి పెట్టనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.

ఆటో గణాంకాలు

నవంబర్ నెలకు ఆటో రంగ గణాంకాలు ఆశావహంగా వెలువడ్డాయి. పెళ్లిళ్ల సీజన్‌కుతోడు.. ఎస్‌యూవీలకు డిమాండ్ కొనసాగడంతో వాహన విక్రయాలు సానుకూలంగా నమోదయ్యాయి. దీంతో సోమవారం(2న) ఆటో రంగ కౌంటర్లలో యాక్టివిటీ కనిపించనున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కాగా.. ఈ ఏడాది క్యూ2లో అంచనాలను వమ్ము చేస్తూ జీడీపీ నెమ్మదించడంతో కొంతమేర సెంటిమెంటు బలహీనపడే వీలున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. తయారీ, మైనింగ్‌తోపాటు వినియోగం తగ్గడం జీడీపీని దెబ్బతీసింది. జీడీపీ మందగమన ప్రభావం ఆర్‌బీఐ నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చని మిశ్రా తెలియజేశారు. వడ్డీ రేట్లపై నిర్ణయాలు కీలకంగా నిలవనున్నట్లు తెలియజేశారు.

విదేశీ అంశాలు

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ భౌగోళిక అనిశ్చితులు మార్కెట్లలో ఆందోళనలకు కారణమవుతున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్‌మీనా పేర్కొన్నారు. ప్రధానంగా రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధ వాతావరణం ప్రభావం చూపుతున్నట్లు వివరించారు. యూఎస్ తయారీ, సర్వీసుల రంగ గణాంకాలు, వ్యవసాయేతర రంగంలో ఉపాధి, నిరుద్యోగిత అంశాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ పాల్కా అరోరా చోప్రా వివరించారు. వీటికితోడు యూఎస్ ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ ప్రసంగం(5న)పై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు సంతోష్ మీనా పేర్కొన్నారు.

ఆర్థిక గణాంకాలు

దేశీయంగా ఈ వారం ఆర్థిక గణాంకాలు కీలకంగా నిలవనున్నట్లు అరోరా చోప్రా తెలియజేశారు. నవంబర్ నెలకు తయారీ, సర్వీసుల రంగ పీఎంఐ గణాంకాలు నేడు వెలువడనున్నాయి. అక్టోబర్‌లో తయారీ రంగ పీఎంఐ 57.3కు చేరగా.. సర్వీసుల రంగ పీఎంఐ 59.5గా నమోదైంది. క్యూ2లో దేశ జీడీపీ నీరసించినప్పటికీ ప్రపంచ దేశాలలో వేగవంత వృద్ధిగా నిలవడం ప్రస్తావించదగ్గ అంశమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇవికాకుండా డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, ముడిచమురు ధరలు, యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ వంటి అంశాలూ కీలకమేనని తెలియజేశారు.

గత వారమిలా..

పలు ఆటుపోట్ల మధ్య గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ నికరంగా 686 పాయింట్లు(0.9 శాతం) జంప్‌చేసింది. 79,803 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 224 పాయింట్లు(1 శాతం) ఎగసి 24,131 వద్ద స్థిరపడింది.

అమ్మకాలవైపే ఎఫ్‌పీఐలు



నవంబర్‌లో రూ. 21,612 కోట్లు

దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు కొనసాగుతున్నాయి. గత నెల(నవంబర్)లో నికరంగా రూ. 21,612 కోట్ల(2.56 బిలియన్ డాలర్లు) విలువైన స్టాక్స్ విక్రయించారు. ఇందుకు ప్రధానంగా యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ మెరుగుపడటం, ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు బలపడటం, దేశీ ఆర్థిక వ్యవస్థ మందగించడం వంటి అంశాలు ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. అయితే అంతక్రితం నెల(అక్టోబర్)తో పోలిస్తే నవంబర్‌లో ఎఫ్‌పీఐల అమ్మకాల స్పీడ్ తగ్గింది. అక్టోబర్‌లో కొత్త చరిత్రను లిఖిస్తూ ఎఫ్‌పీఐలు దేశీ ఈక్విటీల నుంచి 11.2 బిలియన్ డాలర్లు(రూ. 94,017 కోట్లు) పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు

నవంబర్‌లో వృద్ధి రేటు 8.5 శాతం



న్యూఢిల్లీ: స్థూల వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు నవంబర్‌లో 8.5 శాతం పెరిగి రూ.1.82 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన అధిక రాబడులు దీనికి కారణం. గత ఏడాది ఇదే నెల్లో ఈ వసూళ్లు రూ.1.68 లక్షల కోట్లు. తాజా గణాంకాల్లో ముఖ్యాంశాలు...

- సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.34,141 కోట్లు
- స్టేట్ జీఎస్‌టీ వసూళ్లు రూ.43,047 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ వసూళ్లు రూ.91,828 కోట్లు
- సెస్ రూ.13,253 కోట్లు
- దేశీయ లావాదేవీల ద్వారా వసూళ్లు 9.4 శాతం పెరిగి రూ.1.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.
- దిగుమతులపై పన్ను ఆదాయం 6 శాతం పెరిగి రూ.42 వేల కోట్లకు చేరింది.

నికరంగా 11 శాతం వృద్ధి

మొత్తం జీఎస్‌టీ వసూళ్లలో నవంబర్‌లో రూ.19,259 కోట్లు రిఫండ్స్‌గా ఉన్నాయి. గత ఏడాది ఇదే నెలతో ఇవి 8.9 శాతం అధికం. ఇవి మినహాయించగా నికర జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం పెరిగి రూ.1.63 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

పెరిగిన ఏటీఎఫ్, వాణిజ్య సిలిండర్ల రేట్లు



న్యూఢిల్లీ: నెలవారీ సమీక్షలో భాగంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరను 1.45 శాతం, వాణిజ్య సిలిండర్ల రేట్లను రూ. 16.5 మేర (19 కేజీల సిలిండర్‌కు) పెంచాయి. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ రేట్లను యథాతథంగా ఉంచాయి. తాజా పెంపుతో ఢిల్లీలో ఏటీఎఫ్ రేటు కిలోలీటరుకు రూ. 1,318.12 పెరిగి రూ. 91,856.84కి, ముంబైలో రూ. 84,642.91 నుంచి రూ. 85,861.02కి చేరింది. ఏటీఎఫ్ రేట్లను పెంచడం వరుసగా ఇది రెండోసారి. అటు హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగించే వాణిజ్య సిలిండర్ల ధరను వరుసగా అయిదో నెల కూడా పెంచడంతో వాటి రేటు రూ. 1,818.50కి చేరింది. మొత్తం మీద అయిదు నెలల వ్యవధిలో ధర 172.5 మేర పెరిగింది. దీంతో అంతకు ముందు వరుసగా నాలుగు నెలల పాటు రూ. 148 మేర తగ్గించిన ప్రయోజనం దక్కకుండా పోయింది. గృహావసరాలకు ఉపయోగించే వంట గ్యాస్ రేటు యథాతథంగా రూ. 803గా (14.2 కేజీల సిలిండర్) ఉంది. ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) ప్రతి నెల ఒకటో తేదీన అంతర్జాతీయ ఇంధన సగటు ధరలు, విదేశీ మారకం రేటు ప్రకారం గ్యాస్, ఏటీఎఫ్ రేట్లను సవరిస్తాయి.

మీడియాలో రిలయన్స్ కవరేజీ టాప్..

విజికీ న్యూస్ స్కోర్ ర్యాంకింగ్‌లో అగ్రస్థానం



న్యూఢిల్లీ: అత్యధికంగా మీడియాలో కనిపించే సంస్థగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో నిల్చింది. ఇతర ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల కన్నా అధికంగా కంపెనీకి కవరేజీ ఉంటోంది. ఏఐ-ఆధారిత మీడియా ఇంటెలిజెన్స్ సంస్థ విజికీ న్యూస్ స్కోర్ ప్రకారం 2024కి గాను రిలయన్స్ 100కి 97.43 స్కోరు దక్కించుకుని అగ్రస్థానంలో నిల్చింది. 2021 నుంచి కవరేజీ స్కోరును 84.9 నుంచి క్రమంగా పెంచుకుంటూ కంపెనీ తన నంబర్ వన్ స్థానంలో కొనసాగుతూ వస్తోంది. తాజా లిస్టులో ఎస్‌బీఐ (89.13), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (86.24), వన్97 కమ్యూనికేషన్స్ (84.63), ఐసీఐసీఐ బ్యాంక్ (84.33), జొమాటో (82.94) మిగతా స్థానాల్లో ఉన్నాయి. 4,00,000 పైచిలుకు పబ్లికేషన్స్‌లో వార్తల పరిమాణం, హెడ్‌లైన్స్, ప్రచురణ సంస్థల సర్క్యులేషన్.. రీడర్‌షిప్ వంటి అంశాల ప్రాతిపదికన వివిధ బ్రాండ్లకు విజికీ న్యూస్ స్కోర్ ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, మెషిన్ లెర్నింగ్, మీడియా ఇంటెలిజెన్స్ మొదలైన సాధనాలతో 0-100 వరకు స్కోరు ఇస్తారు.

పాన్ 2.0 ప్రాజెక్ట్ మంచిదే..

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి



కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

డిజిటల్ ప్రపంచంలో ప్రభంజనం.. మరో ముందడుగు. ఆదాయపు పన్ను శాఖవారు .. అత్యంత ముఖ్యమైనదైన.. అనువైనదైన.. అవసరమైనదైన అడుగువేశారు. ఇక నుంచి పాన్.. అంటే పర్మనెంట్ అకౌంట్ నంబరు, టాన్.. అంటే టాక్స్ నంబరుకి సంబంధించి అన్ని సర్వీసులు ఒకే గూటి కింద ఉంటాయి. వివిధ ప్లాట్‌ఫాంలకు వెళ్లడం ఉండదు. పాత పద్ధతికి స్వస్తి పలికారు. త్వరితగతి విధానం.. పేపర్ సహాయం లేకుండా ఉండటం, ఈ మార్పులన్నీ మనకు అనుగుణంగానే కాకుండా ఫ్రెండ్లీగా కూడా ఉంటాయి.

పాన్‌కి దరఖాస్తు చేయడం, వాటిలో సమాచారం అప్‌డేట్ చేయడం, ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడం .. ఈ మూడింటిని మూడు ప్లాట్‌ఫాంల మీద చేయాల్సి వచ్చేది. ఇకనుంచి మూడూ ఒకే ప్లాట్‌ఫాం మీద చేయొచ్చు. అదే.. పాన్ 2.0 ప్రాజెక్టు. వివరాల్లోకి వెళితే..

- ఇక నుంచి పాన్, టాన్, రెండూ ఒకే ప్లాట్‌ఫాంలో ఉంటాయి
- ఇది వరకులాగా మూడు ప్లాట్‌ఫాంలకు వెళ్లనక్కర్లేదు
- అనేక వెబ్‌సైట్లను సందర్శించనక్కర్లేదు
- కాలం వృధా కాదు .. శ్రమ తక్కువ
- క్షణాల మీద వేలిడేషన్ జరుగుతుంది
- సెక్యూరిటీ పెరుగుతుంది
- మోసాలను తగ్గించవచ్చు
- అన్ని సర్వీసులు ఉచితం
- ఫిజికల్ కార్డు కావాలంటే రూ. 50 చెల్లించాలి
- ఈ-పాన్‌ను మీ మెయిల్‌కి పంపుతారు. తక్షణం అందినట్లు లెక్క. లేటు ఉండదు.
- వివిధ ఫిర్యాదులకు చెక్ పెట్టినట్లు అవుతుంది
- యాక్సెసిబిలిటీ .. అంటే .. అందుబాటులో ఉంటుంది
- డాక్యుమెంట్లు అవసరం లేదు
- ఈ-పాన్ వల్ల డూప్లికేట్ కార్డులను ఏరిపారేయొచ్చు
- డూప్లికేట్ కార్డుల వల్ల జరిగే మోసాలను అరికట్టవచ్చు
- ఈ-పాన్ ఇక నుంచి యూనివర్సల్ ఐడెంటిటీ కార్డుగా చలామణీ అవుతుంది
- అటు అసెసీలకు, ఇటు వృత్తి నిపుణులకు శ్రమ తగ్గుతుంది. కాలం వృధా కాదు
- సెంట్రలైజ్డ్, సింగిల్ విండో విధానం వల్ల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించగలరు

చివరగా ఇప్పుడున్న పద్ధతిలో డూప్లికేట్ కార్డుల వల్ల మోసాలు జరుగుతున్నాయి. రుణ సౌకర్యం, క్రెడిట్ కార్డులు పొందటం, ఒకే వ్యక్తి మరో వ్యక్తిగా చలామణీ అవడం.. వేరే అవతారమెత్తడం ఇలాంటివన్నీ జరుగుతున్నాయి. పాన్, ఆధార్ కార్డు అనుసంధానం జరిగినప్పటికీ మోసాల వెల్లువ తగ్గలేదు.

ఒక సమాచారం ప్రకారం.. 780 మిలియన్లు అంటే 78 కోట్ల మందికి పాన్ కార్డులున్నాయి. కానీ ఆధార్ కార్డులు దేశంలో 138 కోట్ల మందికి ఉన్నాయి. ఆధార్ కార్డున్న ప్రతి వ్యక్తి అసెస్సీ కానక్కర్లేదు. ఆదాయపు పన్ను పరిధిలోకి రానవసరం లేదు.. రారు. 78 కోట్ల మంది పాన్‌హోల్డర్లు ఆధార్ కార్డుతో అనుసంధానం అయితే మోసాలు తగ్గుతాయి. అయితే, ఇందులో డూప్లికేట్ కార్డులు ఎన్ని ఉన్నాయో అంచనా తెలీదు. కానీ చాలా ఏజెన్సీలు.. ప్రకటనల ద్వారా ఊరించి.. యాప్‌ల ద్వారా జనాలను ఆకట్టుకుని మోసాలకు పాల్పడుతున్నాయి.

ఈ నేపథ్యంలో పాన్ 2.0 ప్రాజెక్టు మోసాలను అరికట్టేలా అడుగువేస్తుందని ఆశిద్దాం . మీరు వెంటనే అప్లై చేయనక్కర్లేదు. పాతవి కూడా కొత్త విధానంలో పని చేస్తాయి. మీరు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ సెలెక్ట్ చేసుకుంటే కళ్ళ ముందు ప్రత్యక్షం అవుతుంది ఈ-కార్డు.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మిడ్‌క్యాప్‌లో మెరుగైన రాబడి

కోటక్ ఎమర్జింగ్ ఈక్విటీ ఫండ్



ఈక్విటీల్లో దీర్ఘకాలానికి పెట్టుబడులు పెట్టాలని భావించే వారు లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు పోర్ట్‌ఫోలియోలో చోటు కల్పించుకోవచ్చు. తమ రిస్క్, రాబడుల ఆకాంక్షలకు అనుగుణంగా ఏ విభాగానికి ఎంత కేటాయింపులన్నవి తెల్చుకోవాలి. లార్జ్‌క్యాప్‌తో పోల్చిచూసినప్పుడు కొంత రిస్క్ అధికంగా ఉన్నప్పటికీ 10-20 ఏళ్ల కాలంలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ అధిక రాబడులు ఇవ్వగలవు. మిడ్‌క్యాప్ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న వాటిల్లో కోటక్ ఎమర్జింగ్ ఈక్విటీస్ ఒకటి. దీర్ఘకాల లక్ష్యాల కోసం రిస్క్ భరించే సామర్థ్యం ఉన్నవారు ఈ పథకాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. మిడ్‌క్యాప్‌తోపాటు లార్జ్‌క్యాప్ పెట్టుబడులకూ ఈ పథకం ప్రాధాన్యం ఇస్తుంటుంది.

రాబడులు

ఈ పథకం దీర్ఘకాల పనితీరును గమనించినట్టయితే రాబడులు మెరుగ్గా కనిపిస్తున్నాయి. ఏడాది కాలంలో ఈ పథకంలో రాబడులు 38 శాతానికి పైగా ఉన్నాయంటే పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గడిచిన ఐదేళ్లలో 27 శాతం, ఏడేళ్లలో 18.47 శాతం, పదేళ్లలో 18.84 శాతం చొప్పున వార్షిక రాబడులను ఇచ్చి.. మిడ్‌క్యాప్ విభాగంలోని మెరుగైన పథకాల్లో ఒకటిగా నిలిచింది. ముఖ్యంగా ఏడాది, ఏడేళ్లు, పదేళ్ల కాలాల్లో బెంచ్‌మార్క్ సూచీ 'బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ టీఆర్ఐ' కంటే ఈ పథకం పనితీరే మెరుగ్గా ఉంది. 2007 మే నెలలో ఈ పథకం మొదలు కాగా, నాటి నుంచి చూస్తే వార్షిక సగటు రాబడి 15.75 శాతంగా ఉంది. ఈ పథకంలో ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసే చార్జీ (ఎక్స్‌పెన్స్ రేషియో) 1.43 శాతంగా ఉంది.



పెట్టుబడుల విధానం

కనీసం 65 శాతం నుంచి గరిష్ఠంగా 100 శాతం వరకు పెట్టుబడులను మిడ్‌క్యాప్ కంపెనీలకు కేటాయించడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగం. 2018, 2020 మార్కెట్ కరెక్షన్లలో ఈ పథకం నష్టాలను పరిమితం చేసింది. ఆ తర్వాతి ర్యాలీల్లో మెరుగైన రాబడులను ఇచ్చింది. వృద్ధికి అవకాశం ఉండి, అంతగా వెలుగులోకి రాని పటిష్ఠమైన కంపెనీలను గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. పోర్ట్‌ఫోలియోలో వ్యాల్యూ స్టాక్స్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. మంచి స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడమే కాదు.. తగిన రాబడులు ఇచ్చే వరకు ఆ పెట్టుబడులు కొనసాగిస్తుంటుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో 50,627 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇందులో 96 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ పెట్టుబడులు 0.21 శాతంగా ఉన్నాయి. నగదు, నగదు సమానాలు 3.7 శాతంగా ఉన్నాయి. ఈక్విటీల్లో 40 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. 58 శాతం పెట్టుబడులను మిడ్‌క్యాప్‌లకు కేటాయించింది. స్మాల్‌క్యాప్ పెట్టుబడులు 1.44 శాతంగా ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోలో 66 స్టాక్స్ ఉన్నాయి. ఇందులో టాప్-10 కంపెనీల్లో పెట్టుబడులు 29 శాతంగా ఉన్నాయి. పోర్ట్‌ఫోలియో కాన్సంట్రేషన్ తక్కువ అని అర్థమవుతోంది. పెట్టుబడుల పరంగా టెక్నాలజీ, మెటీరియల్స్, ఇండస్ట్రియల్స్, కన్జ్యూమర్ డిస్క్రీషనరీ, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. 78 శాతం పెట్టుబడులు ఈ రంగాల కంపెనీల్లోనే ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
పర్సిస్టెంట్ సిస్టమ్స్	4.16
ఒరాకిల్ ఫిన్	3.51
ఎంఫసిస్	3.31
ఒబెరాయ్ రియల్టీ	3.11
ఫోర్టిస్ హెల్త్‌కేర్	3.05
ఇప్కా ల్యాబ్	3.01
కోరమాండల్	2.49
పీఐ ఇండస్ట్రీస్	2.39
సోలార్ ఇండస్ట్రీస్	2.23
సుప్రీమ్ ఇండస్ట్రీస్	2.19


శ్రీకర్ భరత్

ఆంధ్ర జైత్రయాత్ర

వరుసగా నాలుగో విజయం ● అదరగొట్టిన రికీ భుయ్, కేఎస్ భరత్ ● ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు విజయపరంపర కొనసాగుతోంది. టోర్నీలో సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తున్న ఆంధ్ర జట్టు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ గెలుపొందింది. గ్రూప్ 'ఈ'లో భాగంగా ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో ఆంధ్ర జట్టు 23 పరుగుల తేడాతో సర్వీసెస్ జట్టును ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ భుయ్ (35 బంతుల్లో 84; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగగా... ఓపెనర్ కోన శ్రీకర్ భరత్ (39 బంతుల్లో 63; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరిశాడు. ప్రసాద్ (12 బంతుల్లో 28; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. సర్వీసెస్ బౌలర్లలో పూనమ్ పూనియా, మోహిత్ రాఠి, వినీత్ ధన్‌కడ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సర్వీసెస్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 199 పరుగులకు పరిమితమైంది. కెప్టెన్ మోహిత్ అహ్లావత్ (37 బంతుల్లో 74; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), వినీత్ ధన్‌కడ్ (32 బంతుల్లో 51; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీలతో పోరాడారు. ఆంధ్ర బౌలర్లలో స్టీఫెన్, శశి కాంత్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... సత్యనారాయణ రాజు 2 వికెట్లు తీశాడు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆంధ్ర జట్టు 16 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తదుపరి పోరులో మంగళవారం కేరళతో ఆంధ్ర జట్టు ఆడుతుంది.


రికీ భుయ్


స్టీఫెన్

స్కోరు వివరాలు

ఆంధ్ర ఇన్నింగ్స్: కోన శ్రీకర్ భరత్ (సి) అరుణ్ (బి) పూనమ్ పూనియా 63; అశ్విన్ హెబర్ (సి) అరుణ్ (బి) విశాల్ 1; షేక్ రషీద్ (సి) అరుణ్ (బి) పుల్‌కిత్ నారంగ్ 21; రికీ భుయ్ (సి) వినీత్ (బి) విశాల్ 84; పైలా అవినాశ్ (సి) పూనమ్ పూనియా (బి) వినీత్ 5; ప్రసాద్ (సి) విశాల్ (బి) పూనమ్ పూనియా 28; శశి కాంత్ (సి) పూనమ్ పూనియా (బి) వినీత్ 0; వినయ్ కుమార్ (నాటౌట్) 7; సత్యనారాయణ రాజు (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 222. **వికెట్ల పతనం:** 1-24, 2-63, 3-151, 4-175, 5-188, 6-209, 7-222, 8-222. **బౌలింగ్:** పూనమ్ పూనియా 4-0-37-2; గౌరవ్ శర్మ 3-0-43-0; విశాల్ గౌర్ 4-0-50-2; మోహిత్ రాఠి 4-0-35-0; పుల్‌కిత్ 1.5-0-17-1; వినీత్ ధన్‌కడ్ 2.1-0-24-2; నితిన్ తన్వర్ 1-0-16-0.

సర్వీసెస్ ఇన్నింగ్స్: కున్వర్ పాఠక్ (సి) అవినాశ్ (బి) స్టీఫెన్ 2; రజత్ (సి) భరత్ (బి) శశికాంత్ 33; నితిన్ తన్వర్ (ఎల్బీ) రాజు 1; వినీత్ (సి) వినయ్ (బి) శశి కాంత్ 51; మోహిత్ అహ్లావత్ (సి) రికీ భుయ్ (బి) రాజు 74; అరుణ్ (బి) శశికాంత్ 0; మోహిత్ రాఠి (సి) అవినాశ్ (బి) స్టీఫెన్ 5; గౌరవ్ శర్మ (రనౌట్/స్టీఫెన్) 3; పూనమ్ పూనియా (సి) ప్రసాద్ (బి) స్టీఫెన్ 17; విశాల్ గౌర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 199. వికెట్ల పతనం:** 1-4, 2-38, 3-50, 4-150, 5-150, 6-173, 7-175, 8-187, 9-199. **బౌలింగ్:** స్టీఫెన్ 4-0-26-3; శశికాంత్ 4-0-50-3; సత్యనారాయణ రాజు 4-0-39-2; వినయ్ కుమార్ 4-0-35-0; యశ్వంత్ 4-0-43-0.

యువ భారత్ జోరు

జూనియర్ ఆసియా కప్‌లో వరుసగా నాలుగో విజయం ● కొరియాపై 8-1తో గెలుపు



అర్ష్‌దీప్

మస్కట్: జూనియర్ ఆసియా కప్ హాకీ పురుషుల టోర్నమెంట్‌లో భారత్ జైత్ర యాత్ర కొనసాగుతోంది. అర్ష్‌దీప్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్ నమోదు చేయడంతో టీమిండియా 8-1తో కొరియాను చిత్తు చేసింది. పూల్ 'ఎ'లో అన్నీ గెలిచిన భారత్ లీగ్ దశను అజేయంగా ముగించింది. ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా ఇదివరకే సెమీఫైనల్ చేరిన టీమిండియా నేడు సెమీఫైనల్లో మలేసియాతో తలపడనుంది. స్ట్రయికర్ అర్ష్‌దీప్ (9వ , 44వ , 60వ నిమిషాల్లో) అదరగొట్టాడు. తొలి క్వార్టర్ నుంచి, ఆఖరి నిమిషం దాకా మూడు గోల్స్ సాధించి పెట్టాడు. అరిజీత్ సింగ్ హుండల్ (3వ, 37వ నిమిషంలో) రెండు గోల్స్ చేసి భారత్ ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచాడు. గుర్‌జోత్ సింగ్ (11వ నిమిషంలో), రోషన్ కుజుర్ (27వ నిమిషంలో), రోహిత్ (30వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. మొదటి 11 నిమిషాల్లోనే భారత్ 3-0తో మ్యాచ్‌ను శాసించే దిశగా దూసుకెళ్లింది. భారత్‌కు ఈ మ్యాచ్‌లో ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించగా ఇందులో రెండింటిని గోల్స్‌గా మలిచింది. దక్షిణ కొరియా తరఫున నమోదైన ఏకైక గోల్‌ను కిమ్ తేహియోన్ 18వ నిమిషంలో సాధించాడు. నాలుగు లీగ్ మ్యాచ్‌ల్లోనూ గెలిచిన టీమిండియా 12 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. జూనియర్ ఆసియా కప్ చరిత్రలో భారత్ విజయవంతమైన జట్టుగా ఘనత వహించింది. 2004, 2008, 2015, 2023లలో టైటిల్స్ సాధించింది.



శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు బోణీ

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ ఫుట్‌బాల్ లీగ్ ఐ-లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు తొలి విజయం నమోదు చేసింది. ఆదివారం ఇక్కడి డెక్కన్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 2-1 గోల్స్ తేడాతో చర్చిల్ బ్రదర్స్ జట్టుపై గెలుపొందింది. హైదరాబాద్ తరఫున అఫ్గానిస్తాన్‌కు చెందిన ఫైసల్ షెయెస్తె (23వ నిమిషంలో), పనామాకు చెందిన ఏంజెల్ ఒరెలియన్ (72వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. చర్చిల్ బ్రదర్స్ జట్టుకు లామ్‌గౌలెన్ హాంగ్షింగ్ (90+1వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఇరు జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ చైర్మన్ డాక్టర్ కేటీ మహీ కూడా పాల్గొన్నారు. మొత్తం 12 జట్లు పాల్గొంటున్న ఐ-లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు మూడు పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది.

మిలింద్ మెరుపులు వృథా

హైదరాబాద్ జట్టుకు మూడో పరాజయం ● ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ

రాజ్‌కోట్: ఆల్‌రౌండర్ చామా మిలింద్ (22 బంతుల్లో 55; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపులు మెరిపించినా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టుకు పరాజయం తప్పలేదు. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం జరిగిన ఈ పోరులో హైదరాబాద్ జట్టు 7 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్ చేతిలో ఓడింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (36 బంతుల్లో 60; 8 ఫోర్లు, ఒక సిక్స్) అర్ధశతకం సాధించగా... రమణ్‌దీప్ సింగ్ (11 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), నేహల్ వధేరా (31; ఒక ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ, అజయ్‌దేవ్ గౌడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. చామా మిలింద్, రోహిత్ రాయుడు (37 బంతుల్లో 56; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో రాణించగా... మికిల్ జైస్వాల్ (23 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించాడు. కెప్టెన్ తిలక్ వర్మ (9), తన్మయ్ అగర్వాల్ (9), రాహుల్ బుద్ధి (5), అజయ్‌దేవ్ గౌడ్ (6), రవితేజ (0), ప్రతీక్ రెడ్డి (4) విఫలమయ్యారు. ఇన్నింగ్స్ చివరి బంతి వరకు క్రీజులో నిలిచిన మిలింద్ భారీ సిక్స్‌లతో విరుచుకుపడినా... జట్టును విజయతీరానికి చేర్చలేకపోయాడు. పంజాబ్ బౌలర్లలో నమన్ ధీర్ 5 వికెట్లు పడగొట్టాడు. తదుపరి మ్యాచ్‌లో మంగళవారం మధ్యప్రదేశ్‌తో హైదరాబాద్ తలపడనుంది.


రోహిత్ రాయుడు


మిలింద్

స్కోరు వివరాలు

పంజాబ్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి) అజయ్‌దేవ్ గౌడ్ 21; ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) తిలక్ వర్మ (బి) మిలింద్ 1; అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (సి) ప్రతీక్ రెడ్డి (బి) అజయ్‌దేవ్ గౌడ్ 60; నేహల్ వధేరా (సి) మిలింద్ (బి) నితిన్‌సాయి యాదవ్ 31; నమన్ ధీర్ (సి) రాహుల్ బుద్ధి (బి) రవితేజ 9; సాన్వీర్ సింగ్ (సి) రోహిత్ రాయుడు (బి) రవితేజ 24; రమణ్‌దీప్ సింగ్ (నాటౌట్) 39; అర్ష్‌దీప్ సింగ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-13, 2-28, 3-115, 4-115, 5-149, 6-151. **బౌలింగ్:** రవితేజ 4-0-49-2; మిలింద్ 4-0-28-1; అజయ్‌దేవ్ గౌడ్ 4-0-38-2; రక్షణ్ రెడ్డి 2-0-26-0, నితిన్‌సాయి యాదవ్ 4-0-40-1; రోహిత్ రాయుడు 2-0-13-0.

హైదరాబాద్ ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) జసిందర్ సింగ్ (బి) నమన్ 9; రోహిత్ రాయుడు (సి) సాన్వీర్ సింగ్ (బి) నమన్ 56; తిలక్ వర్మ (సి) అర్ష్‌దీప్ (బి) జసిందర్ 9; మికిల్ జైస్వాల్ (సి) అన్‌మోల్‌ప్రీత్ (బి) మయాంక్ మార్కండే 39; రాహుల్ బుద్ధి (సి) అభిషేక్ శర్మ (బి) జసిందర్ 5; అజయ్‌దేవ్ గౌడ్ (సి) రమణ్‌దీప్ సింగ్ (బి) నమన్ 6; రవితేజ (ఎల్బీ) (బి) నమన్ 0; ప్రతీక్ రెడ్డి (స్టంప్డ్) ప్రభ్‌సిమ్రన్ (బి) నమన్ 4; మిలింద్ (సి) రమణ్‌దీప్ (బి) అర్ష్‌దీప్ 55; నితిన్‌సాయి యాదవ్ (రనౌట్) 0; రక్షణ్ రెడ్డి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 189. వికెట్ల పతనం:** 1-25, 2-57, 3-118, 4-120, 5-127, 6-127, 7-133, 8-141, 9-142, 10-189. **బౌలింగ్:** అభిషేక్ 1-0-10-0; అర్ష్‌దీప్ 4-0-47-1; బల్తేజ్ సింగ్ 3-0-35-0; నమన్ ధీర్ 4-0-19-5; జసిందర్ సింగ్ 4-0-44-2; మయాంక్ మార్కండే 2-0-22-1; సాన్వీర్ సింగ్ 2-0-14-0.


నవీన్

దబంగ్ ఢిల్లీ ధమాకా

తమిళ్ తలైవాస్‌పై ఘనవిజయం

నోయిడా: స్టార్ రెయిడర్ నవీన్ కుమార్ 11 పాయింట్లతో సత్తా చాటడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తమిళ్ తలైవాస్‌పై దబంగ్ ఢిల్లీ ఘన విజయం సాధించింది. ఆదివారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ 32-21 పాయింట్లతో తలైవాస్‌ను చిత్తు చేసింది. ఢిల్లీ జట్టు తరఫున నవీన్ కుమార్, ఆశు మలిక్ (5 పాయింట్లు) రాణించారు. తలైవాస్ తరఫున మోయిన్ (8 పాయింట్లు) పోరాడినా లాభం లేకపోయింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 18 రెయిడ్ పాయింట్లు, 12 ట్యాకిల్ పాయింట్లు సాధించగా... తలైవాస్ ఆ స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయింది. తాజా సీజన్‌లో 15 మ్యాచ్‌లాడిన ఢిల్లీ 7 విజయాలు, 5 పరాజయాలు, 3 'టై'లు నమోదు చేసుకుంది. 48 పాయింట్లతో ఢిల్లీ మూడో స్థానానికి ఎగబాకింది. మరోవైపు 15 మ్యాచ్‌ల్లో 9వ పరాజయం మూటగట్టుకున్న తలైవాస్ 33 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 38-35 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. పైరేట్స్ తరఫున దేవాంక్ 13 పాయింట్లు, అయాన్ 8 పాయింట్లతో ఆకట్టుకోగా... వారియర్స్ తరఫున మణిందర్ సింగ్ 11 పాయింట్లతో పోరాడాడు. ఇరు జట్లు అటు రెయిడింగ్, ఇటు ట్యాక్లింగ్‌లో సమంగా నిలిచినా... ఎక్స్‌ట్రాల రూపంలో 4 పాయింట్లు సాధించిన పైరేట్స్ మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. సోమవారం విశ్రాంతి దినం. మంగళవారం నుంచి పుణే వేదికగా పోటీలు జరగనున్నాయి. మంగళవారం బెంగళూరు బుల్స్‌తో గుజరాత్ జెయింట్స్, యు ముంబాతో పుణేరి పల్టన్ తలపడతాయి.

తొలి టి20లో పాకిస్తాన్ గెలుపు

బులవాయో: జింబాబ్వే పర్యటనలో టి20 సిరీస్‌లో రిజర్వ్ బెంచ్‌తో బరిలోకి దిగిన పాకిస్తాన్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి టి20లో సల్మాన్ ఆఘా నేతృత్వంలోని పాక్ 57 పరుగుల తేడాతో జింబాబ్వేపై నెగ్గింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖాన్ (30 బంతుల్లో 39; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), తయ్యబ్ తాహిర్ (25 బంతుల్లో 39 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), ఇర్ఫాన్ ఖాన్ (15 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడారు. ఆతిథ్య బౌలర్లలో ఎన్‌గరవ, సికందర్ రజా, మసకద్జా, బర్ల్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన జింబాబ్వే 15.3 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ సికందర్ రజా (28 బంతుల్లో 39; 4 ఫోర్లు), తదివనషి మరుమని (20 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే రాణించారు. మిగతా 9 మందిలో ఏ ఒక్కరు కూడా కనీసం పది పరుగులైనా చేయలేకపోయారు. పాక్ బౌలర్లు అబ్రార్ అహ్మద్, సుఫియాన్ చెరో 3 వికెట్లు తీయగా, రవూఫ్ 2 వికెట్లు పడగొట్టాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రేపు ఇక్కడే రెండో టి20 జరుగుతుంది.

సుమన్... 10కి 10 వికెట్లు

కూచ్ బెహార్ ట్రోఫీ మ్యాచ్‌లో బిహార్ స్పిన్నర్ ఘనత



పట్నా: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న కూచ్ బెహార్ ట్రోఫీ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో బిహార్ ఎడంచేతి వాటం స్పిన్నర్ సుమన్ కుమార్ అద్భుతం చేశాడు. రాజస్తాన్‌తో ఇక్కడి మొయిన్ ఉల్ హఖ్ స్టేడియంలో ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో 18 ఏళ్ల సుమన్ ఒకే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు తీసుకున్నాడు. సుమన్ 33.5 ఓవర్లలో 20 మెయిడెన్లు వేసి 53 పరుగులిచ్చి 10 వికెట్లు పడగొట్టాడు. సుమన్ ధాటికి రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 75.5 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌటైంది. బిహార్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులకు ఆలౌటైంది. 285 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన బిహార్ జట్టు రాజస్తాన్‌ను ఫాలోఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్‌లో రాజస్తాన్ జట్టు బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. మొత్తం 137.5 ఓవర్లలో రాజస్తాన్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 410 పరుగులు చేయడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

3 కూచ్ బెహార్ ట్రోఫీ చరిత్రలో ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా సుమన్ కుమార్ గుర్తింపు పొందాడు. గతంలో ఆంధ్ర బౌలర్ మెహబూబ్ బాషా (2010లో త్రిపురపై 44 పరుగులకు 10 వికెట్లు), మణిపూర్ పేస్ బౌలర్ రెక్స్ రాజ్‌కుమార్ సింగ్ (2018లో అరుణాచల్ ప్రదేశ్‌పై 11 పరుగులకు 10 వికెట్లు) ఈ ఘనత సాధించారు.

ఇంగ్లండ్ ఘనవిజయం

● ఆరు వికెట్లతో మెరిసిన కార్స్
● తొలి టెస్టులో న్యూజిలాండ్ ఓటమి


కార్స్

క్రైస్ట్‌చర్చ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్... న్యూజిలాండ్‌పై తొలి టెస్టులో ఘనవిజయం సాధించింది. నాలుగు రోజుల్లో ముగిసిన ఈ పోరులో ఇంగ్లండ్ జట్టు 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. ఓవర్‌నైట్ స్కోరు 155/6తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 74.1 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్ (167 బంతుల్లో 84; 12 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 6 వికెట్లతో అదరగొట్టగా... క్రిస్ వోక్స్ 3 వికెట్లు తీశాడు. దీంతో ఇంగ్లండ్ ముందు 104 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో స్టోక్స్ బృందం 12.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జాకబ్ బెథెల్ (37 బంతుల్లో 50 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో మెరవగా... బెన్ డకెట్ (27; 4 ఫోర్లు, 1 సిక్స్), జో రూట్ (23 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడారు. కివీస్ బౌలర్లలో హెన్రీ, రూర్కె చెరో వికెట్ పడగొట్టారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన ఇంగ్లండ్ పేసర్ బ్రైడన్ కార్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి వెల్లింగ్టన్‌లో రెండో టెస్టు ప్రారంభం కానుంది.

సచిన్ రికార్డు బద్దలు కొట్టిన రూట్


రూట్

ఈ మ్యాచ్ ద్వారా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్... భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టాడు. టెస్టు క్రికెట్‌లో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు (1630) చేసిన ప్లేయర్‌గా రూట్ రికార్డుల్లోకెక్కాడు. సచిన్ 60 ఇన్నింగ్స్‌ల్లో 1625 పరుగులు చేయగా... తాజాగా రూట్ 49 ఇన్నింగ్స్‌ల్లోనూ మాస్టర్‌ను అధిగమించి ఈ జాబితాలో అగ్రస్థానానికి చేరాడు. అలిస్టర్ కుక్ (53 ఇన్నింగ్స్‌ల్లో 1611), గ్రేమ్ స్మిత్ (41 ఇన్నింగ్స్‌ల్లో 1611), శివనారాయణ్ చందర్‌పాల్ (49 ఇన్నింగ్స్‌ల్లో 1580) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.



విజేత మెల్‌బోర్న్ రెనెగేడ్స్

తొలిసారి మహిళల బిగ్‌బాష్ టి20 లీగ్ టైటిల్ సొంతం

మెల్‌బోర్న్: మహిళల బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో మెల్‌బోర్న్ జట్టు ఏడు వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) బ్రిస్బేన్ హీట్‌పై విజయం సాధించింది. హేలీ మాథ్యూస్ (69; 2/24) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విజృంభించి మెల్‌బోర్న్‌కు టైటిల్ అందించింది. గత సీజన్‌లో చివరి స్థానంలో నిలిచిన మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టు ఈసారి విజేతగా నిలువగా... బ్రిస్బేన్ హీట్ టీమ్ వరుసగా రెండోసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. వర్షం అంతరాయం మధ్య సాగిన ఫైనల్లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రెనెగేడ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. బ్రిస్బేన్ హీట్ బౌలర్లలో చార్లీ నాట్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడగా... బ్రిస్బేన్ జట్టు లక్ష్యాన్ని 12 ఓవర్లలో 98 పరుగులుగా నిర్ణయించారు. అయితే ఛేదనలో టాపార్డర్ విఫలమవడంతో బ్రిస్బేన్ హీట్ జట్టు 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 90 పరుగులకు పరిమితమైంది. కెప్టెన్ జెస్ జొనాసెన్ (28 బంతుల్లో 44 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) చివరి వరకు పోరాడినా ఫలితం లేకపోయింది. బ్రిస్బేన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన భారత బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (1) విఫలమైంది. మెల్‌బోర్న్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హేలీ మాథ్యూస్ 2 వికెట్లు తీసింది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న క్యాండిల్ ఎత్తు ఏకంగా 42 మీటర్లు. జర్మనీలోని స్లిట్జ్ నగరంలో మధ్యయుగాలనాటి చారిత్రక టవర్‌పై శనివారం ఇలా దీవిగా వెలిగిపోయింది

ఆకుపై అద్భుత కళ



ఇది జపాన్‌కు చెందిన లీఫ్ కటింగ్ కళాకారుడు లిటో అద్భుత సృష్టి. మౌంట్ ఫుజీ పర్వతాన్ని ముప్పై ఆరు కోణాల్లో ఒక చిన్న ఆకుపై ఇలా చిత్రించాడు.



ఐస్‌ల్యాండ్‌లోని రెక్‌జేన్స్ ద్వీపకల్పంలోని అగ్ని పర్వతం మళ్లీ బద్దలైంది. దాంతో గ్రిండావిక్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం బ్లూ లాగూన్ రహదారిపై ప్రవహిస్తున్న లావా

సెక్స్ వర్కర్లకు ప్రసూతి సెలవులు

- ఆరోగ్య బీమాతో సహా పలు ఇతర హక్కులు కూడా
- ప్రపంచంలోనే తొలిసారిగా చట్టం తెచ్చిన బెల్జియం

పారిస్: ప్రపంచంలోనే తొలిసారిగా సెక్స్ వర్కర్ల కోసం బెల్జియం కొత్త చట్టం తీసుకొచ్చింది. ఇకపై వారిని సాధారణ ఉద్యోగుల్లాగే పరిగణించనుంది. ఉద్యోగ కాంట్రాక్టు, ఆరోగ్య బీమా, పెన్షన్, ప్రసూతి సెలవులు ఇవ్వనుంది. క్లయింట్లను తిరస్కరించే హక్కును, ఏ క్షణంలోనైనా వృత్తిని ఆపేసే హక్కును కూడా కొత్త చట్టం కల్పిస్తుంది. పని గంటలు, వేతనం, భద్రతా చర్యలు కూడా తీసుకోనుంది. సెక్స్ వర్కర్లను నియమించుకోవడానికి నిర్వహణ సంస్థలు ప్రభుత్వ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కఠినమైన భద్రతా ప్రోటోకాల్స్ కూడా పాటించాలి. సెక్స్ వర్క్‌ను బెల్జియం 2022లోనే చట్టబద్ధమైన వృత్తుల జాబితాలో చేర్చింది. తుర్కియే, పెరూ వంటి దేశాల్లోనూ ఇది చట్టబద్ధమే. కానీ వారికి ఇలా ఉద్యోగ హక్కులు, కాంట్రాక్టులు కల్పించడం ప్రపంచంలో ఇదే తొలిసారి. మాములు మనుషుల్లా బతికేందుకు ఇది తమకొక అవకాశమని సెక్స్ వర్కర్లు చెబుతున్నారు. ఇది శుభపరిణామమని, అన్ని దేశాలు ఈ దిశగా ఆలోచించాలని హ్యూమన్ రైట్స్‌వాచ్‌కు చెందిన పరిశోధకులు ఎరిన్ కిల్‌బ్రిడ్ అన్నారు. ఈ వ్యాపారం ముసుగులో జరిగే మానవ అక్రమ రవాణా, దోపిడీ తదితరాలను కొత్త చట్టం నిరోధించలేదని విమర్శలొస్తున్నాయి. హింసతో కూడిన ఇలాంటి వృత్తిని సాధారణ పనిగా చూడటం ప్రమాదకరమని స్వచ్ఛంద సంస్థలు అంటున్నాయి. జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాలూ సెక్స్ వర్క్‌ను చట్టబద్ధం చేసినా వారికి ఇంత సమగ్రంగా కార్మిక రక్షణలను అమలు చేయలేదు.

పాక్‌లో తెగల వైరం.. 130 మంది మృత్యువాత

పెషావర్: పాకిస్తాన్‌లోని కల్లోలిత ఖైబర్ ప్రావిన్స్‌లో రెండు తెగల మధ్య కొనసాగుతున్న ఘర్షణల్లో కనీసం 130 మంది ప్రాణాలు కోల్పోయారు. కుర్రం జిల్లాలోని అలిజాయ్, బగాన్ తెగల మధ్య నవంబర్ 22వ తేదీన ఘర్షణలు మొదలయ్యాయి. అంతకుముందు రోజు, జిల్లాలోని పరాచినార్ సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్లపై దాడులు జరిపి 57 మంది చంపేయడంపై ఈ ఘర్షణలకు ఆజ్యం పోసింది. సున్నీ, షియా గ్రూపుల మధ్య ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ఆ ప్రాంతంలో హింసాత్మక ఘటనలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని పోలీసులు అంటున్నారు. ఆదివారం జరిగిన ఘర్షణల్లో మరో ఆరుగురు చనిపోగా, 8 మంది గాయపడ్డారు. దీంతో మరణాల సంఖ్య 130కి, క్షతగాత్రుల సంఖ్య 186కు చేరిందన్నారు. దీంతో, ప్రభుత్వం విద్యా సంస్థలను మూసివేసింది. మొబైల్, ఇంటర్నెట్ సర్వీసులను ఆపేసింది. పెషావర్-పరాచినార్ రహదారిని, పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లోని ఖర్లాచి పాయింట్ వద్ద రాకపోకలను నిలిపివేసింది. దీంతో, చమురు, నిత్యావసరాలు, మందులు దొరక్క సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు ఖైబర్ ప్రభుత్వ యంత్రాంగం అంటోంది.

పుట్టిన రోజు వేడుకలకూ నోచుకోలేదు

పాపం అఫ్గాన్ బాలికలు!

తాలిబన్ల పాలనలో దుర్భర పరిస్థితులు



ఈ ఫొటో చూస్తే మీకేమనిపిస్తోంది? ఏదో హెయిరాయిల్ ప్రకటనలా ఉంది కదా! కానీ నిజానికి అదో బర్త్‌డే పార్టీ. అత్యంత రహస్యంగా చేసుకున్న పార్టీ. అందులో పాల్గొన్న అమ్మాయిలంతా ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ముఖాలు కనబడకుండా జాగ్రత్త పడ్డారు. బర్త్‌డే పార్టీ అంత రహస్యంగా చేసుకోవడమెందుకు? వేరే ఏ దేశంలోనైనా అవసరం లేదు. కానీ ఆఫ్గానిస్తాన్‌లో మాత్రం అది అత్యవసరం! తాలిబన్ల పాలనలో అక్కడి మహిళలు, బాలికల దుస్థితికి అద్దం పడుతున్న ఈ ఫొటోను ఇరాన్-కెనడియన్ ఫొటో జర్నలిస్ట్ కియానా హయేరి తీశారు. ఇలాంటి చిత్రాల సమాహారాన్ని 'నో విమెన్స్ లాండ్' పేరిట ఈ నెల పారిస్‌లో ప్రదర్శించనున్నారు.

ఏడు ప్రావిన్సులు తిరిగి...

ఫ్రెంచ్ పరిశోధకురాలు మెలిస్సా కార్నెట్‌తో హయేరి 2018 నుంచి కలిసి పని చేస్తున్నారు. వారు కొన్నేళ్లుగా అఫ్గాన్‌లోనే ఉంటున్నారు. 2021లో అమెరికా సైన్యం అఫ్గాన్‌ను వీడటం, దేశం తాలిబన్ల చేతుల్లోకి వెళ్లడం వంటి పరిణామాలకు వాళ్లు ప్రత్యక్ష సాక్షులు. నానాటికీ దిగజారుతున్న పరిస్థితులు వారిని భయపెట్టాయి. మహిళల హక్కులను గౌరవిస్తామని కల్లబొల్లి ప్రతిజ్ఞలు చేసిన తాలిబన్లు చివరికి వాళ్లకు అసలు ప్రజా జీవితమే లేకుండా చేశారు. ప్రాథమిక హక్కులతో సహా సర్వం కాలరాశారు. మహిళల గొంతు వినపడటమే నిషేధం. ముసుగు లేకుండా, మగ తోడు లేకుండా గడప దాటడానికి లేదు! బాలికల చదువుకు పాఠశాల స్థాయితోనే మంగళం పాడారు. బహిరంగ ప్రదేశాల్లో సంగీతం, నృత్యం నిషేధం. అఫ్గాన్ మహిళల దుస్థితిని బయటి ప్రపంచానికి చూపేందుకు హయేరి, కార్నెట్ ఏడు ప్రావిన్సుల్లో పర్యటించారు. ఎంతోమంది మహిళలను కలిశారు.

తాలిబన్లలోనూ విభేదాలు!

మహిళలను తీవ్రంగా అణచివేయడంపై తాలిబన్లలోనే వ్యతిరేకత పెరుగుతోంది! అతివాది అయిన దేశాధినేత షేక్ హైబతుల్లా అఖుందా జాదా నిర్ణయాలను తాలిబన్లలోనే ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. మంత్రి సిరాజుద్దీన్ హక్కానీ వంటివాళ్లు బాలికలు, యువతుల విద్య కోసం ప్రభుత్వంతో పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలికలకు ఆరో తరగతి తర్వాత కూడా విద్యను అందించే అండర్ గ్రౌండ్ పాఠశాలలపై తాలిబన్లలోని కొన్ని విభాగాలు దృష్టి సారించినట్టు కార్నెట్ పేర్కొన్నారు.

ఆశలకు ప్రతీకలు కూడా...

ఎంతసేపు అణచివేత గురించే ఎందుకు చెప్పాలి? అందుకే అఫ్గాన్ బాలికలు, మహిళలకు భవిష్యత్తు మీదున్న ఆశను కూడా హయేరి, కార్నెట్ ఫొటోల్లో బంధించారు. తమ చీకటి జీవితాల్లో వెలుగులు నింపే వేడుకలను వాళ్లు జరుపుకొంటున్నారో చెబుతున్నారు. ప్రస్తుతం అఫ్గాన్‌లో బాలికలు, స్త్రీలకు సంబంధించి చిన్న వేడుక అయినా అది నేరుగా తాలిబన్ ప్రభుత్వాన్ని ధిక్కరించడమే. అందుకే బాలికలు పుట్టిన రోజులు, పెళ్లిళ్ల వంటి వేడుకల్లో స్నేహితులను కలుస్తున్నారు. వాటి ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఇది ప్రమాదాలు తెచ్చి పెడుతుందని తెలిసీ రిస్క్ చేస్తున్నారు. మహిళలు గుర్తింపుకే నోచుకోని చోట ఇలాంటి చిన్న వేడుకైనా పెద్ద ప్రతిఘటనే! చిరునవ్వులు చిదిమేస్తున్న కాలంలో ఆనందాన్ని ప్రదర్శించడం కూడా తిరుగుబాటే. అందుకే నిరసనను వ్యక్తం చేసే ఏ అవకాశాన్నీ మహిళలు వదులుకోవడం లేదంటున్నారు. హయేరి, కార్నెట్.

– సాక్షి, నేషనల్ డెస్క్

జడ్జీలపై పెండింగ్ కేసుల కొండ

తెలుగు రాష్ట్రాల హైకోర్టుల్లో 4,94,907 పెండింగ్ కేసులు

- తెలంగాణలో ఒక్కో న్యాయమూర్తిపై 9,144, ఏపీలో 8,576 కేసుల భారం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని న్యాయస్థానాలన్నీ కేసుల భారం, విపరీతమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నాయి. పెరుగుతున్న కేసుల కొండను కరిగించేంత స్థాయి పరిమాణంలో న్యాయమూర్తులు లేరు. క్రింది స్థాయి కోర్టులు మొదలు హైకోర్టు దాకా చాలా జడ్జీ పోస్టులు ఖాళీలున్నాయి. దీంతో ఉన్న కొద్దిమంది న్యాయమూర్తుల మీదనే విపరీతమైన పని భారం పడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 4,94,907 కేసులు న్యాయస్థానాల్లో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. తెలంగాణలో ఒక్కో న్యాయమూర్తిపై 9,144, ఆంధ్ర ప్రదేశ్‌లో 8,576 కేసుల భారం ఉందని నివేదికలు చెబుతున్నాయి. దేశంలో మొత్తం 4,54,55,345 పెండింగ్ కేసులు ఉండగా.. వాటిలో 57 శాతం సివిల్ కేసులు, 62 శాతం క్రిమినల్ కేసులు ఉన్నాయి. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ నివేదిక ప్రకారం సుప్రీంకోర్టులో 83,410 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కేసులతో పెండింగ్ భారం విపరీతంగా పెరిగిపోతోందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రస్తుత పరిస్థితులపై విచారం వ్యక్తం చేసింది. '2005 నాటికి ట్రయల్ కోర్టుల్లోని న్యాయమూర్తుల సంఖ్య ప్రతి 10లక్షల జనాభాకు 50 మంది జడ్జిలుగా ఉండాలని 2002లో ఉత్తర్వులు జారీ చేశాం. ఉత్తర్వులు జారీ చేసి 22 సంవత్సరాలు గడిచినా ఈ నిష్పత్తి 2024 ఏడాదిలో ప్రతి 10 లక్షల జనాభాకు కేవలం 25 మంది న్యాయమూర్తులకు చేరుకోలేదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.. ఢిల్లీకి చెందిన ఓ సెషన్స్ జడ్జికి ఉపశమనం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్య చేసింది. సెషన్స్ జడ్జికి సంబంధించి ఢిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను తొలగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టులో ఒక్కో న్యాయమూర్తికి సగటున 2 వేలకు పైగా కేసుల భారం ఉంది.

మూడు హైకోర్టుల్లోని జడ్జీలపైనే అత్యధిక పనిభారం

రాజస్థాన్, మధ్యప్రదేశ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులపై దేశంలోనే అత్యధిక పనిభారం ఉందని తెలుస్తోంది. 25 హైకోర్టుల్లో 61,09,862 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దేశంలో పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో ప్రస్తుతం రాజస్థాన్ హైకోర్టు అత్యంత దయనీయమైన పరిస్థితిలో ఉందని నివేదిక చూపిస్తుంది. ప్రస్తుతం ఇక్కడ 6,56,141 కేసులు పెండింగ్‌లో ఉండగా కేవలం 32 మంది న్యాయమూర్తులు మాత్రమే ఈ కేసుల పరిష్కారానికి బాధ్యత వహిస్తున్నారు. ఇక్కడ సగటున ప్రతి న్యాయమూర్తి 20,504 కేసుల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మొత్తం పాతిక హైకోర్టులలో ఇదే అత్యధికం. దీని తర్వాత మధ్యప్రదేశ్ హైకోర్టు రెండో స్థానంలో నిలిచింది. 4,69,462 కేసుల పరిష్కారం బాధ్యత 35 మంది న్యాయమూర్తులపై ఉంది. ఇక్కడి న్యాయమూర్తిపై సగటున 13 వేల 414 కేసుల భారం ఉంది. అలాగే అలహాబాద్ హైకోర్టు దేశంలోనే మూడో స్థానంలో ఉంది. 10,67,614 కేసులను పరిష్కరించే బాధ్యత 82 మంది న్యాయమూర్తులపై ఉంది.



ఆదివారం వయనాడ్ జిల్లాలోని మనథవడిలో రోడ్ షో సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ అభివాదం

ప్రజా వ్యతిరేక శక్తులపై పోరాడతా

కేరళ సభలో ప్రియాంకాగాంధీ

వయనాడ్: ప్రజా వ్యతిరేక శక్తులపై పోరాడతానని వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ వ్యాఖ్యానించారు. వయనాడ్ నియోజకవర్గంలో రెండ్రోజులుగా పర్యటిస్తున్న ప్రియాంక ఆదివారం మనంథవాడీ పట్టణంలో జరిగిన సభలో పాల్గొని ప్రసంగించారు. ''దేశ నిర్మాణానికి పునాదులైన రాజ్యాంగబద్ధ సంస్థలను సర్వనాశనం చేస్తున్న ప్రజా వ్యతిరేక శక్తిపై మనం పోరాటం కొనసాగిద్దాం. జాతీయ స్ఫూర్తితో భారతీయ ఆత్మ కోసం పోరాడదాం. ప్రజావ్యతిరేక శక్తుల నుంచి దేశాధికారం, వనరులను తిరిగి చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పోరాడి వాటిని మనం మళ్లీ ప్రజలకు అందజేద్దాం. బీజేపీ, దాని విధ్వంసకర విధానాల నుంచి ప్రజాస్వామ్యయుత సంస్థలను పరిరక్షించుకుందాం. ఇందుకోసం యూడీఎఫ్, ఇండియా కూటమి, కాంగ్రెస్ పెద్ద పోరాటమే చేస్తున్నాయి. ప్రజల హక్కులను హరిస్తూ వాటిని కొందరు పారిశ్రామికవేత్తలైన మిత్రులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్న శక్తిని ఎదురిస్తున్నాం'' అంటూ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై పరోక్ష విమర్శలు చేశారు.

వయనాడ్ వ్యథను పట్టించుకోండి

కొండచరియలు విరిగిపడి ప్రకృతి ప్రకోపానికి కకావికలమైన వయనాడ్ కుగ్రామాల ప్రజలను పట్టించుకోవాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ప్రియాంక వేడుకున్నారు. ''వయనాడ్ బాధితుల పునరావాస కార్యక్రమం ఊపందుకునేలా సీఎంకు లేఖ రాస్తా. రాజకీయాలను పక్కనబెట్టి ప్రధాని, సీఎంలు పునరావాసంపై దృష్టిపెట్టాలి. ప్రకృతి విలయం తర్వాత కేరళ కొండ ప్రాంతాలను సందర్శించడంపై దేశ ప్రజల్లో ఒకింత సంశయం నెలకొంది. వాస్తవానికి కేరళలో కేవలం ఒక్కచోట మాత్రమే కొండచరియలు విరిగిపడ్డాయి. మిగతా అంతటా రమణీయ ప్రకృతి శోభ పరిఢవిల్లుతోంది. ఎలాంటి భయాలు లేకుండా ఇక్కడకు రావొచ్చు'' అని ప్రియాంక అన్నారు.

అసహనానికి నారాయణ గురు బోధలే పరిష్కారం: పోప్

తిరువనంతపురం: విద్వేషం విశ్వవ్యాప్తమయిన ఈ సంకట పరిస్థితుల్లో శ్రీ నారాయణ గురు బోధనలను ఆచరించడం ద్వారా విశ్వమానవ ఐక్యత సాధించగలమని పోప్ ఫ్రాన్సిస్ వ్యాఖ్యానించారు. కేరళకు చెందిన ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త, తత్త్వవేత్త, సంఘ సంస్కర్త నారాయణ గురు బోధలను ప్రచారం చేస్తున్న 'శ్రీ నారాయణ గురు ధర్మ సంఘం ట్రస్ట్' శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు వాటికన్ సిటీలో పోప్‌ను కలిశారు. సర్వమత సమ్మేళన కార్యక్రమంలో భాగంగా వారితో పోప్ సంభాషించారు. ''ప్రజల మధ్య, దేశాల మధ్య విద్వేషం పెచ్చరిల్లుతున్న ఈ తరుణంలో నారాయణగురు బోధనలు సదా ఆచరణీయం. మత, ప్రాంతాలకతీతంగా సామాజిక అభ్యున్నతికి, కుల వివక్ష నిర్మూలనకు నారాయణగురు తన జీవితాన్ని అంకితంచేశారు. ఏ స్థాయిలోనూ, ఏ రకంగానూ, ఎవరూ వివక్షకు గురికాకూడదని ఆయన ప్రబోధించారు. దురదృష్టవశాత్తు ప్రపంచవ్యాప్తంగా కులం, మతం, ప్రాంతం, రంగు, లింగం, స్థానికతల పేరిట వ్యక్తులు, సమాజాల మధ్య విషపూరిత వివక్ష వేళ్లూనుకుంది. సంపన్నుల మాటే చెల్లుబాటవుతోంది. పేదల బాధలు వినే నాథుడే లేడు'' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ''హక్కులు, విధులు, బాధ్యతల అందరికీ సమానంగా అందేలా దేవుడు మానవులందరినీ ఒకేలా సృష్టించాడు. శత్రుత్వం విడనాడి సౌభ్రాతృత్వంతో జీవించండని చెప్పారు. కానీ అన్ని మతాలు ప్రవచించిన గొప్ప భావనలను పెడచెవిన పెట్టిన దుష్ఫలితాలను నేడు ప్రపంచం అనుభవిస్తోంది'' అన్నారు.



నారాయణ గురు ట్రస్టు సభ్యులతో పోప్

దేశ వారసత్వంపై సైద్ధాంతిక దాడి

- అజ్మీర్ దర్గా సర్వేపై మాజీ బ్యూరోకాట్ల వ్యాఖ్య
- జోక్యం చేసుకోవాలని ప్రధాని మోదీకి లేఖ

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లోని ప్రముఖ అజ్మీర్ దర్గాలో ఏఎస్‌ఐ సర్వే వ్యవహారాన్ని దేశ వారసత్వ సంపదపై జరుగుతున్న సైద్ధాంతిక దాడిగా మాజీ బ్యూరోకాట్లు అభివర్ణించారు. ఇటువంటి చట్ట వ్యతిరేక, వినాశకర కార్యకలాపాలను, సమ్మిళిత దేశమనే భావనకు తూట్లు పొడిచేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని ప్రధాని మోదీని వారు కోరారు. ఆయనొక్కరే ఇటువంటి చర్యలకు ఫుల్‌స్టాప్ పెట్టగలరని పేర్కొన్నారు. హిందువుల ప్రతినిధులమంటూ చెప్పుకునే కొందరు ఆయా ప్రాంతాల్లో ఆలయాల ఉనికిని నిరూపించడానికి మధ్యయుగాల నాటి మసీదులు, దర్గాల్లో పురావస్తు సర్వేల కోసం డిమాండ్ చేస్తున్నారని వారు వివరించారు. ప్రార్థనా స్థలాల చట్టంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, న్యాయస్థానాలు కూడా ఇటువంటి డిమాండ్లపై అనవసరమైన తొందరపాటుతో స్పందిస్తున్నాండటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. 12వ శతాబ్దంనాటి సూఫీ ఫకీర్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ సమాధి ఉన్న అజ్మీర్ దర్గా ప్రాంతంలో అంతకుపూర్వం శివాలయం ఉండేదని, దీనిపై పురావస్తు శాఖ సర్వే చేయించాలంటూ దాఖలైన పిటిషన్‌పై అజ్మీర్‌లోని కోర్టు సానుకూలంగా స్పందిస్తూ నవంబర్ 27న ఉత్తర్వులివ్వడం తెల్సిందే. ఇలాంటి పరిణామాలపై నవంబర్ 29న ప్రధాని మోదీకి రాసిన లేఖపై ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, మాజీ హైకమిషనర్ శివ్ ముఖర్జీ, మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎస్‌వై ఖురేషి, ఆర్మీ మాజీ వైస్ చీఫ్ జమీరుద్దీన్ షా, ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ రవి వీర్ గుప్తా సంతకాలు చేశారు.

ఐన్‌స్టీన్, హాకింగ్స్‌లనే మించాడు!

162 ఐక్యూ స్కోర్ సాధించిన పదేళ్ల బాలుడు



ఒక రంగంలో రాణించడాన్నే గొప్పగా చూసే రోజులివి. భారతీయ మూలాలున్న ఈ బ్రిటిష్ బాలుడు మాత్రం బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచి శెభాష్ అనిపించుకుంటున్నాడు. లండన్‌లోని హాన్‌స్లో ప్రాంతంలో నివసించే క్రిష్ అరోరాకు పియానో అంటే ఇష్టం. పియానో నేర్చుకుని ఏకంగా గ్రేడ్ 7 సర్టిఫికేట్ సాధించాడు. పియానో ఎంతబాగా వాయించగలడో చదరంగం అంతే బాగా ఆడగలడు. మానవ మేధస్సుకు కొలమానంగా చూసే ఇంటెలిజెంట్ కోషెంట్ (ఐక్యూ) పరీక్షలో ఏకంగా 162 స్కోర్ సాధించి ఔరా అనిపించాడు. ఇంతటి స్కోరు ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, విఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్స్‌కు కూడా సాధ్యపడకపోవడం విశేషం! ఈ అరుదైన ఫీట్‌తో క్రిష్ ప్రపంచంలోనే అత్యంత మేధావులైన ఒక శాతం మందిలో స్థానం సంపాదించాడని బ్రిటన్ వార్తాసంస్థ 'మెట్రో' పేర్కొంది. అత్యంత మేధావుల సంఘమైన 'మెన్సా'లోనూ క్రిష్ చోటు సాధించాడు. బ్రిటన్‌లోనే అత్యుత్తమ బోధన ప్రమాణాలు పాటించే క్వీన్ ఎలిజబెత్ గ్రామర్ స్కూల్‌లో వచ్చే ఏడాది చేరబోతున్నాడు. ''11వ క్లాస్ సిలబస్ చాలా ఈజీగా ఉంది. పై తరగతులు నా సామర్థ్యాలకు సవాళ్లు విసురుతాయనుకుంటా. ప్రైమరీ స్కూల్ బోర్ కొట్టింది. ఎప్పుడూ కూడికలు, తీసివేతలు, గుణింతాలు, వాక్య నిర్మాణాలే. ఇప్పుడిక బీజగణితం పట్టుబడతా'' అని క్రిష్ నవ్వుతూ చెప్పాడు. క్రిష్ తండ్రి మౌళి, తల్లి నిశ్చల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. నాలుగేళ్లప్పుడే తమవాడి అమోఘమైన జ్ఞాపకశక్తి, తెలివితేటలను గుర్తించామని వారు చెప్పారు. ''నాలుగేళ్లకే అనర్గళంగా మాట్లాడేవాడు. తప్పుల్లేకుండా స్పెల్లింగులు చెప్పేవాడు. చక్కగా ఉచ్చరించేవాడు. ఓసారి నా పక్కన మూడు గంటలు కూర్చుని గణిత పుస్తకమంతా కంఠస్థం చేశాడు. ఏకసంథాగ్రాహి. నాలుగేళ్లకే దశాంశ స్థానాలకు లెక్కలు చేయడం మొదలెట్టి ఆశ్చర్యపరిచాడు. ఎనిమిదేళ్ల వయసులో ఒక ఏడాది సిలబస్‌ను ఒక్క రోజులో చదివేశాడు. ఏంచేసినా అత్యున్నత స్థాయి ప్రావీణ్యం చూపాలని ఆరాటపడతాడు'' అని తల్లిదండ్రులు చెప్పారు.

ప్రఖ్యాత ట్రినిటీ కాలేజ్‌లోనూ..

పాఠశాలలో పుస్తకాలతో కుస్తీ పట్టడం మాత్రమే కాదు సంగీతం అన్నా క్రిష్‌కు చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే పియానో నేర్చుకున్నాడు. పియానిస్ట్‌గా ఎన్నో అవార్డులు అందుకున్నాడు. పియానో వాయించడానికి సంబంధించి కేవలం ఆరు నెలల్లో నాలుగు గ్రేడ్లు పూర్తిచేశాడు. సంగీతానికి సంబంధించి అత్యున్నత కళాక్షేత్రంగా పేరొందిన ట్రినిటీ కాలేజ్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో సభ్యత్వం సాధించాడు. ప్రస్తుతం గ్రేడ్ 7 పియానో సర్టిఫికేట్ పొందాడు. తన కంటే వయసులో పెద్ద వాళ్లతో పోటీపడుతూ వాళ్లను ఓడించి పతకాల పంట పండిస్తున్నాడు. వెస్ట్ లండన్‌లో ఎన్నో పోటీల్లో పాల్గొన్నాడు. హిట్ సంగీతాన్ని వాయించేటప్పుడు చాలా మంది ఎదురుగా సంబంధిత నోట్‌ను రాసుకుంటారు. క్రిష్ ఎలాంటి నోట్ లేకుండానే అద్భుతంగా వాయించి ప్రేక్షకులు ప్రశంసలు పొందిన సందర్భాలు ఎన్నో. '' సంగీత పోటీల్లో నోట్స్ లేదని భయపడను. తప్పు చేయబోనని నాకు బాగా తెలుసు'' అని క్రిష్ గతంలో చెప్పాడు. బాలమేధావి 'యంగ్ షెల్డన్' వెబ్ సిరీస్‌ను బాగా ఇష్టపడే క్రిష్ ఎక్కువగా పజిల్స్, పదవినోదం లాంటి వాటిని పరిష్కరించడం అలవాటు. చదరంగం మీద ఆసక్తి చూపడంతో ఒక టీచర్‌ను పురమాయించి నేర్పించారు. అయితే ఆ టీచర్‌నే తరచూ ఓడిస్తూ తన అద్భుత మేధను ఎప్పటికప్పుడు నిరూపించుకుంటున్నాడు క్రిష్.

– లండన్

బలహీనపడిన ఫెంగల్

- తమిళనాట ఇంకా భారీ వర్షాలే
- పుదుచ్చేరిలో రంగంలోకి సైన్యం


సాక్షి, చెన్నై: తమిళనాడులో ఫెంగల్ తుపాను ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాలతో విల్లుపురం, కడలూరు జిల్లాల్లో జన జీవనం స్తంభించింది. విల్లుపురం జిల్లా మైలంలో 51 సెంటీమీటర్లు, దిండివనంలో 37, విల్లుపురంలో 27 సెం.మీ వర్షం కురిసింది. విల్లుపురం జిల్లాలో ఒక్క రాత్రిలోనే 24 సెం.మీ వర్షం నమోదు కావడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లు తెగి అనేక గ్రామాల మధ్య సంబంధాలు నిలిచిపోయాయి. విద్యుత్ వ్యవస్థలు దెబ్బతినడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. వందలాది ఇళ్లలోకి నీరు చేరింది. కడలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో 18 సెం.మీ వర్షం పడింది. విద్యుత్ తీగలు తెగపడిన ఘటనల్లో ఐదుగురు మరణించారు. తీరాన్ని తాకిన ఫెంగల్ తుపాను బలహీనపడింది. దీని ప్రభావంతో బుధవారం వరకు వర్షాలు కొనసాగనున్నాయి. అదేవిధంగా, పుదుచ్చేరి ఫెంగల్ ధాటికి అతలాకుతలమైంది. శనివారం రాత్రి పుదుచ్చేరిలో ఏకంగా 48 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆర్మీ రంగంలోకి దిగి ముంపు ప్రాంతాల్లోని బాధితులను పడవల్లో సహాయక శిబిరాలకు తరలించింది.

సాక్షి ప్లస్
సోమవారం। 2-12-2024

కోటలు లేని ఏకైక సింధు నాగరికత పట్టణం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

- క్రీ.పూ.2500 ఏళ్ల కిందట సింధు నాగరికత విలసిల్లింది. సింధు నదీ పరీవాహక ప్రాంతంలో విరాజిల్లడం వల్ల ఈ నాగరికతను సింధు నాగరికత అని, సింధులోయ నాగరికత అని పిలుస్తారు. తొలిసారి హరప్పా ప్రాంతంలో తవ్వకాలు జరపడంతో దీన్ని హరప్పా నాగరికత అని కూడా అంటారు.
- తొలిసారిగా 1921లో భారత సర్వేయర్ జనరల్‌గా ఉన్న సర్ జాన్ మార్షల్ ఆధ్వర్యంలో దయారాం సహాని.. హరప్పా (రావి నది ఒడ్డు)న తవ్వకాలు జరపడంతో ఒక విశిష్ట నాగరికత బయటపడింది.
- సింధు నాగరికత పేరును హరప్పా నాగరికతగా సర్ జాన్‌మార్షల్ మార్చాడు. పురావస్తు ఆధారాల ప్రకారం సింధు నాగరికత కాలం క్రీ.పూ.3,000 నుంచి క్రీ.పూ.1,500. సింధు నాగరికత ఉన్నత దశలో ఉన్న కాలం క్రీ.పూ.2,500 నుంచి క్రీ.పూ.1,750 వరకు.
- సింధు నాగరికతకు లిపి ఉంది. కానీ చదివేందుకు వీలుకాకపోవడం వల్ల దీన్ని 'ప్రోటో హిస్టారిక్' యుగం (సంధి కాలపు చారిత్రక యుగం) అని పిలుస్తారు.
- ఈ యుగంలో ఉపయోగించిన లోహం 'కంచు'. అందుకే సింధు నాగరికతను 'కాంస్య యుగపు' నాగరికత అని కూడా పిలుస్తారు. ఈ నాగరికత శిలాయుగం నుంచి లోహ యుగానికి మార్పు చెందుతున్న కాలంలో అభివృద్ధి చెందింది. సింధు నాగరికతకు సమకాలీన నాగరికతలు.. మెసపటోమియా (ఇరాక్) (యూఫ్రటీస్, టైగ్రిస్); ఈజిప్ట్ (నైలు నది); చైనా (హోయాంగ్ హో) మొదలైనవి. సమకాలీన నాగరికతల కంటే సింధు నాగరికత 6 అంశాల్లో విశిష్టమైందిగా గుర్తింపు పొందింది.
- సింధు నాగరికత మిగిలిన నాగరికతల కంటే వైశాల్యంలో పెద్దది. ఇది 1.3 మి.చ.కి.మీ.లలో విస్తరించి ఉంది. దీని సరిహద్దులు ఉత్తరాన జమ్ముకశ్మీర్‌లోని మండా నుంచి దక్షిణాన మహారాష్ట్రలోని దైమాబాద్ వరకు, తూర్పున ఉత్తరప్రదేశ్‌లోని అలింగీర్ నుంచి పాకిస్తాన్‌లోని (సుక్త-జందార్) వరకు విస్తరించి ఉంది.
- సింధు నాగరికత పట్టణ నాగరికత (ఇది సింధు నాగరికత ముఖ్య లక్షణం).
- ఇక్కడి పట్టణాలు గ్రిడ్ వ్యవస్థలో, ప్రధాన వీధులు ఉత్తర-దక్షిణాలుగా, ఉప వీధులు తూర్పు -పడమరలుగా దీర్ఘ చతురస్రాకారంలో ఉన్నాయి.



- సింధు ప్రజలు ఇళ్ల నిర్మాణంలో కాల్చిన ఇటుకలను ఉపయోగించటాన్ని ప్రత్యేక అంశంగా చెప్పొచ్చు (దీనిలోనే సింధు ప్రజలు పరిపక్వత సాధించారు).
- ఈ నాగరికతలో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. భూగర్భ మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. మురుగు నీటి కోసం ఇంకుడు గుంతలు తవ్వటం ఈ నాగరికతలోని ప్రత్యేకత.
- సాంకేతిక పరిజ్ఞానంలో మిగిలిన నాగరికతల కంటే గొప్పది.
- సింధు ప్రజలు ప్రపంచంలో తొలిసారి పత్తిని పండించారు.

సింధు నాగరికత తవ్వకాల్లో మొత్తం 250 ప్రదేశాలు బయటపడ్డాయి. అందులో ముఖ్యమైనవి..

సింధు నాగరికతకు చెందిన ప్రధాన ప్రదేశాలు - పురావస్తు విశేషాలు

- **హరప్పా:** సింధు నాగరికత తవ్వకాల్లో బయటపడిన మొట్టమొదటి పట్టణం.

పట్టణ నిర్మాణం– ముఖ్య లక్షణాలు

- 2 వరుసల్లో నిర్మించిన 6 ధాన్యాగారాలు, పంటలు నూర్చే వృత్తాకారపు వేదికలు బయటపడ్డాయి.
- రాతితో చెక్కిన నటరాజ విగ్రహం వెలుగుచూసింది.
- చెక్కతో తయారు చేసిన శవపేటికలు.
- కోటకు వెలుపల చిన్నచిన్న గదులతో కూడిన నిర్మాణాలు.
- **మొహంజోదారో:** మొహంజోదారో అంటే సింధు భాషలో మృతుల దిబ్బ (Mound of Dead) అని అర్థం.
- తవ్వకాల్లో బయటపడిన అతి పెద్ద సింధు నాగరికత ప్రాంతం.
- పెద్ద ధాన్యాగారం (Great Granary)
- కాల్చిన ఇటుకలతో నిర్మించిన 39×23×9 అడుగుల విస్తీర్ణం గల మహాస్నానవాటిక బయటపడింది.
- అనేక స్తంభాలతో కూడిన అసెంబ్లీ హాలు నిర్మాణం.
- ఏడుసార్లు వరదలకు గురై, తిరిగి 7 సార్లు పునర్నిర్మితమైన పట్టణం.
- కంచుతో పోత పోసిన నాట్యగత్తె విగ్రహం లభించింది.
- రాతితో తయారుచేసిన పశుపతి మహాదేవుని విగ్రహం దొరికింది.
- **చాన్హుదారో:** కోటలు లేని ఏకైక సింధు నాగరికత పట్టణం.
- సిరాబుడ్డి (Ink pot) దొరికింది.
- పూసలు, ఆభరణాలు తయారుచేసే పరిశ్రమ ఆనవాళ్లు వెలుగుచూశాయి.
- **కాళీభంగన్:** రాజస్థానీ భాషలో కాళీభంగన్ అంటే నల్ల గాజులు అని అర్థం.
- నాగలితో పొలం దున్నిన ఆనవాళ్లు ఇక్కడ కనిపించాయి.
- యజ్ఞ యాగాదులకు గుర్తుగా 2 అగ్నిహోమాలు బయటపడ్డాయి.
- **లోథాల్:** కాల్చిన ఇటుకలతో కూడిన మానవ నిర్మిత నౌకాశ్రయం ఉన్న పట్టణం.
- మొదటిసారిగా వరి పండించిన ఆనవాళ్లు లభించాయి.
- ఎక్కువగా ముద్రికలు దొరికాయి.
- సతి ఆచారానికి సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయి.
- కొలిచే ప్రమాణం (త్రాసు, కొలబద్ద) వంటి పనిముట్లు దొరికాయి.
- కాళీభంగన్‌లా అగ్ని గుండం ఆనవాళ్లు ఇక్కడ బయల్పడ్డాయి.
- చదరంగం లాంటి ఆటకు సంబంధించిన ఆనవాళ్లు దొరికాయి.
- **రంగాపూర్:** ఇక్కడ హరప్పాకు పూర్వం ఉన్న సంస్కృతి వెలుగుచూసింది.
- ధాన్యపు పొట్టుకు సంబంధించిన ఆనవాళ్లు లభించాయి.
- **కోట్-డిజి:** సింధు నాగరికతకు పూర్వమే విలసిల్లిన నాగరికత విశేషాలు ఉన్నాయి.
- ఇక్కడ రాతితో చేసిన బాణాలు బయటపడ్డాయి.
- **రూపార్ :** ఇక్కడ కుండల తయారీ ఆనవాళ్లు లభించాయి.
- **సుర్కటోడా:** గుర్రం అవశేషాలు లభించిన ఏకైక పట్టణం.
- క్షీణ దశలో ఉన్న సింధు నాగరికత ఆనవాళ్లు లభించాయి.
- **బన్వాలి:** మేలు రకపు బార్లీ, ఆవాలను ఉపయోగించిన, పండించిన ఆనవాళ్లు దొరికాయి.
- **అలంగీర్‌పూర్:** ఇది హరప్పా నాగరికత చివరి దశను తెలుపుతుంది.
- **ధోలవీర:** భారతదేశంలో బయల్పడిన సింధు నాగరికతకు చెందిన అతిపెద్ద పట్టణం.

ఆర్థిక పరిస్థితులు

- **వ్యవసాయం:** సింధు ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. గోధుమ, బార్లీ ముఖ్య పంటలు. వీటిని రబీ సీజన్‌లో అధికంగా పండించేవారు. ఇతర ముఖ్య పంటలు నువ్వులు, ఆవాలు, బఠాణీలు తదితర లెగ్యుమినేసి కుటుంబానికి చెందిన పంటలను పండించేవారు. నవంబర్‌లో విత్తనాలు చల్లి ఏప్రిల్‌లో కోతలు కోసేవారు. సింధు ప్రాంత ప్రజలు తొలిసారిగా పత్తిని పండించారు. వీరు తొలిసారిగా పత్తిని పండించటం వల్ల గ్రీకులు పత్తిని సిండర్ అని పిలిచేవారు.
- వ్యవసాయ మిగులు ఎక్కువగా ఉండేది. మిగులును ధాన్యాగారాల్లో భద్రపరిచేవారు. వ్యవసాయ మిగులుతో అంతర్గతంగా ఎద్దుల బండి ద్వారా, అంతర్జాతీయంగా పడవల ద్వారా వ్యాపారం చేసేవారు.
- ఆవు, ఎద్దు, బర్రె, మేక, కుక్క, పిల్లి తదితర పెంపుడు జంతువులతో పాటు ఏనుగు, పులి, ఖడ్గ మృగం వంటి అడవి జంతువులు కూడా వీరికి తెలుసు. సింహం గురించి వీరికి తెలియదు.
- **పరిశ్రమలు:** కుండలు, పూసల తయారీ, బొమ్మలు (టెర్రకోట బొమ్మలు) – ముద్రలు, తాయెత్తులు, పడవల తయారీ పరిశ్రమలు ముఖ్యమైనవి.
- **వర్తక వాణిజ్యం:** అంతర్జాతీయ వ్యాపారం మెసపటోమియాలోని సుమేరియన్లతో ఎక్కువగా జరిగేది. మెసపటోమియాలో లభించిన అనేక హరప్పా వ్యాపార ముద్రికలు దీనికి ఉదాహరణ.
- **ఎగుమతులు:** వ్యవసాయ ఉత్పత్తులైన గోధుమ, బార్లీ, పత్తితోపాటు దంతాలతో చేసిన సామగ్రి, కుండలు, బొమ్మలు, పూసలు తదితరాలు.
- **దిగుమతులు:** ఆఫ్ఘనిస్తాన్ నుంచి తగరం, అఫ్గానిస్తాన్, పర్షియా నుంచి బంగారం, రాజస్థాన్ నుంచి రాగిని, సౌరాష్ట్ర నుంచి కాంబ్‌షల్స్ (విలువైన రాయి)ని దిగుమతి చేసుకొనేవారు. వస్తు మార్పిడి విధానం ద్వారానే వ్యాపారం జరిగేది.

ప్రదేశం	ప్రస్తుత ప్రాంతం	తవ్విన సం.	పురావస్తు శాస్త్రవేత్త	నది
హరప్పా	పశ్చిమ పంజాబ్‌లోని మాంటిగోమరి జిల్లా	1921	దయారాం సహాని	రావి
మొహంజోదారో లార్ఖానా జిల్లా	సింధు రాష్ట్రంలోని (పాక్)	1922	ఆర్.డి. బెనర్జీ	సింధు
చాన్హుదారో	సింధు (పాక్)	1931	ఎన్.జి.మజుందార్	సింధు
కాళీభంగన్	ఉత్తర రాజస్థాన్	1953	ఎ.ఘోష్, బి.బి.లాల్ (1961)	గగ్గర్
లోథాల్	గుజరాత్	1957	ఎస్.ఆర్. రావ్	బోగవ్
రంగాపూర్	అహ్మదాబాద్ (గుజరాత్)	1953	ఎం.ఎస్. వాస్త	మీడర్
కోట్-డిజి	సింధు (పాక్)	1955-57	ఫజుల్ అహ్మద్‌ఖాన్	సింధు
రూపార్	పంజాబ్ (భారత్)	1955-57	వై.డి. శర్మ	సట్లెజ్
సుర్కటోడా	కచ్ ప్రాంతం (గుజరాత్)	1972	జె.పి.జోషి	బోగవ్
బన్వాలి	హరియాణా	1973	ఆర్.ఎస్.బిస్ట్	సరస్వతి
ధోలవీర	గుజరాత్	1990-91	ఆర్.ఎస్.బిస్ట్	సబర్మతి ఉపనది

హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
పౌరశాస్త్రం - ఎస్ఏ కంటెంట్

లౌకికతత్వం - ప్రపంచశాంతి - భారతదేశం

'లౌకిక' అంటే మతంతో సంబంధం లేనిది అని అర్థం. 'లౌకికతత్వం' అంటే మతంతో ప్రమేయం లేని చింతన లేదా తత్వం. లౌకికతత్వాన్ని అనుసరించే దేశం ప్రజల మత సంబంధమైన విషయాల్లో జోక్యం చేసుకోదు. భారతదేశం వివిధ మతాలకు పుట్టినిల్లు. హిందూ, బౌద్ధం, జైనం, ఇస్లాం, క్రైస్తవం, పార్శీ మతాలు మనదేశంలో ఉన్నాయి. భారతదేశం ఒక లౌకిక రాజ్యం. క్రీస్తు పూర్వం నుంచి మతాలను పరిశీలిస్తే అశోకుడు మొదట హిందువు. తర్వాత ఉపగుప్తుడనే బౌద్ధమతాచార్యుని బోధనలతో బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆ కాలంలోనే పరమత సహనాన్ని పాటించిన చక్రవర్తి అశోకుడు. హర్షుడు, చంద్రగుప్త విక్రమాదిత్యుడు కూడా లౌకికతత్వాన్ని అనుసరించారు. ఇక మధ్యయుగంలో తొలి లౌకిక చక్రవర్తి అక్బర్. దిన్-ఇ-ఇలాహీ అనే నూతన మతానికి అక్బర్ శ్రీకారం చుట్టాడు. అంతేకాకుండా ఇబాదత్ ఖానా అనే ప్రార్థన మందిరంలో సర్వమతాల వారు ప్రార్థనలు చేసుకొనే అవకాశం కల్పించాడు. ప్రస్తుతం మనదేశంలో హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మొదలైనవారు తమ మతాలు నిర్ణయించిన ఆచార వ్యవహారాలను పాటిస్తూ శాంతియుతంగా జీవిస్తున్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక అనే పదాన్ని భారత రాజ్యాంగ పీఠికలో ప్రవేశపెట్టారు. భారతీయ లౌకికవాదం ఉదారమైంది. ప్రేమ, సహనం, సర్వమత సమానత్వం అనే



సూత్రాలకు ప్రాముఖ్యత ఇస్తుంది. మతవాదానికి బదులు మానవతావాదాన్ని పౌరులు అలవరుచుకోవాలి. మతం పేరుతో ఇతరులపై దాడులు చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుంది. తద్వారా అల్ప సంఖ్యాకుల్లో భయాందోళనలను తొలగిస్తుంది.

ప్రపంచ శాంతి

యుద్ధ భయం మానవాళిని అనాదిగా వేధిస్తోంది. మానవుల శాంతియుత సహజీవనానికి యుద్ధాలు తీవ్రమైన అంతరాయం కలిగిస్తున్నాయి. వీటివల్ల ఎంతో నష్టం కలుగుతుంది. 20వ శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా పెను విధ్వంసాన్ని సృష్టించాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914–18 మధ్య కాలంలో జరిగింది. రెండో ప్రపంచ యుద్ధ కాలం 1939–45. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా తటస్థంగా ఉంది. మళ్లీ ప్రపంచ యుద్ధమే సంభవిస్తే ప్రపంచం మొత్తం కొద్ది క్షణాల్లో ధ్వంసం అవుతుందని అంచనా. అందుకే ప్రపంచ శాంతి నెలకొల్పడం ఎంతో అవసరమని వివిధ దేశాలు గుర్తించాయి. ఈ లక్ష్యసాధన కోసం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నానాజాతి సమితి, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి ఏర్పడ్డాయి. నానాజాతి సమితి 1920లో జెనీవా ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. 1945, అక్టోబర్ 24న న్యూయార్క్ కేంద్రంగా ఐక్యరాజ్యసమితి ఏర్పడింది.

భారతదేశం పాత్ర

ప్రపంచ శాంతి నెలకొల్పడానికి, కొన్ని దేశాలు గణనీయమైన కృషి చేస్తున్నాయి. వాటిలో భారతదేశం ఒకటి. ప్రపంచ శాంతిని కాపాడటం భారత విదేశాంగ విధాన ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. జాతీయ ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఇతర దేశాలతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాల విషయంలో రూపొందించిన విధానాన్ని విదేశాంగ విధానం అంటారు. భారత విదేశాంగ విధానానికి మొదటి ప్రధాని నెహ్రూ రూపకల్పన చేశారు.

పంచశీల సూత్రాలు

టిబెట్ విషయంపై భారతదేశం, చైనా చేసుకున్న ఒడంబడికలో శాంతియుత సహజీవన సూత్రాలను పేర్కొన్నారు. వీటినే పంచశీల సూత్రాలు అంటారు. 1954 జూన్ 28న భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ-ఎన్-లై ఈ ఒప్పందాన్ని ఆమోదించారు.

అలీనోద్యమం (నామ్)

భారత మొదటి ప్రధాని నెహ్రూ, యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో, ఈజిప్టు అధ్యక్షుడు కమాలుద్దీన్ నాజర్ అలీనోద్యమానికి మూల పురుషులు. వీరికి ప్రపంచ శాంతి, సహజీవనం, సామరస్యం, సహకారం వంటి అంశాలపై నమ్మకం అపార నమ్మకం ఉంది. అటు అమెరికా ఆధ్వర్యంలోని పెట్టుబడిదారి దేశాల కూటమి, ఇటు రష్యా నాయకత్వంలోని సామ్యవాద దేశాల కూటమిలో చేరని దేశాలను అలీన దేశాలు అంటారు. నామ్ 1961లో ఏర్పడింది. మొదటి సదస్సులో 25 దేశాలు పాల్గొన్నాయి. ప్రస్తుతం నామ్‌లో సభ్య దేశాల సంఖ్య–107. నామ్ ఏడో సదస్సు 1983లో న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. భారత్ నామ్ ద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణకు విశేష కృషి చేస్తోంది. క్యూబా సమస్య విషయంలో 1962లో అమెరికా–రష్యాల మధ్య రాజీని కుదర్చడంలో భారతదేశం ముఖ్యపాత్రను పోషించింది. అంతేకాకుండా శాంతిస్థాపన దిశగా 1983, 1985, 1988లలో పాకిస్థాన్‌తో ఒప్పందాలను కుదుర్చుకుంది.

మాదిరి ప్రశ్నలు

1. మనదేశంలో సంపూర్ణ అక్షరాస్యతా సంవత్సరంగా ఎప్పుడు ప్రకటించారు?
   1) 1992 2) 1991
   3) 1990 4) 1989
2. స్త్రీలలో అక్షరాస్యత అతి తక్కువ ఉన్న రాష్ట్రం?
   1) మేఘాలయ 2) రాజస్థాన్
   3) ఒడిశా 4) బీహార్
3. జీవించే హక్కును ఏ నిబంధన ద్వారా ప్రసాదించారు?
   1) 22 2) 20 3) 21 4) 24
4. స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కును ఎప్పుడు చట్టబద్ధం చేశారు?
   1) 1985 2) 1989 3) 1984 4) 1983
5. మొట్టమొదటిసారిగా షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని ఏ సంవత్సరంలో ఉపయోగించారు?
   1) 1940 2) 1945
   3) 1947 4) 1935
6. అస్పృశ్యతను ఒక పాపంగా అభివర్ణించినవారు?
   1) గౌతమబుద్ధుడు
   2) జవహర్‌లాల్ నెహ్రూ
   3) గాంధీజీ
   4) అంబేద్కర్
7. దేశంలో భాష ప్రాతిపదికగా ఏర్పడిన మొదటి రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్నాటక
   3) కేరళ 4) తమిళనాడు
8. ఒక జాతికి ఉండే లక్షణాలు?
   1) సంఘీభావం
   2) ఐకమత్యం
   3) భాష, మాండలికాలు
   4) సార్వభౌమాధికారం
9. రాజ్యాంగంలోని ఏ విభాగం నిర్బంధ ప్రాథమిక విద్య గురించి వివరిస్తుంది?
   1) ప్రవేశిక 2) ప్రాథమిక విధులు
   3) ఆదేశ సూత్రాలు
   4) పౌరహక్కులు
10. హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?
    1) ఇది అన్యాయమైన అరెస్ట్‌ను నిరోధిస్తుంది
    2) అధికారిని పనిచేయమని
    3) నీ పని నీవు చేయమని
    4) ప్రతిషేధం
11. Sons of soil (భూమిపుత్రుల) సిద్ధాంతం ఎవరిది?
    1) శివసేన 2) బీహార్
    3) తెలంగాణ 4) విదర్భ
12. భారత రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక అనే పదాన్ని ఏ సంవత్సరంలో చేర్చారు?
    1) 1978 2) 1972
    3) 1976 4) 1970
13. ఐక్యరాజ్యసమితి ఏ నగరంలో ఉంది?
    1) చికాగో 2) న్యూయార్క్
    3) జెనీవా 4) శాన్‌ఫ్రాన్సిస్కో
14. దిన్-ఇ- ఇలాహీ అనే మతాన్ని ప్రవేశపెట్టిన వారు ఎవరు?
    1) బాబర్ 2) షాజహాన్
    3) ఔరంగజేబు 4) అక్బర్
15. భారతీయ లౌకికతత్వం ఎలాంటిది?
    1) సామాజికమైంది 2) నైతికమైంది
    3) ఉదారమైంది 4) ఏదీకాదు
16. రెండో ప్రపంచ యుద్ధంలో దారుణంగా ధ్వంసమైన నగరం?
    1) పెకింగ్ 2) నాగసాకి
    3) టోక్యో 4) తైవాన్
17. ఆసియా రాజ్యాల మొదటి మహాసభ జరిగిన నగరం ఏది?
    1) బాగ్దాద్ 2) నాగసాకి
    3) పెకింగ్ 4) ఢిల్లీ
18. భారత్-చైనాల మధ్య శాంతి ఒప్పందం ఏ సంవత్సరంలో జరిగింది?
    1) 1987 2) 1988
    3) 1985 4) 1983
19. అలీనవిధానం పితామహుడు ఎవరు?
    1) చౌ-ఎన్-లై 2) భుట్టో
    3) నెహ్రూ 4) గాంధీజీ
20. బాండుంగ్ సమావేశం జరిగిన సంవత్సరం?
    1) 1947 2) 1949
    3) 1950 4) 1955
21. మొదటి అలీనదేశాల సదస్సుకి హాజరైన సభ్య దేశాల సంఖ్య?
    1) 45 2) 35 3) 25 4) 55
22. పంచశీల ఎవరి ఒప్పందాల ఫలితం?
    1) రాజీవ్‌గాంధీ- బెనజీర్ భుట్టో
    2) ఇందిరాగాంధీ- జుల్ఫికర్ ఆలీభుట్టో
    3) నెహ్రూ-చౌ-ఎన్-లై
    4) సుకర్నో-టిటో
23. మారణాయుధాల సంఖ్య పెరగడానికి కారణం?
    1) మిత్రదేశాలు ఉచితంగా ఇవ్వడం
    2) శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి
    3) ఖర్చు తగ్గడం
    4) శాస్త్రీయ విజ్ఞాన లోపం
24. వియత్నాం విప్లవాన్ని బలపరిచిన సమావేశం జరిగిన నగరం?
    1) అల్జీర్స్ 2) జకార్తా
    3) హవానా 4) హరారే
25. ఏ లక్ష్యసాధన కోసం ఐక్యరాజ్య సమితిని ఏర్పాటు చేశారు?
    1) ఏకీయత 2) జాతీయత
    3) శాంతి 4) మత సహనం
26. ఏ సంవత్సరంలో చైనా- ఇండియాల మధ్య యుద్ధం జరిగింది?
    1) 1965 2) 1948
    3) 1962 4) 1971
27. ఇండియా తొలిసారిగా అణు విస్ఫోటన పరీక్ష జరిపిన సంవత్సరం?
    1) 1974 2) 1970
    3) 1968 4) 1975
28. సార్క్ ఆవిర్భావం ఎక్కడ జరిగింది?
    1) సిలోన్ 2) ఢాకా
    3) ఢిల్లీ 4) ఖాట్మాండు
29. బ్రిటీషువారు పరిపాలించిన వలస రాజ్యాల కూటమిని ఏమని వ్యవహరిస్తారు?
    1) కామన్‌వెల్త్
    2) బ్రిటీష్ సమాఖ్య
    3) యూరోపియన్ దేశాల కూటమి
    4) నాటో

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1;
5) 4; 6) 3; 7) 1; 8) 3;
9) 3; 10) 1; 11) 1; 12) 3;
13) 2; 14) 4; 15) 3; 16) 2;
17) 4; 18) 1; 19) 3; 20) 4;
21) 3; 22) 3; 23) 2; 24) 1;
25) 3; 26) 3; 27) 1; 28) 2;
29) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ట్రాన్స్‌కోలో కార్పొరేట్ లాయర్ పోస్టులు

విజయవాడలోని ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ట్రాన్స్‌కో/ఏపీపీసీసీలో కార్పొరేట్ లాయర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **ఖాళీల వివరాలు:** ఏపీ ట్రాన్స్‌కో-01, ఏపీపీసీసీ-04.
» **అర్హత:** మూడేళ్ల ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం లేదా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు ఉత్తీర్ణతతో పాటు నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోపు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీ ట్రాన్స్‌కో, విద్యుత్ సౌధ, గుణదల, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **నోటిఫికేషన్ తేది:** 19.11.2024.
» **వెబ్‌సైట్:** https://aptransco.gov.in

కర్ణాటక బ్యాంక్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్స్ పోస్టులు

మంగళూరులోని కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా కేబీఎల్ బ్రాంచ్‌లు /కార్యాలయాల్లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ /సంస్థ/బోర్డు నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.11.2024 నాటికి గరిష్టంగా 26 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:** నెలకు రూ.24,050 నుంచి రూ.64,480.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్షా సమయం 135 నిమిషాలు.
» **పరీక్ష కేంద్రాలు:** బెంగళూరు, చెన్నై, ముంబై, న్యూఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, పుణె, మంగళూరు, ధార్వాడ్/హుబ్బళ్లి, మైసూరు, శివమొగ్గ, కలబురగి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **పరీక్ష తేది:** 15.12.2024.
» **వెబ్‌సైట్:** https://karnatakabank.com

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఆకాశ మార్గంలో... అద్భుత విజయాలు!

వరుస విజయాలతో భారత్ అంతరిక్ష రంగంలో తన సత్తా చాటుతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పీఎస్ఎల్వీ-సీ27 వాహక నౌక ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1డీ ఉపగ్రహాన్ని దిగ్విజయంగా కక్ష్యలోకి చేర్చింది. దీంతో దేశీయ జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. చంద్రుడిపైకి పంపిన చంద్రయాన్, అంగారక గ్రహంపైకి చేపట్టిన మార్స్ ఆర్బిటార్ మిషన్ (MOM) విజయవంతమవడం, పూర్తి దేశీయ పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజన్‌ను రూపొందించడం, అధిక బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లగలిగే జీఎస్ఎల్వీ మార్క్–IIIని రూపొందించడం, పీఎస్ఎల్వీ ద్వారా వరుస ఫలవంతమైన ప్రయోగాలు చేయడం.. తదితరాలన్నీ అంతరిక్ష రంగంలో మనం సాధించిన ప్రగతికి కలికితురాళ్లు. వీటన్నింటినీ భారత శాస్త్రవేత్తలు అతి తక్కువ కాలంలోనే, దాదాపుగా స్వతంత్రంగా సాధించి భారత ప్రతిష్టను ఇనుమడింపజేశారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత అంతరిక్ష కార్యక్రమం

డాక్టర్ విక్రం సారాభాయి నేతృత్వంలో భారత అంతరిక్ష కార్యక్రమం రూపుదిద్దుకుంది. 1962లో అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో మొదటగా ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (INCOSPAR) ఏర్పాటైంది. అదే ఏడాది తిరువనంతపురం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ (TERLS) నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం నుంచి 1963 నవంబర్ 21న మొదటి సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. 1969లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ISRO) ఏర్పాటైంది. 1972లో అంతరిక్ష సంఘం, అంతరిక్ష విభాగం ఏర్పాటయ్యాయి. భారత అంతరిక్ష కార్యక్రమ విధానాన్ని అంతరిక్ష సంఘం రూపొందిస్తుంది. అంతరిక్ష విభాగం ఆ విధానాన్ని అమలు చేస్తుంది. 1972 ఏప్రిల్ 1 నుంచి ఇస్రో ప్రభుత్వ సంస్థగా మారింది. అదే ఏడాది ఏప్రిల్ 19న భారత్ తన తొలి ఉపగ్రహం ఆర్యభట్టను ప్రయోగించింది. అంతరిక్ష విభాగానికి సంబంధించి సుమారు 20 కేంద్రాలు వివిధ అంతరిక్ష కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నాయి. విక్రం సారాభాయి అంతరిక్ష కేంద్రం వీటిలో ప్రధానమైంది, పెద్దది. ఇది పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్లను నిర్మించడంతో పాటు ఏవియానిక్స్, ఏరోనాటిక్స్, సాలిడ్ ప్రొపిల్లెంట్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్స్ లాంటి రంగాల్లో పరిశోధన నిర్వహిస్తుంది. అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఉపగ్రహాలకు చెందిన సాంకేతిక పరికరాలను నిర్మిస్తుంది. వీటిని బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్ అనుసంధానించి ఉపగ్రహాలను నిర్మిస్తుంది. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ వాహక నౌకల ద్వారా ఇన్‌శాట్, ఐఆర్ఎస్ ఉపగ్రహాలను ప్రయోగిస్తారు.

ఉపగ్రహ వ్యవస్థలు

భారత అంతరిక్ష కార్యక్రమంలో ప్రధానంగా మూడు రకాల ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నారు. ఇన్‌శాట్ (ఇండియన్ శాటిలైట్ సిస్టం) వ్యవస్థ ఉపగ్రహాల ద్వారా టెలికమ్యూనికేషన్, రేడియో, టీవీ కార్యక్రమాల ప్రసారం, డీటీహెచ్ సేవలు, టెలి మెడిసిన్, టెలి ఎడ్యుకేషన్, వీడియో కాన్ఫరెన్సింగ్, విపత్తుల నిర్వహణ, విలేజ్ రిసోర్స్ సెంటర్లు, శాటిలైట్ న్యూస్ గ్యాథరింగ్, వాతావరణ సమాచార సేకరణ, హెచ్చరికల జారీ, ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించడం, రక్షించడం మొదలైన సేవలు అందిస్తున్నారు.

ఐఆర్ఎస్ (ఇండియన్ రిమోట్ సెన్సింగ్ సిస్టం) ఉపగ్రహాల ద్వారా సహజ వనరుల పరిశీలన, సమాచార సేకరణ, నిర్వహణ, సంరక్షణ, నియంత్రణ, ముఖ్యంగా అటవీ, ఖనిజ, నేల, సముద్ర వనరుల నిర్వహణ సాధ్యమవుతోంది. దీంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, విద్యుద్దీకరణ, కరవు నియంత్రణ, వాటర్‌షెడ్ల అభివృద్ధి, అడవులు, బంజరు భూముల నిర్వహణ తదితర సేవలు లభ్యమవుతున్నాయి. విపత్తు నిర్వహణ, జీవ వైవిధ్య సంరక్షణ, శీతోష్ణస్థితి మార్పు ప్రభావాల అధ్యయనం - నిర్మూలన, దేశ రక్షణ మొదలైనవాటిలోనూ ఐఆర్ఎస్ ఉపగ్రహాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. రిసోర్స్‌శాట్, ఓషన్‌శాట్, కార్టోశాట్, రీశాట్, మేఘట్రాపిక్స్, సరళ మొదలైనవి ముఖ్యమైన ఐఆర్ఎస్ ఉపగ్రహాలు.

ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ అభివృద్ధి లక్ష్యంతో ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (IRNSS) అనే సరికొత్త జీపీఎస్ వ్యవస్థను ఇస్రో వృద్ధి చేసుకుంది. ఇందులో మొత్తం ఏడు ఉపగ్రహాలు ఉంటాయి. ఇస్రో ఇప్పటి వరకు IRNSS-1A, 1B, 1C & 1D అనే నాలుగు ఉపగ్రహాలను ప్రయోగించింది. రవాణా రంగంలో ఈ వ్యవస్థ సాధారణ వ్యక్తులు సైతం తమ గమనం, చేరాల్సిన ప్రదేశం గురించి తెలుసుకోవడానికి, లక్ష్యం ఎంత దూరంలో ఉందో నిర్ధారించుకోవడానికి తోడ్పడుతుంది. తద్వారా మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి వీలవుతుంది. సుదూర ప్రాంతాల్లోని పర్యావరణ పరిశోధన కేంద్రాలను అనుసంధానించడానికి ఇది ఉపయోగపడుతుంది. మొదటిసారిగా 1970లో అమెరికా సైనికులకు దిశానిర్దేశం చేయడానికి మాత్రమే ఉద్దేశించిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం ప్రస్తుతం సైనిక అవసరాలతో పాటు అనేక ఇతర అవసరాలకు కూడా ఉపయోగపడుతోంది. ఐఆర్ఎన్ఎస్ఎస్ ద్వారా బ్యాంకింగ్, వాణిజ్యం, కమ్యూనికేషన్స్ సేవలు మెరుగవుతాయి. ఇతర దేశాల ఉపగ్రహాలపై ఆధారపడటం కంటే దేశీయ నావిగేషన్ వ్యవస్థ ద్వారా పూర్తి భద్రతతో కూడిన మిలటరీ కార్యకలపాలను నిర్వహించవచ్చు. దీనికి ఐఆర్ఎన్ఎస్ఎస్ ఎంతగానో దోహదపడుతుంది. ఇది భారత భూభాగంలో, ప్రధాన భూభాగం నుంచి 1500 కిలోమీటర్ల విస్తీర్ణంలోనూ పనిచేస్తుంది.

అంతరిక్ష నౌకలు

ఉపగ్రహాలతో పాటు వాటిని ప్రయోగించే అంతరిక్ష నౌకలు కూడా చాలా కీలకమైనవి. ఇప్పటికీ ప్రపంచంలో కేవలం కొన్ని దేశాలకే రాకెట్ పరిజ్ఞానం ఉంది. అనేక అవాంతరాలు ఎదురైనప్పటికీ భారత్ రాకెట్ విజ్ఞానాన్ని దాదాపుగా సొంతంగానే అభివృద్ధి చేసుకుంది. ప్రారంభంలో శాటిలైట్ లాంచ్ వెహికల్-3 (SLV-3), అగ్‌మెంటెడ్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ASLV) అనే రెండు పరిశోధన నౌకలను ఇస్రో అభివృద్ధి చేసి, వాటి ద్వారానే ఉపగ్రహాలను ప్రయోగించింది. వీటి అభివృద్ధిలో సాధించిన పరిజ్ఞానం, వైఫల్యాలు అందించిన పాఠాలను దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ అంతరిక్ష నౌకలను ఇస్రో అభివృద్ధి చేసింది. ఇవి రెండు రకాలు. అవి..

1) **పీఎస్ఎల్వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్):** ప్రపంచంలో విజయవంతమైన అతి కొద్ది రాకెట్లలో ఇది ఒకటి. 29 పీఎస్ఎల్వీ ప్రయోగాలు నిర్వహించగా మొదటిది (పీఎస్ఎల్వీ-డీ1) మినహా మిగిలినవన్నీ పూర్తిగా విజయవంతమయ్యాయి. ఈ వాహక నౌక ద్వారా 72 ఉపగ్రహాలను ప్రయోగించారు. వీటిలో 31 దేశీయ, 41 విదేశీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ విధంగా అంతరిక్ష సేవలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో పీఎస్ఎల్వీ కీలక పాత్ర పోషిస్తుంది.

2) **జీఎస్ఎల్వీ (జియోస్టేషనరీ శాటిలైట్ లాంచ్ వెహికల్):** ధ్రువ కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశ పెట్టడానికి ఉద్దేశించిన నౌక ఇది. దీని ద్వారా భూస్థిర కక్ష్యలోనూ ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇది మూడంచెల నౌక. దీని మూడో దశ 'క్రయోజనిక్ దశ'. అమెరికా ఒత్తిళ్ల మేరకు రష్యా ఈ ఇంజన్ సరఫరాను నిరాకరించినప్పటికీ భారత్ 1996లో దీని అభివృద్ధిని ప్రారంభించి సొంతంగా తయారు చేసుకుంది. ఇప్పటివరకు జీఎస్ఎల్వీ ద్వారా 8ప్రయోగాలు నిర్వహించగా.. 5 విజయవంతమయ్యాయి. జీఎస్ఎల్వీ మార్క్-III అభివృద్ధితో ఇస్రో భారీ ఉపగ్రహాలను సైతం ప్రయోగించనుంది. ఇప్పటివరకు ఇలాంటి భారీ ఉపగ్రహాల ప్రయోగం కోసం ఏరియేన్ అనే విదేశీ రాకెట్‌పై ఆధారపడుతున్నారు. దీనికి సంబంధించిన ఎల్వీఎమ్-3 అనే ప్రయోగం ద్వారా ఇస్రో డిసెంబర్ 2014లో క్ర్యూ మాడ్యూల్ అట్మాస్ఫియరిక్ రీ ఎంట్రీ ఎక్స్‌పరిమెంట్ అనే కాప్స్యూల్‌ను విజయ వంతంగా భూమిపైకి తీసుకురాగలిగింది.

ఇవేకాకుండా అంతరిక్ష శోధనలో భాగంగా ఇస్రో చంద్రయాన్-1, చంద్రయాన్-3 మంగళయాన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. మొదటి ప్రయత్నంలోనే అంగారక గ్రహ కక్ష్యలోకి మంగళయాన్‌ను 2014 సెప్టెంబర్ 24న విజయవంతంగా ప్రవేశ పెట్టగలిగాం.

GSLV	తేది	ప్రయోగించిన ఉపగ్రహాలు	ఫలితం
1. GSLV-D1	2001 Apr 18	జీ శాట్-1	విజయం
2. GSLV-D2	2003 May 8	జీ శాట్-2	విజయం
3. GSLV-Fo1	2004 Sep 20	ఎడ్యు శాట్	విజయం
4. GSLV-Fo2	2006 July 10	ఇన్ శాట్-4సి	వైఫల్యం
5. GSLV-Fo4	2007 Sep 2	ఇన్ శాట్-4సిఆర్	విజయం
6. GSLV-D3	2010 Apr 15	జీ శాట్-4	విఫలం
7. GSLV-Fo6	2010 Dec 25	జీ శాట్-5 పి	విఫలం
8. GSLV-D5	2014 Jan 5	జీ శాట్-14	విజయం

One thing that is usually true...



BANK EXAMS
MARKETING AWARENESS

1. The term marketing refers to:
a) New product concepts and improvements
b) Advertising and promotion activities
c) A philosophy that stresses more on customer value and satisfaction
d) Planning sales campaigns
e) None of these

2. In the history of marketing, when did the production period end?
a) In the late 1800s
b) In the early 1900s
c) In the 1920s
d) After the end of the Second World War
e) None of these

3. A marketing philosophy summarized by the phrase 'a stronger focus on social and ethical concerns in marketing' is characteristic of the ____ period.
a) production b) sales
c) marketing
d) societal marketing
e) None of these

4. Which skills and capabilities will marketers need to increasingly have?
a) Market research
b) Digital and social media marketing
c) Strategic marketing
d) Sales
e) None of these

5. Which of the following is not part of the external marketing environment?
a) Political b) Legal
c) Product d) Socio-cultural
e) None of these

6. Tobacco advertising is now virtually banned in all marketing communication forms in many countries around the world. This can be explained as an influence of:
a) Technological environment
b) Legal environment
c) Economic environment
d) Ecological environment
e) None of these

7. A firm has decided to alter its pricing and promotional strategies in response to slower than expected job growth and declining personal incomes. The firm is responding to changes in it's:
a) Socio-cultural environment
b) Political environment
c) Economic environment
d) Competitive environment
e) None of these

8. The process of collecting information about the external marketing environment is:
a) Environmental management
b) Environmental scanning
c) Marketing management
d) Marketing research
e) None of these

9. Which is NOT classified in buy classes?
a) New task
b) Information gathering
c) Modified re-buy
d) Straight re-buy
e) None of these

10. With respect to consumer behaviour, one's friends and relatives could be considered a/an:
a) Impersonal influence
b) Reference group influence
c) Perceptual influence
d) Institutional influence
e) None of these

11. Which of the following is not part of the consumer proposition acquisition process?
a) Motive development
b) Information gathering
c) Proposition evaluation
d) Perception
e) None of these

12. The purchasing department reorders on a routine basis, very often working from an approved list of suppliers. This is referred to as:
a) Straight re-buy b) New task
c) Modified re-buy
d) Routine buying
e) None of these

13. Which sampling techniques are often selected in qualitative research?
a) Non-probability sampling
b) Probability sampling
c) Stratified sampling
d) Random sampling
e) None of these

14. What is the term used to describe the degree to which the data elicited in a study is replicated in a repeat study?
a) Replication b) Pre-code
c) Reliability d) Convenience
e) None of these

15. One thing that is usually true of focus groups is that:
a) Most groups involve a small number of participants
b) They usually average 5 to 10 minutes in length
c) The moderator's job is to keep the group busy for the entire time and not let anyone leave
d) The questions used are highly structured and response-driven
e) None of these

16. Which type of research methods are designed to elicit responses to predetermined, standardized questions from a large number of respondents?
a) Quantitative b) Qualitative
c) Non-probability
d) Probability e) None of these

17. The ____ process commences at corporate level. Here the organization sets out its overall mission, purpose and values.
a) researching
b) strategic planning
c) controlling d) managing
e) None of these

18. A statement about what an organization wants to become, which sets out an organization's future, is referred to as:
a) Mission b) Values
c) Organizational goals
d) Vision e) None of these

19. A statement that sets out what the organization wishes to achieve in the long term is referred to as:
a) Mission b) Vision
c) Values
d) Strategic context
e) None of these

20. Organizational values are important because they ___.
a) help shape mission statements
b) help increase sales
c) help guide behaviour and the recruitment and selection decisions
d) help define market research
e) None of these

21. A commonly used basis for segmenting consumer markets:
a) Organizational size
b) Demographics
c) Product type
d) Price e) None of these

22. Which of the following is not an example of a behavioural variable?
a) Product usage
b) Media usage
c) Purchase occasion
d) Personality e) None of these

23. ACORN, a segmentation analysis technique, stands for which of the following?
a) A Corresponding Official Residential Notation
b) A Classification of Reported Nationals
c) A Classification of Residential Neighbourhood
d) A Countrywide Official Resources Navigation
e) None of these

24. The family life cycle:
a) is a way to apply psychographic segmentation
b) refers to the process of family formation and dissolution
c) provides insights into the relationships among age, occupation, income and housing
d) is composed of the 11 stages of personal growth from infancy to retirement
e) None of these

25. Offerings move through a sequential, pre-determined pattern of development similar to the biological path that life forms follow. This is the concept of:
a) Process of diffusion
b) New product development
c) Product life cycle
d) Brand management
e) None of these

26. Which of the following is NOT a service innovation strategy?
a) Branded service innovation
b) Established service innovation
c) Incremental service innovation
d) Radical service innovation
e) None of these

27. ____ is concerned with value creation generated through novel or unusual service concepts.
a) Established service innovation
b) Radical service innovation
c) Generic service innovation
d) Incremental service innovation
e) None of these

28. At the highest end of innovation maturity, firms seek to integrate the services dimension as part of their total offer. This is known as:
a) Servitization b) Reutilization
c) Diffusion d) Productization
e) None of these

29. In marketing terms, ____ refers to what we get for what we pay.
a) Revenue b) Cost
c) Value d) Product
e) None of these

30. ____ act as cues by indicating to a potential customer that there is a bargain to be had.
a) Odd-number pricing
b) Sale signs c) Relative price
d) Price surplus e) None of these

31. ____vary according to the number of units of goods made or services sold.
a) Product assets
b) Price elasticity
c) Fixed costs d) Variable costs
e) None of these

32. Costs which do not vary according to the number of units of product made or service sold:
a) Fixed costs b) Moving assets
c) Working capital
d) Fixed capital e) None of these

33. This is a hierarchy of effects or sequential model used to explain how advertising works:
a) ADD b) AIDA
c) PESTLE d) SWOT
e) None of these

34. AIDA stands for Awareness, ___, Desire and ____.
a) Interest; Action
b) Intensity; Appeal
c) Involvement; Action
d) Involvement; Appeal
e) None of these

35. Marketing communications is used to achieve one of two principal goals. The first concerns the development of brand values. What is the other goal?
a) Increasing sales
b) Informing about products
c) Changing the behavior of target audiences
d) Channeling communication tools
e) None of these

36. Sharing of meaning created through the transmission of information:
a) Communication
b) Noise c) Transfer
d) Understanding
e) None of these

37. Users are able to create content and become more involved with a brand through:
a) Door to door
b) Online communities
c) Direct mail d) Telemarketing
e) None of these

38. A commercial activity, whereby one party permits another an opportunity to exploit an association with a target audience in return for funds, services or resources is referred to as:
a) Advertising b) Exchange
c) Sponsorship
d) Public relations e) None

39. These sell directly to end consumers and may purchase directly from manufacturers and/or deal with wholesalers:
a) Distributors b) Franchising
c) Merchant d) Retailers
e) None of these

40. These store goods for moderate to long periods:
a) Storage warehouses
b) Distribution centres
c) Haulage transport
d) Electronic data interchange
e) None of these

KEY

1) c;	2) c;	3) d;	4) b;
5) c;	6) b;	7) c;	8) b;
9) b;	10) b;	11) d;	12) a;
13) a;	14) c;	15) a;	16) a;
17) b;	18) d;	19) a;	20) c;
21) b;	22) d;	23) c;	24) b;
25) c;	26) a;	27) b;	28) a;
29) c;	30) b;	31) d;	32) a;
33) b;	34) a;	35) c;	36) a;
37) b;	38) c;	39) d;	40) a.